TIGHT BINDING BOOK

UNIVERSAL
LIBRARY

OU_204149

UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY
Call No. T84.2/V44S Accession No. T 652
Author వెంకటశాస్త్రి - S .
Title శ్రీ మధ్వసిద్ధాంతసారము .
This book should be returned on or before the date last marked below.

శ్రీకృష్ణాయ పరబ్రహ్మణే నమః.

అఖిలకల్మషాపహంబగు

శ్రీమద్భాగవతము

ఆంధ్రవచనము.

అయిదవభాగము. (1361-1632)

బ్రహ్మశ్రీ, కేశవరపు - వేంకటశాస్త్రిగారిచేఁ
బ్రణీతము.

శ్రీదేవరాజసుధీమణిపరిశోధితము.

ఆనంద ముద్రాయంత్రాలయ ముద్రితము.

ఆక్ - వేంకటేశ్వర అండ్ కంపెనివారిచేఁ
ప్రకటితము.

1914.

(COPY-RIGHT REGISTERED.)

All Rights Reserved.

Copyright 1915—By **R. Venkateshwar & Co., Madras.** This book is fully protected by an Indian and Foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language and offer it for sale. A substantial copy of the words, ideas or illustrations contained herein constitutes an infringement of a copyright, and notice is hereby given that suit will be filed in every case of infringement.

Checked 1965

Checked 1965

కాపిరైట్ 1915 వ సం॥ ఆర్. వేంకటేశ్వర్ అన్డ్ కంపెనివారు కాపీ రైట్‌దార్లు. ఈ పుస్తకము ఇండియా కాపిరైటుచేతను పరకీయమైన కాపీ రైటుచేతను సురక్షితమైంది. ఎవరుగాని యీపుస్తకమును సంపూర్ణముగాఁ గాని లేక యిందొకభాగమునుగాని తాము వేఱుగా ప్రకటించుటకును, మఱి యొకభాషయందు తర్జుమాచేసి క్రయమునకు నిచ్చుటకును, హక్కు ఇయ్యఁబడదు. ఇందుఁ గలపదములనుగాని భావములనుగాని పటములనుగాని ఏమాత్ర మైనను కాపీచేసినయెడల ఆది కాపిరైటును నుల్లంఘించిన ట్లగుటచే అట్టివారు దావాకు లోనగుదురని దీనిచే తెలియఁజగును.

విషయసూచిక.

గజేంద్రమోక్షణము ; త్రికూటవర్ణనము	1366
గజేంద్రుఁడు పరమేశ్వరుని ధ్యానించుట	1371
క్షీరసాగరమథనము ; గజేంద్రుని పూర్వవృత్తాంతము	1377
దుర్వాసునిశాపముచే సంపదతోఁగి దేవతలు హరినిస్తుతించుట ...	1380
విష్ణువు ప్రత్యక్షమగుట, సముద్రమును మథింప మందరపర్వతమును గొనిపోవుట	1389
సముద్రమున హాలాహలాదులు జనించుట	1394
క్షీరసాగరమున నైరావతాదులు జనించుట	1403
మోహిని దైత్యులను వంచించి యమృతమును దేవతలకే పంచుట ...	1410
దేవదానవ యుద్ధము	1414
సురాసుర యుద్ధము	1421
శంకరుఁడు మోహినీరూపమును జూచి మోహితుఁడై వెంబడించుట	1427
శ్రీశుకుఁడు తెక్కిన పన్నెండంతరముల విసరించుట	1435
రాజు ప్రత్యేకముగా మన్వంతరముల కార్యముల నడుగుట ...	1438
వామనావతారకథా ప్రారంభము	1440
అదితి తన కుమారులనుగూర్చి చింతించి విష్ణువు నారాధించుట; అతఁడామె గర్భమున వామనుఁడయి పుట్టుట	1445
వామనమూర్తి యవతరించుట ; బ్రహ్మాదులతఁ డుతించుట ...	1455
వామనుఁ డుపయించుట	1460
వామనుఁడు మూఁడడుగుల నేల దానమడుగుట ; శుక్రుఁడు వామనుని స్వరూపమును దెలిపి దానము వలదని యుపదేశించుట ...	1464
బలి దానమును దప్పక యిత్తునని శుక్రునకుఁ జెప్పుట	1471

త్రివిక్రముఁడు బలినిబంధింపుట ; ఎదిరించిన బలియనుచరులను విష్ణు
భృత్యులు తఱుముట 1476
బలి మూఁడవ యడుగునకుఁ గొన శిరస్సును జూపుట ; ప్రహ్లాదాదులు
బలిని రక్షింపుమని త్రివిక్రముని వేఁడఁగా నద్దేవుఁడు బలిని సుతల
మున కధిపతిగాఁ జేయుట 1481
ప్రహ్లాదునితో బలి సుతలమున కేగుట 1487
మత్స్యావతార కథా ప్రారంభము 1491
ఇళోపాఖ్యానము 1502
పృషధ్రాదుల చరిత్రము 1506
చ్యవనుఁడు సుకన్యను బరిగ్రహించుట ; చ్యవనుఁ డశ్వినీదేవతల సోమ
పీథులం జేయుట 1510
అంబరీషో పాఖ్యానము 1515
అంబరీషో పాఖ్యానము 1527
అంబరీషుని వంశవర్ణనము ; శకుని చరిత్రము ; సౌభరి చరిత్రము ... 1531
మాంధాతృ వంశపరంపరను వర్ణించుట 1539
హరిశ్చంద్రుని వంశ వివరణము ; సగరుని చరిత్రము 1543
గంగావతరణ కథ ; కల్మాషపాద ఖట్వాంగ చరిత్రములు ... 1548
శ్రీరామచరిత్రము 1555
శ్రీరామచరిత్రము 1564
ఇక్ష్వాకువంశానుక్రమము 1570
మిథిలవంశానుక్రమము 1572
చంద్రవంశ చరిత్రము 1575
పురూరవుసివంశము 1582
పరశురాముఁడు జనన్యాదుల జంపుట 1587
ఆయువంశాదికము 1592
నహుషవంశము 1594

యయాతి బస్తోపాఖ్యానము చెప్పుట	1601
పూరుని వంశము	1605
గర్గరంతిదేవవంశాదులు	1610
చంద్రవంశానుక్రమము	1615
పూరునిపుత్రుఁడైన అనునివంశము; యదువంశవర్ణనము... ...	1620
ఐసుదేవుని వంశక్రమము	1625

పటముల పట్టిక.

గజేంద్రునకు శ్రీమన్నారాయణుఁడు ప్రత్యక్షమై మకరి శిరమును ఖండించుట 1377

క్షీరసాగర మథనము; ఉచ్చైశ్శ్రవాదులు పుట్టుట ... 1395

మోహినిరూపియైన భగవంతుఁడు దైత్యులను వంచించి దేవతల కమృతమును పంచియిచ్చుట ... 1411

వామనరూపియైన భగవంతుఁడు బలియజ్ఞవాటమునకు పోయి మూఁడడుగులు యాచించుట ... 1467

త్రివిక్రమావతారము 1474

శ్రీమత్స్యావతారము 1493

శివుఁడు పార్వతితో క్రీడించుచుండ సుద్యుమ్నుఁడు చూచుట 1504

అంబరీషుని పాదములను దూర్వాసుఁడు పట్టుకొని క్షమాపన మడుగుట 1527

సీతావివాహము 1556

విభీషణుఁడు శ్రీరాముని శరణుఁ జొచ్చుట ...

శ్రీరామ పట్టాభిషేకము 1563

ము గోరక యెవని మంగళచరిత్రములను పాడుచు, దానివలన జనితమగు నానందసముద్రమున మునుకలిడి సుఖించుచున్నా రో యాభగవంతుఁడు నన్ను రక్షించుఁగాక. ఎవఁడు నియతుఁడై బ్రహ్మాదులకుఁగూడఁ బరుఁడై ప్రాకృతము లయిన నేత్రములకుఁ గానరాక కేవలము భక్తియోగముచేతనే పొందఁదగినవాఁడై యింద్రియముల కతీతుఁడై మిక్కిలి సూక్ష్మరూపుఁడై యుపాయాంతరములచే సాధ్యుఁడుగాక వేల్పులకెల్ల మొదటివాఁడై లోకములంగంటను బూర్ణుఁడై యుండునో యా పరమేశ్వరుని నుతించెదను. ఏ మహాత్ముని కలలును, నంశములును, నంశాంశములును, నామభేదమును, రూపభేదమును బొంది బ్రహ్మాది దేవతలును, జరాచరాత్మకము లగులోకములును, వేదములును నగుచున్నవియో యా పరబ్రహ్మము నాకు గతియగుఁగాక. అగ్నిహోత్రము మంటలును, సూర్యుని కిరణములును, మాటిమాటికి నిర్గమించి మగుడ నచ్చటనే లీనములగుచున్నట్లు, బుద్ధియు, మనస్సును, నింద్రియములును, దేవాది శరీరసంఘములును, గుణపరిణామరూప మగుప్రపంచము నెవనియం దుద్భవించి లీనము లగుచున్నవియో యా భగవంతుఁడు దేవతలలో నొకండునుగాఁడు; అసురుఁడునుగాఁడు; మనుష్యుఁడునుగాఁడు; పశుపక్ష్యాదులలో నేదియునుగాఁడు; స్త్రీయునుగాఁడు; పురుషుఁడునుగాఁడు; నపుంసకుఁడునుగాఁడు; ప్రాణియును గాఁడు. అతఁడు గుణరహితుఁడు, కర్మరహితుఁడు. అతఁడు జీవవర్గములలో నంతర్భూతుఁడు కాఁడు. అతఁడు కేవలమును సద్గుణముల కాశ్రయుఁడైయున్నవాఁడు. అతఁడు సమస్తమున కాధారుఁడు. అట్టి భగవంతుఁడు ముక్తికిఁ బ్రతికూలము లయినవా కర్మజాలమును నిరసించుఁ

గాక. ఇఁక నేనెంతమాత్రమును జీవింపను. అహంకార మమకా రములతోఁగూడిన యీ గజ జన్మమెట్టిపురుషార్థమును సంపాదిం పలేదు. కావున నీ జన్మమును విడిచి మరలఁ బుట్టుకకు రానీని మోక్షము గోరుచున్నాను. ఆత్మలోకము నావరించు కర్మ నకు మోక్షమును గోరుచున్న నేను, విశ్వమును సృజించినవాఁడు ను, విశ్వ శరీరకుఁడును, విశ్వమునకు వేఱయినవాఁడును, సక ము నెఱింగినవాఁడును, విశ్వమున కంతరాత్మయై నియమించు వాఁడును, గర్మాధీన మగుజన్మాదులు లేనివాఁడును, జ్ఞానాదిగుణ ముల కాలయమును, భక్తులకుఁ బొందఁదగినవాఁడు నగుపర మాత్మకు నతు లొనర్చెద. ఉపాసనాత్మక మగుజ్ఞానముచే భగవ ద్దర్శనమునకు విరోధియగుకర్మజాలమును దహించిన యోగులు నిర్మలమనస్సునం దెవనిఁ జూచుచున్నారో నే నాపరమేశ్వరునిఁ జూడ శక్తిగలవాఁడను గానందున నతనికి శక్తికొలఁది నమస్క రించెదను. నిరంకుశ మగువ్యాపారము గలవాఁడై సృష్టిస్థితిలయ ము లనెడిశక్తిత్రయముతోఁగూడి భక్తులఁ బాలించుచు నపార మగుశక్తిగలవాఁడై యింద్రియముల జయింపనివారిచేఁ దెలియ బడని మార్గము గలపరమాత్మకు వందనములు. ఎవనిమాయ వలన సంచరించుచున్న దేహాత్మాభిమానముచే నే నాత్మస్వరూప మును దెలిసికోలేకున్నానో యూహింపఁ దరముకాని మహిమ గలయా భగవంతుని శరణుఁ జొచ్చెదను" అని యిట్లు గజేం ద్రుఁడు భక్తియుతుఁడై హేయగుణరహితమగు భగవత్స్వరూ పమును నుతింప నా నుతియందుఁ దమచిహ్నములుగాని తమ నామములుగాని లేనందున బ్రహ్మశంకరుఁడు మొదలగువా రతని రక్షింపశారైరి. గజరాజు వర్ణించిన యసాధారణగుణములు

1377 గజేంద్రునకు శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై మకరి శిరమును ఖండించుట.

తనయందుండుటచేత నిఖిలస్వరూపుఁ డయినహరి వచ్చి ప్రత్యక్షమయ్యె. ఓ రాజా ! ఆ శ్రీహరి కరిరాజు మకరిచేఁ బీడితుఁ డగుచున్నట్లు తెలిసికొని యతఁ డొనర్చిన స్తవమును వీనులవిందుగా విని ఛందోమయుఁ డయినగరుత్మంతునెక్కి చక్రమును దాల్చి దేవతలు పరివేష్టించి నుతించుచుండ గజేంద్రుఁ డున్నమడువును సమీపించెను. ఇట్లు సమీపింప మహాసత్వము గలమకరిచేఁ బీడితుఁ డయినగజరాజు గరుడు నధిరోహించి చక్రముదాల్చి యున్నహరి నాకసమున్నై ఁ జూచి పద్మముతోఁ గూడిన తన తొండమునెత్తి 'ఓ నారాయణా! ఓ లోకగురూ! ఓ భగవంతా!' యని యతి కష్టముతోఁ గేకలిడెను. అంత హరి యార్తుఁ డైన కరిరాజును వీక్షించి దయాళుఁ డై గరుత్మంతునుండి దిగి త్వరలో నతని చెంతకుఁ బోయి దేవతలు చూచుచుండఁ జక్రముచే మకరిశిరమును ఖండించి మడువునుండి యుద్ధరించి రక్షించెను. ఇది మూఁడవయధ్యాయము.

—•—

క్షీరసాగరమథనము; గజేంద్రుని పూర్వవృత్తాంతము.

ఆ సమయమున దేవతలును, ఋషులును, గంధర్వులును, బ్రహ్మయు, శంకరుఁడు మొదలగువారు శ్రీహరియొనర్చిన యద్భుతకర్మమును నుతించుచుఁ బుష్పవర్షమును గురియించిరి. దేవతలు దేవదుందుభుల మ్రోయించిరి. గంధర్వులు నాట్యముసల్పుచుఁ బాడిరి. ఋషులును చారణులును సిద్ధులును పురుషోత్తముని స్తుతించిరి. ఓ రాజా ! ఆ మకరి హూహూనామకుఁ డగుగంధర్వుఁడు సుమా ! అతఁడు దేవలమునిశాపమువలన నీ మకరిరూపుఁ దాల్చెను; ప్రస్తుతమున శాపవిముక్తుఁ డై యెప్పటి

రూపమును బొంది పవిత్రకీర్తియు, నాశరహితుఁడు నగుహరికి నమస్కరించి కొనియాడఁదగిన భగవంతుని యశస్సును, గుణము లను గానముచేసెను. ఆ గానమునకు సంతసించి హరి యతని ననుగ్రహింప నా గంధర్వుఁడు మరల నతనికిఁ బ్రదక్షిణ నమ స్కారములు గావించి బ్రహ్మాదులు చూచుచుండఁగనే శాప విముక్తుఁడై తనలోకమున కేఁగెను. ఆగజేంద్రుఁడు శ్రీహరి కర స్పర్శమువలన నజ్ఞానబంధనమువలన విముక్తుఁడై పచ్చనివస్త్ర మును నాల్గుభుజములును గలభగవంతునితో సమమగురూప మును బొందెను. ఓ మహీశా! ఆ కరిరాజు పూర్వజన్మమునఁ బాండ్యదేశాధిపతి; ద్రవిడరాజులలో నతఁడు శ్రేష్ఠుఁడు; ఇంద్ర ద్యుమ్నుఁడనునామము గలవాఁడు. అతఁడు విష్ణుభక్తిగలవాఁడై సంతతము హరిభజనము సల్పుచుండెఁ. అతఁ డొకప్పుడు మౌని యై చిత్తము నిశ్చలముగాఁ జేసికొని హరి నారాధించుచుండె ను. ఆసమయమున విపులకీర్తి యగునగస్త్యుఁడు శిష్యగణములు గొల్చుచుండ నింద్రద్యుమ్ను ని యాశ్రమమున కరుదెంచెను. అపుడు సమాధినిష్ఠుఁడై యుండుటచే నారాజేమియు మాటాడ లేదు; పూజింపను లేదు; కూర్చుండుమనను లేదు. అందుల కమ్ముని కోపించి, "అయారె! ఈయింద్రద్యుమ్నుఁడు దురాత్ముఁడు, బుద్ధి హీనుఁడు; ప్రస్తుతమున బ్రాహ్మణుల నవమానించిన పాపాత్ముఁ డు; ఏనుఁగువలె మత్తుఁడై తన్ను నొరులను నెఱుంగనివాఁడు. కావున నికమీఁద వీఁడు గజమై వర్తించుఁగాక" యని శపిం చెను. ఇట్లు శపించి యగస్త్యుఁడు శిష్యులతోఁగూడ గదలిపోయె ను. అనంతర మింద్రద్యుమ్నుఁ డాశాపమును బ్రారబ్ధకర్మమును గానిశ్చయించి దాని ననుభవించియె నశింపఁజేయవలెనని భావిం

చి పరమాత్మస్మరణమును నశింపఁజేయు గజజన్మము నొందెను. అతఁడు గజరూపమున నున్నను బూర్వము విశేషముగా హరిని భజించియుండుటనలనఁ దత్స్మృతిజ్ఞానముచేఁ దుదకుఁ బరమాత్మస్మృతి సంభవించినది. ఓరాజా! నారాయణుఁడిట్లు గజరాజును విడిపించి యతఁడును బార్షద జనమును సేవించుఁడ గంధర్వులును, సిద్ధులును, సురలును, తా నొనర్చిన యద్భుతకార్యముల నుతించుచుఁడ గరుడునిపైఁ గూర్చుండి తనలోకమున కేఁగెను. ఓ మహీపాలా! హరి ప్రభావమును దెలియఁజేయు గజేంద్ర మోక్షణకథను నీకోర్కిఁ జొప్పున వివరించితిని. దీనిని విన్న జనులకు స్వర్గము గలుగును; యశస్సు లభించును; కలికల్మషములొలంగును; దుస్స్వప్నములు రావు. ఈ గజేంద్రమోక్షణకథ యిట్టిది కనుకనే ప్రాతఃకాలమున లేచి పరిశుద్ధులై దుస్స్వప్ననాశననునిమిత్తము దీనినిఁ బఠించుమందురు. ఈ చరిత్రమంటిట్టిమహిమ మున్నదని భగవంతుఁడే సంతుష్టచిత్తముతో సర్వభూతములును వినుచుఁడ గజేంద్రునితో నిట్లనియె. "ఓకరిరాజా! నన్నును, నిన్నును, నీ సరోవరమును, నీ కాననమును, నీ పర్వతగుహలను, నీ వెదురుఁబొదలను, నిందున్న మందారాది వృక్షములను, నాకును, బ్రహ్మకును, శంకరునకును నిలయములయినయీ పర్వతశిఖరములను, నాకుఁ బ్రియమయిన క్షీరసాగరమును, బ్రకాశమానమైన యీ శ్వేతద్వీపమును, నాశ్రీవత్సమును, గౌస్తుభమును, వనమాలను, గౌమోదకి యనెడి గదను, జక్రమును, బాంచజన్యమును, బక్షినాయకుఁ డయినగరుత్మంతుని, ననంతుని, నాకుఁ గలాభూతమై, యీహింపఁదరము కానంత సూక్ష్మరూపముగల్గి నన్నాశ్రయించుకొనియున్న లక్ష్మీ

దేవిని, బ్రహ్మను, నారదుని, రుద్రుని, ప్రహ్లాదుని. నేఁదాల్చిన మత్స్య కూర్మాదు లగునవతారములను, నా యవతారములచేఁ జేసిన పుణ్యచరిత్రములను; సూర్యునిఁ, జంద్రుని, నగ్నిని, ఓం కారమును, సత్యమును, బ్రకృతిని, భక్తిలక్షణ మగుధర్మమును, జంద్రునకును గశ్యపునకును భార్యలగు దక్షతనయలను, గంగను, సరస్వతిని, యమునను, నలకనందను, నైవావతమును, ధ్రువునిఁ, బుణ్యశ్లోకు లగుసప్తర్షులను, ధార్మికు లగుమానవులను, నుదయ కాలమున లేచి సమాహితచిత్తులై యేజనులు స్మరింతురో, నాకు శరీరభూతు లయినయా పుణ్యాత్ములందఱను సకలపాపములవలన విముక్తులై సుఖింతురు. ఎవరు ప్రాతఃకాలమున నీస్తోత్రముచే నన్ను నుతింతురో వారు మరణకాలమున నాయం దాసక్తులగుదురు" అనిపలికి హరి పాంచజన్యము నూఁది బ్రహ్మాదులను సంత సింపఁజేసి గరుడు నధిష్ఠించె. కావున నీచరిత్రమం దెంతయో ప్రభావము గలదని నమ్ముఁడు. ఇది నాల్గవయధ్యాయము.

దుర్వాసుఁడుచేఁ సంపదతొఁగి దేవతలు హరిని స్తుతించుట.

ఓరాజా! పాపహరమైన గజేంద్రమోక్షణ కథను నీకుఁ జెప్పి తిని. ఇఁక రైవత మన్వంతరమును జెప్పెదను. తామసుని సోద రుఁ డయినరైవతుఁ డైదవమనువయ్యె. అర్జునుఁడు, బలి మొద లగువారు మనుపుత్త్రులు. విభువనువాఁ డింద్రుఁడయ్యె. భూత దయుఁడు మొదలగువారు దేవతలయిరి. హిరణ్యరోముఁడు మొద లగువారు సప్తర్షులైరి. శుభ్రుఁ డనువానికి వికుంఠ యనుభార్య యందు నారాయణుఁడు వైకుంఠుఁ డనునామముతో నవత

రించె. మునశ్రేష్ఠులు వైకుంఠులను నామముతో నుద్భవించిరి. అప్పుడు వైకుంఠుఁడు తనప్రియురాలైన లక్ష్మీదేవికిఁ బ్రియముసేయ నెంచి యామె కోర్కిచొప్పునఁ జక్రవాళపర్వతము నుపరిభాగమునందు వైకుంఠనగరమును గట్టించె. అది సకలలోక జనులచేతను గొనియాడఁబడుచున్నది. ఆ పరమేశ్వరునిప్రభావమును గుణములను నింతకుఁ బూర్వమే కొంతవఱకు వర్ణించితిని. భూమి రేణువులనైనఁ బూర్తిగా లెక్కింపఁగలము; కాని యా భగవంతుని గుణముల లెక్కింపఁజాలము. చాక్షుషుఁ డనువాఁ డాఱవమనువయ్యెఁ. పురుషుఁడు, పురుషుఁడు, సుద్యుమ్నుఁడు మొదలగువారు మనుపుత్త్రులు. మంద్రద్రుముఁ డనువాఁ డింద్రుఁడయ్యెఁ. ఆప్యాదులు దేవగణములైరి. హవిష్మంతుఁడు వీరకుఁడు మొదలగువారు సప్తర్షులైరి. అప్పుడు భగవంతుఁడు వైరాజునకు సంభూతి యనుభార్యయందు నిజాంశముచే నుద్భవించి యజితుఁ డనునామమును దాల్చె. అతఁడు క్షీరసాగరమును మథించి యమృతమును సాధించి దేవతలకిచ్చెను. మఱియుఁ గూర్మరూపము దాల్చి సముద్రమున మునుఁగుచున్న మందరపర్వతమును మోచెను' అని చెప్పుచున్న శుకుంగాంచి రాజట్లనియె. "ఓమునీంద్రా! భగవంతుఁడు క్షీరసాగరము నెందులకు మథించెను? కూర్మరూపమును దాల్చి యెవరికొఱకు కేహేతువుచే మందరపర్వతము మోచె? దేవత లమృతము నెట్లుపొందిరి? సముద్రమథనమువలన నమృతమేకాక మఱియు నేయేవస్తువులుదయించినవి? అత్యద్భుతము లైనభగవచ్చేష్టలను వర్ణించెడి భగవన్మహిమము నెంతవిన్నను జిరకాలము తాపత్రయముచేఁ బీడిత మగునాచిత్తము తృప్తిచెందకున్నది" అని

యడిగిన నరేంద్రుని ప్రశ్నములను మిక్కిలి సన్నుతించి శుకుఁడు హరిప్రభావము నిట్లు చెప్పఁదొడంగె. ఓ రాజా! పూర్వము దేవాసురులకు ఘోరయుద్ధము సంభవించె. అందు రాక్షసులు వాఁడియైనయాయుధములను దాల్చి దేవతలను బీడించి కూలవైచిరి. దేవతలలోఁ బెక్కండ్రు నిర్జీవులైరి. పూర్వమొకప్పుడు దేవేంద్రుఁడైరావతమునెక్కి పోవుచుండఁజూచి దుర్వాసుఁడు పుష్పమాల నొకదాని నిచ్చె. ఇంద్రుఁడు దాని గౌరవముతోఁ దీసికొని స్వీకరింపక యైరావతము కుంభమునకుఁ జుట్టె. అది పాదముచేఁ ద్రొక్కి చూర్ణము గావించె. అదిచూచి కోపించి "నీవు మూఁడులోకములతోఁగూడ శోభాహీనుఁడ వగుదువు గాక" యని శపించె. వై రెండుకారణములవలనను ముల్లోకములును శోభ దఱిఁగియుండెఁ. యాగాదిక్రియలు తొంటివలె వానికి శోభను గల్గింపలేవయ్యె. ఇంద్రాదిదేవత లప్పుడు కూడికొని లోకములకు శోభను గల్గించుటకును, యుద్ధమునఁబడిన దేవతలను బ్రదికించుటకును దగినయుపాయమునుగూర్చి పలుతెఱంగుల నాలోచించిరి; కాని నిశ్చయింపలేకపోయిరి. అంత నింద్రుఁడు లందఱును మేరుశిఖరమున నున్నబ్రహ్మసభకుఁ బోయి నమస్కరించి యతనికి విన్నవించుకొనిరి. అంత బ్రహ్మ, కాంతిహీనులై బలముఁ దొలంగియున్న యింద్రాది దిక్పాలురను, మంగళహీనములగు మూఁడులోకములను, దేజముతోను బలముతోను గూడిన దైత్యులను జూచి మిక్కిలి విచారించి సమాహిత చిత్తముతోఁ బరమపురుషుని ధ్యానించి వికసితముఖుఁడై యింద్రాదులఁ గాంచి యిట్లనియె. "ఓ సురలారా! నేను, రుద్రుఁడు, మీరు, దైత్యులు, మనుష్యులు, పశుపక్ష్యాదులు, చెట్లు, స్వేదజ

ములు మొదలగుమనమందఱము నెవనియంశాంశముల లేశముల చేఁ బొడమితిమో యాపరమపురుషుని శరణుఁజొ త్తము. ఆలో చింప నతనికి వధ్యులులేరు; రక్షింపఁదగినవారును లేరు; అంద ఱును సమానులే. అతనికిఁ గొంద ఱుపేక్షింపఁదగినవారనియు, గొంద ఱాదరింపఁదగినవారనియు నేర్పాటులేదు. అయినప్పటికి నతఁడు లోకమునకు సృష్టిస్థితిలయాదులుగల్గింప నొక్కొక్కకాల మందు సత్త్వాదిగుణముల మూఁడింటిని స్వీకరించుచుండును. ఆ మూఁడింటిలోను సత్త్వమును బాల్చి శ్రీహరి భూతములఁ బరి పాలించుచుండు. సత్త్వగుణప్రధానుఁ డగుహరి రక్షకుఁడై యుం డుటచే సత్త్వప్రధాను లగుదేవతలకుఁ దప్పక జయముగల్గు. కావున మనము వేగముగానరిగి యతని నీడఁజేరుదము. చేరినచో నతఁడు మనలఁ జేరఁదీసి సుఖింపఁ జేయు. అతఁడు దేవతలందుఁ బ్రేమగలవాఁడై యుండుటచే మనకార్యము తప్పక నెఱవేఱును" అని యిట్లు పలికి బ్రహ్మ దేవతలు గొల్చివచ్చుచుండఁ దమస్సు కంటెఁ బరమైన యజితుని నిలయమునకుఁబోయి యెట్టివారికిని గానరాని స్వరూపముగలవాఁడును, నింతకుఁబూర్వమే యజితుఁ డనునవతారము దాల్చియున్నవాఁడును నగుపరమేశ్వరునకు నమస్కరించె. ఆనంతరము బ్రహ్మాదులు సమాహితచిత్తు లై యింద్రియముల జయించి యుపనిషద్వాక్యములచే నజితు నిట్లు నుతింపనారంభించిరి. "ఓ దేవా! నీవు సకలదేవతలలో నుత్త ముఁడవు. నీకు సమానుఁడుగాని నీకంటె నధికుఁడుగాని లోక మున లేఁడు. నీవు మనస్సునకును, వాక్కులకు నందనివాఁడవు. ఒకప్పుడు యోగులమనసునకు నీవు గోచరుఁడవయినను నింత శక్తిగలవాఁడవని నిర్ణయింప నశక్యుఁడవు. నీమహిమ మూ

హింపఁ దరముగానిది. నీకుఁ గర్మాధీన మగుస్థూలశరీరము లేదు. మావంటివారి హృదయగుహరములందు శయనించువాఁడవు. జీవుఁ డట్లు శయనించువాఁడైనను, నీవలె నుపాదానకారణము కాఁడు. నీకుఁ బ్రకృతికింబోలె మార్పులు లేవు. జీవుని స్వభావ మువలె నీస్వభావము మాఱదు. నీ వనంతశక్తులు గలవాఁడవు. నీవు ప్రాణములను, మనస్సును, బుద్ధిని, జీవాత్మలను, సాక్షాత్కరించుకొనువాఁడవు. ఓ యీశా! నీవు శబ్దాదివిషయములను, వానిని గ్రహించు శ్రోత్రాదీంద్రియములను, బ్రకాశింపఁజేయు వాఁడవు. నీకు జాగరాద్యవస్థలు లేవు. కర్మాధీన మగుశరీరము నీకు లేదు. అజ్ఞానముగాని మిథ్యాజ్ఞానముగాని నీకు సంభవింపవు. నీ వాకసమువలె నన్ని చోట్లను వ్యాపించియున్నవాఁడవు. జ్ఞానాదు లగునాత్మగుణములచేతను నిండినవాఁడవు. అట్టి నిన్ను శరణుఁబొం దెదము. ఓ పరమేశా! సంసార మొక చక్రమువంటిది. అది మనో వ్యాపారమువలనఁ గల్గుచున్నది. అది నీమాయచేఁ ద్రిప్పఁబడు చున్నది. కర్మేంద్రియములును జ్ఞానేంద్రియములును బంచ ప్రాణములు నాఁబడు పదునేనంచులు గలది. అది యెప్పుడు శీఘ్ర ముగాఁ దిరుగుచుండును. దానికి సత్త్వము రజము తమము నాఁబడు మూఁడు నాభులు గలవు. భూమి, జలము, వహ్ని, వాయువు, గగనము, మనస్సు, బుద్ధి, యహంకారము ననెడి యెని మిది నేములచే నది యొప్పుచుండును. అది మెఱుపువలె మిక్కి-లి చంచలమైనది. ఆ మనోమయచక్రమున కెవఁ డాధారమో యట్టిపరమాత్మ వగునిన్ను శరణుసొచ్చెదము. ఏది కేవలము శుద్ధసత్త్వమయమై, ప్రకృతిమండలమునకుఁ బరమై సంసారులకుఁ గానరానిదై రాగాదిదోషములు లేనిదయి దరిలేనిదై వెలయు

చున్నదో, దేనిని బండితులు యోగమార్గముచే నుపాసించు చున్నారో, యాపరమపదము నధిష్ఠించి యున్ననీ పాదపద్మముల నాశ్రయించెదము. మావంటివా రెవనిమాయ నతిక్రమింప లేరో, యెవనిమాయచే మోహితులై మావంటివారు సకల భూతములం దంతరాత్మరూపమున వెలయుచుఁ బరమపురుషా ర్థమైయున్న యెవని నెఱుంగఁజాలరో, భూతములందు వర్తించు చున్నను నెవనికిఁ బ్రకృతిపురుషగతము లగుదోషము లంటవో, యెవఁడు దేవతలకుఁగూడ దేవుఁడో, యట్టిపరమాత్మకు నమస్కా రము లొనర్చెదము. ఓ పరమేశా! నీకుఁ బ్రియశరీర మైనసత్వ గుణముచే సృజింపఁబడిన దేవతలమును, ఋషులము నగు మేమే దురూహ మగు నీ చేష్టలను దెలిసికోలేనప్పుడు కేవలము రజస్తమోగుణములచే సృజింపఁబడు రాక్షసాదు లెట్లు దెలిసి కోఁగలరు? జరాయుజము లనియు, నండజము లనియు, స్వేద జము లనియు, నుద్భిజ్జము లనియుఁ బిలువఁబడు నాల్గువిధము లగుభూతనర్గములకును దావైన యీ భూమి నిజసృష్టయై యెవనికిఁ బాదము లగుచున్న వో యా పరమపురుషుఁ డాస్వతం త్ర్యుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. మూఁడులోకములును, నల్లోకములవారును, లోకపాలురును, దేనివలన నుద్భవించి జీవించుచున్నారో, వర్ధిల్లుచున్నారో యాజలమే రేతస్సుగాఁ గల్గి బ్రహ్మశబ్దవాచ్యుఁ డయినమహావిభూతి మాకుఁ బ్రసన్నుఁ డగుఁ గాక. దేవతల కన్నమును, బలము నాయువును నొసంగుచు, వృక్షములకును, బ్రజలకును వృద్ధిగల్గించు చంద్రుఁ డెవనికిమన స్సని చెప్పుచున్నారో యా విరాట్పురుషుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. ఇంద్రాదిదేవతలకుఁ గ్రమముగా హవిర్భాగముల

నర్పించుచు, వేదపూర్వభాగమునఁ జెప్పఁబడిన యూగాదుల కొఱకు జన్మించి సకలదేహములలోపలను వర్తించుచు నందున్న సప్తధాతువుల నభివర్ధించు చున్నయగ్ని, యెవనికి ముఖ మగు చున్నదో యా విరాట్పురుషుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. అర్చిరాది మార్గభూతుఁడైన వేదమయుఁడై బ్రహ్మోపాసనమునకు స్థానమై, ముక్తికి ద్వారమై, మోక్షమును సాధించు పుణ్యముల నొనర్పఁదగినవాఁ డగుటచే ముక్తిసాధనుఁడై, యుదయముచేతను, నస్తమయముచేతను నాయువును క్షీణింపఁజేయువాఁ డగుటచే మృత్యువై పరఁగు సూర్యుఁ డెవనికి నేత్రమగుచున్నాఁడో యా విరాట్పురుషుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. సకలచరాచర ములకును, మనోబలమును, దేహబలమును, నింద్రియబలమును, గల్గించుచుఁ బంచవిధము లగువృత్తులతోఁ గూడినవాయువును బుద్ధ్యాదుల కధిష్ఠాతృదేవతల మగుమేము, సార్వభౌముని భృత్యులుంబోలె, ననుసరించుచుందుము. అట్టివాయు వెవని ప్రాణము వలన నుద్భూతమైనదో యావిరాట్పురుషుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. ఎవని శ్రోత్రమువలన దిక్కు లుదయించినవ్వో, దేహగతము లగురంధ్రము లెవనిహృదయమువలన సంభవించెనో, కర్ణేంద్రియములకును, జ్ఞానేంద్రియములకును, మనస్సునకును, బంచప్రాణములకును, శరీరమునకును, నాశ్రయ మైనయాకాశ మెవని నాభివలనఁ బుట్టెనో, యావిరాట్పురుషుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. ఎవనిబలమువలన నింద్రుఁడును, బ్రసాదము వలన దేవతలును, గోపమువలన రుద్రుఁడును, సంతోషము వలనబ్రహ్మయు, శరీరగతరంధ్రములవలన ఛందస్సులును ఋషులును, గుహ్యేంద్రియమువలనఁ బ్రజాపతియు సంభవించిరో,

యాపరబ్రహ్మము మాకుఁ బ్రసన్న మగుఁగాక. ఎవనివక్షస్థలము వలన సంపదయు, నీడవలనఁ బితరులును, స్తనమువలన ధర్మంబును, బృష్ఠభాగమువలన నధర్మమును, శిరస్సువలన నాకసమును, నస్వ్వవలన నచ్చరలును నుదయించిరో యావిరాట్టు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. బ్రాహ్మణకులంబును, నింద్రియాతీతము లగుపదార్థములను దెలుపువేదంబును, నెవనిముఖమువలన నుదయించినవ్వో, క్షత్త్రికులంబును బలంబు నెవని బాహువులవలనఁ గల్గినవ్వో, వైశ్యకులమును, నైపుణ్యము నెవనితొడలవలనఁ బుట్టెనో, శూద్రకులమును శుశ్రూషావృత్తియు నెవనిపాదములనలన జనించెనో యావిరాట్పురుషుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. ఎవని క్రిందిపెదవివలన లోభము, మీఁదిపెదవివలనఁ బ్రీతియు, నాసికవలనఁ గాంతియుఁ దాఁకుడువలనఁ బశువులకు హితమగుకామము, కనుబొమలవలన మృత్యువ్వు,కనుఱెప్పలవలనఁ గాలమును సంభవించెనో యామహాపురుషుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. పంచమహాభూతములును, గాలమును, బుణ్యపాపకర్మములును, సత్త్వాదిగుణములును, బ్రహ్మాండమును, దానియం దున్నకార్యవర్గమును, నేమహాత్ముని సంకల్పమువలనఁ గల్గుచున్నట్లు చెప్పుచున్నారో, ఎవ్వనిస్వరూపము చేతనాచేతనములతో సజాతీయ మయినట్లు లూహింపఁ దరముకానిదో, యేది కేవలము పండితులకుమాత్రమే తెలియఁదగినదో యాభగవంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ డగుఁగాక. ఎవఁడు స్వతంత్రమై హద్దులేనిదై యున్న యానందమును సంతత మనుభవించుటచే సమస్తవాంఛితములను బొందినవాఁడో, మాయాగుణములకు లోఁబడని స్వభావసిద్ధమై న

యైశ్వర్యము గలవాఁ డెవఁడో, యాపరమేశ్వరునకు నమస్కారములు. ఉక్తవిధము లగునసాధారణగుణములు గల్గిన యో దేవా! నీదివ్యమంగళవిగ్రహమును జూడఁదలంపు గల నీ భక్తుల మగు మా కన్నులకు మందహాససుందర మగునీ ముఖపద్మము విందుగొల్పుఁగాక. ఓ పరమపురుషా! ధర్మము వినాశోన్ముఖ మయినకాలములందు స్వేచ్ఛచేతనే పెక్కు లవతారంబులు దాల్చి మానిమిత్తము దుష్కరము లగుకార్యముల నొనర్చు చున్నావు. అట్టి నీకు నీరూపము చూపుట యేపాటిదుర్ఘటకార్యము? ఇప్పుడు నన్ను స్తుతించినంతమాత్రమున నారూపము నెట్లుచూపుదు ననియడుగుదేని చెప్పెదము వినుము. మీవంటి వారందఱును దమకుఁ బ్రియము లయినవిషయలాభములకొఱకుఁ బ్రయత్నించి యనేకవిధము లగుదుఃఖములను జెందుచు నధిక కష్టము స్వల్పసుఖము గలపనుల నాచరించుచున్నారు. అవి యన్నియు నీకర్పింపఁబడినచో వ్యర్థములు కావు. ధర్మవిరుద్ధ మైనను లౌకికవిషయ మైనను గర్మకలాపము నీయందుంచిన నది విఫలము కాదు. నీవాత్మకు నిరతిశయప్రియుఁడవై యుండ నట్టి నీ కర్పితమైనది నిష్ఫల మెట్లగును? మఱియు స్వల్పకర్మయినను నీకర్పితమయినది యనంతఫలము గల్గించు. కావున మాయెొనరించిన స్తుతి స్వల్పమయినను నీ సుందరరూపమునుజూప సమర్థమయినదే! చెట్టు మొదట నీరు వ్రోసినచో నది తచ్ఛాఖోపశాఖల నన్నింటిని దృప్తిపొందించునట్లు నిఖలదేవతలకును మూల మయిన నిన్నారాధించినచో నది యఖలదేవతలను దనుపును; మఱియు సకలపురుషార్థములను సాధించును. ఓ దేవా! ప్రకృతి పురుషులకార్యములతోఁ బోల్ప వలనుపడని యద్భుతకార్యముల

నొనర్చుచు, ననంతుఁడవై హేయగుణములు లేనివాఁడవై సత్త్వాదిగుణములకు నియామకుఁడవై సత్త్వమును వర్ధించు కర్మమున కనుగుణముగాఁ బ్రవర్తించు చున్ననీ కిప్పుడు నమస్కారము లాచరించెదము. నిన్నుఁ బ్రసన్నునిఁగాఁ జేసికొనుట కింతకుఁ దప్ప వేఱొక యుపాయము లేదు.'' ఇది యైదవయధ్యాయము.

విష్ణువు ప్రత్యక్షమగుట; సముద్రమును మథింప మందరపర్వతమును గొనిపోవుట.

అని యిట్లు దేవతాగణములచే నుతింపఁబడి పరమేశ్వరుఁడు వేవురు సూర్యులతోఁ దుల్య మయినకాంతి గలవాఁడై వారికిఁ బ్రత్యక్షమయ్యె. అతని దేహకాంతిచే దేవతల కన్నులు మిఱుమిట్లుగొనుటంజేసి వారు తమ్మునుగాని భూమినిగాని, యాకసమునుగాని, దిక్కులనుగాని చూడలేకపోయిరి. అప్పుడు భగవంతుఁడగు బ్రహ్మయు శంకరుండును నా పరమేశ్వరుని దేహమునుజూచిరి. ఆ యీశ్వరునిదేహ మింద్రనీలమణులవలె శ్యామలవర్ణము గలది. అతని కన్నులు దామరపూవులోపలి దళములవలె నెఱ్ఱనివై యుండె. అతఁడు ధరించిన పట్టువస్త్రము తప్తకాంచనమువలెఁ బ్రకాశించుచుండె. అతని సకలావయవములును ప్రసన్నములై సుందరములై యుండె. అతని కనుబొమలు మిక్కిలి సుందరములై యుండె. మంచి రత్నములు దాపిన కిరీటము బాహువులు మొదలగు నలంకారముల నతఁడు ధరించియుండె. కర్ణకుండలముల కాంతులచే నినుమడింపఁబడిన చెక్కిళ్లకాంతి యతని ముఖపద్మమున కమిత

సౌందర్యమును గూర్చుచుండె. అతఁడు బంగారు మొలత్రాటిని, గడియములను, ముత్యాలహారములను, నందెలను, గౌస్తుభరత్నమును, శ్రీదేవిని, వనమాలను దాల్చి వెలయుచుండె. చక్రము మొదలగు నతని యాయుధములు పురుషాకృతులను దాల్చి యతని సేవించుచుండె. అట్టిపరమేశ్వరునిఁ జూచి బ్రహ్మరుద్రుని తోడను, సకలసురులతోను సకలావయవములు భూమినిదాకు నట్లుగా మ్రొక్కి పరమపురుషునిట్లు నుతింప నారంభించె. 'ఓదేవా! నీవు కర్మాధీనుఁడవు కాకయే సృష్టిస్థితిలయములొనర్చుచున్నావు. సత్వాదులగుప్రకృతిగుణములకు శత్రువవు. నీవు దుఃఖరహితమగునానందమునకు సముద్రునివంటివాఁడవు. అణుస్వరూపుఁడగుజీవునికంటెను సూక్ష్మతరుఁడవై యతనియంతరాత్మవై యొప్పుచున్నవాఁడవు. నీవు మహాప్రభావము గలవాఁడవు. ఊహింపఁ దరముకాని తేజస్సు గలవాఁడవు. ఇట్టి నీకు నమస్కారము లాచరించెదను. ఓ పురుషశ్రేష్ఠా! శ్రేయస్సును గోరువారి నీ రూపమును, వేదోక్తమును బాంచరాత్రాదులచే బోధితము నగుయోగముచే నారాధింతురు. ఈనీరూపమందు ముల్లోకములతోను గూడినమమ్మును జూచుచున్నాము. కావున విశ్వము నీకంటె వేఱయినదికాదని నిశ్చయింపవచ్చు. ఈ విశ్వము మొదటికాలమందును, మధ్యకాలమందును, నంత్యకాలమందును, స్వతంత్రుఁడ వయిన నీయందే కానవచ్చుచున్నది. ఉపాదాన కారణమయిన మంటికంటె ఘటము వేఱుగాన ట్లుపాదాన కారణము లయిననీకంటె నీ జగంబు వేఱయినదిగానేరదు. అ ట్లగుటంజేసి జగత్తునకు సంభవించుచున్న యాద్యవస్థయు, మధ్యమావస్థయు, నంతిమా

వస్థయు నీవేకాని వేఱుకాదు. అట్లు జగంబున కభిన్నుఁడ వయ్యుఁ బ్రకృతి విలక్షణుఁడైన జీవునికంటెను విలక్షణుఁడవై తద్గతదోషముల నందవు. ఓదేవా! నిన్నువిడిచియుండలేనిదై నీకు వశంగతయై యున్నమాయచే నీ జగము నిర్మించి యం దంతరాత్మరూపమునఁ బ్రవేశించితివి. అట్లు ప్రవేశించి గుణ పరిణామమందు సైతమును జేతనాచేతనగతము లగునీచ గుణముల నొందక వర్తించు నిన్నుఁ బండితులు యోగపరిశుద్ధ మైనమనస్సుచే సాక్షాత్కరము చేసికొందురు. మజ్జియు మథించి కట్టెలందుండు నగ్నిని దీసికొనుచున్నట్లును, బితికి గోవులం దున్న పాలను గాంచువిధమునను, గృషిచేసి భూమియం దున్నయన్న మును సాధించుచందమునను, భూమిని ద్రవ్వి జీవనభూత మగు జలమును జేసొన్నట్లును, విద్వాంసు లగుపురుషులు చేతనాచేత నము లగుపదార్థములందున్న నిన్నును యోగపరిశుద్ధమైన మన స్సనెడిసాధనమువలనఁ బొందుచున్నారు. ఓలోకనాథా! ఓపద్మ నాభా! నిరతిశయపురుషార్థ మగునీరూపమును మిక్కిలి చిర కాలమునుండి కోరుచున్నాము. మాపూర్వపుణ్యవశమున నేటి కది మాకుఁ బ్రత్యక్షమైనది. కార్చిచ్చుచేఁ బరితాపముచెందు గజములు గంగాజలమునుబొంది సంతసించునట్లు నీ యీ రూప మునుబొంది సుఖించుచున్నాము. ఓ లోకనాథా! అట్టి నీవు మమ్ముఁ దయఁజూచి దేనినపేక్షించి నీపాదమూలమును జేరితిమో యా ప్రయోజనమును మాకు సమకూర్చుము. విశ్వమునకు లోపటను వెలుపటను నిండియుండి సమస్తమును సాక్షాత్కరించుకొనెడి నీ కింతకంటె నేమని విన్నవింపఁగలము? నేనును, శంకరుఁడును, దేవాదులును, దక్షాది ప్రజాపతులును మొద

లగు మే మందఱమును నగ్నివలన విస్ఫులింగములవలె నీవలన వేఱయితిమి. అట్టి మేమాత్మసుఖము నేమెఱుఁగుదుము. కావున నీవే బ్రాహ్మణులకును, దేవతలకును, వేదములకును, సుఖము గల్గించునుపాయము నాలోచించి యుపదేశింపుము" అని యిట్లు బ్రహ్మాదులచే సన్నుతుఁడై పరమేశ్వరుఁడు వారి హృదయమును దెలిసికొని యింద్రియముల జయించి దోసిలికట్టి యెదుట నిల్చి యున్నబ్రహ్మాదులఁ గాంచి తా నొక్కఁడే సురలకార్యమును నెఱవేర్పఁ జాలినను సముద్రమథనాదులచే విహరింప నెంచి మేఘగర్జనమువలె గంభీర మగుస్వరముతో నిట్లనియె. "ఓ విరించీ! ఓశంకరా! ఓదేవతలారా! నావచనమును వినుఁడు. దానివలన మీకు శ్రేయస్సుగలుగును. మీకుఁ జా వెప్పటికిని సంభవింపదు. మీ రిప్పుడు వెంటనే పోయి మంచిమాటలాడి దైత్యులతోను దానవులతోను సంధిచేసికొనుఁడు. కాలనశమున వారు మీకు సఖులై యుండినచో మీ కభివృద్ధి తప్పక కలుగును. నెఱవేర్చుకొనవలసిన కార్య మున్నప్పుడు శత్రువులతో నైనను సంధిచేసికొనవలయు. అట్లు వారలతో సఖులై యుండియు మనస్సులలోఁ గ్రోధమును విడువక యహిమూషికముల వలె వధ్యఘాతుకభావముతో వర్తింపవలయును. అమృతమును సాధించుటకై మీరు శీఘ్రముగాఁ బ్రయత్నింపవలయును. ఆ యమృతమును ద్రావినవాఁడు మృత్యుగ్రస్తుఁడయ్యుఁ జావు లేనివాఁడగును. అట్టి యమృతము మీ కున్నచో సమస్తము సమకూఁఅును. మీరు ముందుగా సమస్తము లగుగుల్మములను, వృణములను, లతలను, ఔషధులను, బాలసంద్రములతో వైచి మందరపర్వతమును గవ్వముగాఁ జేసి వాసుకిని ద్రాటినిగాఁ

జేసి నా సాయమును బడసి జాగరూకులై మసలుఁడు. దైత్యులు కేవలము గర్వమును జెందుదురు. మీరు ఫల మనుభవింతురు. ఓ సురలారా ! దైత్యులు దేనిని గోరుదురో దానికెల్ల మీ రను మోదింపుఁడు. మంచిమాటలచేఁ గార్యము సిద్ధించినట్లు కోపము చేతఁ గాదు. కాన్పున మీ రిఁకఁ గోపము విడువవలయు. మీరు తరుచునపుడు ముందుగాఁ గాలకూటము పుట్టును. దానికి మీ రెంతమాత్రము భయపడకుఁడు. దానిని రుద్రుఁడు భక్షింపఁ గలఁడు. సముద్రమునం దుదయించిన వస్తువులలో నొకదానికిని మీ రాశపడరాదు; అపేక్షింపఁ గూడదు; ఒకప్పుడును గోపింపఁ గూడదు" అని యిట్లు బోధించి భగవంతుఁ డైనపురుషోత్తముఁడు వారు చూచుచుండఁగా నచ్చటనే యంతర్ధాన మొందెను. అనంతరము బ్రహ్మయు శంకరుఁడును, భగవంతునకు నమస్కరించి తమతమ నిలయముల కరిగిరి. ఇంద్రాది దేవతలు బలినిని సమీపించిరి. అంతఁ బుణ్యశ్లోకుఁ డైనబలి సంధి విగ్రహాదుల నెఱిఁగినవాఁడు కావున యుద్ధమును గోరక వినతులై వచ్చుచున్న దేవతలను జూచి చంప నుద్యుక్తులైన తనవారిని వారించెను. సకలమును జయించి సకలలోకసంపదలను వశము గావించుగొని దైత్యులచే రక్షితుఁడై సభామధ్యమున నాసీనుఁడై యున్న బలిని సమీపించి దేవతలలో వరిష్ఠుఁడయిన యింద్రుఁడు మృదుమధురము లైనవచనములతోఁ బురుషోత్తముఁడు చేసిన యుపదేశప్రకారముగాఁ దెలిపెను. ఆవచనము బలికి శంబరునకుఁ ద్రిపురాసురులకుఁ, దక్కిన దైత్యనాయకులకును హితముగాఁ దోఁచె. అంత దైత్యులను, సురలును, బరస్పరమును సమయ మేర్పఱుచుకొని సంధిచేసికొని యమృతము

నిమిత్తము మిక్కిలి ప్రయత్నముచేసిరి. అనంతరము దేవాసురులు మదాంధులై పరిఘులవంటి బాహువుల బలముచే మందరపర్వతమును బెల్లగించి సింహనాదములు చేయుచు దానిని సముద్రమును బొందింపఁ బ్రవృత్తులైరి. కాని కొంతదూర మేఁగునప్పటికి బలి యింద్రుఁడు మొదలగువారందఱును వివశులై దాని మోయలేక మార్గమధ్యమున విడిచిపెట్టిరి. మిక్కిలి బరువు గలయా పర్వతము క్రిందఁబడునప్పుడు దేవాసురులు పెక్కండ్రు నుగ్గయిరి. అప్పుడు భగవంతుఁడు నలఁగిన యవయవములు గలవారై భగ్నమనోరథులై యున్న దేవదానవులను గాంచి యచ్చటికేఁగి గిరిక్రిందఁ బడి చచ్చినవారి నందఱను గడకంటిచూపులచేఁ జూచి బ్రదికించె. భగవంతు ననుగ్రహమువలన వికలాంగు లగువారుగూడఁ బూర్ణాంగులై బాధారహితులైరి. అనంతరము పరమపురుషుఁడు వారందఱుఁ జూచుచుండఁగా సులభముగా నా పర్వతము నొక్కచేతితో నెత్తి గరుడునిపై నుంచి సురాసురులు గొలువ సముద్రమును సమీపించి యా పక్షిరాజు మూఁపునుండి యాగిరిని దింపిపోవ నతని కనుజ్ఞయొసఁగె. అప్పుడు పక్షిరాజు శీఘ్రగమనమున నెగిరిపోయెను. ఇది యాఱవయధ్యాయము.

సముద్రమున హాలాహలాదులు జనించుట.

అనంతరమున దేవాసురులు వాసుకి చెంతకేఁగి "నీ కమృతములోఁ బాలుపెట్టిద" మని చెప్పి యొప్పించి యతని నాపర్వతమునకుఁ జుట్టి సంతోషయుతులై యమృత మపేక్షించి సముద్రమును దరువ నారంభించిరి. ఓ రాజేంద్రా! శ్రీహరి



1395 క్షీరసాగర మథనము : ఉచ్చైశ్శ్రవాదులు పుట్టుట.

వాసుకిముఖము వైపు పట్టుకొనెను. దేవతలంద ఱూపక్కనే పట్టుకొనిరి. ఆ భగవంతుఁ డిందుల కట్లు పట్టుకొనెనో యెఱుఁగక రాక్షసులు, " మేము స్వాధ్యాయసంపన్నులము. శాస్త్రములఁ జదివినవారము. పుట్టువుచేతను, జేసిన కర్మకలాపము చేతను బ్రసిద్ధులము. అట్టి మే మంగళకరమైన వాసుకితోఁక నెంతమాత్రమును గ్రహింప " మని పలికి కార్యవిముఖులై యున్నఁగాంచి వాసుదేవుఁడు మందహాసముచేయుచు దేవతలతోఁగూడ ముఖభాగమును వదలి పుచ్ఛభాగమును జేకొనెను. దైత్యులు ముఖభాగమును గ్రహించిరి. కశ్యప నందనులైన దేవాసుర లిట్లు స్థానవిభాగమును జేసికొని యధిక ప్రయత్నముతో సముద్రమును దరువఁజొచ్చిరి. ఓ పాండవేయా ! ఇట్లు మథించుచుండ మహాభారము గలయా కొండ నిరాధారమై నందున బలవంతు లగుదేవాసురులు పైకెత్తు చున్నప్పటికి నాఁగక జలములలో మునిఁగెను. సురాసురులు తమబలము బలీయమైన దైవముచే నశించుటంబట్టి సవిచారమనస్కులై తెలతెల పోయిన మొగంబులతో నూరక చూచుచుండిరి. అంత విశ్వేశ్వరుఁ డొనర్చినవిఘ్నమును గాంచి సత్యసంకల్పుఁడు, నపార బలుఁడును, భగవంతుఁడు నగు నజితుఁడు మహోన్నతమగు తాఁబేటిరూపము నొంది జలములలో మునుఁగుచున్న పర్వతముక్రింద నిలిచి పైకెత్తఁగా సురాసురులు దానిని గాంచి సంతసించి మఱుఁడ మథింప నుద్యుక్తులైరి. ఓరాజా ! ఆ కూర్మమూర్తి లక్షయోజనముల విస్తీర్ణత గల్లి రెండవ జంబూద్వీపమో యన్నట్లు సొంపారుచున్న తన వీపుచే ధరించియుండుటంబట్టి యకొండ నిరపాయముగా నుండెను. సురవరులును,

దైత్యశ్రేష్ఠులును దమ బాహుబలముచేఁ గడువేగముగాఁ ద్రిప్పు చున్నయా పర్వతపుపరివర్తనము లమితబలుఁ డయిన యా కూర్మమూర్తి యొడలి దురదను దొలఁగింప ననుకూలముగా నుండె; కాని రవంతేనియు బాధ గల్గింపలేకపోయె. జలమందుఁ దాఁబేటిరూపుననుండియే పరమేశ్వరుఁ డా యసురులలోఁ బ్రవేశించి వారికి బలవీర్యములను గల్గించుచు, న క్లే దేవరూపమున దేవతల బలవీర్యాదులను వర్ధించుచు వాసుకిని నిద్రామత్తునిఁగాఁ జేయుచు, నా గిరి యుపరిభాగమున రెండవ గిరివలె నొప్పుచు నేకహస్తముచే దాని నాక్రమించుచు వెలయుచుండుటం జూచి బ్రహ్మాదు లతని మహిమను నుతించుచుఁ బూలవానఁ గురియించిరి. ఓరాజా ! భగవంతుఁ డిట్లు పర్వతమునకుఁ గ్రిందను మీఁదను, నాధారముగా నుండి తమయందును, వాసుకియందును బ్రవేశించి బలకరుఁడై యుండుటం జేసి దేవదానవులు మదించి తమ బలమునంతను వినియోగించి జలజంతువులకు క్షోభ గలుగునట్లు సముద్రమును వడివడిగాఁ దరుచుచుండిరి. అంతలో ముఖభాగము నవలంబించి యున్న రక్కసులు వాసుకి నేత్రములవలనను, సహస్రముఖముల వలనను, నిట్టూర్పు వాయువులవలనను బుట్టిన యగ్నిచేతను బొగచేతను దేహకాంతిని దొఱంగి దావాగ్నిచే దగ్ధములైన నరశవృక్షములవలె నుండిరి. ఆ యగ్నియుఁ బొగలును దేవతలకుఁగూడ సోఁకి వస్త్రములను గంధమాలలను, గవచములను, ముఖములను వివర్ణములగాఁ జేసి శరీరకాంతిని దఱిఁగింపఁ దొడంగెను; కాని యింద్రునకు వాహనము లయిన మేఘములు వర్షించు చుండుటచేతను, సముద్ర తరంగము

లలో దాఁగియున్న శీతలవాయువులు ప్రసరించుటచేతను నంతగా వారు బాధలనొందలేదు. దేవదానవులచే మథింపఁబడి నను సముద్రమువలన నమృత ముదయింపనందున భగవం తుఁ డగునజితుఁడు స్వయముగానే మథింపఁ దొడంగెను. ఆసమ యమున హరి మేఘముమవంటి దేహకాంతిగల్గి పచ్చని పట్టువస్త్ర మునుదాల్చి మెఱుపుఁదీవెలవలెఁ బొలుపొందు కంఠాభరణములచే నొప్పుచుఁ గిరీటసహిత మగుశిరస్సుచే నాకాశమును బ్రకాశింపఁ జేయుచు జ్వలించు చున్నవనమాలను ధరించి, యెఱ్ఱని నేత్ర ములు గలవాఁడై యలరుచుండెను. అతఁడు లోకముల కభ యము నీయఁజాలిన తన భుజములతో సర్పమును బట్టికొని సముద్రమును మథించుచు రెండవపర్వతమువలెఁ బ్రకాశిం చెను. ఇట్లు మథించుచుండఁ బర్వత భ్రమణమువలనఁ జేపలు, మొసళ్లు, సర్పములు, దాఁబేళ్లు, తిమింగిలములు, తిములు, గజ ములు మొదలగు జలజంతువు లన్నియు మిక్కిలి క్షోభఁ జెందు చుండెను. ఇట్లు మథింపఁబడు సముద్రమునుండి ముందుగా హాలాహల మనెడి దుస్సహ మగువిష ముదయించె. అది సాటి లేనిదై భయంకర మగువేగము గలదై దిక్కులకును విదిక్కుల కును, మీఁదికిని, గ్రిందికిని వ్యాపించుచుండెను. దానింగాంచి సురాసురలును, ముల్లోకములందలి ప్రజలును, మిక్కిలి భయ పడి దిక్కులేనివారై శంకరుని శరణువేఁడఁ బఱ్ఱిడిరి. ఇట్లు సురా సురాదులు త్వరగాఁబోయి లోకముల యభివృద్ధినిమిత్తము పార్వతితోఁగూడఁ గైలాసమునఁ గూర్చుండి మోక్షముకై తప మొనర్చుచున్నవాఁడును మునీశ్వరులకుఁ బూజనీయుఁడును నగు శంకరుని సమీపించి నమస్కరించి స్తోత్రము లొనర్పనారంభిం

చిరి. "* ఓశంకరా! నీవు దేవతలకుఁగూడ దేవుఁడవు. నీవు సర్వభూతములకు నంతరాత్మవు. నీవు సకలభూతములను సృజించువాఁడవు. అట్టి నీ పాదమూలములఁ జేరినమమ్ముఁ జేరఁదీయుము. ముల్లోకముల దహించి వచ్చుచున్నయీ విషము నడఁచి రక్షింపుము. † సకల లోకములకును నీవొక్కఁడవే యీశ్వరుఁడవు. సంసారబంధము గల్గించుటకును మోక్షము గల్గించుటకును,నీవే ప్రధానుఁడవు. నీవు లోకములకు గురువవు. అట్టివాఁడ వగుటచేతనే బుద్ధిమంతులు నిన్నుఁ బూజించు

---

* ఇట రుద్రునిఁ బరమకారణునిఁగాఁ జెప్పి భగవంతునియందుండు నసాధారణధర్మము లతనియందున్నట్లు వర్ణించుచున్నారు. అట్లుచేయుట భగవద్ధర్మములు రుద్రునియం దారోపితములగుటవలన నసియెఱుంగవలయును. లేదా రుద్రుఁడు భగవంతుని యావేశావతారమే కావున పరమేశ్వరిబుద్ధిచేనట్లు వర్ణించుట సముచితమని తెలియవలయు.

† ఈప్రకరణమున విస్మీతులగుటంబట్టి దేవతలు శంకరునే పరబ్రహ్మనుగా భావించి యిట్లునుతించుచుండిరి. కాని యతఁడు వాస్తవముగాఁ బరబ్రహ్మము కాఁడు. కావునసే శంకరుఁడు తన్నుఁ బరమేశ్వరునిఁగా నుతించుచున్నప్పటికిని దానుమాత్రము తిన్నట్లుతలంపక పార్వతితో "అపన్నులగువాఁకి యథార్థజ్ఞానముండదు. కావునసే యీపన్ను లగుసురలు పరమేశ్వరుఁడను గాని నన్నుఁ బరమేశ్వరునిఁగా భావించి నుతించుచున్నారు. వీరల యవివేకమును జూడుము" అని యీక్రిందివిధమునఁ జెప్పుచున్నాఁడు, "ఆహోబతభవాన్యే తత్ప్రభావానాం పశ్యవైశసం। పుంసఃకృపయతో భద్రేసర్వాత్మాప్రీయతేహరిః॥ ప్రీయతేహరిర్ భగవతి ప్రీయేహంసచరాచరం॥ ఈచెప్పటచే భూతదయకు సంతసించువాఁడును సర్వాంతరాత్మయుఁ దనకంటె నుత్కృష్టుఁడు నగుపరమేశ్వరుఁడున్నట్లు లీశ్వరుఁడే తలంచుచున్నాఁడు. కావున నీస్తుతి రుద్ర శరీరకుఁడయిన పరబ్రహ్మమునకే చెందునని తెలియవలయు.

చున్నారు. ఓస్వప్రకాశా ! నీ కంశభూతయై త్రిగుణములుగల్గి యున్నమాయచే నీ ప్రపంచమునకు సృష్టిని, స్థితిని, లయమును బొందించును బ్రహ్మ యనియు,విష్ణువనియు, శివుఁడనియు నామ ములఁ జెందుచున్నావు. చిదచిద్రూపము లగుపదార్థములను సృజించు పరబ్రహ్మవు నీవే; చిదచిత్తులచేఁ బ్రకాశించు ప్రపంచ మవు నీవే;దాని కంతరాత్మవై యున్నవాఁడవును నీవే; శాస్త్ర ముచే సాధనీయుఁడవు నీవే; జగములకుఁ గారణభూతుఁడవు నీవే; ఆత్మవు నీవే ; కాలశరీరకుఁడవు నీవే ; నిఖలయోగములును నీవే; నిర్వికారుఁడవును సర్వాంతరాత్మవు నగుపరబ్రహ్మవు నీవే; సకల ధర్మములచేతను బూజనీయుఁడవు నీవే ; అకారోకారములును మకారమును గలిసి యేర్పడిన యోంకారము భవద్విషయక మనియే చెప్పుదురు. ఓశంకరా! నీవు సకలదేవతాస్వరూపుఁడవు. అగ్ని నీకు ముఖమనియు,భూమి నీకుఁ బాదములనియు, గాఁము గమనమనియు, దిక్కులు నీచెవులనియు, వరుణుఁడు నీ నాలుక యనియుఁ జెప్పుదురు. ఆకాశము నీపొక్కిలి; వాయువు నీ నిట్టూర్పులు; సూర్యుఁడు నీనేత్రములు; జలము నీరేతస్సు; నీ యాత్మ యఖిలజీవాత్మలకును నాధారము: చంద్రుఁడు నీ మనస్సు; దివి నీశిరస్సు; సముద్రములు నీకుక్షి; పర్వతములు నీ యస్థిసమూహములు; ఓషధులును, లతలును, నీరోమములు; గాయత్ర్యాది ఛందస్సులు నీధాతువులు. ఓ వేదమయా ! వేదో క్తమగు ప్రసిద్ధధర్మము నీహృదయము. తత్పురుషము, అఘో రము, సద్యోజాతము, వామదేవము, ఈశానము నాఁబడు నను వాకము లైదును నీముఖవ్యాపారరూపములు. ఆయనువాకము లేకదా ముప్పదియెనిమిది మంత్రవర్గము లయినవి. స్వయం

ప్రకాశమై శివ మనుపేరు గలయాత్మతత్త్వము నీయవస్థానము. అధర్మసంభూతము లగులోభము. దంభము మొదలగునవి నీ నీడలు; ప్రపంచసృష్టి నొనరించు సత్వరజస్తమములు నీ నేత్రములు; గాయత్రి మొదలగు ఛందస్సులచేఁ బ్రచురమై పురాతన మయినవేదము సర్వజ్ఞుఁడవును, శాస్త్రప్రణేతవు నగు నీయాకృతము. ఓ గిరీశా! ఓ లోకపాలకా! స్వప్రకాశ మగు * నీస్వరూపమును బ్రహ్మకును, విష్ణువునకు నింద్రునకునుగూడ తెలిసికోఁదగియున్నది. దానియందు రజస్సు మొద లగుప్రాకృత గుణములు లేవు. దేవమనుష్యాది భేదముగూడ నందు లేదు. ఓ దేవా! నీ విదివఱకు భూతద్రోహముచేసెడి మన్మథుని, దక్షయజ్ఞమును, దక్షునిఁ ద్రిపురాసురులను సంహరించితివి. అయిన నా నీచేష్టలు నిన్ను నుతించుటకుఁ జాలవు. ప్రళయకాలమున నీవు చేసిన ప్రపంచమును నీకంటి మంటలచేత భస్మముచేయుదువు. అట్టి యసాధారణకృత్యమునే నీవు గొప్పగానెంచవు. అట్లుండ నీ స్వకార్యములు నీమనమునకు గొప్పలని యెట్లుతోఁచు? వానిని సాధనముగా నుంచుకొని మా చేసిన నుతి నీకెట్లు సంతసింపఁజేయును? ఆత్మారాము లైనగురువులచే సంతతమును

---

* ఇంచులకు మూలము. 'విరించివైకుంఠ సురేంద్రగమ్యుఁ' అని యున్నది. దీని నాలోచింప శంకరుఁడు విష్ణువునకుఁగూడ నమస్కరింపఁ దగినవాఁడ నట్లు తోఁచుచున్నది కాని యదిసరికాదు. మఱియెట్లనఁగా, ఈప్రకరణము రుద్ర శరీరకుఁ డయిపరమేశ్వరుని నుతించుచున్నది. పరమేశ్వరస్వరూపము పరిచ్ఛేద్యముకాదు. పరమేశ్వరుఁడుగూడఁ దన స్వరూప మిట్టిదని చెప్పలేనట్లు గ్రంథములవలనఁ దెలియవచ్చుచున్నది. శాన విష్ణువు తనమహిమను తానే తెలిసికోఁజాలసియున్నదని యర్థమయినట్లిచ్చట గ్రహింపవలయు.

దమతమ హృదయములందు స్మరింపఁబడు చున్ననీ సామర్థ్య మెఱుంగక కొందఱు పార్వతితోఁ జరించుటం జేసి కామివనియు, ఫలమునఁ బేక్షించి తప మొనర్చుచున్నా వనియు, శ్మశానము నందుఁ జరించువాఁడ వనియుఁ, గ్రూరుఁడ వనియు, హింసా కృత్యముల నొనర్చువాఁడవనియు, నిందించుచున్నారు. నీ చేష్టను దెలిసికోలేనివా రందఱును సిగ్గులేనివారని చెప్పవచ్చును. ఇట్టి వాఁడ వగుటంబట్టి కార్యావస్థను, గారణావస్థను బొందెడి చిద చిత్తులకంఱె విలక్షణుఁడవై సర్వవ్యాపివై యున్న నీ స్వరూప మును దెలిసికొనుటకే బ్రహ్మాదులు సమర్థులు కారని చెప్పవలసి యుండ నుతింప నెట్లు సమర్థు లగుదురు? బ్రహ్మాదు లశక్తు లగు చున్నప్పుడు నీచే సృష్టింపఁబడిన బ్రహ్మాదులచే సృజింపఁబడిన మావంటివా రెట్లు శక్తు లగుదురు? కావున మాశక్తికొలంది నీస్తోత్రమును జేయుచున్నాము. ఓయీ! మీరు నుడివిన సర్వ ధర్మములు పరమాత్మవికాని నావికావు. నేను పుణ్యాతిశయ మునఁ బొందఁబడిన యధికారము గల జీవుఁడనుగాని మీరన్నట్లు పరమాత్మను కానే! యందువేనిచెప్పెదము వినుము. ఓ పర మేశ్వరా! నీవు పరమాత్మవైనను గాకపోయినను నీకంఱెఁ బరతత్త్వ మున్నదోలేదో మాకుఁ దెలియకపోయినను నీవు లోకసుఖము నపేక్షించి పెక్కులు కర్మము లాచరించుచున్నా వని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. సర్వము పరమేశ్వరున కధీన మయియుండుటచేతను, నతఁడు లేకుండ నెవరికయినను స్వరూప స్వభావములు లేకుండుటం జేసియు, దద్దృష్టిచేతనే తద్ధర్మముల చేతనే సమస్తమును నుతింపవలయును గాన నిన్ను నెట్లు నుతిం చితిమి. కావున మానుతిని జేకొని మాయభీష్టమును దీర్పుము"

అని యిట్లు పరమాత్మ ధర్మములచే నుతింపఁబడుచుండు సర్వ భూతహితుఁ డయినయీశ్వరుఁడు సంతసించి యా దేవతలకుఁ గాలకూటమువలన సంభవించిన దుఃఖమును దెలిసికొని తనప్రియురా లగుపార్వతి కిట్లనియె. "ప్రియురాలా! ఆహా! ఎంతకష్టము! ఎంతకష్టము! క్షీరసాగరమును దరుచుటవలన భయంకర మగు హాలాహలము పుట్టెను. దానివలన నీదేవతలకును, లోకముల కును, గొప్పయాపద సంభవించినది. ఇప్పు డాప్రజలకు సంప్రాప్త మయినదుఃఖమును జూడుము. దీనుఁలై శరణాగతు లగువారిని రక్షించుటయే ప్రభువు లగువారికి ముఖ్యధర్మము. కావున జీవిం పఁదలంపు గల వీరిని రక్షింపఁ దగినయుపాయను నాలోచింపవల యును. లోకమున సజ్జనులు క్షణభంగురములగు తమ ప్రాణ ములచేఁ బ్రాణుల ప్రాణముల రక్షించుచుందురు. దానివలన నెంతయో లాభము గలదు. భగవన్మాయచే భూతములు మో హితములై పరస్పరమును ద్వేషించుచుండును. అట్టివానియందు దయగల్గి వర్తించెడి పురుషునందు సర్వాంతరాత్మ యగుపరమ పురుషుఁడు ప్రీతిఁజెందును. జ్ఞానాది పరిపూర్ణుఁ డయినహరి ప్రీతుఁ డయినచో జరాచరసహితుఁడ నగునేను ప్రీతిఁజెందెదను. కావున నే నీ విషమును భక్షించెదను. ప్రజల కిక సుఖము గల్గుఁగాక " అని యిట్లు లోకసుఖకరుఁ డయినరుద్రుఁడు విష భక్షణమున కభిముఖుఁ డయ్యె. తనభర్తప్రభావ మెఱుఁగును గాన పార్వతియు యందుల కనుమోదించె. అంత శంకరుఁ డంతటను వ్యాపించి వచ్చుచున్నవిషమును గరతలమునఁ జేర్చి కొని దయతో భక్షించెను. ఓ రాజా! జలకల్మష మయిన విషము తనబలము నీశ్వరునకుఁగూడ జూపకపోలేదు. ఆ విషము

తన వేఁడిమిచే నీశ్వరుని కంఠమును నల్లగాఁ గమలునట్లు చేసినది. అయిన నది రుద్రున కలంకారమే యయ్యె. అయ్యారే! లోకమున సాధువులు స్వార్థమును ద్యజించి లోకహితమునెంచి పరితాపము చెందుదు రనుట కిదియొక నిదర్శనముగదా! అట్టి పరోపకారము సకలాత్ముఁడయినపరమేశ్వరునికి సంతసము గల్గింపకమానదు. ఆశ్రితుల యభీష్టము నెఱవేర్చు శంకరుఁ డొనర్చిన యద్భుతకర్మమున కచ్చెరువడి బ్రహ్మాయు, విష్ణువును, బ్రజలును, దాక్షాయణియు మిక్కిలి స్తుతించిరి. ఈశ్వరుఁడు భక్షించునపుడు జాఱిపడిన విషలేశములను, దేళ్లును, బాములును, విషౌషధులును, మఱికొన్ని జంతుప్రులును స్వీకరించెను. ఇది యేడవయధ్యాయము.

క్షీరసాగరమున ఐరావతాదులు జనించుట.

శంకరుఁ డిట్లు విషమును భక్షించినందులకు దేవదానవులు మిక్కిలి సంతసించి వేగముగా సముద్రమున కరిగి తొలఁటియట్ల సముద్రమును బలముతోఁ దరుచుచుండగా మధేనువుదయించె. దేవతలకుఁ బ్రీతిఁ గల్గించు యాగములకుఁ బనికివచ్చు పాలు, పెరుఁగు, నేయి మొదలగు హోమద్రవ్యముల నిచ్చునుగదా యని యెంచి బ్రహ్మవాదులగుఋషీశ్వరులు దానిని స్వీకరించిరి. అనంతరము చందురునివలె దెల్లనివగునుచ్చైశ్శ్రవ మనెడి గుఱ్ఱ ముద్భవించినది. దానిని బలి పుచ్చుకొనియె. ఇంద్రునకుఁ గూడ దానియం దాసయొడమెను, కాని భగవంతుని యుపదేశముచొప్పున మనస్సు ద్రిప్పికొనెను. పిమ్మటఁ దెల్లనికాంతుల నీనుచు శిఖరములఁబోలు నాలుగు దంతములచేతను ఐరావతము

శోభనాకర్షించుచు గజశ్రేష్ఠ మగునై రావతమం దుదయిం చెను. దానివెంటనె తక్కిన దిగ్గజములును, వానివెనుక నెనిమిది యూఁడేనుఁగులును జన్మ మందినవి. అనంతరము కౌస్తుభ మనెడిరత్నము సంభవించె. ఆ రత్నమును హరి గ్రహించి వక్ష మున నలంకారముగాఁ దాల్చె. ఆటుపిమ్మట దేవలోకమున కలంకారభూత మగు కల్పవృక్షము పుట్టెను. అది యెల్లప్పుడు నర్థులుకోరిన వాంఛితములనెల్లఁ బూరింపఁజాలినది. పిమ్మట బంగారునగలచే నందమైన మెఱలతోను, సుందరము లగువస్త్ర ములతోను నచ్చర లుదయించిరి. వారు మనోహరము లైన గమనములచేతను, గడకంటిచూపులచేతను, సురలమనంబుల నాకర్షించి రతిసుఖము గల్గింపఁజాలినవారు. వారివెనుకఁ బరమేశ్వ రునియందు లగ్నమగు మనస్సుగల్గి మెఱుపుఁదీవియవలె నిజకాం తులచే దిక్కుల వెల్గించుచు లక్ష్మీదేవి సముద్రమునుండి యావి ర్భవించె. ఆమె సౌందర్యాతిశయమునకును లేఁబ్రాయమునకును, దేహకాంతికిని, జిక్కినహృదయములు గలవారై దేవాసురు లందఱు నామెయందుఁ గోర్కి వహించిరి. ఆసమయమున నద్భుత మై మిక్కిలి విలువ గలసింహాసనము నొకదాని నింద్రుఁడు గొనివచ్చి యూమె కర్పించెను. రమాదేవి దానిపైఁ గూర్చుం డెను. గంగ, యమున, సరస్వతి మొదలగునదులు శరీరములఁ దాల్చి స్వర్ణకుంభములతో నిర్మలజలమును దెచ్చిరి. భూమి మూర్తిమతియై యభిషేకమునకుఁ దగినయోషధులఁ గొనివచ్చె. గోవులు పంచగవ్యము నొసంగినవి. వసంతుఁడు మూర్తిమంతుఁ డై నానావిధ పుష్పముల సమర్పించె. ఋషులు మంత్రపూర్వక ముగా గంగాదిజలములచే నభిషేకించిరి. గంధర్వులు మంగళ

ములను బొడిరి. స్త్రీలు నృత్యము గావించిరి. మేఘులు మూర్తి మంతములై మృదంగములు, దవ్వెటలు, దుందుభులు, గోముఖ ములు, శంఖములు, వేణువులు, వీణలు మొదలగువానిఁ జేకొని తుములముగా వాయింపఁదొడంగిరి. అనంతరము దిగ్గజములు పూర్ణకలశములఁ దాల్చి బ్రాహ్మణులు మంత్రము లుచ్చరించు చుండఁ బద్మహస్తయగులక్ష్మిని దానమాడించినవి. స్నాన మగు నప్పటికి సముద్రుఁడు పచ్చని పట్టువస్త్రములఁ దెచ్చియిచ్చెను. మకరందపానములచే మదించిన తుమ్మెదలు గలవై జయంతి యను పుష్పమాలచే నమ్మహాదేవిని వరుణుఁ డలంకరించె. విశ్వకర్మ మనోహరము లగుభూషణములను, సరస్వతి ముత్యాలహార మును, బ్రహ్మ పద్మమును, నురగులు గుండలములను, దెచ్చి యిచ్చిరి. ఇట్లలంకరింపఁబడిన లక్ష్మీదేవి తన కభిమతుఁ డయిన పతిమెడలో ధ్వనిచేయు చున్నతుమ్మెదలు గల యుత్పలమాలను జేత ధరించి చెక్కిళ్లయందుఁ బ్రతిఫలించెడి కుండలములచేతను, సిగ్గుతోఁ గూడిన మందహాసము చేతను, సుందర మగువదనమును, జందన కుంకుమముల పూఁతలచే నొప్పు చు సమములై పరస్పర మెరసికొనుచు నున్న స్తనద్వయమును, గృశించిననడుమును గల దై, మధురము లగునూపురధ్వనులనల్లడ గడలుగొలుపుచుసంచా రముచేయు చున్న హేమలతవలెఁ బ్రకాశించుచు నిట్టట్టు నడ యాడుచుండెను. నిత్యమును, నిత్యము లగుకల్యాణగుములు గలదియు, హేయగుణములు లేనిదియు, నగునాశ్రయమును దనకు సంపాదింపనెంచి యందులకై గంధర్వులందును, యక్షు లందును, నమరులయందును, జారణులందును, దక్కినవారి యందును వెదకెనుగాని యామె కనుకూల మగుస్థానము లభింప

లేదు. ప్రతివానియందు నొక్కొకలోపము గానవచ్చుటచే నెవఁడును నామెమది కిష్టుఁడు గాఁడయ్యె. రుద్రుఁడు, దూర్వాసుఁడు మొదలగువారికిఁ దపోధనంబు గలదు. కాని వారు కోపమును జయింపలేకపోయిరి. గురువు, శుక్రుఁడు మొదలగువారికి జ్ఞానము గలదు. కాని వారి జ్ఞానము సంగరహితమైనది కాదు. బ్రహ్మ మిక్కిలి గొప్పవాఁడు. కాని యతఁడు తన కుమార్తికనే మోహించినవాఁడగుటంజేసి కామమును జయింపలేక పోయెను. ఇంద్రుఁడు లైశ్వర్యము గలవాఁడే. కాని యా యైశ్వర్యము పరులయనుగ్రహమువలన సంపాదించుకొన్నది కాని స్వభావసిద్ధమైనదికాదు. అట్టివారు ప్రభువు లెట్లగుదురు. యమాదులు ధర్మశాలులే కాని వారియందు భూతదయలేదు. కొందఱియందు వితరణగుణము గలదు కాని యది ముక్తిహేతువుకాదు. కొందఱకుఁ జాలినంత పరాక్రమము గలదు కాని యది మఱికొందఱచేఁ బరిహృతమగును. ఆలోచింప భగవంతునికంటె నితరులెవ్వరును ప్రాకృత గుణవర్జితులు కారు. చిరాయువు గలవారికి మంగళ స్వభావము లేదు. మంగళ స్వభావముగలవారికిఁ జిరాయువులవడుట యరుదు.సుస్వభావంబును జిరాయువు నుభయమునుగలవారికి మంగళకర మగువేషము లేదు. ఇట్టి సద్గుణములన్నియుఁ గల్గి సుమంగళవేషమున నొప్పువాఁడు పరమేశ్వరుఁడు కలఁడు.కాని యతఁ డవాప్తసకల కాముఁడగుటంజేసి నన్ను వరించునో వరింపఁడో " అని యిట్లు తలపోయుచు నసాధారణములును మంగళములును, నగు సకల గుణముల కాశ్రయుఁడై ప్రాకృతగుణములు లేక యవేక్షారహితుఁడై యఖిలమునకు నాశ్రయణీయుఁడై యున్నముకుందునిఁ బతిగావరింపఁ దలంచి,

ఝంకారము లొనర్చు మత్తమధుకరముల సమూహములు గల తన చేతిలోని పద్మమాలచే నతని మెడ నలంకరించి లజ్జామంద హాసములచేఁ బ్రకాశించు చూపులు ప్రసరింపఁజేసి యతని వక్షస్థలమును దనకునివాసముగా నొనర్చుకొనవలెనన్న యూహతో మాటాడక యతని యనుగ్రహమును బ్రతీక్షించుచుండెను. ముల్లోకములకుఁ దల్లియు నఖిలసంపదల కాధారయు నగు శ్రీదేవికి ముల్లోకములకుఁ దండ్రియగునారాయణుఁడు తన వక్షస్థలమును నివాసస్థానముగా నిచ్చెను. ఆ శ్రీదేవి యందుండి తన కడకంటిచూపులచేతనే లోకములను లోకాధిపతులను వర్ధింపజేయుచుండె. శ్రీదేవి హరివక్షము నధిరోహించుసమయమున శంఖములు పూరింపఁబడె. మృదంగములు, తప్పెటలు, దుందుభులు వాయింపఁబడె. గంధర్వులు పాడిరి. అచ్చరలును, దక్కిన దేవస్త్రీలు నాడిరి. బ్రహ్మయు, రుద్రుఁడు, మొదలగు వారందఱును బుష్పముల వర్షించుచు, భగవద్గుణములను దెలుపు సత్యములగు మంత్రములచేత నుతించిరి. దేవతలును, బ్రజాపతులును శ్రీదేవి కరుణాకటాక్షములకుఁ బాత్రులై సకల సద్గుణములును, సుస్వభావమును, గలవారై యానందము నొందిరి. దైత్యులును, దానవులును, లక్ష్మిచే నుపేక్షితులై దుర్బలులై, నిరుద్యోగులై మోహము నొందిరి. అనంతరము సురకధిదేవత యగు వారుణీకన్యకమలములవంటి నేత్రములు గలదై సముద్రములోనుండి నిర్గమించెను. దైత్యదానవులు హరియాజ్ఞ చొప్పున నామెను బరిగ్రహించిరి. ఓ మహారాజా! దేవదానవులిట్లు విడువని పట్టుదలలతో నమృతము నపేక్షించి సముద్రమును మథించుచుండ నాశ్చర్యముగొలుపు నొకమహాపురుషుఁ

డుదయించె; అతని బాహుదండములు బలిసినవై దీర్ఘములై యుండె. అతని మెడ శంఖమును బోలుచుండె. అతని నేత్రము లెఱ్ఱగా నుండె. అతఁడు లేఁబ్రాయము గలవాఁడై యుండె. అతని వక్షమున వనమాల ప్రకాశించుచుండె. అతఁ డనేకవిధ ము లగునలంకారములఁ దాల్చియుండె. అతని పచ్చని పట్టు పుట్టములు, ఉన్నత మగువక్షస్థలము, రత్నమయములై, మనో హారములై యున్నకుండలములు, నల్లని కుటిలకేశములు, జూప ఱు హృదయముల నాకర్షించు చుండెను. అతఁడు సింహమువంటి పరాక్రమము గలవాఁడై మందహాసము చేయుచుఁ 'గంకణా లంకృతము లగుచేతులతో నమృత భాండమును దాల్చియుండె. అతని పేరు ధన్వంతరి. అతఁడు విష్ణువు నంశాంశములవలన నవత రించినవాఁడు. అతఁడే యాయుర్వేదమును గనిపెట్టెను. అతఁడు యాగములందు దేవతలతోఁ బాటుభాగము గలవాఁడు. ఇట్లు వచ్చిన ధన్వంతరిని, నమృతపూర్ణ మగుకలశమును జూచి రాక్షసు లందఱును మిక్కిలి సంతసించి శీఘ్రముగా దాని హరిం చుటయేకాక సముద్రమునఁ బొడమిన సమస్త వస్తువులనుగూడ దీసికొనిరి. దైత్యులు బలోత్కటులై యమృత కలశమును వారింప దేవత లేమియుఁ జేయఁజాలక విచారించుచు హరిని శర ణుసొచ్చిరి. సేవకుల కోర్కుల నెఱవేర్చు నారాయణుఁ డాదేవ తల దుఃఖమును జూచి దయగలవాఁడై "ఓ సురలారా! మీరు విచారింపకుఁడు. నామాయచే నమృతమును సాధించి మీకిచ్చె దను" యని యిట్లు దేవతల నోదార్చుచు హరి యచ్చటనే యం తర్ధానము చెందెను. ఆ సమయమున నమృతమందలి యభిలా షముచే దైత్యులు "నీవుకాదు, నీవుకాదు, నేనే ముం దమృత

మును ద్రావెదను" అని యిట్లు పరస్పరమును గలహించుకొను చుండిరి. వారిలో దుర్బలు లగువారు, "అమృతము నిమిత్తము మనవారుగూడ నెంతయు నర్హులు. సత్రయాగమందు యజమానులవలె నీయమృతమందందఱును సమానఫలమందవలెను. ఇదియే సనాతనధర్మ" మని పలుకుచు మచ్చరముతోఁ దనువారిని నిషేధించుచుండిరి; కాని వారు వారి మాటల సరకుగొనక యమృతకలశమును దీసికొని పోవుచుండిరి. అంతలో సకలోపాయముల నెఱింగిన విష్ణువు దేవాదిస్త్రీలందఱను నిరసింపఁజాలిన స్త్రీరూపమును దాల్చి జగముల మోహింపఁజేయు సౌందర్యము గలదగుటచే మోహినియను నామమును వహించె. ఆమె శరీరము నల్లఁగలువవలె శ్యామలమై చూడఁ దగియుండె. ఆమె యవయవములన్నియును, సుందరములై మనోహరములై యుండె. ఆమె చక్కని కర్ణములం దాభరణము లొప్పుచుండె. ఆమె చెక్కిళ్లు మిక్కిలి చక్కఁగానుండె. ఆమె నాసిక యున్నతమై మొగము నందమిచ్చుచుండె. నవయౌవనముచే బలిసి వట్రువలై యున్న స్తనముల భారమున్ నామె కృశోదరము మోయఁజాలకుండె. ముఖపరిమళము సపేక్షించి వచ్చు తుమ్మెదల ఝంకారములకు భయపడి నేత్రములు మిక్కిలి చలించుచుండె. వికసించిన మల్లెపువ్వులదండ యామె కేశపాశమును జుట్టి నెత్తావుల నీనుచుండె. సుందరమగు నామె మెడయం దాభరణములు వెలయుచుండె. శుభప్రదములగు నామె బాహువులందు బాహుపురులు ప్రకాశించుచుండె. ఆమె నితంబము శుభవస్త్రముచే నావృతమై ద్వీపమువలె విశాలమై యుండెను. దాని జుట్టును జుట్టికొనియున్న బంగారుమొలత్రాడు మిక్కిలి సుందర

ముగానుండె. ఆమె చరణములందు నూపురములు మధురముగా ధ్వనిచేయుచుండె. లజ్జాసహితమగు మందహాసములచేతను, భ్రూవిక్షేపముల విలాసములచేతను, సుందరములగు నామె కడ కంటిచూపులు దానవుల మనస్సులందు మోహమును మాటి మాటికిని వర్ధింపఁజేయుచుండె. ఇది యెనిమిదవయధ్యాయము.

మోహిని దైత్యులను వంచించి యమృతమును దేవతలకే పంచుట.

ఇట్టి సౌందర్యవిలాసముతోఁ దమచెంతకు వచ్చుచున్న మోహినీదేవినిఁ గాంచి దైత్యులు పరస్పరమను స్నేహమును విడిచి సుధాపాత్రము నొకనివలన వేఱొకఁడు హరించుచు నామెను సమీపించి" అయ్యా ! యేమిసౌందర్యము! భళీ ! యెట్టి దేహకాంతి ! వహ్వారే ! దీనియూహన మెంతభాగుగానున్నది !!' యని యిట్లు తలంచుచుఁ గామపీడితులై యామెను మెంబడించి యిట్లనిరి. "ఓకంజాక్షీ ! నీవెవతెవు? ఎందుండివచ్చితివి? నీవేమి చేయఁదలంచి యిట్లువచ్చితివి? నీ వెవనిభార్యవు ? నీ వృత్తాంత మును దెలియఁజెప్పుమా ! నీ సౌందర్యము మా మనస్సులను గలంచి యాకర్షించుచున్నది ! సురలుగాని దైత్యులుగాని సిద్ధులుగాని, గంధర్వులుగాని, చారణులుగాని, యోగీశ్వరులుగాని, యీసౌందర్యముగల నిన్ను వరింపలేదని యెఱుంగుదుము. ఆలోచింప వారు నిన్ను వరింపఁ దగనే తగరు. అమరులే యనర్హులగుచుండ మానవు లెట్లర్హులగుదురు ? కావున నీ వెవరిభార్యవును గావు ? ఓసుందరీ ! దయాళు వయినయీశ్వరుఁడు శరీరులమగు మామనస్సులకును, మాయింద్రియములకును సంతుష్టిని గల్గింప



1411. మోహినిరూపియైన భగవంతుఁడు దైత్యులను వంచించి దేవతల కమృతమును పంచి యిచ్చుట.

నిన్నును సృజించిపంపించెనుగాఁబోలు ! ఇదియే నిశ్చయము. ఓ మానినీ ! మే మీయమృతమునిమి త్తము గలహించుచుంటి మి? బద్ధవై రులమును జ్ఞాతులము నయినమాకు దీనిని లెస్సగాఁ బంచియిమ్ము. మేము కశ్యపుని సంతతివారము. కొందఱు మతని పుత్రులము. మఱికొందఱు మతని సోదరులము. మేము సత్కులజా తులమయ్యు నీ యమృతమునకై వివదించుచుంటిమి. ఈవివాద మునశించున ట్లమృతమును బంచిపెట్టుము" ఆవి యిట్లు ప్రార్థించు చున్నదైత్యుల మొఱ నాలించి మోహినీదేవి మందహాసము గావించి కడకన్నులచే వారినిజూచుచు నిట్లనియె. "ఓదానవు లారా! మీరు పవిత్రమయిన కశ్యపసంతతివారు. నేను గులటను. అట్టి మీరు నాయందు విశ్వాసముంచి "యీకార్యంబు నెఱవేర్పు" మనుట కచ్చెరువు చెందుచుంటిని. పండితు లగువారు స్త్రీల నెప్పుడును విశ్వసింపరసుఁడీ ! ఓ సురవైరులారా ! మా వంటి కులటలస్నేహము తోఁడేళ్లస్నేహమువలె ననిత్యమైనది. అప్పటి కప్పుడే క్రొత్తమార్గములఁ బట్టుచుండును. కావున నన్ను మీరు నమ్ముట యుక్తముగాలే"దని పలుక నామెపరిహాస వాక్యములు విని దైత్యులు చంచలచిత్తులై గంభీరముగా నవ్వి యమృతపాత్రమును నొసంగిరి. మోహిని యాపాత్రమును జేకొని మందహాసముచేయుచు వారింజూచి "ఓయసురలారా ! నాచేసిన పంపక మొకప్పుడు న్యాయ్యమైనను, నన్యాయ్య మైన మీ రంగీకరించినచో నీ సుధను బాగుగా విభజించె దను" అని పలికెను. దానవు లావాక్యమును విని తద్వాక్యనిశ్చ యమును దెలియఁజాలక "నీ యిష్టప్రకారము చేయు" మని పలికి యనుమోదించిరి. అనంతరము వారామె యాజ్ఞచొప్పున

నుపవాసముచేసి స్నానముచేసికొని హవిస్సుచే నగ్నినిబూజించి బ్రాహ్మణులకును, భూతములకును, దదితరులకును, యథార్హముగా నానాదానములను జేసి వారివలన నాశీర్వచనములను గైకొని నూతనవస్త్రములఁ దాల్చి యలంకరించుకొని తూర్పునకుఁ జివరలుండున ట్లమర్పఁబడినదర్భలపైఁ గూర్చుండిరి. సురలు నక్షి చేసిరి. ధూపములచే సువాసితమై, పూలదండలచేతను దీపములచేతను నలంకృతమై, యున్న శాలయందు సురాసురులు ప్రాఙ్ముఖులై దర్భలయందుఁ గూర్చుండియుండఁగా సమ్మతకలశమును జేకొని మోహినీదేవి యాశాలను బ్రవేశించెను. ఆమె తొడలు వర్తులములై కరితుండములను బోలుచుండె. ఆమె నితంబము సుందరవస్త్రముచేఁ దనరారుచుండె. విశాలమైన కటిభారముచే నామెగమనము మందమగుచుండె. మదముచే నామె నేత్రములు తిరుగుడుపడుచుండె. ఆమె బంగారపు టందెలు మనోహరముగా ధ్వనిచేయుచుండె. ఆమె స్తనములు కుంభములఁబోలుచుండె. ఇట్లు శ్రీదేవివలె నొప్పారుచు, సుందరములయినకుండల కాంతులచేఁ గర్ణములును, నాసికయును, జెక్కిళ్లును, ముఖమును, బ్రకాశింప, పైటకొంగు జాఱుచుండఁ బరదేవతవలె నిరుపమానసౌందర్యముతో నందుఁ బ్రవేశించిన మోహినిని గాంచి యామె కడకంటి చూపులకుఁ జిక్కి దేవాసురులు మోహమును జెందిరి. అనంతరము మోహిని దైత్యుల కమృతమొసంగుట పాములకుఁ బాలుపోయుటవంటిదనియు, స్వభావముచేతనే దుష్టులయినవారి కమృతమొసంగిన లోకములు నిలుచుటకష్టమనియుఁ దలంచి దేవతలను, దైత్యులను, వేఱువేఱుగాఁ గూర్చుండఁబెట్టి మందహాసముచేతను, బ్రియ

వాక్యములచేతను, గడకంటి చూపులచేతను దైత్యులను వంచించి జరామరణములను హరించు నా యమృతమును దేవతలచేఁ ద్రావించె. దైత్యుల కొక యమృతబిందువైనను దక్కలేదు. అయినను వారు తొలుతమోహినియెదుటఁ బలికినమాటలను దాఁటఁజాలక యామెయందు నమ్మకముగలవా రగుటచేతను స్త్రీతోవివదించుట నింద్యమని యెఱిఁగినవా రగుటచేతను నేమియుఁ బలుకకయూరకుండిరి. మఱియుఁ దామొకవేళ నిష్ఠురముగా నడిగినచో నామెస్నేహము చెడునని భయపడుచు, నామె బహుమానవచనములకు సంతసించుచుఁ, గొంచెమేనియు విప్రియముపలుక లేకపోయిరి. రాహువను రక్కసుఁడొకఁడు దేవతావేషమును దాల్చి దేవతల పంక్తిలోఁ గూర్చుండి యమృతమును ద్రావెను. అది సూర్యచంద్రులు గనుఁగొని మోహినికిఁ గనుసన్నచేయ నామె నిశితధారలు గలచక్రముచే నమృతమును ద్రావుచున్న యారాహువుతలను ఖండించెను. వాని మొండెమున కమృతమంటకపోవుటచేఁ గ్రిందఁబడెను. వాని శిరస్సు సుధాసంస్పర్శమువలన నమరత్వమునొందెను. బ్రహ్మ యారాహువును గ్రహమునుగా నొనర్చె. గ్రహత్వమును బొందియు రాహువు పూర్వవైరమును విడువక పర్వదినములందు సూర్యచంద్రులను గ్రసించుచుండును. దేవతలంద ఱమృతమును ద్రావినతోడనే మోహిని దైత్యులు చూచుచుండఁగాఁ బురుషరూపమునొందెను. ఓరాజా! దైత్యులు దేవతలతోఁ బాటు క్షీరసాగర తీరమునుజేరి మందరపర్వతముచే మథించి మిక్కిలి శ్రమలొంది యమృతమును సాధించినవారయినను దైవానుగ్రహమువలన సురలమృతమును సుఖముగాఁ ద్రావఁ

గల్గిరి. దైత్యులు విష్ణువునకుఁ బ్రతికూలు రగుటఁజేసి యమృతము నొందలేకపోయిరి. పృథగ్భావము నొందియుండుటచేఁ జెట్లు కొమ్మలకుఁ జేసిన జలసేచనము వ్యర్థమగును. అట్లె ప్రాణము చేతను, ధనముచేతను, మనస్సుచేతను, వాక్కులచేతను, తన దేహమునిమిత్తము, దారసుతాదులనిమిత్తము చేయఁబడిన కర్మ, మహంకారము నుమకారము మొదలగు వేఱువే అభిమాన ములు గలదగుటచే నిష్ఫలమగుచున్నది. చెట్టునకుఁ బ్రధాన మయినమూలమును జలాదులచేఁ దడిపిన సఫలమగు. అట్లె సర్వ మున కంతరాత్మయై సర్వకారణుఁ డైయున్న యీశ్వరునిమి త్తము ప్రాణాదులచేఁ జేయఁబడిన కర్మము సఫలమగును. కావున సమస్తము బ్రహ్మాత్మకమనియే నిశ్చయించి తదారాధన బుద్ధితోఁ జేసినదంతయు ఫలవంత మగునని యెఱుంగును. ఇట్టి బుద్ధి లేకపోవుటచేతను, హరిభక్తికి విముఖు లగుటచేతను దానవులు హరిని సంతసింపఁజేయలేకపోయిరి; తత్ఫల మగు నమృత మును జెందలేకపోయిరి. ఇది తొమ్మిదవయధ్యాయము.

—•✧•—

దేవదానవ యుద్ధము.

ఓ రాజా! భగవంతుఁ డీప్రకారముగా సుధారసమును సాధించి సురలచేఁ ద్రావించి గరుడునిపైఁగూర్చుండి సర్వభూత ములును జూచుచుండఁగనే యటనుండి వెడలిపోయెను. పిమ్మట దైత్యులు తమజ్ఞాతు లయిన దేవతలకుఁ గల్గిన మహాఫలమును గాంచి సహింపలేక యాయుధములను దాల్చి సురలను జంప వెంబడించిరి. సురగణము లమృతపానముచే నతిబలులై నారా

యణు పాదపద్మముల నాశ్రయించినవారై తమ్మెదిరించివచ్చు చున్నరక్కసుల నెదుర్కొనిరి. ఆ సముద్రతీరమున దేవదానవు లకు ఘోరయుద్ధము సంభవించె. దానిఁ దలంచుకొన్న దేవా మునఁ బులకలు వొడమును. జ్ఞాను లయినయా దేవదానవులు పరస్పరమును గోపమును వహించి యొకరినొకరు దార్కొని ఖడ్గములచేతను, బాణములచేతను, నానావిధాయుధముల చేతను గొట్టుకొనిరి. ఆసమయమున శంఖములు, మద్దెలలు, దుందుభులు మొదలగు వాద్యవిశేషముల ధ్వనులును, గజముల బృంహితములును, గుఱ్ఱముల హేషలును, రథముల చప్పళ్లును, బదాతుల సింహనాదములును గలిసి భూమ్యాకాశముల నిం డించె. ఆరణమున రథికులు రథికులతోను, బదాతులు పదా తులతోను, గుఱ్ఱములు గుఱ్ఱములతోను, గజములు గజముల తోను దార్కొనిరి. దేవాసురులలోఁ గొందఱు లొట్టియల నెక్కిరి. కొందఱు గజములపైఁ గూర్చుండిరి. కొందఱు గాడిదల నారోహించిరి. కొందఱెలుఁగుబంట్లనధిష్ఠించిరి. కొందఱు పెద్ద పులులను, కొందఱు సింహములను, గొందఱు గద్దలను, గొం దఱు రాఁబులుఁగులను, గొందఱు తోఁడేళ్లను, గొందఱు డేగల ను, గొందఱు తిమింగిలములను, గొందఱు శరభమృగములను, గొందఱు గాఱుదున్నలను, గొందఱు ఖడ్గమృగములను, గొం దఱు గోవులను, గొంద తెఱ్ఱను, గొందఱు గవయములను, గొందఱు నక్కలను, గొంద తెలుకలను, గొందఱు తొండలను, గొందఱు గుక్కలను, గొందఱుమనుష్యులను, గొందఱు మేక లను, గొందఱు దుప్పులను, గొందఱు హంసలను, గొందఱు పందులను, మఱికొందఱు స్థలజల పక్షులను, నింకొకకొందఱు

వికృతాకారము గలజంతువులను నెక్కి యుభయసేనాముఖ ములను బ్రవేశించిరి. ఓ రాజా! చిత్రము లగుధ్వజపటముల వలనను, మిక్కిలి విలువగల్గి వజ్రదండములైన తెల్లనిగొడు గులచేతను, వజ్రదండములు గలవీవనలచేతను, వింజామరల చేతను, వాయువుచే జలించుచున్న తలపాగలచేతను, ధ్వని చేయుచున్న కవచములచేతను, భూషణములచేతను, సూర్య కాంతిలోఁ దళతళమని మెఱయు శస్త్రములచేతను, వీరసమూ హములచేతను బ్రకాశించుచున్న దేవదానవుల సైన్యములు జలజంతువుల పంక్తులతోఁ గూడిన సముద్రములవలె నొం డొంటిఁ దారొక్కనియె. దానవసేనలకెల్ల నధిపతి యగుబలి, మయనిర్మితమై, యుద్ధసాధనములతోఁ గూడినదై, పెద్దదై, యందఱకు నచ్చెరువు గొలుపుచు నిరుపమానమై, కామగమ నము గలదై, మిక్కిలి కాంతిగల దగుటచే దుర్నిరీక్ష్యమై, వైహాయస మనుపేరు గల్గియున్న విమానము నెక్కి ఛత్రచామ రములు మొదలగు రాజచిహ్నములతోఁగూడి సకల సైన్యము లచే సేవింపఁబడుచుఁ బొడుపుఁగొండయం దున్నచంద్రునివలెఁ బ్రకాశించుచుండెఁ. సేనాధిపతు లయిననమువియు, శంబరుఁ డును, బాణుఁడును, విప్రచిత్తియు, నయోముఖుఁడును, ద్విమూ ర్ధుఁడును, గాలనాభుఁడును, బ్రహేతియు, హేతియు, నిల్వలుఁ డును, శకునియు, భూతసంత్రాసుఁడును, వజ్రదంష్ట్రుఁడును, విరో చనుఁడును, వాయ్వగ్నివుఁడును, శంకుశిరుఁడును, గపిలుఁడును, మేఘదుందుభియు, దారకుఁడును, నుగ్రనేత్రుఁడును, శుంభుఁ డును, నిశుంభుఁడును, జంభుఁడును, నుత్కలుండును, నరిష్టుఁ డును, నరిష్టసేమియు, ద్రిపురులును, బాలోమకాలకేయులును,

నివాతకవచులును, మఱికొందఱు దానవశ్రేష్ఠులును, బలికి నలుదిక్కులనడుచుచు సేవించుచుండిరి. ఈ రాక్షసవీరు లందఱు నమృతము నిమిత్తము మిక్కిలి శ్రమచెందియుఁ దద్భాగమును బొందలేక పోవుటచే నతికోపమును వహించి యింతకుఁబూర్వము దేవతల మర్దించినవారే కావున నిప్పుడు నశ్లే చేయవచ్చునని తలంచి సింహనాదములఁ జేయుచు, శంఖములను బూరించుచుఁ బైకిఁ గవయుచుండిరి. ఉద్ధతులై తమపైకి విజృంభించు చున్న శత్రువులంగాంచి యింద్రుఁడు సెలయేళ్లతోఁ గూడిన యుదయాద్రిని సూర్యునివలె దిగ్గజమైనయైరావతమునెక్కి యాకాశమునఁ బ్రకాశించెను. ఆసమయమున నానావిధములగునాయుధములఁదాల్చి పలురకము లగుధ్వజములు ప్రకాశింప, వాయువు, వహ్ని, వరుణుఁడు మొదలగులోకపాలకు లందఱును దమతమ సైన్యములతో నింద్రునికిఁ జుట్టును నడుచుచుండిరి. ఇట్లు ప్రోవుపడి యుభయపక్షముల వీరులును బరస్పరము నాక్షేపించుకొనుచు, నొకరినొకరు పిలుచుకొనుచు, రణముఖమును బ్రవేశించి ద్వంద్వయుద్ధముచేయ మొదలిడిరి. అందు బలితో నింద్రుఁడును, దారకునితోఁ గుమారస్వామియు, హేతితో వరుణుఁడును, బ్రహేతితో మిత్రుఁడును, గాలనాభునితో యముఁడును, మయునితో విశ్వకర్మయు, శంబరునితో ద్వష్టయు, విరోచనునితో సవితయు, నముచితోఁ బరాజితుఁడును, వృషపర్వునితో నశ్విదేవతలును, బాణాసురుఁడు మొదలగు బలిపుత్రులు నూర్గురతోను సూర్యుఁడును, రాహువుతో జంద్రుఁడును, బులోమునితో వాయువును, శుంభనిశుంభులతో బలవతి యగుభద్రకాళియు, జంభునితో వృషాకపియు, మహిషా-

నురునితో విభావసువును, వాతాపితోను నిల్వలునితోను బ్రహ్మపుత్త్రులును, దుర్వ్వాసునితోఁ గామదేవుఁడును, నుత్కలునితో బ్రాహ్మి మొదలగు సప్తమాతృకలును, శుక్రునితో బృహస్పతియు, నరకునితో శనైశ్చరుఁడును, నివాతకవచులతో మరుత్తులును, గాలకేయులతో వసుప్రులును, బాణాసురులతో విశ్వేదేవులును, గ్రోధవశులనెడిరక్కసులతో రుద్రులును, నెదుర్కొని యుద్ధ మొనర్చుచు సమీపించి జయేచ్ఛ గలవారై తీవ్రములయినబాణములచేతను, ఖడ్గములచేతను, దోమరములచేతను, భిండివాలములచేతను, చక్రములచేతను, గదలచేతను, బట్టిసములచేతను, శక్తులచేతను, గొఱ్ఱులచేతను, గండ్రగొడ్డండ్లచేతను, నిస్త్రింశములచేతను, బల్లెములచేతను, బరిఘములచేతను, ముద్గరములచేతను, గొట్టికొని శిరస్సునుఁ ఛేదించుకొనిరి. ఏనుఁగులును, గుఱ్ఱములును, బదాతులును, రథములును, సారథులును బెక్కువిధములుగా ఖండింపఁబడిరి. భిన్నము లయిన బాహువులును నుగ్గైన తోడలును, దెగిన కంఠంబులును, శిథిలము లయినపాదములును, శకలము లయినధ్వజములును, జూర్ణము లయిన యమ్ములపొదలును, జినిఁగిన కవచములును, రాలిపడిన యలంకారములును గల్గి యుద్ధభూమి భయంకరముగా నుండె. దేవదానవవీరుల పదభూతములచేతను, రథచక్రములచేతను బూర్ణిత మైనసమరరంగమునుండి పరాగము మొపట దట్టముగా లేచి దిక్కులను, నాకాశమును, సూర్య్యునిఁ గప్పివుచ్చెను. కాని యనంతరమందే యాభూమి రక్తధారలచేఁ దడియుటంబట్టి యా ధూళులు నివర్త్తించినవి. శిరోవిహీనము లయిన మొండె

ములు చేతులతో నాయుధములు దాల్చి యా యుద్ధభూమి యందు భటులవలె సంచరించుచు జూపఱు కాశ్చర్యముపుట్టించు చుండిరి. ఆసమయమున బలి ఘోరముగా బోరుచు నింద్రు నిఁ బదిబాణములచేతను, మూఁడుశరములచే నైరావతమును, నాలుగమ్ములచే నాల్గు గుఱ్ఱములను, నొకబాణముచే మావటీని నొప్పించెను. వివిధవ్యయంబు నేర్పు గలయింద్రుఁడు తనపైకి వచ్చు చున్నయాబాణములను జూచి మందహాసము చేయుచు వాడిశరములఁ బ్రయోగించి మార్గమధ్యమందే ముక్కలు గావించెను. ధనుర్విద్యయం దా యింద్రునకుఁ గల నేర్పు పెంపునుజూచి బలి సహింపఁజాలక భయంకరమగుశక్తిని ప్ర యోగించెను. మహోల్కవలెఁ బ్రకాశించుచుఁ దనపైకి నది వచ్చుచుండ నింద్రుండు దాని క్షణములోనే తునిమివైచెను. అనంతరము బలి క్రుద్ధుఁడై శూలమును, బిస్మటఁ బ్రాసమును, దరువాతఁ దోమరమును ప్రయోగించెను; కాని వానినన్నింటిని నింద్రుండు త్రుంచివైచెను. అంత బలి యంతర్ధానము చెంది తనమాయలను సృజించెను. తోడనే సురసైన్యములపైఁ బర్వ తములును, కార్చిచ్చుచేఁ గాలుచున్నవృక్షములును, వాడియైన శిఖరములు గలశిలలును బడి చూర్ణము గావించు చున్నట్లు తోఁపించెను. ఆ యుద్ధభూమియందుఁ గ్రూరసర్పములును దంద శూకములును, దేళ్లును, సింహములును, బెబ్బులులును, వరా హములును, గజములును సంచరించి దేవతల బాధింపఁ జొచ్చె ను. వందలకొలఁది రాక్షసులును, రాక్షసస్త్రీలును శూలహస్త లై వస్త్రవిహీనలై నలుదిక్కుల నిండి "చంపుఁ డొడుఁవు" అని పలుకుచు, దేవసైన్యముపై గవిసిరి. మేఘము గంభీరము

గాను, గర్ణకఠోరముగాను ధ్వనిచేయుచు నాకసమున నిట్టట్టు సంచరించుచు నిప్పులను వర్షింపఁజొచ్చె. బలిచే సృజింపఁబడిన వాయుసహిత మగు నగ్ని ప్రళయాగ్నివలె భయంకరముగాఁ జూపట్టుచు దేవసైన్యమును దహింపఁ దొడఁగెను. ఆ సమయమున నాల్గు దిక్కులనుండియు గట్టుల నతిక్రమించి వాయూద్ధూతము లయినతరంగములచేతను సుళ్ళచేతను, భయంకరమై పొంగి పొరలివచ్చు చున్నసముద్రములు దేవతలకుఁ గానవచ్చెఁ. ఇట్లు బలి పలువిధములును, భయంకరములును, నగు మాయలను సృజింప సురసైనికులు మిక్కిలి దుఃఖించిరి. దేవేంద్రాదు లామాయల నడఁగింపఁజాలక విష్ణువును ధ్యానింప జగత్కర్త యగునాపరమేశ్వరుఁడు గరుడునిమూఁపుపైఁ బాదములుంచి పచ్చని పట్టువస్త్రములను ధరించి పద్మములవంటి లోచనములు గలవాఁడై శ్రీవత్సముచేతను, మిక్కిలి విలువ గలకిరీటముచేతను, గుండలములచేతను, బ్రకాశించుచు, నెనిమిదివిధములగు నాయుధములను ధరించి వెంటనే సాఁకొత్కరించెను. మెలఁకువ వచ్చినపిమ్మట స్వప్నములవలెను, హరిస్మరణము గల్గినతర్వాత సకలవిపత్తులవలెను, భగవంతుఁడు సాఁకొత్కరించిన తోడనే యతని తేజోమహిమచే బలి సృజించిన మాయాజాలమంతయును నశించెను. యుద్ధభూమి కరుదెంచిన విష్ణువును గాంచి సింహావహనుఁడై నకాలనేమి భయంకర మగుశూలము నొకదానినిగొని గిరగిరఁద్రిప్పి విష్ణువుపైకిఁ బ్రయోగించె. అది పోయి గరుడుని మూఁపుపైఁ బడెను. త్రిలోకాధిపతి యైనవిష్ణువాశూలమును లీలగాఁ గొని వాహనముతోఁ గూడ నా రక్కసునిఁ జక్కఁడఁచెను. వాని మరణమును జూచి మాల్యవంతుఁడు

తీవ్ర మయినగదను దాల్చి హరికి వాహన మయినపక్షీంద్రునిఁ బొడిచి సింహనాదము చేసెను. అట్లు మహాధ్వనిచేయుచున్న శత్రువును మాల్యవంతునిఁ జూచి హరి సహింపలేక వాని శిరమును జక్రముచే ఖండించెను. ఇది పదవయధ్యాయము.

సురాసుర యుద్ధము.

అనంతరమునఁ బరమపురుషుఁ డయినవిష్ణుప్రదయవలన రాక్షసమాయలనుగడచి యింద్రాదిదేవతలు పూర్వము తమతో ద్వంద్వయుద్ధమునకుఁ దారసిల్లిన దైత్యులతో మగుడ యుద్ధమునకు సమకట్టి వారల నానావిధములఁ బీడించిరి. అందు దేవేంద్రుఁడు మిక్కిలికోపించి తన్నెదురుకొన్నబలిని వజ్రాయుధముచేఁ జంప యత్నింప నదిచూచి ప్రజలు హాహాకారములు చేయఁ దొడంగిరి. అప్పుడింద్రుఁడు మిక్కిలి కోపియై యుద్ధాభిలాషగల్గి యుద్ధభూమియందు మహాగర్వముతో సంచరించుచున్నబలింజూచి తిరస్కరించుచు నిట్లుపలికెను. "ఓరీమూఢా! నానావేషములచేఁ గన్నుదెఱవని యజ్ఞులను మోసపుచ్చి వారిధనంబు హరించునట్లు నీచందమున సకలమాయాధిపతులమగు మమ్ము నీమాయలచే జయింపనెంచితిని. నీమాయలకుఁ జిక్కువారముకాము. ఓతెలివిమాలినవాఁడా! ఇంతకుముం దనుభవించు పదవులకంటె నున్నతపదవులను, నింతకుమున్ను మీరున్నలోకములకంటె నుత్తమలోకములను బొందఁ దలంచుచున్నారు. వానిని మీరపహరింప సమకట్టుచున్నదొంగలు. అట్టి తుచ్ఛులగుమిమ్మిప్పుడే ఛంపెదను. ఓ మందబుద్ధీ! ఇదిగో

నూఱంచులు గలయీవజ్రాయుధముచే నిప్పుడే చెడుమాయలు పన్నినట్టి నీశిరంబును ఖండించెదను. పాతిపోక నీజ్ఞాతులతోఁ గూడి నీపౌరుషము చూపుము" అని పలుకుచున్న యింద్రుని వాక్యములువిని బలి యిట్లనియె. "ఓసురేంద్రా! ఏలగర్వించెదవు? పూర్వము చేసికొన్నకర్మమే కాలచోదితమై మనకీ జన్మమున వరుసగా జయమును నపజయమును సుఖదుఃఖములును గలిగించుచుండును. అట్టికర్మము గలవీరులకవి కాలక్రమమున సంభవించుచుండును. నీ విప్పు డొకవేళ యశమును జయమును బొందిసను నీ కవి సర్వదా నిలిచియుండవు. నాపూర్వకర్మము మంచిదైనచో నీకిప్పుడు సంభవించినజయాదులు నాకే సంభవించును. ఇంతమాత్రమున సంతసించుట కేమున్నది? లోకమునఁ బండితులగువారు కర్మవశమున సంభవించెడి సుఖదుఃఖముల ననుభవించు జనులనుగాంచి సంతసింపరు; దుఃఖింపరు. ఇట్లుండ నీ వది యెఱుంగక జయాపజయములను గూర్చి సంతసించుచు విచారించుచు నున్నాను. నీవవివేకులలో మొదటివాఁడవు. కీర్తికిని జయమునకును, దేహమే సాధనమని తలంచిన చో సాధువులు మిక్కిలి విచారింతురు. అట్టియవివేకులగుమిమ్ము ను మీవలె మేము నిందావాక్యములు పలుకము" అనియి ట్లాయింద్రునాక్షేపములచేతనే కాక వీరశ్రేష్ఠుఁడయినబలి కర్ణాంతమువఱకు నాకర్షింపఁబడిన బాణములచేతను నతనిఁగొట్టెను. యథార్థవాది యగుబలిచేఁ దిరస్కృతుఁడయినయింద్రుఁడా యాక్షేపము నంకుశాహతమును గజమువలె సహింపలేక శత్రువులఁ జంపునదియు, వ్యర్థముకానిదియు నగు తన వజ్రాయుధము నతనిపైఁ బ్రయోగించెను. బలి యాదెబ్బదిని తెక్కలు

దెగిన పర్వతమువలె వాహనముతోఁగూడ నేలఁగూలెను. అంత జంభాసురుఁడు యుద్ధభూమిపైఁ బడిన తనమిత్రుని బలినిగాంచి యతనిస్నేహమును బురస్కరించుకొని యింద్రునెదుర్కొనెను. సింహవాహనారూఢుఁడయినజంభుఁడిట్లు దేవేంద్రుని సమీపించి యతిరయమున గదనుదీసికొని గిరగిరఁద్రిప్పి యతని కంఠముపైఁ గొట్టెను. అట్లే యైరావతమునుగూడ నొప్పించెను. ఆ గజమాగదాఘాతమునోర్వలేక వివశత్వమునొంది మోఁకాళ్లఁ బడి మిక్కిలి దుఃఖమునుజెందెను. ఆసమయమున సారథి యగు మాతలి వేయుగుఱ్ఱములఁ బూన్చినరథమును గొనిరాఁగా నింద్రుఁడా గజమును విడిచి రథమధిరోహించెను. మాతలి తన ప్రభువునకుఁ జేసినయుపకారమును మెచ్చుకొనుచు జంభుఁడు ప్రకాశించు చున్నశూలము నొకదానిఁ గైకొని మందహాసము చేయుచు నింద్రసారథిని బొడిచెను. కాని యతఁడంతతోఁ జలింపక ధైర్యమవలంబించి యూపోటును లక్ష్యముచేయలేదు. మరల నారక్కసుఁడాయుధమును దీసికొనునంతలో నింద్రుఁడు వజ్రముచే వాని శిరస్సును ఛేదించెను. ఇంద్రునిచే జంభుఁడు చచ్చెనన్నవార్త నారదునివలన విని వాని జ్ఞాతులయిననముచియు, బలుఁడును బాకుఁడును సతిరయమునఁ బఱతెంచి యింద్రుని సమీపించి పరుషవచనములచే వాని మర్మస్థానములను ఛేదించుచు, మేఘములు జలధారలచేఁ బర్వతములనువలె బాణవర్షముచే వానిఁగప్పివుచ్చిరి. అందు శరసంధానమందు మిక్కిలి నేర్పు గలబలాసురుఁడు దేవేంద్రుని నొకబాణముచేతను నతని గుఱ్ఱముల వేయింటిని వేయుబాణములచేతను, నొక్కమాఱు నొప్పించెను. అప్పుడే పాకాసురుఁడు చూచువారాశ్చర్యము

చెందునట్లు బాణముల సంధించుచు విడుచుచు, నవలీలఁ రెండు వందల శరములచే మాతలిని, రథమును దట్టముగాఁ గొట్టెను. ఓరాజా! ఆసమయమునఁ బాకాసురుని ధనుర్విద్యాకౌశలమున కచ్చెరువొందనివారు లేరు. మూఁడవవాఁ డగునముచి బంగారు పిడులుగల పదునేనుమహాశరములచే నింద్రుని నొప్పించి వర్షాకాల మేఘమువలె గంభీరముగా నఱచెను. ఈవిధమున నా రాక్షసవీరులు వర్షాకాలమందు సూర్యుని మేఘములవలె రథసారథులతోఁగూడ నింద్రుని శరవర్షముచేఁ గానరాకుండఁ జేసిరి. తమ ప్రభువయినయింద్రునిఁ గానక సురగణములు మిక్కిలి వివశత్వమునొంది దిక్కులేనివారయి సముద్రమధ్యమున నావ పగిలిపోవుటచే మిక్కిలిభీతిచెంది తమ రక్షణకై విలపించు వర్తకులవలెఁ గడుంగడు వాపోవఁజొచ్చిరి. అంతఁ గొంతవడికింద్రుఁ డాశరపంజరమును భేదించుకొని తన యశ్వములతోను రథముతోను, సారథితోను, ధ్వజముతోను బైకివచ్చి నిశావసానమందు సూర్యునివలె నిజతేజముచే భూమ్యాకాశములను దిక్కులను బ్రకాశింపఁజేయుఁ జొచ్చెను. రాక్షసవీరులచేఁ బీడింపఁబడుచున్న తనసేననుగాంచి మిక్కిలి కోపించి యింద్రుఁడు శత్రువుల దండింప వజ్రాయుధమును గైకొని బలపాకాసురుల శిరముల నొక్కమాఱె ఛేదించెను. అదిచూచి వారి జ్ఞాతులు మిక్కిలి భయమందిరికాని మహాబలుఁ డగునముచిమాత్ర మెంతమాత్రమును జంకక తన జ్ఞాతుల మరణమువలనఁ గల్గిన శోకమునకును, గోపమునకును నధీనుఁడై యింద్రు నెట్లయినను జంపవలెనని నిశ్చయించి ఘంటలతోను, బంగారునగలతోను, వెలయు చున్నలోహమయ మగుశూలమును స్వీకరించి "ఓరీ!

యింద్రా! దీనిచేఁ జచ్చితి" వని సింహనాదముచేయుచు ప్రయో
గించెను. ఆకాశమునుండి మహోల్కవలె భయంకరమై వచ్చు
శూలమును గాంచి యింద్రుఁడు బాణపరంపరచే వేయిముక్క
లుగాఁ జేయుటయేకాక కోపోద్దీపితుఁడై వజ్రాయుధమును వాని
శిరస్సును ఛేదింపఁ బ్రయోగించెను. వజ్ర మిట్లు దేవేంద్రుని
యావచ్ఛక్తిచేతను ప్రయుక్తమైనను, నింతకుఁ బూర్వమతి
బలుఁడయినవృత్రునిఁ జంపినదై ననునది సముచిచర్మమునైనను
ఛేదింపకపోయెను. ఆ యశక్తతనుఁ జూచి యచ్చటివారందఱు
నచ్చెరువడిరి. తన వజ్ర మతనియెడ వ్యర్థమైనందుల కింద్రుఁడు
మిక్కిలి భీతుఁడయి "అకటా! దైవయోగముచే నా యాయు
ధము భూతలోక మాశ్చర్యము చెందునట్లు వ్యర్థమైనదేమి?
తమభారముచేఁ బ్రజాక్షయముచేయు పర్వతముల రెక్కల నేది
ఛేదించెనో, యేది త్వష్టృప్రజాపతి తపోతిశయమునఁ గల్గిన వృ
త్రు నవలీల జయింపఁగల్గెనో, యేది యితరాయుధములచే జయిం
పఁబడని బలిని, జంభుని, బలునిఁ, బాకుని నిర్జింపఁగల్గెనో, యట్టి
వజ్రాయుధము నాచేఁ బ్రయుక్తమయ్యు నల్పుఁడయినను
చిని జయింపకలేకపోయెను. బ్రహ్మతేజమునకు నిధి యైనదధీచి
మహాముని సామర్థ్యమేయైన నిది యిప్పుడు నిష్కారణముగా
సామాన్యదండమువంటిదయ్యె. ఇట్టిదాని నేఁ బరిగ్రహింపను"
అని యిట్లు తనలో విచారించు చున్నసమయమున " ఓయీ
యింద్రా! యీరాక్షసుఁడు తడిగలయాయుధములచేఁ జావఁడు.
తడిలేని యాయుధములచేతను జావఁడు. అట్లు చావకుండుట
కితనికిఁ బూర్వము వరమిచ్చియున్నాను. నీవజ్రము శుష్కమైనం
దున దీనిఁ జంపలేకపోయెను. వీని మరణమునిమిత్తముపాయాం

తర మాలోచింపవలయు" నని వినవచ్చిన యశరీరవాక్కు విని సమాహితచిత్తుఁడై తాదృశవస్తువేదియో యని చింతించి చింతించి తుదకట్టివస్తువు నురుఁగుగాక వేఱొకటిగాదని నిశ్చయించి దానిని దెచ్చి వజ్రమునకుఁ బులిమి దానిచే నముచిని సంహరించెను. ఇట్లతి ప్రయత్నముచే నముచి సంహారమును గావించిన యింద్రునిఁ గాంచి మునులు మిక్కిలి నుతించి పుష్పమాలికలచే నలంకరించిరి. గంధర్వశ్రేష్ఠులయినవిశ్వావసు పరావసులు గాన ముచేసిరి. దేవతలు దుందుభుల మ్రోయించిరి. దేవతాస్త్రీలు నాట్యముచేసిరి. ఆయింద్రుఁడు బలి పాకాదులను జయించినట్లే వాయువు వరుణుఁడు మొదలగువారందఱును భయంకరము లగునాయుధములఁ దాల్చి తన్నుఁ దార్కొన్న దానవులను, సింహములు మృగములవలె, సంహరింపఁ జొచ్చిరి. ఆసమయమున ఘోరముగా జరుగుచున్న దానవనాశనమును గాంచి దానిని వారింపనెంచి నారదునిఁ బంపెను. నారదుఁడప్పుడు సత్వరమున వచ్చి దేవతలఁజూచి" ఓ సురలారా! నారాయణపాదాశ్రయు లయినమీరమృతమును ద్రావఁజాలు భాగ్యము నందితిరి. దాన ముల్లోకములును లక్ష్మీసంపన్నములయి వఱలుచున్నవి. మీ కిఁక గలహముతో నేమి ప్రయోజనము? మరలుఁడు మరలుఁడు" అని పల్కిన నారదుని పలుకులు మన్నించి యింద్రాదిదేవతలు కోపము నడంచుకొని తమతమ సేవకబృందములు గొలువ స్వర్గపురమున కరిగిరి. నారదుని దయవలనఁ జావకుండ మిగిలిన దైత్యులుగూడ వజ్రప్రహారము దిని నేలమార్చిల్లి యున్న బలిని దీసికొని యస్తాచలంబునకుఁ బోయిరి. అంత దైత్యగురు వగుశుక్రుఁడు తన మృత

సంజీవినీవిద్యచే యుద్ధమునఁ బడినదైత్యులలోఁ బెక్కండ్రను బ్రదికించెను. అనంతర మతఁడు మూర్ఛిల్లిన బలియొద్ద కేఁగి స్పృశింప నతఁడును లేచి కూర్చుండెను. ఓరాజా! బలి దుస్సహమగు పరాజయము నొందినను, జయాపజయంబులును, సుఖదుఃఖంబులు మొదలగునవి కర్మాధీనములయి వచ్చుచుండు ననెడిజ్ఞానము గలవాఁడౌటంజేసి దానికై సుంతేనియు విచారము నొందలేదు. ఇది పదునొకండవయధ్యాయము.

{శంకరుఁడు మోహినీరూపమును జూచి మోహితుఁడై వెంబడించుట.}

ఓరాజా! శ్రీహరి మోహినీరూపముఁ దాల్చి దానవుల మోసపుచ్చి సురగణములచే నమృతము ద్రావించినట్లు శంకరుఁడు విని పార్వతీ సహితుఁడై వృషభమునెక్కి భూతగణములు గొల్వఁవచ్చుచుండఁగా బయలువెడలి విష్ణుచెంతకేఁగి యతనిగౌరవమును బడసి సుఖాసనమున నాసీనుఁడై హరికిఁ బ్రతిపూజ లర్పించి మందహాసము చేయుచు నిట్లనియె "ఓపరమేశ్వరా! నీవు బ్రహ్మాదిదేవతలకుఁగూడ దేవుఁడవు. సకలజగములందును వ్యాపించినవాఁడవు. జగత్తులే శరీరముగాఁ గలవాఁడవు. చేతనాచేతనాత్మకము లగుపదార్థములకు నీవాత్మవు. నీవు సమస్తమునకును గారణభూతుఁడవు. "ఓదేవా! సూక్ష్మ చిదచిద్విశిష్టుఁడగు నీవలన నీజగము పుట్టుచున్నది. నీవలననే, దీనికి నాశము గలుగుచున్నది. నీవలననే యిది వర్ధిల్లుచున్నది. ఈ విశ్వముకంటె విలక్షణుఁడయిన ప్రత్యగాత్మ నీకు శరీరమగుచున్నది. ప్రకృతియు నీకు శరీరమగుచున్నది.

ప్రకృతిపురుషశరీరకుఁడ వయ్యుఁ దద్గతము లగువికారము లను బొందనివాఁడవు. నీ కుత్పత్తివినాశాదులు లేవు. స్వరూపముచేతను స్వభావముచేతను గలుగు మార్పులు నీకు లేవు. ఒకప్పుడు సంకోచమునొందని యపరిచ్ఛిన్నజ్ఞానమున కాధారుఁడవు. నీవు స్వరూపముచేతను, గుణములచేతను మిక్కిలి గొప్పవాఁడవు. నీవిట్లు జగములకుఁ గారణభూతుఁడవగుటఁ జేసియే ముముక్షువు లగుమును లిహలోకసుఖములను, బరలోకసుఖములను గోరక యితరప్రయోజనమును దేని నపేక్షింపక నీపాదపద్మములను గొల్చుచున్నారు.*"ఓపరమేశా! నీవు పరమాత్మవు. నీవు స్వరూపగుణములచే గొప్పవాఁడవు. నీవు

---

*ఇందులకుమూలము=శ్లో॥త్వంబ్రహ్మపూర్ణమమృతంవిగుణంవిశోకమానంద మాత్ర మవికార మనన్య దన్యత్। విశ్వస్యహేతు రుదయస్థితి సంయమానా మాత్మేశ్వరశ్చ తదపేక్షతయా నపేక్షఃఅని యున్నది.ఇందుఁ బూర్ణపదముచే "పూర్ణం పురుషేణసర్వ"మ్మనెడి శ్రుతియు,విగుణపదముచే "అస్థూలమనణ్వ హ్రస్వ"మ్మనెడిశ్రుతియు,విశోకమనుపదముచే "ఏషఆత్మాఽపహతపాప్మా"యనుశ్రుతియు,ఆనందపదముచే "విజ్ఞానమానంద"మ్మనెడి శ్రుతియు, అవికారపదముచే "నిష్కలంనిష్క్రియం నిరవ్యం"మ్మనుశ్రుతియును, "అనన్యత్"అను పదముచే "ఐతదాత్మ్యమిదం సర్వం తత్సత్యం స ఆత్మా, అయమాత్మా బ్రహ్మ తత్త్వమసి, సర్వంఖల్విదంబ్రహ్మ" అనుశ్రుతియు, "అన్యత్" అనుపదముచే "యఆత్మని తిష్ఠన్, యఃపృథివ్యాంతిష్ఠ" న్నిత్యాదిశ్రుతియు, "విశ్వస్యహేతుః" అనుపదముచే "సదేవసోమ్యే దమగ్ర ఆసీత్, అనేన జీవేనాత్మ నాను ప్రవిశ్య నన్తూలాస్సమ్యేమా స్సర్వాః ప్రజాస్సదాయతనాస్సత్ప్రతిష్ఠా" యనుశ్రుతియు, "ఆత్మేశ్వరః" అనుపదముచే, "పతిం విశ్వస్యాత్మేశ్వరం నతత్స మశ్చాభ్యధికశ్చదృశ్యతే న్యే వమహిమ్న ప్రతిష్ఠితఃఅను శ్రుతియు స్మరింపఁబడుచున్నవి.

సర్వవ్యాపివి. నీకుస్థాల్యాదిగుణములులేవు. నీకు దోషాదులులేవు. కేవల మానందమే స్వరూపముగాఁ గలవాఁడవు. నీ కెట్టి మార్పులును లేవు. సకలము శరీరముగాఁ గలవాఁడవగుటచేతను, సమస్తమునకుఁ గారణభూతుఁడవగుటచేతను, బ్రకృతపురుషాత్మక మగుజగమునకంటె వేఱయినవాఁడవు కావు. ప్రపంచమునకు సృష్టి స్థితిలయములు గల్గించువాఁడవు. నీకు నీవే యధిపతివి. నీ కెట్టికోర్కియులేదు. ఓ మహనీయా! నామరూపముల విభజింపఁ దరము కానంత సూక్ష్మరూపములు గలచిదచిత్తులు శరీరముగా గల నీవొక్కఁడవే ! కార్యరూపమై చిదచిద్రూప మైనయీ జగమునకును గారణ మైననీకును భేదము చెప్పవచ్చును. కారణావస్థయందును గార్యావస్థయందును నున్న బంగారమొక్కటియేకదా! కార్య మయినబంగారునకును గారణ మైనబంగారునకును భేదములేనట్లె కార్య మైనజగమునకును గారణ మైన నీకును భేదము లేదు. ఇట్లు కార్యకారణరూపుఁడ వయిననీయందు వస్తుభేదము కల్పింపఁబడుచున్నది. అది యజ్ఞానకృతమని వేఱు చెప్పవలయునా? కాని గుణపరిణామాత్మక మయినయీ ప్రపంచము ప్రకృతిపురుషవిలక్షణుఁడ వయిననీకు శరీరభూతమయినది. కావున నీస్వరూపము దానికంటె భిన్నమైనదే. ఓ యీశా! కొందఱు వేదాంతులు నిన్ను బ్రహ్మమునుగాఁ జెప్పుచున్నారు. మీమాంసకులు నిన్ను ధర్మమునుగాఁ దలంచుచున్నారు. సాంఖ్యులు నిన్నుఁ బ్రకృతిపురుషులకంటె వేఱయినవానిఁగాఁ దలంచుచున్నారు. కొందఱు నిన్ను నవశక్తులతోఁ గూడినవానిఁగాఁ జెప్పుచున్నారు. కొందఱు నిన్ను వికారరహితుఁడును, స్వతంత్రుఁడును నగుమహాపురుషునిఁగాఁ దలంచు

చున్నారు. ఓ పరమేశ్వరా! నేను బ్రహ్మమరీచ్యాది ఋషులు మొదలగు మేమందఱము నీ మాయచే జ్ఞానమునకు దూరమయి నీచే నిర్మిత మగువిశ్వమును యథార్థముగాఁ దెలిసికోలేనప్పుడు నీ యనంతగుణములను స్వరూపము నెట్లు తెలిసికోఁగలము. మేమే దానిత త్త్వము నెఱుంగఁజాలనపుడు జ్ఞానసంకోచము నొం దించు పాపకర్మముల నాచరింపఁ గతూహలు లైనదైత్యులు, మానవులు మొదలగువా రెట్లు తెలిసికొనఁగలరు ? ఇటువంటి నీవు చరాచరాత్మక మగువస్తువును వాయువువలె నాకా శమువలె సకలమునం దంతరాత్మరూపముగా వ్యాపించి జ్ఞాన స్వరూపుఁడవై యీ జగమునకు సృష్టిస్థితిలయములను, భూత హితమును, లోకమునకు బంధమోక్షములను గల్పించుచు లీలా రసమనుభవించుచున్నావు. కల్యాణగుణములచే లీలారస మను భవించు చున్ననీ వరాహాద్యవతారములను బెక్కుఁటిని జూచితిని. కాని దైత్యుల మోహింపఁజేసి సురలచే నమృతము ద్రావించిన నీ మోహిన్యవతారమును జూడలేదు. ఆరూపమును జూడఁ దలంచి వచ్చితిని. దానిఁ గనుఁగొన నామనం బువ్విళ్లూరుచున్నది" అని యిట్లు ప్రార్థించు చున్నరుద్రునివచనములు విని విష్ణు వొకానొకభావముచే గంభీరముగా నవ్వి యతని కిట్లనియె. "ఓశంకరా! అమృతకలశము దానవు లపహరింపఁగా మదో న్మత్తు లైనదైత్యుల మోహింపఁజేసి దేవకార్యము నెఱవేర్ప జాలినది స్త్రీ వేషము దక్క వేఱొక్కటి గాదని యాలోచించి దైత్యుల వేడుకకొఱ కారూపమును దాల్చితిని. నీ వా రూప మును జూడఁ గుతూహలపడి వచ్చితివి; కావునఁ గాముకజను లకు బహూహకరింపఁదగినదియు, నెట్టివారికయిన మన్మథోద్రేక

ము గల్గింపఁజాలినదియు నగునా మోహినీరూపమును జూపెద" నని పలుకుచు నతఁ డచ్చటనే యంతర్ధానము చెందెను. శంకరుఁడు పార్వతితోఁగూడ నచ్చటనేయుండి తన నేత్రములను నలుదిక్కులకుఁ బ్రసరింపఁజేసి చూచుచుండెను. అంత శంకరునికిఁ బూవుల తో, నెట్టని చివుళ్లతో వెలయు తరువులు గలయుద్యానవనము లోఁ దనకు సమీపమున విహరించు నొక స్త్రీలలామము గాన వచ్చెను. అసుందరి సలీలముగా బంతియాడుకొనుచుండె. ఆమె పిఱుఁదులందుఁ దళతళలాడు వస్త్రముపై బంగారు మొలత్రాడు ప్రకాశించుచుండె. కందుక క్రీడావశమున నిట్టట్టు తిరుగాడుచు సత్వరముగా నూపిరి విడుచుచుఁ దీసికొనుచుండుటచే నామె స్తనములును, వానిమీఁదఁ బ్రకాశించు హారములును, గంపించుచుండెను. విహరించుచున్నప్పు డామెపాదములు చలించుచున్నచిగుళ్లవలె రంగు లీనుచుండెను. నలుదిక్కులందు నెగిరిపడుచు నతిచంచల మయిన బంతిని జూచుచుండుటచే మిక్కిలి చపలము లయిననల్లగుడ్లు గలవిశాలనేత్రములచేతను, గర్ణకుండలములచేఁ బ్రకాశించు చెక్కిళ్లచేతను నల్లని ముంగురులచేతను, నామె మొగము మిక్కిలి యందమై యుండె. గమన వేగముచే జాఱుచున్న కట్టుపుట్టమును గేశపాశమును నామె యందమగు తన యెడమచేతిచే బంధించుచుండెను. ఆమె రెండవచేతితో బంతిని నేలఁగొట్టుచుఁ దన కపటవృత్తిచే జగమును మోహింపఁ జేయుచుండె. రుద్రుఁ డాయువతినిజూచి తదీయ కందుకక్రీడావిలాసములచేతను, సిగ్గుచేఁ బ్రకటితముగాని మందహాసముతోఁ గూడ బ్రసరింపఁజేయఁబడిన కడకంటిచూపులచేతను, వ్యాకులచిత్తుఁడై స్వయముగా

నామెను చూచి చూడఁబడుచుండుటచేఁ బరవశ మగునాత్మ
గలవాఁడై తన్నును, దనచెంత నున్నపార్వతిని, దనతో వచ్చిన
ప్రమథగణములను మఱచిపోయె. ఇట్లుండ నా మోహిని దూర
ముగాఁ బోయిన బంతిని గొనివచ్చుటకై రయంబునఁ బోవు
చుండ వాయుప్రసారమువలన మొలత్రాటితోఁగూడఁ గట్టు
పుట్టము జాఱి నేలఁబడెను.అంత రుద్రుఁడు దిగంబరుఁడై సుం
దరములగు కడకంటిచూపులు గల్గి చూచువారి చిత్తముల హరిం
చుచు సిగ్గుచే నవయవములను సంకోచింపఁజేసి తన్నుఁ దాఁ
జూచుకొనుచు నున్న యా యువతినిజూచి వివేకహీనుఁడై
యామె విలాసములకుఁజిక్కి మిక్కిలి మదనబాధనొందుచుఁ
బార్వతిచూచుచుండఁగనే యతిరయమున నామెచెంత కేఁగెను.
తన చెంతకు వచ్చు చున్నరుద్రునిఁగాంచి యా మోహిని వస్త్ర
విహీనురాలై యుండుటచే మిక్కిలి సిగ్గుపడి నవ్వుకొనుచుఁ
జెట్లలోని కరుగుచుండె. రుద్రుఁ డదిచూచి చంచలము లగునిం
ద్రియములు గలవాఁడై కామునికిఁ జిక్కి యాఁడేనుఁగును మగ
యేనుఁగుంబోలె నామె ననుసరించి పోఁజొచ్చెను. ఇట్లు పోయి
రుద్రుఁ డతిరయమున నా కాంతను సమీపించి యామె యిష్ట
పడకున్నను దదీయ కేశపాశమును బట్టికొని తన చెంతకు లాగి
కొని చేతులు సాఁచి గట్టిగాఁ గౌఁగిలించుకొనెను. కరిచేఁ గరిణి
వలె రుద్రునిచే నాలింగితమై విడివడిన కేశపాశము గల దై
యున్నయా మోహిని యతని కౌఁగిలింతనుండి తప్పించికొని
పరువెత్తుచుండెను. ఆమె ననుసరించి శివుండును బరువెత్తఁ
జొచ్చె. మత్తకుంజరము కుంజరినివలె నా కాంతను వెంబ
డించి రుద్రుఁడు పోవుచుండ నమోఘు మగునతని రేతస్సు భూమి

వై ఁ బడెను. అట్లు కేతస్సు పడిన చోట్లు సువర్ణక్షేత్రములును, రజతక్షేత్రములు నయ్యెఁ. మఱియు నతని కేతస్సు పడిన నదులం దతఁడు తప్పక సన్నిహితుఁ డై యుండును. అతని నుపాసించు ఋషులుకూడ నచ్చటనే నివసింపఁజొచ్చిరి. ఓ రాజా! కేతస్సులన మియనతోడనే రుద్రుఁడు భగవన్మాయాభూత యగునా కాంత చే మోహితుఁడగుటను దెలిసికొని తనకుఁ దానే సిగ్గుపడుచుఁ గామమును ద్రోసిపుచ్చెను. పిమ్మట శంకరుఁడు జగద్రూపుఁ డయినపరమేశ్వరునిమహిమను దెలిసికొని యా స్త్రీరూపమును నామె చేష్టలును మహాశ్చర్యకరములని మనమునఁ దలపోయఁ జొచ్చెను. భగవంతుఁడగువాసుదేవుఁ డెప్పటియట్ల పురుషరూప మును దాల్చి నిర్వికారుఁడై త్రపావిహీనుఁడై యున్నరుద్రునిఁ జూచి వేగముగాఁ దన మాయను దెలిసికొనుటకు సంతసించి యిట్లనియె. "సురశ్రేష్ఠా! నీవు నిశ్చయముగాఁ గామాది వికారముల విడిచినవాఁడవే. అయిన ను నా మాయ యెట్టివారికిఁ గూడ దుస్తరమగుటచే నీవు మోహమును జెందితివి. ఆలోచింప నా మాయ కధీనుఁడగువాఁడెవఁడు చంచలేంద్రియులగువారికి దుస్తరము లగుకామక్రోధాదిభావముల నీవలె నవలీల నతిక్రమింపఁ గలఁడు? కాలము శరీరముగాఁ గలదియు సృష్ట్యాదుల భాగముల స్వీకరించునదియు, నగునా మాయ యిఁక నిన్ను మోహింపఁజేయలేదు!" అని యిట్లు పల్కి వాసుదేవు ననుగ్రహమునుగాంచి రుద్రుఁడతనికినమస్కరించి యతనియనుమతివడసి తన ప్రమథగణములను గలిసికొని పార్వతీసహితుఁడై కైలాసమున కరిగెను. ఓ రాజేంద్రా! అనంతరము శంకరుఁడు శరీరార్ధభూత యగుపార్వతితో మునిశ్రేష్ఠులనుద్దేశించి యిట్లు

నియె. ఓ పార్వతీ ! కర్మాయత్త మగుజననాదులులేని పరమపురు షుని మాయామహిమమును జూచితివిగదా ! సకల విద్యలకు నధిపతి నగునేనే మోహమును జెందితిని. సామాన్య లగుమాన వులు దానవులు మొదలగువారు మోహమును జెందుదురని వేఱ చెప్పవలయునా ! ఓ సుందరీ ! వేలకొలఁదివత్సరములపర్యం తమును దపమునుజేసి యంతమున దానినుండి మఱలిన నన్నుఁ జూచి "నీ వుపాసించిన పరవస్తు వే" దని యడిగితివి. ఎవనిని గాలము సైతము వశము గావించుకొనలేదో, యెవఁడు సమస్తము నొక్కమాఱుగాఁ దెలిసికొన సమర్థుఁడో, యా పరమపురుషుని నేను సర్వకాలములందు నుపాసించుచున్నాను" అని పార్వతికిఁ జెప్పి ననిచెప్పి రాజునకు ముసీంద్రుఁడు వెండియు నిట్లనియె. "ఓ నరేంద్రా ! ఎవఁడు కూర్మరూపమును దాల్చి క్షీరసాగరమథనకాలమున మహాపర్వత మగుమందరమును మోచి యమృతమును సురలకిచ్చెనో యా పరమేశ్వరుని విక్ర మమును నీకుఁ దెలియఁజేసితిని. ఈ చరిత్రమును జదువువారును, విన్నవారును, జేసెడు ప్రయత్నములన్నియుఁ దప్పక సఫలము లగును. భగవంతుని సద్గుణములను వెల్లడించు నీ చరిత్రము భయంకరము లగునాధ్యాత్మికాదితాపములను హరింపఁ గలు గును. సముద్రమును మథించి తీసిన యమృతము దైత్య లప హరింప మోహినీరూపమున వారిని మోహింపఁజేసి దానిఁ గైకొని తన భక్తులకోర్కులఁ బూరించువాఁడును, పంసారుల కగమ్యుఁడు నగుభగవంతునకు నమస్కరించెద." ఇది పండ్రెం డవయధ్యాయము.

శ్రీ శుకుఁడు తక్కిన మన్వంతరముల వివరించుట.

ఓ రాజేంద్రా ! ఇఁక దక్కిన మన్వంతరముల విశేషములఁ జెప్పెద నాలింపుము. ప్రస్తుతకాలమున వైవస్వతమనువు వర్తించుచున్నాఁడు. అతనిపేరు శ్రాద్ధదేవుఁడు. అతఁడు వివస్వంతుని కుమారుఁడు. అతఁడు సప్తమ మనువయ్యె. అతని కిక్ష్వాకుఁడును నభగుఁడును, ధృష్టుఁడును, శూర్యాతియు, నరిష్యంతుఁడును, నాభాగుఁడును, దిష్టుఁడును, గరూషకుఁడును, బృషద్ధ్రుఁడును వసుమంతుఁడు ననుకుమారులు గలరు. ఈసప్తమమన్వంతరమున నాదిత్యులును, వసువులును, విశ్వేదేవులును దేవతలైరి. పురందరుఁ డనువాఁడింద్రుఁడయ్యె. కశ్యపుఁడు, నత్రియు, వసిష్ఠుఁడును, విశ్వామిత్రుఁడును, గౌతముఁడును, జమదగ్నియు, భరద్వాజుఁడును సప్తర్షులయిరి. ఈ మన్వంతరమునఁనే భగవంతుఁడదితి కశ్యపులకుఁ గుమారుఁడై యుదయించి వామనుఁ డను నామమును దాల్చి ప్రఖ్యాతిగాంచెను. అతఁ డాదిత్యుల కందఱి కును దమ్ముఁడు. ఓరాజా ! ఏడుమన్వంతరముల విశేషములను సంగ్రహముగా నీకు వినిపించితిని. విష్ణువు నంశావతారములచే వెలయు తక్కిన మన్వంతరములనుగూడ వర్ణించెదను వినుము. వివస్వంతునకు ఛాయాదేవి యనియు, సంజ్ఞాదేవి యనియు నిర్వురు భార్యలు గలరని వెనుకనే చెప్పితిని. వారు విశ్వకర్మ కుమారికలు. అతనికి బడబయను మూఁడవభార్య గలదని కొందఱు చెప్పుచున్నారు. సంజ్ఞయే బడబారూపమును దాల్చెనని కొందఱందురు. వారిలో సంజ్ఞాదేవికి యముఁడు యమున శ్రాద్ధదేవుఁడు ననెడి మువ్వురుకుమారులును, దపతి యనుకన్యకయుం గలిగిరి. ఆ తపతిని సంవరణుఁడు వరించెను. మూఁడవది యగు

బడబ కశ్వికుమారు లుదయించిరి. ఎనిమిదవ మన్వంతరమున సూర్యపుత్రుఁ డగుసావర్ణి మనువయ్యెను. నిర్మోహుఁడు విరజస్కుఁడు మొదలగువారు మనుపుత్త్రులు. అప్పుడు సుతపస్కులు మొదలగువారు దేవగణములగుదురు. బలిచక్రవర్తి యింద్రుఁడయి వారిఁ బాలించు. ఓరాజా ! ఆబలి మహాయశస్కుఁడు. అతఁడు పదత్రయపరిమిత మగుభూమిని యాచించు చున్న విష్ణువునకొసంగి యతని యనుగ్రహమువలన నింద్రపదవిని ముక్తిని జెందును. మొదట విష్ణు వతని బంధించినను బిమ్మట నతని ననుగ్రహించి స్వర్గలోకమునకంటె నధిక మగుపాతాళమున కధిపతినిగాఁ జేసెను. అతఁ డిప్పు డింద్రునివలె నచట సుఖము లొందుచున్నాఁడు. ఆమన్వంతరమున గాలవుండు,దీప్తిమంతుఁడు, పరశురాముఁడు,ద్రోణపుత్రుఁ డగునశ్వత్థామ, కృపాచార్యుఁడు, ఋశ్యశృంగుఁడు నాతండ్రి యగువ్యాసభగవానుఁడు తమ యోగప్రభావమువలన సప్తర్షులగుదురు. ప్రస్తుతమున గాల వాదులు తమతమ యాశ్రమములందే వర్తించుచున్నారు. అప్పుడు భగవంతుఁడు దేవగుహ్యుఁ డనునతనికి సరస్వతి యనునామెయందుఁ గుమారుఁడయి యవతరించి సార్వభౌముఁ డనెడిపేరు వహించి తనశక్తిచే బురందరునివలన నింద్రపదవిని దీసికొని బలి కర్పించును. వరుణపుత్రుఁ డయినదక్షసావర్ణి తొమ్మిది వ మను వగుధృతకేతువు, దీప్తకేతువు మొదలగువారు మనుపుత్త్రు లగుదురు. దాత, మకీచి, గర్గుఁడు మొదలగువారు దేవగణములగుదురు.శ్రుతుఁ డనువాఁ డింద్రుఁ డగు.ద్యుతిమంతుఁడు మొదలగువారు సప్తర్షులగుదురు. అప్పు డాయుష్మంతున కంబుధార యనుభార్యయందు విష్ణువు ఋషభుఁ డనునామముతో

నవతరించి ముల్లోకములను నిరపాయముగా రక్షించుచు నింద్ర నిచే నేలించును. ఉపశ్లోకుని తనయుఁ డగుబ్రహ్మసావర్ణి పదవ మనువయ్యెడు. భూరిషేణుఁడు మొదలగువారు మనుపుత్త్ర లగు దురు. హవిష్మంతుఁడు, సుకృతి, సత్యుఁడు, జటామూ ర్తి మొద లగువారు స ప్తర్షులగుదురు. సువాసనుఁడు,విబుద్ధుఁడు మొదలగు వారు దేవగణములగుదురు.శంభు డనువాఁ డింద్రుఁడగు.అప్పుడు విష్ణువు విశ్వజితుఁడనువానికిఁ దద్భార్య యగువిషూచియందు స్వాంశముచే నవతరించి యింద్రునికి సఖుఁ డగుయుండును. ప్రశస్తమనస్కుఁ డయిసధర్మసావర్ణి యేకాదశమనువగును. సత్యధర్ముఁడు మొదలగువారు పదిమంది మనుపుత్త్ర లగుదురు. విహంగములు, కామగములు, నిర్వాణులు, రుచులు, సురగణము లయ్యెదరు. ధ్రువు డనువాఁ డాగణముల కింద్రుఁడగు.అరుణుఁడు మొదలగువారు స ప్తర్షు లయ్యెదరు. అప్పుడు శ్రీహరి యార్యకుఁ డనువాని భార్య యగువైధృతియం దవతరించి ధర్మసేతు వను నామమును వహించి మూఁడులోకములను రక్షించును. ఓరాజా! రుద్రసావర్ణి యనువాఁడు పండ్రెండవ మనువగును. దేవవంతుఁడు, ఉపదేవుఁడు, దేవజ్యేష్ఠుఁడు మొదలగువారు మనుపుత్త్ర లయ్యెదరు. ఆ మన్వంతరమున ఋతుధాముఁ డను వాఁ డింద్రుఁడగును. హరితాదులు దేవగణములగుదురు. అగ్నీ ధ్రుఁడు తపోమూ ర్తి మొదలగువారు స ప్తర్షు లయ్యెదరు. అప్పుడు పరమేశ్వరుఁడు సత్యసహునిభార్య యగుసూనృతకుఁ గుమారుఁడై స్వధాముఁ డనుపేరితో నామన్వంతరమును రక్షిం చును. దేవసావర్ణి యనువాఁడు పదుమూఁడవ మనువగును. చిత్రసేనుఁడు మొదలగువారు మనుపుత్త్ర లయ్యెదరు. నుకర్ములు

త్రాములు ననువారు దేవగణము లయ్యెదరు. దివస్పతి యను వాఁ డింద్రుఁ డగు. నిర్మోకుఁడు, తత్త్వదర్శుఁడు మొదలగువారు సప్తర్షు లయ్యెదరు. అప్పుడు శ్రీహరి దేవహోత్రునిభార్య యగు బృహతికిఁ గుమారుఁడై యోగీశ్వరుఁ డనునామమును వహించి యింద్రునకుఁ దోడ్పడును. ఇంద్రసావర్ణి యనువాఁడు పదునాల్గవమనువగు. ఊరువు, గంభీరుఁడు, వసువు మొదలగువారు మనుపుత్రులగుదురు. పవిత్రులనువారును, జాతూషులనువారును దేవగణము లగుదురు. శుచి యనువాఁ డింద్రుఁడగును. అగ్ని, బాహువు, శుచి, శుక్రుఁడు మాగధుఁడు మొదలగువారు సప్తర్షులయ్యెదరు. అప్పుడు హరి సత్రాయణుఁ డనువాని భార్యయగు వితానకుద్భవించి బృహద్భానును వనెడిపేరు వహించి యజ్ఞాదికర్మములను విస్తరింపఁజేయును. ఓమహారాజా! భూతకాలమందును వర్తమానకాలమందును రాఁబోవు కాలమందును వర్తించు మనువులు పదునల్వురు. వారి చరిత్రములను సంగ్రహముగా వివరించితిని. కృతత్రేతాదియుగములు నాలుగును వేయుమాఱులు పరివర్తించినచోఁ బదునాల్గు మన్వంతరములు గతించును. ఈ మన్వంతరము లొక్కమాఱు పరివర్తించినచో దైనందిన కల్పమగును" ఇది పదుమూఁడవయధ్యాయము.

రాజుప్రత్యేకముగా మన్వంతరముల కార్యములనడుగుట.

అని చెప్పుచున్న మునీంద్రునిఁజూచి నరేంద్రుఁడు "ఓ మునీంద్రా! మన్వంతరకాలములందును మనువులును, దత్పుత్రులును మునులును మొదలగువా రెవనిచే నీకార్యము నొనర్పని

యుక్తులెరి? వారినిగూర్చి తెలియఁజేయు" మనిపలుక నమ్మునీం
ద్రుఁ డతని కిట్లనియె. ఓ రాజేంద్రా ! మనువ్రులును, మనుపు
త్త్రులును, మునులును, నింద్రుఁడును, సురగణములును, నాయా
మన్వంతరములకాలమున నాయాయవతారములఁ బొందిన పర
మేశ్వరునిచే శాసింపఁబడు చుందురు. అట్లు నియుక్తులయి
మన్వాదులు జగత్పోషణమును జేయుచుందురు. ఎట్లు చేయు
దురందువేని, చెప్పెదను. ఆ మన్వాదులలో మునులు మన్వంత
రమితుదను బాశకులు లేకపోవుటచేఁ జెడిపోయిన వేదగణ
ములను వానివలన నేర్పడు సనాతన ధర్మములను దమ తపఃప్ర
భావమువలనఁ దెలిసికొందురు. మనువులు తమతమ కాల
ములందు శ్రీహరి యనుమతిని బడసి మునుల యుపదేశము
చొప్పున ధర్మమును నాల్గుపాదములను నడపించు చుందురు.
మనుపుత్త్రులు మనువులు స్థాపించిన ధర్మమును మన్వంతరావ
సానమువఱకును, దమ పుత్త్రపౌత్త్రాదిక్రమముచేత నా యా
వర్ణాశ్రమములకుఁ దగునట్లుగాఁ బ్రవర్తింపఁజేయుదురు. దేవగ
ణములు పంచ మహాయజ్ఞములందును భోక్త లగుఋషులతోను,
పితృదేవతలతోను, యజ్ఞభాగముల ననుభవించుచుందురు. పర
మేశ్వరుఁడు తనసామర్థ్యముచే సంపాదించి యిచ్చినముజ్జగముల
శీల ననుభవించుచు,నింద్రుఁడుయథేష్టమ ైశ్వర్యమునుగురియిం
చి లోకములఁ బరిపాలించెను. పరమేశ్వరుఁడు యజ్ఞాద్యవతార
ములను గపిలాద్యవతారములను దాలిచి జ్ఞానమును యుగాను
సారముగా నుపదేశించును. మఱియు నతఁడు మత్స్యాది రూప
మునొంది సృష్టినొనరించుచు, రాజమూర్తియై దుష్టులను సంహా
రించుచు, సృష్ట్యాదుల కుపయుక్తము లగుగుణముల నవలం

బించి కాలరూపమున సమస్తజంతువుల లయమొందించుచు నామరూపముల వహించిన మాయచే మోహితులయి జ్ఞానముచే నేకాకారు లయినయాత్మలందు దేవమనుష్యాదిభేదమును బాటించు జనులకుఁ గానరాక కేవలము నుతింపఁదగినవాఁడునై, ప్రవర్తించుచుండును.కల్పయాథాత్మ్యమును దెలిసిన పండితులు దైనందిన కల్పప్రమాణము పదునాల్లు మన్వంతరముల కాలమని చెప్పుచున్నారు. ఇది పదునాల్గవయధ్యాయము.

వామనావతార కథా ప్రారంభము.

అని చెప్పుచున్న శుకుంజూచి రాజిట్లనియె "ఓ మునీంద్రా! విష్ణువున కెట్టికోర్కి యును లేదు. అతఁడవాప్తసమస్తకాముఁడు; తాను సమస్తమునకును బ్రభువు. అట్టిహరి దీనునివలె బలిచెంత కేఁగి మూఁడడుగులభూమి నెందులకు యాచించెను? యాచించి పుచ్చుకొనియు బలిని బంధించుటకుఁ గారణమేమి? పరిపూర్ణుఁడయినవిష్ణువు యాచించుటయు నిరపరాధుఁడయినబలిని బంధించుటయు నా కాశ్చర్యమును గొలుపుచున్నవి. ఆవృత్తాంతము లనువిన నామనస్సు కుతూహలపడుచున్నది. దయచేసిచెప్పుము" అని యడుగుచున్న రాజునకు శుకుఁ డిట్లనియె. "ఓ రాజేంద్రా! దేవాసురయుద్ధమునఁ బలి యింద్రునకోడి ప్రాణహీనుఁడై శుక్రాదుల దయవలన జీవించి యుదారమనస్కుఁడై వలయునంత ధన మర్పించుచుఁ ద్రికరణశుద్ధిగా వారినిసేవించెను. తమ్ము సేవించుచు స్వర్గమును జయింపవలెనన్న తలంపు గలవాఁడయియున్న బలిభక్తికి సంతసించి బ్రాహ్మణులు మంత్రపూర్వకముగా నభిషేకించి యతనిచే విశ్వజిత్తనెడి యాగమును జేయిం

చిరి. విశ్వజిద్యాగమందలి హవిస్సుచే సంతృప్తి గాంచిన యగ్ని వలనఁ గనకమయ మయినపరికరముతోఁగూడినరథంబును, నింద్రుని తురంగములవంటి తురంగములును, సింహధ్వజంబును గాంచన పరికరముతో బద్ధ మగుచిల్లును, నక్షయ తూణీరము లును, దివ్యమగుకవచమును, సంభవింపఁగా బలి వానిని స్వీకరించెను. అప్పుడు పితామహుఁడయిన ప్రహ్లాదుఁడు బలికినాఁడని పద్మమాల నొసంగెను.గురు వయినశుక్రుఁడతనికిఁ బ్రశస్త మగు శంఖము నిచ్చెను. ఇమ్మట బలి శుక్రాదుల దయవలన సంపాదిత మైనయుద్ధపరికరమును జేకొని బ్రాహ్మణులకును, గురువులకును నమస్కరించి వారివలన నాశీర్వాదములను బొంది ప్రహ్లాదుని యనుమతివడసి దివ్యరథంబుపైఁ గూర్చుండి ప్రహ్లాదుఁ డొసఁగిన పద్మమాలను ధరించి కవచమును దొడిగి ఖడ్గమును, విలునమ్ములను నమ్ముల పొదులను దాల్చి యుద్ధసన్నద్ధుఁడై బాహువులందు బాహుపురులును, గర్ణములందు బంగారు మకరకుండలములును బ్రకాశింప వనమందుఁ బ్రజలచే వలె విలసింపఁ జొచ్చెను. అప్పుడు బలి

శ్రీచేతను దనతో స

దిక్కులను నహ

కులచేఁ బరి

భూమా

నుల్లసి

ధ్వనిం

చేతను, బ్రకాశించు నందనవనము నాపురమున మిక్కిలి విరాజిలు చుండెను. ఆ నందనవనమందు నిర్మలజలముతో నిండిన పద్మాకరములు వెక్కులుగలవు. ఆవి యన్నియు హంసలకును సారస పక్షులకును జక్రవాకములకును గన్నెలేడిపిల్లలకును నిలయము లయి, సురలకును, సురస్త్రీలకును క్రీడాస్థానములై చూపఱిచిత్తములను హరించుచుండెను. ఆ పురమునకుఁ ద్రివిక్రమదేవుని కాలిబొట్టనవ్రేలివలన నుదయించిన గంగానది కందకమై వెలయుచుండెను. మఱియు నది యుపరిభాగమున నిర్మితము లగు యుద్ధస్థానములు గలదై, సువర్ణమయమగుటచే నగ్నివలె మెఱయుచు నున్న యున్నతప్రాకారముచేఁ బరివేష్టితమై, శత్రువుల కసాధ్య మయియుండెను. విశ్వకర్మ తననేర్పునంతను జూపి దానిని నిర్మించెను. దాని పురద్వారములు సువర్ణమయములగు తలుపులతోను, స్ఫటికములతోఁ గట్టిన గోపురములతోను బ్రకాశించుచుండెను. అందలి వీథులు విశాలములయి మనోహరములయియుం[illegible] భవనములచేతను సంగణములచేతను,

[illegible]ండె. దానియందుఁ గల
[illegible]లచేతను నిర్మితము
[illegible]చ్చటఁజూచినను
[illegible] మార్పు
[illegible]భవస్త్ర
[illegible]బ్రకా
[illegible]మూలి

రించుచుండెను. అందున్న యచ్చరలు శుభ్రవస్త్రములచేఁ బరిచ్ఛిన్నము లయినమార్గములందు సంచరించుచుండిరి. ఆపురము ముత్యాల వితానములచేతను, మణిమయములయి పలువిధములయి యున్నధ్వజములచేతను, గనులపండువు చేయుచుండె. అందెచ్చటఁ జూచినను మయూరముల కేకలును, భావురముల నినాదములును,దుమ్మెకల ఝంకారములును, వినవచ్చుచుండెను. దేవతాస్త్రీల పాటలు మిక్కిలి మధురములై వినువారి కానందము గొలుపుచుండె. మద్దెలలను వాయించుచు శంఖములను బూరించుచు, దుందుభులను మ్రోయించుచు, వీణెలను మీటుచు,వేణువుల ధ్వనిచేయుచుఁ,దాళాది నినాదముల కనుయుక్తముగా నాట్యముచేయుచు, నెల్లచోట్లను మృదుమధురముగాఁ బాడుచున్న గంధర్వులపాటలు మిక్కిలి మనోహరము లయియుండెను.ఆలోచింప నాపురము సంగీతాధిష్ఠాత్రియగుదేవతకు నిలయమైనట్లు తోఁపక మానదు. ఆ పురము దురాత్ములకును, మూర్ఖులకును, నహంకారులకును, వంచకులకును,నధర్మపరులకును భూతద్రోహకులకును,గాముకులకును బొందఁ దరముకానిది. బలియట్టిపురమును బ్రవేశించి తన సైన్యములచే నరికట్టి దేవతాస్త్రీలు భయమందునట్లు, శుక్రుడు తనకొసఁగిన శంఖమును బూరించెను. ఇంద్రుఁ డదివిని యదరిపడి బలియొనర్చిన మహాప్రయత్నమును దెలిసికొని దేవగణములతోఁ గూడికొని బృహస్పతి చెంతకుఁబోయి యిట్లనియె. " ఓ గురువర్యా ! పూర్వము నాచేఁ బరాజితుఁడయినబలి యిప్పుడు యుద్ధసన్నద్ధుఁడై యిచ్చటికి వచ్చెను. అతని పరాక్రమ మిప్పట్టున నెట్టివారికిని దుస్సహమని తోఁచెడిని. ఇట్టి బలి నెవఁడైన నే యుపాయముచేతనై

నను జయింపలేఁడని నిశ్చయింపవచ్చును. ఈ బలి లోకములను దిక్కులఁ నొక్కవెట్టు మ్రింగువానివలెను, ప్రళయాగ్నివలె దీవ్రము లగుమూఁపులచే నాకాశమును దహించువానివలెను బ్రకాశించుచున్నాఁడు.ఇట్టి యింద్రియబలమును,నిట్టియుత్సాహమును, నిట్టి దేహబలమును, నిట్టి పరాక్రమమును నా శత్రువగు బలి కెట్లులభించెను ? వాని పరాక్రమాదు లిట్లసాధ్యములయి యుండుటకుఁ గారణమేమి ?" అని యడిగిన యింద్రునకు గురు విట్లనియె. "ఓ దేవేంద్రా ! శత్రువున కిట్టియభ్యుదయము గలుగుటకుఁ గారణమేమియో తెలియవచ్చె. బ్రహ్మవాదు లయినశుక్రాదులు తమశిష్యుఁ డయినబలికి నిట్టియభ్యుదయమును గల్గించిరి. పరమేశ్వరుఁ డయిన శ్రీహరి తప్ప నీవంటి యితరులుగాని నీవుగాని యతనియెదుట నిలువఁజాలరు. కావున నిప్పట్టున నీవును,దేవతలును నీ లోకమును విడిచి స్థలాంతరమునకుఁబోయి శత్రు పరాజయకాల మెపుడువచ్చునో ప్రతీక్షించి యుండుఁడు. బ్రాహ్మణప్రభావమువలన నితఁడు క్రమ క్రమముగా నధిక మగుచున్న మహాపరాక్రమము గలవాఁడయ్యె. అట్టి యితఁడు బ్రాహ్మణుల నవమానించుట వలనఁ దప్పక నశించును. ఆ కాల మేతెంచునంతవఱకును నిరీక్షించియుండుఁడు " అని కార్యజ్ఞుఁ డయినబృహస్పతి లెస్సగా నాలోచించి చెప్పిన హితవాక్యములను విని కామరూపు లగు దేవతలు స్వర్గమునువిడిచి మాయమైరి. అందువలన బలి నిరాటంకముగా స్వర్గసింహాసనమునఁ గూర్చుండి లోకత్రయమును దన వశము గావించుకొనెను. అంత శిష్యవత్సలు లయిన శుక్రాదులు విశ్వజిద్యాగము జేసినబలి కింద్రపదవి స్థిరముగానుండు

నట్లు చేయ నెంచి యతనిచే నూ ఱశ్వమేధములను జేయించిరి. అనంతరము బలి యశ్వమేధశతమును జేయుటవలనఁ గల్గిన ప్రభావముచేఁ దన విమలకీర్తిని ముల్లోకములందును వ్యాపింపఁ జేయుచుఁ జంద్రునివలెఁ బ్రకాశించుచుండె. మఱియు దీర్ఘసంకల్పుఁడయినయా బలి బ్రాహ్మణుల దయవలనఁ బొందఁబడిన దల ననుభవించుచుఁ దన్నుఁ గృతార్థునిఁగాఁ దలంచుచుండెను. ఇది పదునేనవయధ్యాయము.

అదితి తన కుమారులను గూర్చి చింతించి విష్ణువు నారాధించుట. అతఁడామె గర్భమున వామనుఁడయి పుట్టుట.

అంత దేవతలకుఁ దల్లి యగునదితి తన పుత్త్రులగునింద్రాదులదృశ్యులయినట్లును, దైత్యులమరావతి నపహరించినట్లును విని గతిలేనిదానివలె మిక్కిలి పరితపించుచుండెను. ఇట్లుండ నొకప్పుడు కశ్యపుఁడు సమాధిని విడిచి యదితియాశ్రమమునకు వచ్చెను. అతఁడు వచ్చునప్పటి కా యాశ్రమము మిక్కిలి కాంతిహీనమై వెలవెలపోవుచుండెను. కశ్యపుఁడు దానిఁగని పెట్టి మనంబున సందేహించుచుఁ దన ప్రియురాలి చెంతకేఁగి యామెవలనఁ బూజలనంది యుచితాసనమునఁ గూర్చుండి దీనవదనయై యున్న యామెంగాంచి యిట్లనియె. "ఓ శుభురాలా! బ్రాహ్మణులకును, గోవులకును, ధర్మమునకును, మృత్యువున కధీనులయి వర్తించు జనమునకును నమంగళములు సంభవింపలేదు గదా? ఓ గృహస్థురాలా! యోగాభ్యాసము లేనివారికిఁగూడ ధర్మము, నర్థమును, గామమును సమకూర్చఁజాలిన గృహములకమంగళము

సంప్రాప్తింపలేదుగదా ? కుటుంబాసక్తురాల వగునీయింటి కతిథులు వచ్చి నీపూజల సందక వెడలిపోయిరా యేమి? ఆలోచింపనతిథు లేగృహమునకువచ్చి సలిలమునైనఁ గైకొనకుండ వెడలిపోవుదురో, యీ గృహము కేవలము నక్కలకు నివాసభూతమగు బిలమువంటిది. ఓ సతీమణీ! ఆహవనీయాదులగునగ్నులను నీయధీనముచేసి నేను సమాధికరిగితిని. నావియోగభరమును సహింపఁజాలక భయాకులవై యున్ననీవు వేళదప్పకుండ హవిస్సుచే నా యగ్నుల నుపాసింపలేదా యేమి? అట్లు చేయనిచో మిక్కిలి విచారింపవలసినదే ? ఆ యగ్నులు సకల వాంఛితములను నెఱవేర్పఁజాలినవి. వానిఁ బూజించియే గృహస్థులు పుణ్యలోకముల సందుచున్నారు. బ్రాహ్మణులును, వహ్నియు సకలదేవస్వరూపుఁ డయినవిష్ణువునకు ముఖమేయని నిశ్చయింప వచ్చును. అట్టి యగ్నుల నారాధింపకపోవుట పెద్దనష్టమును గల్గింపకమానునా ? ఓ ధీరురాలా ! నీ పుత్త్రులందఱును సుఖులైయున్నారా? చిన్న వ్రాయిన నీముఖమును లక్ష్మింప నేదోయమంగళము సంప్రాప్తమైనట్లు తెలుపుచున్నది. అందుచే శంకించుచు చిట్లడుగుచున్నాను. వేగముగా నీవిచారకారణ మెఱిఁగింపుము." అని యడుగు చున్నభర్తను గాంచి యదితి యిట్లనియె. "ఓ నాథా ! బ్రాహ్మణులకును, గోవులకును శుభముగలదు; ధర్మమున కేమియు భంగముగలుగ లేదు. తక్కిన లోకులకు సుఖము లేకపోలేదు. మన గృహస్థాశ్రమము ధర్మార్థకామములకు నిలయమై వెలయుచున్నదని నిశ్చయముగాఁ జెప్పఁగలను. ఓ వల్లభా! సంతతమును మీపాదపద్మముల ధ్యానించుచు నేనగ్నులను వ్రేల్చుచున్నాను. అతిథుల సత్కరించుచున్నాను. నావలనఁ

బూజలు గైకొను తలంపుతో వచ్చినభిక్షువులను బూజించు చున్నాను.భృత్యులను బోషించు చున్నాను.నా కిట్టి సామర్థ్యము గలుగుట భగవంతుఁడ వగునీ యనుగ్రహమువలననే చుమీ ? ఓ ప్రాణనాథా ! ప్రజాపతి వయిననీకు ధర్మపత్నినై నీవలన సకలధర్మముల నభ్యసించు చున్నా కభీష్ట మగుధర్మమేది నెఱవేఱదు ? సమస్త ధర్మములు సమకూరుచున్నవి. ఓ మరీచి నందనా ! సత్వగుణప్రధాను లగుదేవతలును రజస్తమో గుణ ప్రధానులయినదైత్యులును నీ మనస్సువలనను,శరీరము వలనను జన్మించిరి. ఆ నీపుత్త్రులందఱయందును నీవు సమబుద్ధివై వర్తింతువు. అయినను సమర్థుఁడ వగునీవు నీ భక్తులందుఁ బక్షపాతము వహించుట న్యాయ్యము. కావున నీ భక్తురాల నగునాశ్రేయస్సు వర్ధిలున ట్లాలోచింపుము. శత్రువు లగుదైత్యులు స్వర్గలోకమును హరించుటచే నిలువ నీడలేక నాకుమారులు దేశముల పాలయిరి. దయయుంచి వారిని బాలింపుము. నీపత్ని నగుటచే నా కిదివఱకు దుఃఖములు సంభవింపలేదు; కాని నా కిప్పుడు ప్రాప్తమైనది. దైత్యులు నన్ను నా నిలయమునుండి తఱిమి దుఃఖ సాగరమున ముంచినివైచిరి. నా ప్రభుత్వమును, నా సంపదలను, నా నివాసదేశమును లాగికొనిరి. ఓ సజ్జనవర్యా ! నా కుమారులేయుపాయముచేఁ దొంటి యభ్యుదయమును బొందుదురో దాని నొనర్పుము.నన్ను దయఁ జూడుము"అని యిట్లు కడుంగడుఁ బ్రార్థించుచున్నయదితిని గాంచి మందహాసము సేయుచు నిట్ల నియె. "ఓ సాధ్వీ ! పుత్రాదులందలి స్నేహపాశముచే బంధించు విష్ణువు మాయాబలము నతిక్రమింపఁ గలుగుట మహా కష్టము గదా!అయ్యో! ఏమి యాశ్చర్యము? పంచభూత పరిణామాత్మక

మగు దేహమెక్కడ ? ప్రకృతికంటె విలక్షణ మగునాత్మ యెక్కడ ? ఈ దారపుత్రాదు లెవ్వరికి సంబంధించినవారు ? వీరు దేహమునకు సంబంధించినవారా ? లేక యాత్మకు సంబంధించినవారా ? ఆలోచింప నాత్మకును బుత్రాదుల కును దేహమూలకముగా సంబంధము కలదుగాని సాక్షా త్సంబంధము లేదు. ఈ దేహము పంచభూతాత్మక మగుట చేతను, వృద్ధిక్షయములు గలదగుటచేతను, నిత్యము కానిదగుట చేతను, దీనికి సంబంధించిన పుత్రాదులును నిత్యులుకారు. అట్టి పుత్రాదులందు స్నేహము చూపుట కేవల మజ్ఞానమూలకము కాని వేఱుకాదు. కావున నీ పుత్రులందు మోహమును విడువు'' మని యిట్లు కశ్యపుఁడు మొదట తత్త్వోపదేశము చేసెను. కాని దాని కామె సంతుష్టిచెంద లేదు.అది తెలిసికొని యమ్మని యామె కు వెండియు నిట్లనియె. "ఓ సుందరీ ! విష్ణుభక్తు లన్నారాధించు వారికి హితమొనర్చువాఁడు. సకలభూతముల హృదయకుహర ములందును నివసించువాఁడు. శ్రేయస్కాము లగువారిచే యూ హించఁబడి వారి వాంఛితముల నెఱవేర్చువాఁడు. ఇంతే కాదు. అతఁడడిగినదానికంటె నధికముగా నిచ్చువాఁడు. అట్టి వాసు దేవుని నీవు భక్తితో నారాధింతువేని దీనవత్సలుఁడగు నతఁడు తప్పక నీ కోర్కుల నెఱవేర్చును. అతనిసేవ యితర దేవతా సేవవలె నెప్పుడును విఫలముకాదు" అని చెప్పిన పతినిగాంచి యదితి యిట్లనియె. "ఓ నాథా ! జగత్పతి యగుభగవంతు నేయుపాయముచే భజింపనలయు ? ఎట్లు భజించినచో సత్యసం కల్పుఁడగుపరమేశ్వరుఁడు నా మనోరథంబు నెఱవేర్చును ? పుత్రులతోఁగూడఁ బలుపాట్లుపడుచున్న నాకు దేనిచే భగవం

తుఁడు సాఁకొత్కరించునో యాయుపాయము నుపదేశింపు"మని పలుక నాకశ్యపుఁడిట్లనియె. "ప్రియురాలా! పూర్వము నేనుసంతానము గల్గించు వ్రతమునుగుఱించి బ్రహ్మనడుగ నతఁడుదయార్ద్రహృదయుఁడై పయోనామకమగువ్రతముపదేశించెను. అదితప్పక విష్ణువును సంతసింపఁజేయఁగలదు. నీ కావ్రతము నెఱింగించెద. ఫాల్గునశుక్లపక్షమున బ్రతిపదిమొదలుపండ్రెండుదినములాచరింప వలయును.నీవు నిశ్చలమగుభక్తితోఁగూడికొని యీవ్రతముచే నరవిందాక్షుని విష్ణువు నారాధింపుము. చంద్రకళ గల్గిన యమావాస్యలభ్యమైనచో నపు డడవిపంది త్రవ్విన మట్టిని గొనివచ్చి "ఓ భూదేవీ ! నీవధిక ప్రభావము గలదానవు. నిన్ను యథాస్థానమును జేర్చుదలంచిన వరాహమూర్తిచే బాతాళమునుండి యుద్ధరింపఁబడితివి. అట్టి నీకు నమస్కారము. నా పాపములను దొలఁగింపుము" అను మంత్రమును బఠించుచు నామృత్తికను దేహమునఁ బూసికొని స్నానము చేయవలయు. అనంతరము సంధ్యావందనాదికృత్యములను నెఱవేర్చుకొని నిశ్చలచిత్తుఁడై మున్నిగ్గులచే నలంకృత మయినభూమియందును, సూర్యునియందును, జలమందును, వహ్నియందును, గురుపునందును హరిని భావించి పూజింపవలయును. ఆసమయమున "ఓన్నమోభగవతే వాసుదేవాయ" యనుమంత్రము నుచ్చరించు చుండవలయును. "ఓవాసుదేవా ! నీవు సకలమునకు నాధారమవు. నీవు నిజతేజముచే నంతటను వెలుఁగువాఁడవు. నీ వొరులకుఁ గానరాకయే సమస్తవస్తువులకును సాక్షివగుచున్నావు.నీ వందఱిలోను మహాపురుషుఁడవు. అట్టి నీకు నమస్కారము. ఓమహాపురుషా ! నీ

* వీచతుస్సు మొదలగు నింద్రియములకుఁ గానరావు. మిక్కిలి సూక్ష్మరూపుఁడయిన జీవున కంతరాత్మవై ప్రవేశింపఁ దగియుండుటచే నతనికంటెను మిక్కిలి సూక్ష్ముఁడ వగుచున్నావు. నీవు ప్రకృతిపురుషులు శరీరముగాఁ గలవాఁడవు. చతుర్వింశతి తత్త్వములుగూడ నీకు శరీర మగుచున్నవి. ఇంతేకాదు. చతుర్వింశతి తత్త్వరూపమునఁ గార్యావస్థ చెందిన సత్వాదిగుణములకు హేతు భూతుఁడవు. ఇట్లు కార్య కారణ రూపములగు ప్రకృతి పురుషులు శరీరముగాఁ గలవాఁడ వగుటయేకాక వానికంతరాత్మవై కారణుఁడవైయున్న నీకు నమస్కారములు. ఓ పరమేశ్వరా! † శబ్దరూప మగుప్రపంచ మపూర్వ మగువృషభమును

---

* ఇందులకు మూలము ''అవ్యక్తాయ'' అనియున్నది. దీనిచే ''శ్రు॥ యత్తదదృశ్య మగ్రాహ్య మగోత్ర మవర్ణమచక్షుశ్శ్రోత్రం తదపాణిపాదం నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యంతి ధీరా'' అను నుపనిషద్వర్గము సంగ్రహింపఁ బడుచున్నది,

† దీనికి మూలము 'నమోద్విశీర్ష్ణే త్రిపదే చతుశ్శృంగాయ తంతవే। సప్తహస్తాయ యజ్ఞాయ త్రయీవిద్యాత్మనే నమః॥ దీనిచే శ్రు॥ చత్వారి శృంగాస్త్రయో అస్యపాదా ద్వే శీర్ష్ణే సప్తహస్తాసో అస్య। త్రిధాబద్ధోవృషభో రోరవీతి మహాదేవో మర్త్యాగ్ం ఆవివేశ॥ అను మంత్రార్థము ప్రకటిత మగుచున్నది. ఈమంత్రమందు శబ్దాత్మకప్రపంచము లోకవిజాతీయ వృషభముగా నిరూపింపఁ బడుచున్నది. అదెట్లన—మహాన్ దేవః=శబ్దస్వరూపుండగు దేవుఁడు, త్రిధా=మూఁడువిధములుగా, బద్ధః=ఉత్పత్తిఁజెంది, అవఁగా వక్షస్థలమందును, గంధమందును, శిరస్సునందును మాత్రమే శబ్దజాలము పుట్టుచుండును గాన యట్లుచెప్పఁబడియె. వృషభః=లోకవిజాతీయమగు వృషభరూపమునొంది, మర్త్యాన్=నశ్వరములును బరమాత్మకు శరీరభూతములును నగు దేవ మనుష్యాది పదార్థములను, ఆవివేశ=తెలుపుటచేయుటకయి పరిఁచెను. అనఁగా దేవ

బోలుచున్నది. సామాన్య వృషభమునకు రెండు కొమ్ములును, నాలుగు కాళ్లును, నొక తలయు నుండును. కాని యీ శబ్ద వృషభమునకు నామము, క్రియ, నిపాతము, ఉపసర్గము నాఁబడు నాలుగు శృంగములును, భూతము, భవిష్యత్తు, వర్తమానము నాఁబడు మూఁడు పాదములును, బ్రవృత్తినిమిత్తము తదాశ్రయము నాఁబడు రెండు శిరస్సులును, నేడు విభక్తులనెడి యేడు చేతులును గలవు. అట్టి శబ్దప్రపంచము నీకు శరీరభూతమగుటచే రెండు శిరస్సులతోను మూఁడుపాదములతోను నాలుగుశృంగములతోను, నేడు హస్తములతోను వెలయుచు యజ్ఞాదిక్రియాఫలమును విస్తరింపఁజేయుచు వేదముచే బోధిత మగుచుపాపముగల వాఁడవై యజ్ఞరూపుఁడ వయియున్నవీకు వందనములొరించెదను.

మనుష్యాదులను వెలియఁబఱిచెను భావము. అస్య=శబ్దాత్మక మగునీవృషభమునకు, చత్వారి=నామము, క్రియ, నిపాతము ఉపసర్గము నాఁబడునాలుగు, శృంగాణి=కొమ్ములును, అస్య=దీనికి, త్రయఃభూతభవిష్యద్వర్తమానము లనెడి మూఁడు, పాదాః=కాళ్లు, ద్వే=ప్రవృత్తినిమిత్తము, తదాశ్రయము నాఁబడు రెండు, శీర్షే=తలలు, అస్య=దీనికి, సప్త=ప్రథమాదివిభక్తులగు నేడును, హస్తాసః=చేతులగుచున్నవి. ఈ శబ్దజాలరూప మగువేదము పరమాత్మను బోధించు చున్నదని ఫలితార్థము. వెనుకఁ గార్యకారణాత్మక మగువస్తురూపప్రపంచమంతయును బరమాత్మకు శరీరభూత మనిచెప్పి యీశ్లోకముచే నామరూపప్రపంచము భగవంతునిరూపమును బోధించుచు నతని కపృథగ్భూత విశేష మయియున్నదని తెలియఁబఱిచెను. నామాత్మకప్రపంచమంతయు వేదమేయగుటచేతను, అది పరమాత్మకపృథక్సిద్ధవిశేషణమగు రూపప్రపంచమును జెప్పుచుండుటచేతను, అట్టివిశేషణములను చెల్వు శబ్దములకు విశేష్యమందుఁ బర్యవసన్నములగుట సైజమగుటచేతను నిగమాగమాదిశబ్దజాతమంతయుఁ బరమాత్మను బోధింప సమర్థమైనదని స్పష్టమగుచున్నది.

ఓ మహాదేవా ! రుద్రశరీరకుఁడవయి భవుఁడవనియు నంబి కాపతివనియు, శివుఁడవనియు, విద్యాధిపతివనియు, భూతపతి వనియుఁ, బిలువఁబడుచు విశ్వమును నశింపఁజేయుచున్న నీ కభి వాదము గావించెద. మఱియుఁ జతుర్ముఖ శరీరకుఁడవయి సృష్టి నొనరించుచు సమస్తప్రాణుల కంతరాత్మవై, జగద్రూ పుఁడవై, యోగైశ్వర్యమును నిర్వహించుచు, యోగమునకుఁ గారణుఁడ వయిననీకు నమస్కారములు. ఓ యీశ్వరా ! నీవు బ్రహ్మరుద్రాదులకుఁగూడ గారణభూతుఁడవు. నీవు స్వీయతేజ ముచేఁ బ్రకాశించుచు బ్రహ్మాదులను బ్రకాశింపఁజేయుచున్నాఁ డవు. నరనారాయణరూపమున నవతరించి లోకము నాపదల నుండి కాచుచున్నావు. నీ వాశ్రితుల కష్టముల నపహరించు వాఁడవు. ఇంద్రనీలమువలె శ్యామలకాంతితో నొప్పువాఁడవు. పచ్చని పట్టువస్త్రములతోను, నెప్పుడును విడిచియుండని లక్ష్మి తోను వెలయుచున్నవాఁడవు. ఇట్టి మహనీయుఁడ వగునీకు వందనము లర్పించెదను. ఓ పరమపురుషా ! నీ వాశ్రితులకుఁ బూర్తిగా వరముల నొసంగి వరదశ్రేష్ఠుఁడ వనిపించుకొను చున్నాఁడవు. కావుననే భక్తులందఱును శ్రేయస్సు నభిలషించి నీ పాదపద్మములఁ గొల్చుచున్నారు. లక్ష్మియును, బ్రహ్మాదులును నెవనిపాదపద్మముల యామోదమునకు వశులయి నిత్యము ననుసరించుచున్నవారో యా వాసుదేవుఁడు నాకుఁ బ్రసన్నుఁడగుఁ గాక' యనెడి మంత్రములచేతను, నావాహనముచేతను హరిని దమ సన్నిధినిఁ జేర్చుకొని పాద్యమొసఁగి యాసనమిచ్చి యర్ఘ్యో మర్పించి గంధముచేతను, బుష్పములచేతను, మధుపర్కాదుల చేతను బూజించి పాలచే స్నానముచేయించి శ్రద్ధాయుక్తుఁడై

వస్త్రమును, యజ్ఞోపవీతమును, నాభరణములను, సమర్పింప వలయును. ద్వాదశాక్షరవిద్యను బఠించుచు నిట్లు సకలోపచార ముల నొనర్చి నేతితోను బెల్లముతోను గూడిన పాయసాన్న మును శ్రీహరికి నివేదింపవలయును. మూలవిద్యను బఠించుచు హోమముచేయవలెను. పిమ్మట నివేదితమగు నా పాయసమును స్వయముగా భక్షింపవలెను. లేనిచో నొక బ్రాహ్మణున కర్పింప వలయును. పరమేశ్వరున కాచమనమొసంగి తాంబూల మర్పించి ద్వాదశాక్షర మంత్రమును నూటయెనిమిదిపర్యాయములు జపించి స్తోత్రములను బఠించి నుతింపవలయును. తరువాత నా భగవంతునకుఁ బ్రదక్షిణముచేసి దండప్రణామములర్పించి నిర్మాల్యమును దీసికొని శిరసునఁ దాల్చి, యసంతర ముద్వాపనము చేయవలయు. పిమ్మట నిరుపురు బ్రాహ్మణులను బాయసముచే భుజింపఁజేసి వారిని యభ్యర్చితముగాఁ బూజించి వారియనుమతి చొప్పున నా శేషమును బంధుప్రులతోఁగూడ భుజించి స్త్రీసంగర హితుఁడై యారాత్రిపుచ్చి వేకువనే మేల్కొని స్నానముచేసి శుచియై సమాహితచిత్తుఁడై వెనుకటియట్లు పూజింపవలెను. పాలనుమాత్రమే యాహారముగాఁగొనుచు నీవ్రతము నాచరింపవలెను. పూర్వమువలె హోమముచేసి బ్రాహ్మణుల భుజింపఁజేయవలెను. ఓ సుందరీ ! వ్రతి యిట్లు ప్రతిదినమందును విష్ణుపూజను, బ్రాహ్మణ భోజనమును, హోమమును జేయుచు, మూఁడు పూటలును స్నానమొనరించి బ్రహ్మచర్యము పూని క్రింద శయనించుచు శుక్లపక్ష ప్రతిపత్తు మొదలు త్రయోదశివఱకును నీ పయోవ్రత మాచరింపవలయును.ఆసమయమున వ్రతి వాసుదేవపరాయణుఁడై యసద్వాక్యముల నుచ్చ

రింపరాదు. భోగముల ననుభవింపరాదు. సకలభూతములకును హింసచేయఁ జనదు. పదుమూఁడవదినమున యథావిధిగా మంత్రజ్ఞులగు బ్రాహ్మణులు మంత్రము లుచ్చరించుచుండఁగాఁ బంచామృతములచేతను విష్ణువును స్నానముచేయింపవలెను. ధనలోభమునొందక సకలోపచారములతోను విష్ణువును బూజించి విష్ణుదేవతాక మగుచరువును సిద్ధముచేసి నిశ్చలచిత్తుఁడై పురుషసూక్తముచే హోమముచేసి షడ్రసోపేతమగు నైవేద్యము నర్పింపవలెను. జ్ఞానసంపన్నుఁడయిన తన గురువునకు విప్రులకును, వస్త్రములను, నాభరణములను, గోవులను నొసంగి సంతసింపఁ జేయవలెను. ఆ గురు ద్విజతోషణము వారిని సంతసింపఁ జేయుటవంటిదే కాన తప్పక యాచరింపవలయును. ఓ ప్రియురాలా! వ్రతి గురువునకును, తక్కిన బ్రాహ్మణులకును, సంతృప్తిగా భోజనమిడవలయును. బుత్విక్కులకును, గురువునకును యథార్హముగా దక్షిణలొసంగి పిమ్మట సర్వవర్ణములవారిని భోజనాదులచేఁ దనివినొందింపవలయును. దీనులును, గ్రుడ్డివారును, గృపణులును దనివి సన భుజించినచో విష్ణువు తప్పక సంతసించును. ఇట్లుచేసి తానుబందుగులతోను, విద్వాంసులతోను భుజింపవలయును. పూజాదినములందు గానము చేయింపవలయును. హరికథలను వినిపింపవలయును. ఇట్లు భగవంతు నారాధింపవలెను. పయోవ్రతమని దీనిపేరు. ఇది పరమేశ్వరుని సంతసింపఁజేసినట్లు వేఱొకటిచేయ లేదు. బ్రహ్మ పూర్వమీవ్రతమును నాకుపదేశించెను. దానిని నీకు విధిసహితముగా నుపదేశించితిని. ఓ పుణ్యాత్మురాలా! నిర్మలమగు నంతఃకరణము గలదానవై నీ వీవ్రతముచే హరిని బూజింపుము. ఈ పయోవ్రతము సకల

యజ్ఞములతోను, సకలవ్రతములతోను సమానమైనది. అన్ని విధములచేత నొనర్పఁబడు తపస్సారమునకును, సకలదానములకును, నిది తుల్యమైనది. పరమేశ్వరుని సంతసింపఁజేయుటకు దీనితో నీడైనది లేదు. విష్ణువును సంతసింపఁజేయునట్టి నియమములుమాత్రమే యత్యుత్తమములు. కావున నీవు మిక్కిలి ప్రయత్నముచేసి శ్రద్ధాయుతురాలవై యీ వ్రతము నాచరింపుము. పరమేశ్వరుఁడు నీవ్రతమునకు సంతసించి వలయు వరంబుల నిచ్చును. ఇది పద్మావయధ్యాయము.

వామనమూర్తి యవతరించుట; బ్రహ్మాదు లతని నుతించుట.

అని యిట్లు తన భర్త యగుకశ్యపుఁడుపదేశింపఁగా నదితి మిక్కిలి సంతసించి నిశ్చలచిత్తురాలై పండ్రెండుదినంబు లీవ్రతము నాచరించెను. ఆమె బుద్ధియనెడి సారథి సాయమున మనస్సు నింద్రియంబు లనెడి దుష్టతురంగములను జయించి యితరాసక్తముకాని బుద్ధిచే మనస్సును సర్వాంతరాత్మయును, షాడ్గుణ్యపూర్ణుఁడును నగువాసుదేవునియందు స్థిరముగా నిలిపి సర్వదా యమ్మహాపురుషుని ధ్యానించుచు నావ్రతమును యథావిధి సమాప్తినొందించెను. అంత నాదిపురుషుఁడగువాసుదేవుఁడు పీతాంబరమును దాల్చి శంఖము, చక్రము, గద మొదలగు సాధనములఁ జేకొని యామెకుఁ బ్రత్యక్షమయ్యె. అట్లు సాక్షాత్కరించిన వాసుదేవునిఁగాంచి యా సాధ్వి త్వరగాలేచి నిలువఁబడి ప్రేమాతిశయముచే దడఁబడుచుఁ గన్నులనుండి యానంద బాష్పములు స్రవింప, దేహమంతయుఁ బులకరింప భగవంతుని

దర్శనమువలన గల్గిన నిరతిశయానందముచే దేహము కంప మెత్త నతనికి దండప్రణామములాచరించి దోసిలివట్టి యూరక నిల్చియుండె; కాని నుతింప సమర్థురాలు కాకపోయె. ఓ రాజేంద్రా ! ఆ యదితి యట్లు కొంతసేపుండి క్రమక్రమముగా నింద్రియములను స్వాధీనము గావించుకొని యజ్ఞస్వరూపుఁడయిన రమాపతిని తెప్పవాల్పకుండఁ జూచుచుఁ బ్రీతిపూర్వకముగా హరినిట్లు నుతించెను. "ఓ పరమేశ్వరా! నీవు యజ్ఞాధిపతివి; నీవు యజ్ఞభోక్తవు; నీ వాశ్రయించినవారి నెప్పుడును విడుచువాఁడవుకావు. గంగాదిరూప మగుతీర్థము పాదమందుఁ గలవాఁడవు. పవిత్రమగు కీర్తి గలవాఁడవు. శ్రవణములకు మంగళకరమగు నామధేయము గలవాఁడవు. ఓ దేవా ! ఆపన్నులయి నిన్ను శరణుచెందిన లోకులదుఃఖములఁ దొలఁగింప సమకట్టిన మహాత్ముఁడవు నీవే ? నీవు మావంటి దీనులకు నాథుఁడవు. కావున దయయుంచి మాకు సుఖము నొసంగుము. ఓ మహాపురుషా ! నీవు విశ్వస్వరూపుఁడవు. ప్రపంచమునకుసృష్టిస్థితిలయములఁగల్గింపఁ గారణభూతుఁడవు నీవే? లీలకయి నానావిధములుగాఁ బరిణమించు సత్త్వాదిగుణములను జేకొని సృష్ట్యాదికార్యముల నొనర్చువాఁడవగుటచే నీవు విశ్వకారణుఁడవయినను వికారముల నొందవు. నీ వనంతకల్యాణములచే నిరతిశయుఁడవు. మార్పుచెందని స్వరూపమును, గుణములును గలవాఁడవగుటచేఁ బ్రకృతిపురుషసంబంధము సదా గలవాఁడ వయినను దద్గతదోషములు నిన్నుఁ బొందలేవు. సంతత మభ్యుదయముగలదై కల్యాణగుణములకు నిలయమై యవిచ్ఛిన్నానందమైయున్న నీస్వరూపమును జూపి జీవుల యజ్ఞానమును దొలఁగించువాఁడవు. ఆశ్రి

తుల కష్టముల నపహరించువాఁడవు. నట్టి యనంతశక్తి యగు నీకు నమస్కారము లాచరించెదను. ఓ మహాత్మా! నిన్ను సంత సింపఁజేసిన నరులకు నీదయవలనఁ జరాయున్నును,బలపరాక్రమా దులతోఁ గూడిన శరీరమును, సకలసంపదలును, స్వర్గాదులును, సమస్తములయిన యోగసిద్ధులును, ధర్మార్థకామములును, సందే హరహిత మగుజ్ఞానమును గల్గుచుండుననని చెప్పవలసినపుడు శత్రుజయాదులు గల్గునని వేఱు చెప్పవలయునా"యని యిట్లదితి నుతింపఁగా సకలభూతములకు సంతరాత్మయై విలసిల్లు నా వాసు దేవుఁడు సంతసించి యామె కిట్లనియె. " ఓ దేవమాతా! నీవు చిరకాలమునుండి కోరుచున్న నీ కోర్కిని దెలిసికొంటిని. నీ కుమారులు శత్రుపీడితులయి సంపదలను గృహములను విడిచి దేశాంతరములకుఁ బోయి పలుబాధలు పడుచున్నారనియు, వారి యైశ్వర్యము వారికి మరల సంప్రాప్తము కావలయు ననియుఁ గోరుచున్నావు.నీపుత్రులా రక్కసులను యుద్ధములో జయించి తమ రాజ్యము తీసికోఁజాలినంత సామర్థ్యము వారికిఁ గలుగు నిమిత్తమే నన్నుపాసించితివి. తొంటియట్ల నీవు నీపు త్రులతో నొకచోటఁ గూడియుండవలెనని యభిలషించు చున్నావు. అది యంతయు నాకుఁ దెలిసినది. నీ కుమారులగు నింద్రాదులచేఁ జచ్చిన తమ భర్తలసన్నిధినిజేరి విలపించు దుర దృష్టవంతురాండ్రగు దైత్యస్త్రీలను నీవు చూడఁగలవు. ఇం ద్రాదులు మగుడఁ దమ సంపదలను దమకీర్తులను సంపాదించు కొని స్వర్గపురమునుజేరి తొంటియట్లు క్రీడించుచుండఁ జూచి సంతసించు భాగ్యము నీకు స్వల్పకాలములోనే లభించును. ఓ దేవీ!యోజింప నాదైత్యుల కిప్పుడు కాల మనుకూలమైయున్నది.

మహాశక్తిమంతులగుశుక్రాదులచే సంరక్షితులైయున్నారు. వారి నిప్పుడు మనము జయించుట కష్టము. యుద్ధమునఁ బరాక్రమము చూపుట నిష్ఫలము. అది సుఖదాయకము కానేరదు. అయినను నీ వొనరించిన వ్రతమునకు మిక్కిలి సంతసించి నే నందులకుఁ దగినయుపాయము వేఱొకటి యోజించెదను. నా యారాధన మెప్పుడును విఫలముగాదు. నా యారాధకుని శ్రద్ధాభక్తుల కనుగుణ మగుఫలము లభింపకమానదు. నీవు పుత్త్రి రక్షకై చేసిన పయోవ్రతమునకు మిక్కిలి సంతసించితిని. కశ్యపబ్రహ్మ తపఃఫలముగా నేను నా యంశముచే నీకుఁ బుత్త్రిఁడనయి యవతరించి నీ కుమారులను రక్షించెదను. ఓ శుభురాలా ! నీవు నిష్కల్మషుఁడయినకశ్యపు ననువర్తించియుండుము. నిజతేజముచేఁ బ్రకాశించుచున్న నన్నును నీ భర్తవలన గర్భమందు ధరింపఁగలవు. ఈవృత్తాంతము మిక్కిలి రహస్యముగా నుంపవలయు ; ఏరుల కెవ్వరికిని దెలియనీకుము. అట్లు గుప్తముగా నుంచితివేనిశీఘ్రకాలములోనే ఫలమొందఁగలవు" అని యిట్లు వానుదేవుఁడు పలికి యచ్చటనే యంతర్ధానము చెందెను. దర్శనమునకే దుర్లభుఁడయినభగవంతునిఁ గుమారునిఁగాఁ బడయుభాగ్యము తనకు లభించినందుల కదితి మిక్కిలి సంతసించి శ్రద్ధాభక్తులతో భర్తను గొల్చుచు ననుసరించు చుండెను. అంత విఫలముగాని దివ్యజ్ఞానము గలకశ్యపుఁడు నారాయణుని యంశము తనయందుఁ జొచ్చియున్నట్లు సమాధియోగముచేఁ దెలిసికొని తపస్సుచేఁ జిరకాలమునుండి సంపాదితమయినదియు దారుణమైన యగ్నివలెఁ బ్రకాశించుచున్నదియు నగు తనవీర్యము నదితియందుంచెను. సనాతనుఁడయినహరి యిట్లదితిగర్భ

మందుఁ బ్రవేశించి వర్ధిల్లు చున్నసంగతిఁ దెలిసికొని బ్రహ్మ, యసాధారణగుణములను దెలియఁజేయు నామములచే నా విష్ణువు నిట్లు నుతింపఁజొచ్చెను. లోకముల నాక్రమింపఁజాలిన పాదన్యాసములుగల యో పరమేశ్వరా! సర్వోత్కర్షను బొంది వర్తింపుము. నీవు సాధుసులయిన బ్రాహ్మణులకు దేప్రుఁడవయి రక్షించుచున్నావు. నీవు సృష్టిస్థితిలయముల నొనర్ప లీలకయి రజము, మొదలగు గుణములను దాల్చుచున్నావు. ఓ దేవా ! లోకముల రక్షించునిమిత్తము పూరమం దిచ్చి పృశ్నియను సాధ్వీమణిగర్భమున ననసించినవాఁడవు. నీవు వేదములకు నిల యభూతుఁడవగుచున్నావు. లోకత్రయరూప. మగుపద్మము నాభియందుఁ దాల్చినవాఁడవు. నీవు పరమాకాశమునందు వర్తించువాఁడవు. జీవుల కంతరాత్మవై వెలయుచున్నావు. అంతటను వ్యాపించు స్వభావము గలవాఁడవు.నీవు విశ్వమున కాదియందును, మధ్యమందు, నంతమందును గారణభూతుఁడ వగుచున్నావు. పండితులు నిన్ననంతశక్తిగల పరమపురుషునిఁగాఁ జెప్పుచున్నారు. కాలశరీరకుఁడవయిన నీ వీ విశ్వమును మహాప్రవాహము తనయందుఁ బడిన గడ్డిపోచనుంబోలెఁ జిమ్మివేయుచున్నది.ఓ మహనీయా! నీవు స్థావరజంగమములను, బ్రజాపతులను బుట్టించినవాఁడవు. నీట మునుఁగుచున్నవానికిఁ బడవవలెఁ గష్టముల పాలగుచున్న దేవతలకు నీ వాశ్రయుఁ డగుచున్నావు. ఆ దేవతలకార్యమును సాధించుటకే యి ట్లవతరించుచున్నాఁడవు. అట్టి నీకు నమస్కారము లాచరించెదను. నీ వీక నాదేవతల నెప్పటియట్లు స్వర్గనివాసులనుగాఁ జేయుము" ఇది పదునేడవయధ్యాయము.

వామనుఁ డుదయించుట.

అని యిట్లు చతుర్ముఖుఁడు తన యద్భుతకార్యములను, దన ప్రభావమును నుతించుచుండఁగాఁ బరమపురుషుఁడు కర్మాధీన మగు జనన మరణములు లేనివాఁడైనను దేవకార్యము నెఱవేర్ప నదితియం దావిర్భవించెను. అతని నాలుగుచేతులందును. గ్రమముగా శంఖము, చక్రము, గద, పద్మము వెలయుచుండెను. అతని దేహకాంతి నిర్మలమైన నీలమేఘమును బోలుచుండెను. అతని ముఖపద్మము మకరకుండలముల కాంతులచే రాజిలుచుండెను. వక్షస్థలమున శ్రీవత్సమును లాంఛన మొప్పుచుండెను. అతని ముంజేతులందు బంగారుమురుగులును, భుజములందుఁ గేయూరములును, దలయందుఁ గిరీటంబును, మొలయందు బంగారు త్రాడును, మెడయందు ముత్యముల హారములును, గాళ్లయందండెలును విలసిల్లుచుండెను.అతఁడు దాల్చిన వనమాలయండలి తేనెను గ్రోలుటకు మూఁగిన తుమ్మెదకోదమలు ఝుమ్మ్ ఝుమ్మని నినాదముచేయుచుండెను. అతఁడు దాల్చిన కౌస్తుభరత్నము మక్కిలి యందముగుల్కుచుండెను. అతని దేహకాంతిచే గశ్యపుని గృహమునందున్న చీకట్లన్నియుఁ దొలఁగింపఁబడుచుండెఁ. ఇట్టి మహామహిమతో శ్రీహరి యావిర్భవించుకాలమున దిక్కులు నిర్మలములయ్యెఁ. జలాశయములు ప్రసన్నములయ్యెఁ. ప్రజలు సంతుష్టులయిరి. ఆఋతువులును దత్తత్ఫలాదిసంపదలతోఁ దులఁదూఁగుచుండెఁ. దివియు నంతరిక్షంబును, భూమియు, నగ్నియు, దేవతలును, బ్రాహ్మణులును, బర్వతములును, మిక్కిలి సంతోషము గలవయ్యెఁ. సకల నక్షత్రములును, గ్రహములు ప్రదక్షిణమొనర్చుచుండ శ్రవణనక్షత్రయుతమైన

భాద్రపదశుక్లద్వాదశినాఁ డభిజిన్ముహూర్తమున సూర్యుఁడు గగనమధ్యము నధిష్ఠించియుండఁగాఁ బరమపురుషుఁ డుదయించె. ఓరాజా! భగవంతుఁడు జన్మించిన ద్వాదశి విజయయను నామమునఁ బిలువఁబడుచున్నది. అతని జన్మదివసమున శంఖములను మ్రోగించిరి. దుందుభులును మృదంగములును, పణవములును, విచిత్రములగు వాద్యత్రములును వాయింపఁబడెను. మిక్కిలి సంతసముతోఁ నప్సరలాడిరి. గంధర్వులు గానముచేసిరి. మునీశ్వరులు సంతసించిరి. దేవతలును, మనువులును, పితృదేవతలును, నానందముచెందిరి. సిద్ధులును, విద్యాధరులును, గింపురుషులును, గిన్నరులును, చారణులును, యక్షులును, రక్షస్సులును, గరుడులును, భుజగులును, మిగిలిన దేవానుచరులును, పరమేశ్వరుని నుతించుచు, నతనిఁ గీర్తించుచు, నాడుచుఁ బాడుచు దమ యుత్సాహమును వెల్లడించిరి. సురవరులు సంతసముతోఁ గశ్యపు నాశ్రమముపైఁ బుష్పవర్షమును గురియించిరి. అదితి తన గర్భమునుండి యుదయించిన పరమపురుషునిఁగాంచి విస్మితురాలయి చూచుచు నధికానందము చెందుచుండెను. అంత శ్రీహరి యాశ్చర్యశక్తిచే శిశురూపమును దాల్చెను. అది చూచి బ్రహ్మ "జయ, జయ" యని పల్కుచు సంతసము వెలిపుచ్చెను. మొదట నాయుధములతోను, భూషణములతోను నవతరించిన యా పరమపురుషుఁ డచ్చటివారు చూచుచుండఁగనే నటునిచందమునఁ బొట్టి వడుగురూపమును ధరింప సంతుష్టిఁజెందిన మునులందఱును గశ్యపునిచే నా శిశువునకు జాతకర్మాదులఁ జేయించిరి. అనంతరము కశ్యపుఁ డతని కుపనయనము గావించెను. ఆ వామనునకు సూర్యుఁడు సావిత్రి నుపదేశించెను. బృహస్పతి

బ్రహ్మసూత్రమును, గశ్యపుఁడు మేఖలను, భూమి కృష్ణాజినమును, వనస్పతి యగుచంద్రుఁడు దండమును, దల్లియగు నదితి కౌపీనమును, దివి గొడుగును, బ్రహ్మ కమండలువును, సప్తర్షులు దర్భలను, సరస్వతి యక్షమాలను, గుబేరుఁడు భిక్షాపాత్రమును, భార్వతి భిక్షయును నొసంగెను. ఇట్లు బ్రహ్మచారిలక్షణములతోఁ గూడిన యా వటువు బ్రహ్మర్షి గణములతో నిండిన యా సభను మిక్కిలి ప్రకాశింపఁజేసెను. అప్పుడు కశ్యపుఁడుపనయనాగ్నికి బర్హిస్సుచేఁ బరిస్తరణలువేసి ప్రజ్వలింపఁజేసి లెస్సగాఁబూజించి హోమముచేసెను. ఉపనయనసంస్కార మైనపిమ్మట వామనుఁడు శుక్రాదులసాయమున నశ్వమేధయాగములను జేయుచున్న బలిచక్రవర్తి కీర్తిని విని సంపూర్ణ బలవంతుఁడై యడుగడుగునను భూమిని గంపింపఁజేయుచు, నతని యాగవాటికకు వెళ్లెను. నర్మదాతీరమున భృగుకచ్ఛక మనుక్షేత్రమునందు బలిచే యాగమును జేయించుచున్న శుక్రాదులు సూర్యునివలెఁ బ్రకాశించుచుఁ దమచెంత కరుదెంచుచున్న యా వామనునిఁ జూచిరి. క్రమక్రమముగాఁ దమసమీపమున కరుదెంచుచున్న వామనుని తేజముచే శుక్రాదులును,బలియు, నపహృతకాంతులై "ఆ వచ్చువాఁడు సూర్యుఁడా? లేక యగ్నిహోత్రుఁడా? లేక యీ యాగమునుజూడవేడుకతోవచ్చుసనత్కుమారుఁడా?యనిసందేహించుచుండ సందండ మగుగొడుగును, జలపూర్ణ మగుకమండలువును దాల్చి యా యశ్వమేధవాటికను బ్రవేశించెను. మాంజిని, మేఖలను, కృష్ణాజినమును యజ్ఞోపవీతమును, జటలనుదాల్చి కపట బ్రహ్మచారివేషమున నరుదెంచిన శ్రీహరిని గాంచి యతని తేజమునఁ దిరోహితు లయినశుక్రాదులు శిష్యసహితులై యాసన

ములనుండి లేచి గౌరవించిరి. రూపమునకుఁ దగిన యవయవ ములు గలుగుటచే మనోహరుఁడై చూడఁ దగియున్న యా వామనునిఁజూచి బలిచక్రవర్తి యెదురేగి యుచితాసనమర్పించి కుశలమడిగి యతని పాదములు గడిగి ముక్తసంగు లగుయోగీశ్వ రుల హృదయములందు వసించు భగవంతుని యథావిధిగాఁ బూజించెను. ఎవనిపాదమునఁ బుట్టినగంగను పరమభక్తితో దమతమ శిరంబులఁ దాల్చి బ్రహ్మశంకరుఁడు మొదలగువారుఁగా పవిత్రులైరో యా పరమేశ్వరుని పాదజలమును దీసి భక్తితోఁ దనశిరంబునఁ జల్లికొని బలి పరమానందముఁ జెంది కృతకృత్యుని నెంచుకొనుచు నతనిఁ గాంచి యిట్లనియె. "ఓ విప్రవర్యా! నీకు నమస్కారములు. నీవు మిక్కిలి యుచితకాలమున నిచ్చటి కరుదెంచినందుల కానందించుచున్నాము. నీకు మేము కింకరు లము. నీ కేమిచేయవలయును? శ్రేష్ఠమగు శరీరముతోఁ బొల్చు చున్న నీవు మూర్తిమంతమగు బ్రహ్మస్థల తపంబోయనఁ బొల్చు చున్నావు. ఓ మహనీయా! నీవు మాగృహమునకు వచ్చుటచే మా పితృదేవతలు సంతసమందిరి. మాకులము పవిత్రమయ్యె. నాచేయు యజ్ఞము సఫలమయ్యె. నాయగ్నిహోత్రములు లెస్స గాఁ బూజితములయ్యె. నీ పాదారవిందములఁ గడిగినజలమును శిరంబునఁ దాల్చుటచే నిప్పావుఁడ నయితిని. పవిత్రము లగునీపాద ముల తాఁకుడువలన నీ భూమి మాశరీరములతోఁ గూడఁ బవిత్ర మయినది. ఓ విప్రకుమారా? నీ వేదో కోర్కితో వచ్చినట్లు తోఁచుచున్నది. అది యేదో సంశయింపక యడుగుము, దాని నేఁ దప్పక యిచ్చెదను; పుచ్చికొనుము. నీకు భూమి కావలయునా, గోవులు కావలయునా? బంగారము కావలయునా? సకలవస్తు

వులతోఁ దులఁదూఁగు గృహములు కావలయునా ? మృదులా
న్నము కావలయునా ? కన్యక కావలయునా ? వీనిలో నీకేమి
కావలయు ? ఇంతేకాదు. గుఱ్ఱములనుగాని గజములనుగాని
రథములనుగాని,సస్యసంపదలుగల గ్రామమునుగాని యడిగెదవేని
తప్పక యిచ్చెదను. నీకు వలయుదాని నడిగి పుచ్చుకొని నన్ను
సంతసింపఁజేయుము" అనెను. ఇది పదునెనిమిదవయధ్యాయము.

వామనుఁడు మూఁడడుగుల నేల దానమడుగుట; శుక్రుఁడు వామనుని స్వరూపమును దెలిపి దానము వలదని యుపదేశించుట.

అని యిట్లు బలిచక్రవర్తి పలికినవాక్యము సత్యమై ధర్మ
యుక్తమై యున్నందులకు మిక్కిలి సంతసించి భగవంతుఁడగు
వామనుఁ డతనిఁబొగడి యిట్లనియె. "ఓ దానవేంద్రా ! నీవు
పలికినవాక్యము మిక్కిలి యుక్తముగానున్నది. పరలోకసాధ
నము లగుధర్మముల నిర్ణయింప సమర్థుఁడును,శాంతుఁడును నగు
ప్రహ్లాదుఁడు నీకుఁ దాత. అతనికులమునఁ బుట్టినందులకుఁ దగిన
వచనమును బలికితివి. నీ పలుకు ధర్మయుతమై కీర్తికరమైయు
న్నది. ఈనీకులమందుఁ గృపణుఁడగుపురుషుఁ డొకఁడును బుట్ట
లేదు. ఇఁక బుట్టఁబోఁడు. ప్రకృతకాలమున లేఁడు. బ్రాహ్మణున
కిచ్చెదనని వాగ్దానముచేసి యీయని దుర్బలుఁడు నీవంశమున
జన్మింపఁదగఁడు. ఓనరనాథా ! ఆకాశేమునఁ జంద్రునివలె దేవి
యందుఁ బ్రహ్లాదుఁ డుదయించి నిర్మల యశస్సుతో విరాజిలు
చున్నాఁడో యీ నీకులమందు దానావసరమున యాచించు
యాచకునకును, సమరసమయమునఁ దన్నెదురొక్కను వీరునకును,

వెన్నిచ్చిపర్విడునట్టిపిఱికికిపంద సంభవింపలేదు. సంభవింపఁబోడు. నీ వంశమునఁ బొడమిన హిరణ్యాక్షుఁడు మహావీరుఁడుగదా! అతఁడు గదను దాల్చి దిగ్విజయముచేయుచుఁ దనతోఁ సముఁడగు వీరునికై భూమండలమంతటను దిరుగులాడెను. కాని యొకఁడైన నతని నెదుర్కొనఁ గలిగెనా! విష్ణువు వరాహరూపియై భూమి నుద్ధరించుచున్న సమయమునఁ దన్నెదుర్కొన్న యా హిరణ్యాక్షు నతికష్టముచే జయించి తన్నుఁ గృతకృత్యునిఁగాఁ దలంచెను. విష్ణువునకుఁగూడ నాశ్చర్యము గల్గించు నతని పరాక్రమము మహోత్తరమైనదనుటకు సందియమున్నదా? తన సోదరుని మరణమును విని హిరణ్యకశిపుఁడు కోపోద్దీపితుఁడై భ్రాతృహంతయగుశ్రీహరిని జంపి నతని పురమునకేఁగెను. శూలమును దాల్చి ప్రళయకాలయమునివలెఁ దనపైకి వచ్చుచున్న హిరణ్యకశిపునిఁ గాంచి కాలజ్ఞుఁడును మాయావియు నగుహరి తనలోనాలోచించుకొని "నేనెచ్చటికిఁ బర్విడినను మృత్యుదాయకుఁడగు వీఁడు నన్ను వెంబడింపక మానఁడు. కావున నేను వెలుపటను గానరాకుండ నుండుటకై వీని హృదయకుహరమును బ్రవేశించుట మంచి" దని తలంచి తన నిమిత్తము సంచరించుచున్నశత్రునగు హిరణ్యకశిపుని శరీరమును జొచ్చి "హృదయమును జొచ్చినవో నన్నుఁ దెలిసికొనును" నని చింతించి సూక్ష్మశరీరుఁడై భయపడుచు నిట్టూర్పు వాయువులో లీనతఁ జెందియుండెఁ. విష్ణువు నంత వానికి సైతము భయముగల్గించు హిరణ్యకశిపుని శౌర్యము వర్ణనీయము గదా! అప్పుడా దైత్యేంద్రుఁడు వైకుంఠము జనశూన్యమై యుండుటంజూచి కోపోద్దీపితుఁడై "నేనే జయించితి" నని పెద్దపెట్టున సింహనాదముచేసెను.

అనంతర మతఁడు భూమిని, స్వర్గమును, దిక్కులను, నంతరి క్షమును, బాతాళాది లోకములను, సముద్రములను గాలించి చూచినను విష్ణు వగపడకపోవుటచేఁ దనలో నిట్లు తలపోయ నారంభించె. "అయ్యో! నా సోదరునిఁ జంపిన హరినిమి త్త మీ జగమునంతను వెదకితిని; కాని వాఁడు గనఁబడలేదు. ఇందె చ్చటను లేనప్పు డొక్కఁడి కేఁగియుండునుగితప్పకచచ్చియుండును. కోప మజ్ఞానమువలనఁ బొడమి దేహాత్మాభిమానముచే వర్ధిపఁ బడును. అట్టి కోపము దేహము నశించినతోడనే నశించును. ఆ కోపమువలనఁ గల్గువైరముగూడ దేహులకు మరణపర్యంత మే కాని పిమ్మట నుండదు. నాకు హరితోఁ గలవైరానుబంధ మతఁ డు నశించినతోనే నశించిన"దని పలికి యూరకుండెను. ఓ బలిచ క్రవర్తీ! నీపూర్వులచరిత్ర మెంత ఘనమైనదో చూడుము. నీతం డ్రి యగువిరోచనుఁడు తండ్రి తాతల ప్రవర్తనను దెలిసికొన్న వాఁడు. అతఁడు విష్ణుభక్తిగలవాఁడు. అతఁడు ద్విజరూపధారు లయిన దేవతలను బ్రేమించి యాచించినవారికిఁ దన యాయువు నొసంగెను.అతని కుమారుఁడ వగునీవు నీ పూర్వులచేతను, గృహా స్థులగు శుక్రాదులచేతను, మహాకీర్తిమంతు లగుశూరులచేతను నడపఁబడిన ధర్మములనన్నింటి నాచరించుచున్నావు. దాతలలో మొదటివాఁడగు నిన్నొకటి యాచించుచున్నాను. ఓ దైత్యేం ద్రా! నాయడుగుతో మూఁడుగుల భూమిని నా కొసంగుము. ఇంతకంఱె నధికము వలదు. నీవు జగదీశ్వరుఁడవయినను, బెద్ద దాతవైనను నా కోరఁదగిన దింతయె. తన కుపయుక్తమగు పదార్థమునుమాత్రమే యాచించికొనినచో బండితుఁడు ప్రతిగ్ర హమువలనఁ బాపమునొందఁడు. దయయుంచి నా వరము నెఱవే

1467. వామనరూపియైన భగవంతుఁడుబలి యజ్ఞవాటమున మూఁడడుగులు యాచించుట.

ర్పము"అని వామనమూర్తి పలుక విని బలి యిట్లనియె."ఓ విప్ర కుమారా! నీ వచనము వృద్ధసమ్మతమైనది. కాని నీవు బాలుఁడవు. అజ్ఞుఁడవు. స్వార్థమును గూర్చి యించుకేనియుఁ దెలియని వాఁడవు. కానిచో సకలలోకములకు నాథుఁడనై జంబూద్వీప మువంటి ద్వీపమునైన సంతోషపూర్వకముగా నిచ్చు దాతనైయున్న నన్ను మధురవచనములచే సంతసింపఁజేసియు మూఁడడుగుల భూమినిమాత్రమే కోరుదువా? ఓ బాలుఁడా! నన్ను యాచించినవాఁడు వేఱొకని యాచింపఁగూడదు. కావున యథేష్టముగా నీ జీవనమునకుఁ జాలినంతభూమి నడిగి స్వీకరింపుము" అని పలుక విని బలికి వామనుఁ డిట్లనియె."ఓ రాజా! మూఁడులోకములందుఁ గల శ్రేష్ఠము లగుదేశములన్నియైనను బేరాస గలవారిని సంతసింపఁజేయఁజాలవు. మూఁడడుగుల భూమిచే సంతోషములేనివానికి నవఖండయుతమైనజంబూద్వీపముచేతనైనను గలుగదు. ఆ జంబూద్వీపము లభించిన పిమ్మట సప్తద్వీపములును గావలయునని కోర్కిగలుగుచుండును. పృథువు మొదలగు రాజులకు సప్తద్వీపాధిపత్యము లభించినను సంతృప్తిగలుగలేదని పెద్దలవలన వినుచున్నాను. కావున నాశకు మేరలేదు. పేరాశ గలవానికి సుఖముండదు. దైవానుగ్రహము వలనఁ బ్రాప్తమగుదానిచేఁ దృప్తిచెంది పండితుఁడు సుఖియగును. ఇంద్రియముల జయింపలేని యజ్ఞుఁడు ముజ్జగములు తనకు లభించినను దనివిచెందక దుఃఖియగును. అర్థకామములయందలి యతృప్తి పురుషునకు సంసారబంధముగల్గించును. దైవలబ్ధమగుదానివలనఁ గల్గుతృప్తి ముక్తికి హేతువగును. దైవలబ్ధమగుదానితో సంతృప్తుఁడయిన విప్రుని తేజము వర్ధిల్లును. అసంతు

ష్టుఁడగు వానితేజము జలముచే నగ్నివలె నశించును. కావున నో దైత్యేంద్రా! మూఁడడుగుల భూమిమాత్రమే నాకుఁ గావలయును.అంతతో నేఁ గృతకృత్యుఁడ నగుదును. ప్రయోజనము నకుఁ దగినంతమాత్రమే ధనముండిన సుఖకరమగును. అంతకు మించియుండిన దుఃఖము గల్గించును " అని యిట్లు పలుకఁగా విని నవ్వి " ఓ విప్రకుమారా ! నీ వాంఛితము నిచ్చెదను. స్వీకరింపు " మనిపలికి వామనునికి భూమి దారపోయుటకై జలపాత్రమును దీసికొనెను. అంతఁ గాలజ్ఞుఁడయినశుక్రుఁడు బలిచక్రవర్తి మనోనిశ్చయమును దెలిసికొని యిట్లనియె. " ఓ రాజా ! ఇతఁడు నీవనుకొన్నట్లు బ్రహ్మచారికాఁడు. ఇతఁడు కేవలము భగవంతుఁడగు విష్ణుమూర్తి.ఆ విష్ణువు కశ్యపునివలన నదితికిఁ గుమారుఁడైపుట్టి దేవతలకార్యము సాధింప నిచ్చటికి వచ్చినాఁడు. నీవు ముంచువచ్చు ననర్థము నాలోచింపకుండ నితనికి భూమి నిత్తునని ప్రతిజ్ఞచేసితివి. అది మంచినయినట్లు తోఁపదు. దైత్యులకు గొప్ప యన్యాయము సంభవింపనున్నది. ఇతఁడు నిజసంకల్పముచే బ్రహ్మచారిరూపము దాల్చిన విష్ణువేకాని నీవనుకొనునట్లు సామాన్య బ్రహ్మచారికాఁడు. ఇతఁడు నీ యైశ్వర్యమును, రాజ్యమును, దేజంబును, గీర్తిని హరించి యింద్రుని కీఁదలంచియున్నాఁడు. ఇతఁడు విశ్వరూపమునుదాల్చి మూఁడులోకములను మూఁడడుగులచే నాక్రమించును.అది నాకిష్టమేయందువేని నీసర్వస్వమును విష్ణున్న కర్పించి యెట్లుగా వర్తింతువు ? ఎట్లయిననుసీవు చేసినప్రతిజ్ఞను బూర్తిచేయలేవు. ఇతఁ డొకపాదముచే భూమిని, రెండవపాదముచే స్వర్గమును నాక్రమించి మూఁడవపాదమునకు భూమి నిమ్మని యడుగును. నీవెట్లీయఁ గలుగు

దును ? ఈయని-చో నీ ప్రతిన యెట్లు నెఱవేఱును ? నీవు చేసిన ప్రతిజ్ఞను నెఱవేర్చలేకపోవుటచే నీ కెవ్విధముచేతనైనను నరకము తప్పదు.అట్టి సమయమున నీ వీతనివరముదీర్చి కష్టముల పాలగుట యనుచితము.యాచకుల కోర్కు లీడేర్చుటవలన మహత్తరమైన కీర్తి సంభవించునని యందువేని వినుము. నీ వచనము సత్యమే.కానితన జీవనోపాధికి భంగము గల్గించుదానము ప్రశస్తమైనది కాదని పెద్దలందురు.లోకములో ముందుఁ దన జీవనోపాధిని స్థిరపఱుచుకొని పిమ్మట దానాదులను జేయవలెను. అప్పుడు చేసిన దానము, యజ్ఞము, తపస్సు మొదలగునవి ధర్మసమ్మతములు; కాని తన జీవనవృత్తిని నశింపఁజేసికొని చేసెడి దానాదు లట్లు కావు. విద్వాంసుఁడు తన విత్తమును, ధర్మమునకును, గీర్తికిని నర్థమునకును, దనభోగమునకును, దన కుమారాదులకును నైదువిధములుగాఁ బంచి యిహమందును బరమందును సుఖమునుగాంచును. కావున నీవు నట్లుచేయుటయే సముచితము. కాని కీర్తికని నీసర్వస్వము నితనికి దారవ్రాసి పిమ్మటఁ బలుబాధ లనుభవించుట యుక్తముకాదు. 'ఇచ్చెదనని ప్రతిజ్ఞచేసి యిప్పు డీయననుట యసత్యముకాదా ? అసత్యము పలుకుటకంటెఁ బాపమున్నదా ?' యని యందువేని సత్యమన నెట్టిదో యసత్యమన నెట్టిదో పూర్వమున బెద్దలు వ్యవస్థచేసిరి. దాని వివరించెదను, వినుము. మన పూర్వులు సామాన్యముగా చేసెదనని చెప్పినమాట పాటించుట సత్యమనియు,దానికి విరుద్ధమగునది యసత్యమనియు వ్యవస్థచేసి పిమ్మట దానికి విశేషవిహితముగా నిట్లు చెప్పిరి. వృక్షమునకుఁ బుష్పఫలము లెట్టివో దేహమునకు సత్యమట్టిది.వృక్షము జీవింపనిచో

బుప్పాదులుండవు. అట్లు దేహము లేనిచో సత్యము సంపాదించుట యసంభవము. దేహమున కసత్యము మొదలువంటిది. కావున నసత్యమాడియైన దేహమునునిలువఁబెట్టుట యవసరము. మూలము తెగినచో వృక్షము మెండును. పిమ్మటఁ బడిపోవును.సమయమువచ్చినప్పు డనృతమాడనిచో దేహము నిస్సంశయముగా నశించును. మఱియు నీవు సర్వస్వము నిచ్చెద ననుటకు సూచకముగాఁ బలికిన వచనమునకుఁ బరిపూర్ణముగా నిత్తునని యర్థముగాదు.ఏదో కొంచె మిచ్చెదనని యర్థమని మార్చితివేని యతని కీయఁగా మిగిలినదానిచే నీవు జీవింపఁగలవు.యాచకునకు సర్వస్వము నిచ్చెదనని చెప్పి పిమ్మట నిచ్చుటకు సమర్థుఁడు కానిచోఁ గొంచెమేయిచ్చి యతని సంతసింపఁజేయవలెను.అట్లు చేసినచోఁ దనప్రతిజ్ఞపూర్ణ మైనట్లె చెప్పవచ్చును. యాచకుఁడు తన్నడిగినప్పుడు కలవాఁడయ్యు నేమియు లేదనిచెప్పుట యసత్య మని పించుకొనును గాని యిది యట్టిదికాదు.తనకుండియు లేదనువాఁడే దుఃఖార్తియు జీవన్మృతుండునగును.కాని తన దేహరక్షణముకై ప్రతిజ్ఞాతన స్తున్నులోఁ గొంత మిగుల్చుకొన్నవాఁడు కాఁడు.స్త్రీలను బ్రోత్సాహించి వశీకారము చేసికొనుటయందును, బరిహాసములందును, వివాహములందును, జీవనోపాధి నిల్పుకొనుటయందును, బ్రాణాపాయము తటస్థించినప్పుడును, గోబ్రాహ్మణుల నిమిత్తమును, హింసయందును, నసత్యమాడినను నది నింద్యమనిపించుకొనదు. కావున నీ జీవికవిషయమై నీ వసత్యముపలికినను దప్పులేదు, అట్లుచేయుము " అనెను. ఇది పందొమ్మిదవ యధ్యాయము.

బలి దానమును దప్పక యిత్తునని శుక్రునకుఁ జెప్పుట.

అని యిట్లు శుక్రుఁడుపలుకఁగా యజమానుఁ డయినబలి విని యోజించుచుఁ గొంచెముసే పూరకుండి సావధానమనస్కుఁడై గురువునుగాంచి యిట్లనియె. "ఓ గురువర్యా! నీవు పలికినదంతయు సత్యము. అగ్థమునకును, గామమునకును, గీర్తికిని, వృత్తికిని బర స్పరము బాధ గలుగకుండఁ బ్రవర్తించుట గృహస్థులకు ముఖ్య ధర్మము. కాని ప్రహ్లాదవంశమునఁ బొడమిన నేను ధనాశకు లోనయి "తప్పక యిచ్చెదనని ప్రతిజ్ఞ చేసి యిప్పు డీ ద్విజుని నిరాకరించి యెట్లు నీచవర్తనుఁడనగుదును? ఆలోచింప నసత్యము కంటె నెక్కుడగు నధర్మము వేఱొకటిలేదు. మేరువు మొదలగు మహాపర్వతములను, నిధులను, సముద్రములను, వేయేల? సకలమును సులభముగా జయింపఁగలుగుదును. కాని యసత్యమాడువాని నొక్కనిమాత్రము భరింపలే"నని భూదేవియే స్వయముగాఁ బలికినదట! నే నసత్యమును బలికి యధముఁడనుగాలేను. ఇంతేకాదు. నేను నరకమునకు భయపడను. బీదతనమునకు జంకను. దుఃఖమునకు వెనుకదీయను. రాజ్యభ్రష్టుఁడ నగుటకు విచారింపను. చావునకు భీతిల్లను. కాని యీ బ్రాహ్మణునివంచించుటకు భయపడుదును. ఈలోకమునఁ జేసిన భూదానాదులు చచ్చినపిమ్మటఁ దత్కర్తను విడిచినచో నట్టి దానాదులతో నేమి ప్రయోజనము? ఆ చేసినదానము విప్రుని సంతసింపఁజేయఁజాలనిచో నదికేవలము వ్యర్థమేకదా! గురువరా! దధీచి, శిబి మొదలగువారు భూతములకు హితమొనర్పఁదలంచి విడువఁ దరము కాని ప్రాణములనే యర్పించియుండఁగా నీ ధనరాజ్యాదు లేపాటివి? ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! యుద్ధమున నెదురులేనివారును, నా

ప్రపితామహాదులు నగుదై త్యేంద్ర లీభూమిని నిరాటంకముగాఁ బాలించిరి. కాలము వాదిభోగములను హరింపఁగలిగెను గాని వారి కీర్తులను నశింపఁజేయలేకపోయెను.సమరమున దేహమును విడిచినవారు వెక్కురుకలరు. కాని సత్పాత్రమందు శ్రద్ధతో సర్వధనమును వినియోగించినవా రెవ్వరు నిదివఱకు లేరు.కావున నట్టి ఘనకార్యమునే దప్పకయాచరించెదను.యాచకుల కోర్కులను బూరించుటవలన దుఃఖములు సంభవించునని యందువేని వివేకవంతుఁడును దయాళుఁడునగువానికే యవి శుభదాయకము లగుననవలసినప్పుడు మీవంటి బ్రహ్మవిదుల కట్లగునని వేఱ చెప్పనలయునా! కావున నీ విప్రబాలుని కోర్కి దీర్చెదను. ఓ గురువరా ! ఈ వచ్చినవాఁడు నా శత్రువగు విష్ణువు కాని సామాన్యపు బ్రహ్మచారి కాఁడని యంటివి. అట్లు విష్ణువే యాచకుఁడై నాదగ్గఱకువచ్చినచో నాయదృష్టము కొనియాడఁదగినదని చెప్పవచ్చును. యాగాదుల నొనర్ప మ్రుకిలి నేర్పుగలమీవంటి మహాత్ములభిక మగునాదరముతో నెవనిఁగూర్చి యాగములను క్రతువులను జేయుచున్నారో యా విష్ణువు వటువేషమును దాల్చి నా కిప్పుడు ప్రత్యక్షమయ్యె.ఇతఁడు నాకు వరదుఁ డయినను సరియె; శత్రువయిననుసరియె; ఇతఁడు కోరినభూమిని దప్పక యొసంగెదను. ఓ ముసీంద్రా ! మూఁడవయడుగునకుఁ జోటొసంగక పోవుటచే నన్నితఁడు బంధించుననిచెప్పితిరి. నాకుఁగలసమస్తము నొసంగి నిరపరాధుఁడనై యున్న నన్నీతఁ డన్యాయముగా బంధించినను బ్రాహ్మణవేషధారి యగునితని నేనెంతమాత్రమును హింసింపను. నే నిందులకు భయపడను. ఈ విష్ణువు పవిత్రమగు కీర్తి గలవాఁడైనచో నా సర్వస్వమును బుచ్చుకొని నను బంధించి

తన కీర్తిని నశింపఁజేసికొనక నాతోఁ యుద్ధమొనరించి నన్నుఁజంపి యీ భూమిని దీసికొనుట యుక్తము. నన్నుఁ జంపశక్తి లేనిచో నాచేఁ జచ్చినను మంచిదే."అని యిట్లు దానముచేయ నిశ్చయించుకొని తన వాక్యమును శ్రద్ధతో వినక తిరస్కరించెనన్న కోపముచే శుక్రుఁడు దైవచోదితుఁడై సత్యసంధుఁడును, ధైర్యవంతుఁడును నగుబలి నిట్లుశపించెను." ఓ దైత్యేంద్రా ! నీవు పండితాభిమానముకలవాఁడవు. కాని వాస్తవముగా బుద్ధిహీనుఁడవు. నాయుపదేశమును వినక నీసర్వస్వము నశించుటకు సిద్ధముగానున్నను దెలిసికొని రక్షింపఁ బూనుపడనివాఁడవు. నాశాసనము నతిక్రమించి వర్తించుచున్నావు. కాన నీకు శీఘ్రకాలములోనే త్రిలోకాధిపత్యము నీకు లేకుండఁబోవుఁగాక."అని యట్లు శుక్రుఁడు శపించినను బలి యెంతమాత్రమును జంకక సత్యమునుండి తొలఁగక దృఢసంకల్పుఁడై వామనునిఁ బూజించి భూమిని ధారపోయ నిశ్చయించె. ఆసమయమున బలి భార్యయగు వింధ్యావళి ముత్యములహారములు మొదలగు నాభరణములను దాల్చి జలములతో నిండియున్న యొక బంగారుపాత్రను దీసికొని వచ్చెను. అప్పుడు తనభార్య జలమును బోయుచుండఁగా బలి సంతసముతో భగవంతుఁడగువామనుని పాదములు గడిగి జగత్పావనములగు నా యుదకములను శిరసావహించెను.ఇట్లుండ తెన్నిచెప్పినను వినక ధైర్యము వూని దానముచేసిన బలిసాహసమున కచ్చెరువంది దేవతలును, గంధర్వులును, విద్యాధరులును, సిద్ధులును, చారణులును నాకసముననుండి సంతసముతో బలిపైఁ బుష్పవర్షమును గురియించిరి. వేలకొలఁది దుందుభులను మ్రోయించిరి. గంధర్వులుఁ గింపురుషులుఁ గిన్నరులును,

"బలి యితఁగులకు దుష్కరమగుదానిని జేసెను. ఇతఁడు మిక్కిలి తన పలికినవాక్యమును దప్పకుండ విష్ణువునకు ముల్లోకముల నొసంగెను." అని నుతింపఁజొచ్చిరి. ఇట్లందఱును బలినినుతించుచుండ వామనుఁడు "నీవాంఛితమును స్వీకరింపు" మని పలికిన బలివాక్యమును మన్నించి భూమిని, నాకాశమును, దిక్కులను, స్వర్గమును, భూతాళాదులను, సముద్రములను, బశుపక్ష్యాదులను, నరులను, దేవతలను, మునులను, నాక్రమించునంత పెద్దదిగాఁ దన శరీరమును బెంచెను. అప్పుడు బలి ఋత్విక్కులతోను, నాచార్యునితోను, సభ్యులతోను, మహావిభూతి యగువామనుని శరీరమునందు గుణత్రయాత్మకమగు సకలప్రపంచమును గాంచెను. అందుఁ బాదతలములందు రసాతలమును, బాదములందు భూమిని, నతని పిక్కలందుఁ బర్వతములను, మోకాళ్లయందుఁ బక్షులను, దొడలందు వాయుగణములను, వస్త్రమందు, సంధ్యలను, గుహ్యమందుఁ బ్రజాపతులను, జఘనమందుఁ దాను ప్రధానుఁడుగాఁ గల రాక్షసగణములను, బొక్కిటియం దంతరిక్షమును, గుక్షియందు సప్తసముద్రములను, వక్షస్థలమందు నక్షత్రపంక్తులను, హృదయమున ధర్మరాజును, స్తనములందు సత్యమునర్థసత్యమును, మనస్సునందుఁ జంద్రుని, బ్రూమ్మసంధుఁ బద్మహస్తయగులక్ష్మిని, గంఠమున సామవేదము మొదలగు శబ్దములను, భుజములందు దేవేంద్రుఁడు మొదలగు సురలను, గర్ణములందు దిక్కులను, శిరస్సునందు దివిని, గేశములందు మేఘములను, నాసికయందు వాయువును, నేత్రములందు సూర్యుని, ముఖమం దగ్నిని, వాక్కునందు వేదమును, నాలుకయందు వరుణుని, గనుబొమలందు విధి నిషేధశాస్త్రములను, గనుఱెప్పలందు



1474. త్రివిక్రమావతారము.

శేయుంబవళ్లను, నుదుటియందుఁ గోపమును, గ్రిందివెదవియందు లోభమును,ద్వగింద్రియమునఁ గామిని, రేతిస్సున జలమును, బృష్ఠభాగమున నధర్మమును, బాదన్యాసములందు యజ్ఞములను, నీడయందు మృత్యువును, నన్వ్వనందు మాయను, రోమములం దోషధులను, నాడులందు నదులను, గోళ్లయందు శిలలను, బుద్ధియందు బ్రహ్మను, నింద్రియములందు ఋషిగణములను, దేవగణములను, శరీరమందుఁ జరాచరాత్మక మగుప్రపంచమును, వేఱువేఱుగాఁ బరికించిచూచెను. ఇట్లు చరాచరభువనము నా భగవంతునందుఁగాంచి దైత్యులందఱును దుఃఖించిరి. అంతట సుదర్శనమనుపేరు గలచక్రమును, దుస్సహ మగుకాంతితోను మేఘగర్జనమువంటి ధ్వనితోను వెలయుచున్న శార్ఙ్గమను చాపమును, జలదమువలె ఘోషించు పాంచజన్య మనెడిశంఖమును మిక్కిలి బలముగల కౌమోదకియనుగదయు,విద్యాధరమనియు, నందకమనియు, నామము గల ఖడ్గమును, జంద్రునివంటి యాకారము గలడాలును దఱుఁగని బాణపుంజములు గలయమ్ములపొదులును, సునందుఁడు మొదలగు పార్షదులును, లోకపాలురును, భగవంతుని సమీపించి తమతమస్థానముల నిలిచిరి. ప్రకాశించు కిరీటముచేతను,నంగదములచేతను, మకరకుండలములచేతను, శ్రీవత్సముచేతను, కౌస్తుభముచేతను, బంగారుమొలత్రాటిచేతను, బచ్చనిపట్టువస్త్రముచేతను, దుమ్మెదగుంపుగల వనమాలచేతను, ద్విపక్రమరూపుఁ డయినభగవంతుఁడు మిక్కిలి ప్రకాశించెను. పిమ్మటఁ బరమేశ్వరుఁ డొకపాదముచే బలిచక్రవర్తి భూప్రదేశమును, శరీరముచే నాకాశమును, బాహువులచే దిక్కులను, రెండవ పదముచే స్వర్గలోకమును, నాక్రమిం

చెను. మూఁడవపాదమున కా బలి సంబంధి యగుభూమి యణు మాత్రమైనను లేదు. ఆభగవంతుని రెండవపాదము స్వర్గలోకము కంటె మీఁదుగానున్న మహర్లోకమును, జనలోకమును తపో లోకమును సత్యలోకమును గూడ నాక్రమించియుండఁగా బలి చక్రవర్తి కిఁక స్థల మెట్లు మిగిలియుండును? ఇది యిట్లువదవ యధ్యాయము.

త్రివిక్రముఁడు బలిసంబంధించుట ఎదిరించిన బలి యనుచరులను విష్ణు భృత్యులు తఱుముట.

ఓ రాజేంద్రా! సత్యలోకమును బొందిన త్రివిక్రముని పాద మునుజూచి దాని గోటికాంతులచేఁ దిరస్కృత మగుదేహచ్ఛా యగల బ్రహ్మ యాదరయుక్తుఁడై పూజించెను. అనంతరము మరీచి మొదలగు బ్రహ్మర్షులును, బ్రహ్మనిష్ఠులైన సనకాది యోగులును భక్తియుతులై యా త్రివిక్రమదేవ్రపాదము నర్చించిరి. ఇంతేకాదు. వేదములు, ఉపవేదములు, మీమాంస, న్యాయము, ఇతిహాసములు, పురాణములు, వేదాంగములగు వ్యాకరణాదులు, పంచరాత్రాదులు మొదలగువాని యభిమాని దేవతలును, యోగమనెడి వాయువుచే మండుచున్న జ్ఞానాగ్నిచే గర్మజాలమును భస్మము గావించుకొన్నవారును, పరమేశ్వరుని పాదముల ధ్యానించుటవలనఁ గర్మాధీనముగాని సత్యలోకమును బొంది యందు నివసించియున్న తక్కినవారు నా త్రివిక్రముని పాదమునకు నమస్కరించిరి. అంత విమలకీర్తి యగు బ్రహ్మ తన జన్మమునకుఁ గారణమైన విష్ణుపాదము తనలోకముదాఁక వచ్చి యుండుట కానందించి యర్ఘ్యపాద్యాదులచేఁ బూజించి భక్తి

యుతుఁడై నుతించెను. ఓ నరేంద్రా! అప్పుడు బ్రహ్మ తన కమండలు జలముచేఁ ద్రివిక్రముని చరణమును గడుగఁగా నా యుదకమా పాదస్పర్శమునఁ బవిత్రమై గంగానదియయ్యెను. అది భగవంతుని ర్తివలె నిర్మలమై ధ్రువమండలమునఁబడి పిమ్మటఁ గ్రిందికిఁ బ్రవహించుచు లోకత్రయమును బవిత్రీకరించుచున్నది. అనంతరము భగవంతుఁడు తన మహాకాయమును దగ్గించి తొంటిరూపును బొందియుండఁగా లోకపాలురతోఁగూడ బ్రహ్మదు లతని సమీపించి, జలమును, బరిమళించుచున్న పూజాద్రవ్యమును, బుష్పమాలలను, దివ్యచందనమును, ధూపమును, దీపమును, లాజలను, అక్షతలను, ఫలములను, సమర్పించిరి. కొంద ఱతని నుతించిరి. కొంద ఱతని శౌర్యాతిశయమును సూచించుచు జయశబ్దములను బలికిరి. కొంద ఱాడిరి. కొందఱు మృదంగాదులను మేళగించి పాడిరి. కొందఱు శంఖములను బూరించిరి. కొందఱు దుందుభులను మ్రోయించిరి. భల్లూకములకుఁ బ్రభువయినజాంబవంతుఁడు త్వరగావచ్చి భేరిని మ్రోయించుచు భగవంతుని విజయము నన్నిదిక్కులందును జాటెను. అంతట దైత్యులు మూఁడడుగులని మిషచేఁ గృత్రిమమున సమస్త భూమి హరింపఁబడుటఁజూచి విచారించి తమలోఁ దా మిట్లను కొనిరి " ఓ మిత్రులారా! ఈ వామనుఁడు బ్రాహ్మణుఁడు కాఁడు. మాయావి యైనవిష్ణువు; దేవతల కార్యమును నెఱవేర్చుట కీరూపమున వచ్చియున్నాఁడు. వీఁడు బ్రహ్మచారియై యాచకుఁడై యీ యజ్ఞశాలకు వచ్చి కపటముచే మన ప్రభువు సర్వసంపదలను వశము గావించుకొనెను. మన ప్రభువు సతతము సత్యసంధుఁ డగుటచేతను విశేషించి యజ్ఞదీక్షితుఁ

డగుటచేతను, బ్రాహ్మణభక్తి గలవాఁడగుటచేతను దయావంతుఁ డగుటచేతను, నసత్యమును భాషింపలేకపోయెను. ఇట్టి సత్యవంతుఁడైన మనభర్తయెడ వీఁడు కపటియై వర్తించెను. కావున వీని నిప్పుడు వధించుటయే యుత్తమకార్యము. అదియే మన ప్రభునకు మనము చేయవలసినపని" అని కూడఁ బలికికొని బలి యనుచరు లగురక్కసులు, శూలములు పట్టిస ములు మొదలగు నాయుధములఁదాల్చి కోపమున మండిపడుచుఁ. దమప్రభువు నానతినొందకయే వామనునిఁ జంపఁ బరువెత్తిరి. అట్లు యుద్ధమునకు వచ్చు చున్నదైత్యులను గాంచి సునందాదు లగు విష్ణుపార్షదులు త్వరగాఁ యుద్ధసాధనముల ధరించి యడ్డుగాఁ బోయి కేలిచేయుచు వారిని వారించిరి. అంత లోఁ నూరకుండక నందుఁడును, సునందుఁడును జయ విజ యులును, బ్రబలుఁడును, నుద్బలుఁడును, గుముదుఁడును, గుము దాక్షుఁడును, విష్వక్సేనుఁడును,గరుత్మంతుఁడును,జయంతుఁడును, శ్రుతదేవుఁడును, బుష్పదంతుఁడును, సాత్వతుఁడును మొదలగు వారందఱును బదివేలయేనుఁగుల బలముతో నొప్పారుచున్న దైత్యసైనికులను గొట్టి తఱిమివేసిరి. విష్ణుపార్షదులచేఁ జంపఁ బడుచున్న దైత్యసైన్యములను జూచి బలి తనగురు వగుశుక్రుని శాపమును స్మరించుకొని యది యుద్ధమునకుఁ దగిన సమయము కాదని నిశ్చయించి, కోపాగ్నిచే మిక్కిలి రగులుచున్న తన వీరుల కిట్లనియె. "ఓ విప్రచిత్తీ! ఓ రాహూ! ఓ హేతీ! నా వచన ము వినుఁడు. యుద్ధమునుండి మరలుఁడు. మన కిప్పుడు కాల మనుకూలముగా లేదు. ఓ దైత్యులారా! కాలరూపుఁడైనభగవం తుఁడు సర్వభూతములకు నధిపతి. ఆ ప్రభువు దుఃఖము గల్గింప

సమకట్టియుండఁగా సుఖము నిమిత్తము పురుషుఁ డెంత ప్రయత్నించి పౌరుషము చూపినను వ్యర్థమేకాని ఫలములేదు. ఆలో చింపఁ గాలమునకు వశులయిన పురుషుల పరాక్రమాదు లెట్లు ఫలవంతములగును ? ఆకాలము నెవరు దాఁటఁగలరు ? పూర్వము మనకు సుఖముగల్గించి దేవతలకు దుఃఖ మొసంగిన భగవంతుఁడిపుడు మనకు దుఃఖమును దేవతలకు సుఖమునుగల్గింప నిశ్చయించియున్నాఁడు. కాపున మీరప్రుఁడు బలముచేతఁగాని, బుద్ధిచేఁగాని, మంత్రాలోచనములచేఁ గాని, యూపధాములచేఁగాని, సామాదు లగునుపాయములచేఁగాని కాలరూపుఁ డయిన భగవంతుని నతిక్రమింప సమర్థుఁడు కానేరఁడు. పూర్వము దైవానుకూలురయిన మీచే నీయిం ద్రాదు లనేకపర్యాయములు సులభముగా జయింపఁబడిరి. అట్టివా రిప్పుడు యుద్ధమున మిమ్ము జయించి సింహానాదమును జేయుచున్నారు. కాలము మనకనుకూలముగా నుండినప్పుడు వీరలను జయింపవచ్చును. మీ రిపుడు యుద్ధముచేయక యీ కాలమునకు వేచియుండుఁడు" అని యిట్లుపదేశించుచున్న తమ ప్రభువు వచనములు విని దైత్యవీరులును, దానవ వీరులును, మూఁకుమూఁటలుకగ విష్ణుసైనికుల దెబ్బలకుఁ దాళఁజాలక పాతాళమును బ్రవేశించిరి. అంతగగుత్మంతుఁడు భగవంతుని యభిప్రాయమును గ్రహించి వచ్చి వారుణపాశములచే బలిని బంధించెను. సర్వశక్తి యగువిష్ణుప్రభావమునకు సకలదిక్కులందును, భూమియందును, నాకాశమందును, హాహాకారములు విశేషముగాఁ బ్రబలినవి. అనంతరము వారుణపాశములచే బద్ధుఁడైనను, సకల సంపదలను గోల్పోయినను, ధైర్యమును వివేకమును విడువక మహాయశుఁడై

పొల్చు చున్నబలిని గాంచి వామనుఁ డిట్లనియె. "ఓ రాక్షసేం
ద్రా! నీవు నాకు మూఁడడుగుల భూమి నిచ్చెద నంటివి. నీచేఁ బరి
పాలితమగు భూమియంతయు రెండడుగులకే సరిపోయినది.
మూఁడవయడుగు భూమి నా కీవలసియున్నది. ఇమ్ము. సూర్య
కిరణము లెంతదూరము ప్రసరించునో, చంద్రుఁడు నక్షత్రము
లతోఁ గూడ నెంతదూరము కానవచ్చుచున్నాఁడో, పర్జన్యుఁ
డును వహ్నియు నెంతదూరముదనుక వ్యాపించియున్నారో,
యంతవఱకే కదా నీ భూమి? ఈ భూలోకమంతయు నొక
యడుగుతోఁ గొల్చితిని. దిక్కులును గగనమును నా శరీరముచే
నాక్రమింపఁబడినవి. నీవు చూచుచుండఁగనే రెండవ యడుగుచే
స్వర్గలోకమును గొల్చితిని. ఎట్లాలోచించినను మూఁడవయడుగు
నకుఁ జోటులేదు. ఇచ్చెదనని ప్రతిజ్ఞచేసి యీయనివానికి నరక
నివాసము తప్పదు. నీ గురువగు శుక్రాచార్యునిచేఁగూడ నది
యామోదింపఁబడినది. కావున నీవిక నరకమునుబ్రవేశింపుము.
యాచకుని కిచ్చెద నన్నదాని నీయఁజాలనిచో నాపురుషుని
మనోరథము తఱుచుగా వ్యర్థమైనది. వానికి స్వర్గమెప్పుడును
లభింపదు. ఆధోలోకమునఁ బడవలసినదే.మఱియు నీవు నాకిచ్చె
దనని ప్రతిజ్ఞచేసి యీయఁజాలక నన్ను వంచించితివి. ఇట్లగు
టచే నీ వసత్యమాడితివి.అందులకు ఫలముగా నరకమును గొన్ని
సంవత్సరము లనుభవింపుము" అనెను. ఇది యిఱువదొకటవ
యధ్యాయము.



{బలి మూఁడవ యడుగునకుఁ దనశిరస్సును జూపుట; ప్రహ్లాదులు బలిని రక్షింపుమని త్రివిక్రముని వేఁడఁగా నద్దేవుఁడు బలిని సుతలమున కధిపతిగాఁ జేయుట.}

ఇట్లు భగవంతుఁడు నిందించుచున్నను, మనస్సును జలింపఁ జేయుచున్నను బలి నుంతేనియుఁ జలింపక జంకక వామనునిఁ గాంచి గంభీరవచనములతో నిట్లనియె. "ఓ పరమపురుషా ! నా పలికినవచన మెప్పుడు ననృతముగాదు. నా వచనమును సత్యముగానే కావించెదను.నిన్ను వంచించుటకు నేనట్లనలేదు.మూఁడవయడుగు నా శిరంబుననుంపుము. ఓ ద్విజబాలకా ! నరకమునకు భయపడను; రాజ్యముపోవుటకు విచారింపను; వారుణపాశములతోఁ గట్టినందులకు వగవను; గొప్పయపాయమునకు జంకను; ధన వ్యయమునకు వెనుకదీయను; నీతోఁ విరోధము సంభవించినదని భీతిల్లను;కాని యసత్యమాడుటకు భయపడుదును. తల్లిదండ్రులుగాని సోదరుఁడుగాని మిత్రుఁడుగాని చేయని దండనమును యోగ్యతముఁడగు వేత్రొకపురుషుఁడు చేసినచోఁ బురుషుల కది విచారకరముగాక కీర్తికరమగునని నామతము. ఓ మహాత్మా ! శౌర్యము, వీర్యము, ధనసంపదలు మొదలగువాని వలన జనించిన గర్వముచే నంధులమై యుండిన మా గర్వమును దొలఁగించి కన్నుల నొసంగితివి. ఇట్టి హితమును గల్గించుటచే నీవు మాకు గురువవు. పూర్వము వెక్కుఱు దైత్యులు నీతోనుగ్రవిరోధమును బూని కేవలము యోగీశ్వరులు వొందెడు నుత్తమపదమును జెందిరి. నేను వారివలెఁగాక విచిత్రచేష్టితములు గలనీచే నిగ్రహింపఁబడి వారుణపాశములచే బద్ధుఁడనైనను లజ్జింపను; దుఃఖింపను; నీతోడి విరోధమును, నీవు చేసిన

బంధనమును నాకు విస్తార మగుకీర్తిని గల్గించుచుండ విచారిం పవలసిన పని యేమి? ఓ మహాత్మా! నా తాత యగుప్రహ్లాదుఁడు నీ భక్తులలో సుత్తముఁడని వాసిగాంచెను. అతఁడు తన తండ్రి యగు హిరణ్యకశిపునిచే నిరంతరము బాధితుఁడయ్యు సుంతే నియు జంకక నిన్నే యన్నివిధములఁ జుట్టమునుగా భావించుకొనెను. మఱియుఁ బ్రహ్లాదుఁడు తనలో "సంత్యక్తాలమున నాత్మను విడుచుచున్న యీదేహము రణశీలుఁడయిన మానవున కేమి పురుషార్థము సంపాదించును? ఈ దాయాదులతో నేమి ఫలము? దొంగలవంటి యీ స్వజనులతో నేమిపని? సంసారమునకు హేతుభూత యయినభార్య యేమిపురుషార్థమిచ్చును? ఈ మందిరము లెందులకుఁ బనికివచ్చును? ఆయువును నశింపఁజేయుటకుఁ దప్ప, నీ వెందులకును బనికిరావు" అని నిశ్చయించి యపరిమిత జ్ఞానమును సంపాదించి భక్తశ్రేష్ఠుఁడై సంసారమునకు భయ మందుచుఁ దనదైత్యకులమునునశింపఁజేయుచున్నను నిన్నే నమ్ము కొని సంసారాది భయముల నివర్తించునదియుఁ బురుషార్థరూప ము నగు నీపాదపద్మముల శరణు పొందెను. అట్లు నేనును నీవ వశమువలన రాజ్యలక్ష్మిని గోల్పోయి నాకు శత్రువగు నీపాద పద్మముల సన్నిధిని జేరితిని. దేనివలనఁబురుషుఁడు మోహితుఁడై జ్ఞానమును బోఁగొట్టికొని యమని సన్నిధిని బొందియు జీవితము చంచలమైనదని తెలియఁజాలఁడో యా రాజ్యలక్ష్మి నన్నువిడిచి పోయినందులకు మిగుల నానందించుచుంటిని" అని యిట్లు బలి పలుకుచుండఁగా భగవద్భక్తుఁడగుప్రహ్లాదుఁడు పున్నమచం దురునివలెఁ దన కాంతుల వ్యాపింపఁజేయుచు నచ్చటికి వచ్చెఁ. కాంతిచే విరాజితుఁడై పద్మదళములను బోలినకన్నులు గల

వాఁడై నిర్మలమగు నల్లని దేహచ్ఛాయతోను, దీర్ఘములగు బాహువులతోను, సుందర మగునాకారముతోను బొల్చుచు వచ్చియున్న ప్రహ్లాదునిఁగాంచి బలి సిగ్గున మొగమువంచికొని బాష్పపూరితము లగుకన్నులు గలవాఁడై వారుణపాశములచే బద్ధుఁడగుటంజేసి వెనుకటివలెఁ బూజాదుల నర్పింపనేరక శిరస్సు వంచి నమస్కరించెను. అంతఁ బ్రహ్లాదుఁడు భాగవతుల కధిప పతియై సునందాదు లగుపార్షదులచే సేవితుఁడై యున్న వామను నిఁ గాంచి శరీరము పులకలచేతను, గన్నులానందబాష్పములచే తను నిండుచుండ సమీపించి దండప్రణామము లాచరించి యిట్లనియె. "ఓ పరమపురుషా! ఈ బలి విశ్వజిద్యాగముచే నిన్నుఁ బూజింప నానందించి నీవే యితనికింద్రపదవి నొసంగితివి. దానిని నీవు మరలఁ బుచ్చుకొంటివి. పురుషులను మోహబద్ధులనుగాఁ జేయఁజాలిన యీ సంపదలనుండి యితనిఁ దొలఁగించుట మిక్కిలి యుచితకృత్యము. ఆలోచింప విద్వాంసుఁడైనను సంపదలవలన మోహితుఁడై యాత్మస్వరూపము మఱచి చెడును. ఓ నారాయణా! ఇతని సంపద్విహీనునిఁగాఁ జేయుట యితని ననుగ్రహించుటయే కాని వేఱుగాదు. ఇట్టి యుపకర్తను, జగదీశ్వరుఁడవును, సర్వజ్ఞుఁడవును నగు నీకు నమస్కారములు" అని యిట్లు దోసిలిగట్టి ప్రహ్లాదుఁడు భక్తియుతుఁడై పలుకుచుండ బ్రహ్మ మెల్లమెల్లన సమీపించి వామనునితో నేదియో చెప్పనుద్యుక్తుఁడయ్యెను. అంత బలి ధర్మపత్ని యగువింధ్యావళి పాశబద్ధుఁడైన తన భర్తనుజూచి మిక్కిలి భయమొంది దోసిలిగట్టి కన్నీటిని స్రవింపఁజేయుచు వామనమూర్తి కిట్లనియె. "ఓ పరమాత్మా! నీవీ విశ్వమునంతటిని గ్రీడార్థము సృజించుకొంటివి. నీవాడికో

నుటకు సాధనభూత మగునీ జగమందుఁ గొందఱు మందబుద్ధు లు తాము ప్రభువులని యభిమానము వహించుచుందురు. వారు లజ్జాహీనులై "మేము స్వతంత్రుల మనియు వాదించుచుం దురు. అంతియకాని వారికి స్వాధీన మగువస్తు వొక్కటియై నను లేదు. ఇట్టివారు, జగమును సృజించువాఁడవును, బాలించు వాఁడవును, సంహరించువాఁడవును నగు నీకేమి సమర్పింపఁ గలుగుదురు? ఇట్లుండ 'లోకత్రయము నిచ్చితిని. మూఁడవపాద మునకు నా దేహము నర్పించి నా వాక్యమును సత్యము గావించు కొందు' నని నా భర్త లోకత్రయము తన దేహము తన కధీన మైయున్నట్లు వచించెను. అది తెలివిమాలిన పని. ఇతఁడు మంద బుద్ధి యగుటచే నట్లు పలికెను. కావున క్షమించి యితనిఁ బాశవి ముక్తునిఁ జేయు"మని ప్రార్థించెను. అంత బ్రహ్మ వామనునిఁజూచి "ఓ జగత్కర్తా! నీవు సమస్తభూతములకు నంతరాత్మవై పాలిం చువాఁడవు. నీవు సృష్టిసంహారములను జేయు నాకును రుద్రున కును గూడ దేవుఁడవు. ఓ జగన్మయా! నీ వీ బలి సర్వస్వమును దీసికొంటివి. ఇఁక నితని విడువుము. ఇతఁడు దండనార్హుఁడు కాఁడు. ఈ యుదారుఁడు సమస్త భూమండలమును, దన విక్ర మముచే సంపాదింపఁబడిన యింద్రాదిలోకములను దన దేహ మును నిశ్చల మనస్సుతో నీ కర్పించెను. తనకున్న సమస్తమును నీ కధీనముగావించిన యీ బలి దండనార్హుఁ డెట్లగును? ఇంతియ కాదు. లోకములోఁ బురుషుఁడు నిశ్చలబుద్ధియై సలిలముచేతను దూర్వాంకురములచేతను నిన్నుఁ బూజించి యుత్తమగతిని జెందుచుండఁగా స్థిరబుద్ధితో, ముల్లోకములను గూడ నీ కర్పిం చిన యీబలి యుత్తమపదవిని బొందుటకు మాఱుగా దండనము

నొంద నెట్లగ్గుడగును ? కావున నీకు నితనిఁ బాశవిముక్తునిఁ జేయుము." అని పల్కిన బ్రహ్మకు నారాయణుఁ డిట్లనియె. "ఓ కమలాసనా ! నే నెవరి ననుగ్రహింపఁ దలంతునో వాని సంపదలను ముందుగా నపహరింతును. అట్లు చేయనిచో ధన మద ము పురుషుని వివేకరహితునిఁగాఁ జేయుటచే వాఁడు లోకమును నన్నును దిరస్కరించును. అట్లు తిరస్కరించుటచేతను నితరము లగుకర్మములచేతను నీలోకమున నానాయోనులందును బుట్టుచు, జీవుఁడు కర్మాధీనుఁడై యొకానొక సుకృతవిశేషమువలనఁ బురు షుఁడై పుట్టును. జన్మముచేఁగాని, కర్మముచేఁగాని, ప్రాయముచేఁ గాని సౌందర్యముచేఁగాని, విద్యచేఁగాని, యైశ్వర్యముచేఁగాని, ధనాదులచేఁగాని గర్వమెవనికిఁ గల్గదో యట్లు కలుగకపోవుట నా యనుగ్రహముచేతనే యని తెలిసికొనుము. అట్లయిన ధ్రువా దుల కైశ్వర్య మేలయిచ్చితివియని యందువేని చెప్పెదను వినుము. గర్వమునకు, నవివేకమునకు నిమిత్తము లగుజన్మాదులు సకల శ్రేయస్సులకును బ్రతికూలములైనను నా భక్తుఁడు వానియందెప్పు డును మోహముఁ జెందఁడు. కావునను నాభక్తులకైశ్వర్యమొసంగినను నది యనర్థకారికా నేరదు. ఈ బలి దైత్యులలోను, దానవులలోను శ్రేష్ఠుఁడు. ఇతఁడు మహాకీర్తిమంతుఁడు. ఇతఁడు దుర్జయ మగు నామాయను జయించెను. ఇతఁ డిట్టిసమయములందైనను మోహమును జెందఁడు, ఇతఁడు ధనమును గోల్పోయినను, రాజ్యభ్రష్టుఁడైనను, శత్రువులచే నిందితుఁడైనను, జ్ఞాతులచే విడువఁబడినను, నాపదను బొందినను, శుక్రునిచే శపింపఁబడినను దన మనోనిశ్చయమును వదలక సత్యవాక్యమును బరిపాలించెను. నేను నా మాయలచే ననేకవిధములఁ గలఁత పెట్టినను దన ధర్మ

మును విడువఁడాయెను.ఇట్టివాఁడు లోకమున వేఱొకఁడుండఁడు. ఇతనికి దేహావసానమున దేవతలకున్నైనను దుర్లభ మగునా లోక మును బొందును. ఈ జన్మమందుఁగూడ సావర్ణి మన్వంతర మున నా యనుగ్రహముచే నింద్రుఁడగును. అంతకాలము వఱకు నీవు విశ్వకర్మ నిర్మించిన సుతలలోకమున కధిపతివై పాలించుచుండుము. నాదయవలన నీకచ్చట మనఃపీడగాని, రోగముగాని, ప్రమాదముగాని, శీతోష్ణాదులవలన సంభవించు తిరస్కారముగాని యుపద్రవముగాని యెంత మాత్రమును సంభవింపవు" అని యిట్లు బ్రహ్మతోఁ బలికి బలిఁజూచి "ఓ దైత్యేంద్రా! ఓ మహారాజా! నీకు శుభమగుఁగాక. నీవు నీదాయాదులతోఁగూడ సురలకు సైతము స్పృహింపఁదగిన సుతల మున కరుగుము. దానిఁ బాలించు నిన్ను నింద్రాది దేవతలైనను దిరస్కరింపఁజాలరు. తక్కినవారి సంగతి చెప్పనేల? దైత్యులఁదఱుము, నీ శాసనమును మన్నించి వర్తించుచుందురు. అట్లు వర్తింపనివారిని నాచక్రమే తప్పక చంపును. ఇంతియకాదు. నిన్నును,నీ యనుచరులను, నీభోగోపకరణములను సర్వదా సకలోపద్రవములనుండి సంరక్షించుచుందును. ఆ నీ లోకమున నే నెల్లప్పుడును నీద్వారమును రక్షించుచు నీకుఁ గానవచ్చుచుందును. అచ్చటి దైత్యుల సహవాసముచే నీకొకప్పుడసుర ధర్మములు సంభవించుచున్నను నాప్రభావమువలన నిన్నవి చెందక నశించును. ఇది యిరువదిరెండవయధ్యాయము.

ప్రహ్లాదునితో బలి సుతలమున కేగుట.

అని యిట్లు పరమపురుషుఁడు పలుకఁగా నిఖిల సజ్జనహితుఁడును, మహానుభావుఁడును నగుబలి చేతులుజోడించి కన్నుల నుండి యానందబాష్పములు స్రవించుచుండఁగా భక్తియుతుఁడై గద్గదవాక్కులతో నా పరమేశ్వరుని కిట్లనియె. "ఓ మహాత్మా సత్త్వగుణ ప్రధానులగులోకపాలురు సైతము పూర్వ మెప్పుడును బొందని నీయనుగ్రహము నీచరాక్షసుఁడనగు నాయందుంచి తివి. ఆలోచింప నీకొనర్చిన నమస్కారము నీభక్తుల కోర్కులను దీర్ప సమర్థమైనదని నిశ్చయముగాఁ జెప్పవచ్చు" నని పలికి బలి హరికి నమస్కరించి బ్రహ్మకు మ్రొక్కి పాశములవలన విముక్తుఁడై సంతుష్టుఁడై తన యనుచరులతోఁగూడ సుతలమును బ్రవేశించెను. ఓ పరీక్షిన్నరేంద్రా! ఇట్లు భగవంతుఁడు వామన రూపమునొంది బలివలన స్వర్గలోకమును బుచ్చుకొని యింద్రున కిచ్చి యతనిచే సకలజగంబు నేలించుచు నదితి కోర్కులను బూరించెను. అనంతరము ప్రహ్లాదుఁడు పరమపురుషు ననుగ్రహమును బొంది బంధవిముక్తుఁడై వంశవర్ధనుఁడై నతన మనుమనిఁజూచి సంతుష్టుఁడై భక్తి పరవశుఁడగుచు విష్ణువున కిట్లనియె. "ఓ జగదీశా! నీవు మాయెడఁ జూపిన యనుగ్రహమును బ్రహ్మగాని లక్ష్మిగాని శంకరుఁడుకాని పొందియుండలేదు. తక్కిన యింద్రాదులసంగతి చెప్పనేల? క్రూరస్వభావము గలవార మైనను మమ్మును దుఃఖములనుండి కాపాడు చున్ననీ యనుగ్రహము నెంతయు వర్ణింపఁ దగును. బ్రహ్మాదులతోఁ గూడి నుతింపఁ బడు నీవసురులమగు మమ్ము రక్షించుట కేవలము నీయనుగ్రహ

మువలన నేకాని వేఱుకాదు. ఓ శ్రేయస్కరా ! నీపాద పద్మము లందలి మకరందమును సేవించుటచేత బ్రహ్మాదులు సృష్ట్యాద్యధికారములఁ బొందియున్నారు. కుబుద్ధులమగు మేము నీపాదపద్మ పరాగమును సేవింపకపోయిన నీ కరుణాకటాక్షములకుఁ బాత్రులమగుచున్నాము. ఆలోచింప బ్రహ్మాదులకంటె మాయందే నీ కధికానుగ్రహ మున్నదిని చెప్పవచ్చునుగదా ! ఓదేవా ! నీ చేష్టితము కర్మాధీనుఁడగు ప్రాకృత జనునివంటిది కాదు. నీని గ్రహానుగ్రహములు మిక్కిలి చిత్రములుగా నుండును. అపరిమిత మగుసంకల్పజ్ఞానముచే సనాయాసముగా జగమును సృజించువాఁడవును, సృష్టికిఁబనికివచ్చు కల్యాణగుణములు గలవాఁడవును, సమస్తచిదచిత్తులకు నంతరాత్మవును, నందఱయందు సమబుద్ధిగలవాఁడవును నగునీవు భక్తప్రియుఁడవన్నంతమాత్రమున విషమదృష్టి గలవాఁడవు కావు. నీ స్వభావము కల్పతరువును బోలియున్నది. కల్పనృక్షమాశ్రయించినవారికిని, నాశ్రయింపనివారికిని సమముగానే కోర్కులను బూరించును. అట్లె నీవును జేయుచుందువు" అని యిట్లు పల్కిన ప్రహ్లాదునకు భగవంతుఁడిట్లనియె. "ఓతాతా ! ప్రహ్లాదా ! నీకు భద్రమగుఁగాక. నీవు సుతలమున కరుగుము. అచ్చట నీవు నీ పౌత్రుఁడగు బలితోఁగూడిన జ్ఞాతులకందఱకును మోక్షము కలిగింపుము. ఆ సుతలమున నీవు గదాపాణివగు నన్నెల్లపుడును సందర్శించుచుందువు. ఆ దర్శనమువలనఁ గల్గిన యానందముచే సంసారహేతువగు కర్మబంధనములనెల్లఁ దొలఁగించుకొనఁగలవు" అని పలుకఁగా విమలమతి యగుప్రహ్లాదుఁడు భగవదాజ్ఞ నంగీకరించి మనుమనితోఁ గూడి చేతులు జోడించి భగవంతునకుఁ

ప్రదక్షిణనమస్కారములను జేసి యతనిసెలవు గైకొని సమస్త దైత్యసేనలకు నధిపతియై సుతలమును బ్రవేశించెను. ఓ రాజా ! అనంతరము నారాయణుఁడు సభలో ఋత్విజులనడుమ నాసీనుఁడయియున్న శుక్రునిఁజూచి "ఓ విప్రశ్రేష్ఠా ! నీ శిష్యుఁడగు బలి యజమానుఁడై చేయుచున్న యజ్ఞకర్మము విచ్ఛేదము గాకుండ వేదోక్తప్రకారగానడిపి సమాప్తముచేయు"మని పలికెను. "ఓ దేవా ! కర్మప్రవర్తకుఁడవును యజ్ఞఫలప్రదుఁడవును నగు నిన్ను బలి త్రికరణశుద్ధిగా భయభక్తులతోఁబూజించి సంతసింపఁ జేయ నతని యజ్ఞకర్మమున కిఁక లోపమేది ? మఱియు మంత్రమునఁగాని, తంత్రమునఁగాని దేశకాలవస్తువులందుఁగాని యే దేని లోపమున్న యెడల నదియంతయు నీ నామస్మరణమువలనఁ దీఱును గదా ! బలి నీ యనుగ్రహమునకుఁ బాత్రుఁడగుటచే నెట్లాలోచించినను యజ్ఞకర్మమునకు లోపములేదు. అయినప్పటికిని నీ శాసనమును జేసెదను. నీ యాజ్ఞను దలఁదాల్చుట పురుషులకుఁ బరమశ్రేయస్సుగదా ? " అని పలికి శుక్రుఁడు విప్రులతోఁగూడి బలి యజ్ఞమును సమాప్తముగావించెను. ఓ రాజేంద్రా ! శ్రీహరి యిట్లు వామనరూపము దాల్చి పరులచే నపహృత మగుస్వర్గమును బలిని యాచించి పుచ్చుకొని తన సోదరుఁడగు నింద్రున కిచ్చెను. ఇప్పుడు ప్రజాపతులకునెల్ల నధిపతి యగుబ్రహ్మ, దేవర్షులతోను, మనువులతోను, దక్షుఁడు భృగువు మొదలగు మహామునులతోను, సనత్కుమారునితోను, శంకరునితోను గూడి యదితికశ్యపుల ప్రీతి నిమిత్తము లోక పాలాదిసహితమగు లోకములకెల్ల వామనునిఁ బ్రభువునుగాఁ జేసెను. కేవలము లోకములకును సకల దేవతలకును, ధర్మము

నకును, దహస్సునకును, లక్ష్మికిని, సమస్త శుభములకును, వ్రతములకును, స్వర్గమునకును, మోక్షమునకును, సర్వభూతములకును, క్షేమ మలవడునిమిత్తము వామనునిఁ బతిగాఁ జేసెను. ఓ రాజా! ఆ సమయమున సమస్తభూతములును మిక్కిలి సంతోషించినవి. పిమ్మట నింద్రుఁడు బ్రహ్మయూసతిచొప్పున వామనమూర్తిని విమానముపైఁ గూర్చుండనిచ్చి లోకపాలురతోఁగూడ స్వర్గమునకుఁ దీసికొని పోయెను. ఇంద్రుఁడుపేంద్రుని బాహుబలముచే రక్షింపఁబడుచున్న ముల్లోకములను బొంది తదాధిపత్యమును వహించి నిర్భయుఁడై యేలుచు సకలసంపన్నుఁడై మోదమును సుఖమును జెందెను. ఓ రాజా! అనంతరము బ్రహ్మయు, శంకరుఁడును, సనకాదులును, భృగ్వాది మహామునులును, పితృదేవతలును, సిద్ధులును, దక్కిన భూతములును, విమానారూఢులై వామనమూర్తి పరమాద్భుతచరిత్రమును గానము చేయుచు, సదితిని నుతించుచుఁ దమతమ నెలవుల కేగిరి. ఓ కురునందనా! నా బుద్ధికి గోచర మగునంతవఱకు, వినువారి పాపములను దూలించు వామనచరిత్రమును నీకు వినిపించితిని. ఆ వామనుని గుణములకు మేర లేదు. భూమి రేణువులను లెక్కించుటవలెనే యాతనిగుణముల లెక్కించుట యసాధ్యము. ఇఁక ముందయిన నా పరమపురుషునిగుణముల లెక్కింపఁజాలినవాఁడు పుట్టఁబోఁడని మంత్రద్రష్ట లగునసిష్ఠాదులు వక్కాణించిరి. అద్భుతకర్ముఁడయిన వామనచరిత్రమును భక్తితోవిన్నవారును, బఠించినవారును దప్పక ముక్తినొందుదురు. దైవతకర్మమును గాని, పైతృక కర్మమునుగాని, మనుష్యసంబంధి కర్మముగాని యాచరించునప్పుడే వామనచరిత్రము కీర్తింపఁబడినచో నా

క్రియాకలాప మెట్టిలోపమును జెందక ఫలవంతమగునని పండితులు చెప్పియున్నారు. ఇది యిరువదిమూడవయధ్యాయము.

మత్స్యావతార కథా ప్రారంభము.

అని చెప్పిన శుకయోగిని జూచి నరేంద్రుఁడిట్లనియె. ఓ మునీంద్రా! వామనచరిత్ర వినుటవలన నా మనస్సు మిక్కిలి సంతసించినది. శ్రీహరి మత్స్యావతారమెత్తి చేసిన యద్భుత కృత్యములను వినుటకు నామనస్సుకుతూహలపడుచున్నది. ఆ యీశ్వరుఁడు జీవునివలెఁ దమోగుణస్ప్రధానమును, గ్రోధముగలదియు, లోకనిందితమును నగు మత్స్యరూపము నెందులకు ధరించెను. ఉత్తమశ్లోకుఁడయిన భగవంతునిచరితము వినువారలయఁ జదువువారలయు సమస్తపాపములను దొలఁగించునది. కాన్నన మత్స్యావతారచరిత్రమును బూర్ణముగా వివరించి చెప్పుము" అని యడిగిన నరేంద్రునివచనము విని మిక్కిలి సంతసించి విష్ణువు మత్స్యరూపము దాల్చి చేసిన చేష్టలను వివరింప నారంభించె. "ఓ రాజేంద్రా! గోవులను, విప్రులను, సురలను, సాధుప్రలను, వేదములను, ధర్మ మర్యాదలను రక్షింపఁదలంచి భగవంతుఁడు మత్స్యాద్యవతారములను ధరించుచున్నాఁడు. ఆ పరమేశ్వరుఁడు సత్వాది ప్రాకృతగుణములుగాక కేవలము కల్యాణగుణములు మాత్రమే గలవాఁడగుటచేఁ బెద్దవియుఁ జిన్నవియునగు భూతము లందు సర్వదా వాయువువలె వ్యాపించుచున్నను, నాయా భూతముల యుచ్చత్వ నీచత్వము లతనికి సంభవింపవు. గతించిన కల్పావసానమున బ్రహ్మసృష్టివ్యాపారమునువిడిచి నిద్రించుటచేఁ

ప్రళయము సంభవించెను. ఆ ప్రళయమందు మూఁడులోకము లును, సముద్రమున మునింగినవి. బ్రహ్మ నిద్రాసక్తుఁడై శయినింపఁ దలంచియున్నసమయమున వేదము లతని ముఖమునుండి నిర్గమిం చెను. వానిఁ గాంచి సమీపమున నున్న హయగ్రీవుఁ డను రాక్షసుఁ డపహరించెను. ఆ దానవేంద్రుని దుష్టకృత్యమును జూచి వానిఁ జంపి యా వేదముల బ్రహ్మ కర్పించునిమిత్తము భగవంతుఁడు మత్స్యరూపమును ధరించెను. ఆ వృత్తాంతమునే వివరించి చెప్పెదను వినుము. గతించిన కల్పమునందే సత్యవ్ర తుఁ డగురాజర్షి యుండెను. అతనిపేరు సత్యవ్రతుఁడు. అతఁడు క్షమాదు లగుగుణములు గలవాఁడు. అతఁడు నారాయణుని మనమున నిల్పికొని జలమునుమాత్రమే త్రాగుచు ఘోరమగు తప మాచరించెను. ఆ సత్యవ్రతుఁ డనురాజర్షియే భగవ దను గ్రహమును బడసి యీ మహాకల్పమున వైవస్వతుఁ డను పేరితో మనువయ్యె. ఆ సత్యవ్రతుఁ డొకనాఁడు మాలానదియందు జల తర్పణము చేయుచుండఁగా నతని దోసిటిలోని కొకచేపపిల్ల వచ్చెను. దాని నతఁడు జలములోఁ బడవేయుచుండెను. అంత నది యా రాజర్షిని గాంచి "ఓ దీనవత్సలా! దీనియం దనేకము లగు పెద్ద చేపలుగలవు. అందుఁ బెద్దవి మావంటి చిన్నచేపలను దినుచుండును. వానికిభయపడి నిన్నుశరణుసొచ్చితిని. దీనమ నగు నాయందు దయయుంచి రక్షింపక మగుడ నీ జలములలోఁ బొఱ వైచెదవేమి?" అని యిట్లు దీనాతిదీనముగాఁ బ్రార్థింపఁజొచ్చెను. సత్యవ్రతుఁ డదివిని దానినిసామాన్యమగుచేపనుగాఁ దలంచెను; కాని త న్నుగ్రహింపఁ బ్రేమతో మత్స్యరూపమును దాల్చి వచ్చిన భగవంతునిఁగా నెఱుంగకపోయెను. అయిన నతఁడు దాని



1493 శ్రీమత్స్యావతారము.

రక్షింప నిశ్చయించెను. అతఁడు దాని దీనవాక్యములువిని దయాళువయి తన కమండలువు జలములోనుంచి తనయాశ్రమమునకు గొనిపోయెను. అంత నాచేప యొక్కరాత్రియందే కమండలువునకు సరిపడఁ బెరిఁగి యవకాశము లేకపోవుటచే విచారించి సత్యవ్రతునిఁగాంచి "ఓ మహాత్మా! యీ కమండలువు నాకు మిక్కిలి యిఱుకటముగా నున్నది. దీనిలో నినసింపఁజాలను. నేను సుఖముగా నినసింపఁజాలినంత విశాలమగు స్థలమున నుంపుము" అని పలుక విని సత్యవ్రతుఁడు కమండలువులోనున్న చేఁపను దీసి నిర్మలోదకముగల పెద్దచెఱువు వెనములో నుంచెను. అదిమొదలు అర్ధకాలములోనే దానికి సరిపడఁబెరిఁగి "ఓరాజా! నిన్ను శరణుఁజొచ్చితిని గనుక న న్నింతకంటె విశాలమగుస్థలమందుంచి రక్షింపుము. ఈ కటాహము నా సుఖజీవనమునకుఁ జాలకున్నది" యని వేఁడికొనఁగా దానిఁ గరుణించి సత్యవ్రతుఁడు జలపూర్ణమైన యొక సరోవరమున నుంచెను. మఱియు అర్ధకాలములోనే యా చేప దానికి సరిపడఁ బెరిఁగి "ఓరాజా! ఈ సరోజలము నాకు సుఖము గల్గింపఁ జాలినదికాదు. కావున నన్నుఁ గొనిపోయి యింతకంటెఁ బెద్దదియు నక్షయజలము గలదియునగు నొక మడువునం దుంపుము. అట్లయిన నన్ను రక్షించినవాఁడవగుదువు." అని వేఁడ నతఁ డట్లొనర్చెను. కాని యామడువును జాలనందున నతఁడు దాని నొక సముద్రమునఁ జేర్చెను. ఆ సమయమున నది యతనింజూచి "ఓ వీరా! ఈ సముద్రమునందు భయంకరము లగుమకరము లెన్నియో గలవు. అవి మిక్కిలి బలము గలవి. అవి నన్ను భక్షింపక విడుచునా? ఇంతకాలమును రక్షించి యిప్పు డిట్లుచేయుట యుచితమా? కావున న న్నీ

సముద్రమునఁ ద్రోయకుము" అని పల్కెను.సత్యవ్రతుఁ డాచేప మృదువాక్యమును విని మత్స్యరూపమునే మోహితుఁడై యిట్లనియె. "ఓయీ! ఈమత్స్యరూపమునే నన్ను మోహింపఁ జేయుచున్న నీ వెవఁడవు? ఇటువంటి ప్రభావము గల చేప నిదివఱ కెన్నఁడును జూచియుండలేదు; వినియుండుటయును లేదు. ఏ జలచరమైన నొకదినకాలములో నూఱుయోజన ముల దేహమును బెంపఁగలదా! కావున నీవు కేవలము జలచరమవు కావు. నీవు దేవుఁడవు. ఆలోచింప నీవు బ్రహ్మాది దేవతలలో నొకఁడవు కావు. నీవు నిర్వికారుఁడవయిన నారాయణ మూర్తివి. భూతముల ననుగ్రహించి రక్షించుటకై నీ విట్టి మత్స్యరూపమును ధరించితివి. ఓ పురుషోత్తమా! నీవు జగ మ్ముల సృష్టి స్థితి లయములకుఁ గారణుఁడవు. నీభక్తులమును, శర ణాగతులము నగుమాకు నాయకుఁడవు. నీవు సకలమున కంత రాత్మవై వెలయుచున్నవాఁడవు. అట్టి నీకు నమస్కారము. నీవు లీలచేఁ బెక్కవతారముల నెత్తితివి. అవియన్నియు భూత ముల కభివృద్ధిని గల్గించునవియె. అయిన నీ వేప్రయోజనమును సాధింప నీ యవతారముఁ దాల్చితివో తెలియఁజెప్పుము.ఓ కమ లాక్షా! స్వతంత్రాభిమానము గలయితరులపాదసేవవలె నీపాద సేవ యెప్పుడునువ్యర్థముకాదు.నీవు సకలభూతములకును బ్రియుఁ డవు. సమస్తమునకు హితకరుఁడవు. మఱియు నంతరాత్మవు. అట్టి నీ భజన మెట్లునృథయగును? కావున నీ సేవకులమగు మా కద్భుతమగు నీ మత్స్యరూపమునఁ బ్రత్యక్షమైతివి" అని పల్కిన సత్యవ్రతునికి మత్స్యరూపుఁ డయినభగవంతుఁ డిట్లనియె. "ఓ రాజా! కల్పాంతమున సముద్రములు ముల్లోకములను ముంచి

వై చును. అప్పు డుదువిహరించుము నాభక్తులఁ గాపాడి వారికిఁ బ్రీతిగల్గింప నీరూపమును జేకొంటిని. అట్టి ప్రళయము వచ్చుట కీక నెంతోకాలము పట్టదు. నేటి కేడవదినమందే లోకము లన్నియు సముద్రమున నడఁగియుండును. ఇట్లు * ప్రళయకాల సముద్రమున సర్వము మునిఁగియున్న సమయమున నాయాజ్ఞచే నొకవిశాలమగు పడవ నీ చెంతకు వచ్చును. అప్పుడు నీవు నానా విధములగు బీజములను, నోషధులను, నా నావపైనుంచి స ప్త

---

* ఇటఁ బ్రళయమనఁగా మహాప్రళయమని యర్థమా ! కేక దైనందిన ప్రళయమని యర్థమా ! ఇది మహాప్రళయమునుటకు వీలులేదు. అట్లయినచో బ్రహ్మలోకమునూడ నశింపవలయును. పృథివ్యాదులు మిగిలియుండుటకును వలనుపడదు. కాన 'యావద్బ్రహ్మనిశా' అని చెప్పుటచే బ్రహ్మలోకమును బ్రహ్మయు మిగిలియున్నట్లు తెలియవచ్చుటచే నిది మహాప్రళయమన వలనుపడదు. పోనిమ్ము. దీనిని దైనందిన ప్రళయమనవచ్చునన నదియు వలనుపడదు. అట్లన్నచో ప్రళయకాలసంబంధులగు ననావృష్ట్యాదులు లేకుండఁగ నే యాకస్మికముగా నేటి కేడవదినమునఁ దైత్యలోక్యము సముద్రమున మునుఁగునని మత్స్యమూర్తి చెప్పిన వచన మనుపపన్నమగును. ఏమన దైనందిన ప్రళయమునఁ బ్రళయకాల వృష్ట్యాదులుండి క్రమక్రమముగా లోకములు మునుంగును. కాని యాకస్మికముగా మునుఁగవు. ఇదియునుంగాక ప్రథమస్కంధమున "రూపం సంజ గృహే మాత్స్యం చాక్షుషాంతరసంప్లవే। నావ్యారోప్యమహీమయ్యా మపాద్వైవస్వతం మనుం"అని చెప్పఁబడియున్నది. మహాప్రళయమునంగాని దైనందిన ప్రళయమునఁ గాని భూమ్యాదులుండుట యసంభవము కాన " నావ్యారోప్యమహీమయ్యా " మనునది విరోధించును. మఱియు " త్వం తావకోమ ధీస్సర్వాః " అను నిర్దేశమునుగూడ సరిపడదు. ఆరెండువిధములగు ప్రళయములందును సోమధ్యాదులును జంతువులును నుండుటయెట్లు ? పోనిమ్ము, " ఇది వాస్తవిక ప్రళయము కాము సత్యవ్రతునికి వైరాగ్యము గల్గించి జ్ఞానోపదేశముచేయు భగ

ర్షులతోను, సకల జంతుప్రులతోను గూడి యా పెద్దనావలోఁ గూ
ర్చుండి నిర్భయముగా విహరింపఁగలవు. అప్పుడు సూర్యకాంతి
లేకపోవుటచేఁ జీఁకట్లుక్రమ్మినను సప్తర్షుల దేహకాంతిచేఁ దోలఁ
గింపఁబడుచుండును. ప్రళయకాలవాయు వా నావను మిక్కి-లి
యెగురఁగొట్టుచుండు. అయినను భయపడకుము. అట్టి సమ
యమున నే నీరూపముతో నీచెంతకువత్తును. నీవొక పెద్దపాము
తో నా నావను నా కొమ్మునకుఁగట్టుము. మీ రున్నయా నావను
నడుపుచునే నాప్రళయార్ణవమందు బ్రహ్మ నిద్రనుండి లేచునంత
వఱకును విహరించుచుందును. పరబ్రహ్మమని చెప్పఁబడు నామహి
మను నీకు దయాపూర్వకముగా నుపదేశింతును. దాని నీవు

వంతుఁ డాకస్మికముగాఁ గల్పించిన ప్రళయమని యందుమేని అదియు వలను
పడదు. ఏమన "కాలేనాగతనిద్రస్య ధాతుశ్శిశయిషోర్ముఖాత్ । ముఖతో
నిస్సృతాస్వేదాత్ " అని చెప్పియుండుటచే సత్యవ్రతునికి జ్ఞానోపదేశార్థము
భగవంతుఁ డీ ప్రళయమును గల్పించెనన్నచో బ్రహ్మ నిద్రించుటయు, వేదము
లతనిముఖమునుండి నిర్గమించుటయు, వానిని హయగ్రీవుఁడు హరించుటయు
నెట్లు సరిపడును? కావున సత్యవ్రతునికై కల్పించిన యాకస్మికప్రళయమను
టయు వలనుపడదు. అందుచేనిట గతించినదైనందిన కల్పమున నవసానమందు
సంభవించు ప్రళయమని చెప్పవలయును. ప్రళయకాలలక్షణము లగునానాప్ర
ళ్యాదు లున్నట్లు చెప్పకపోయినను నర్థమునుబట్టియున్నవని యనుకొనవల
యును. ఇది దైనందిన కల్పవిశేషమని చెప్పుటచే నందుఁ బృథివ్యాదులుండు
టయు, బీజములు సత్వములు, గర్భీయుండుటయు సంభవించుచున్నది. ఆదై
నందిన కల్పవిశేషమందు బ్రహ్మకు నిద్రసంభవించుటచే వేదనిస్సరణము, దద
పహరణము మొదలగునవి సంఘటింపవచ్చును. కావున నిది దైనందిన ప్రళయ
ముకాని మహాప్రళయముకాని కాదనియు దైనందినకల్పావసానమునఁ బ్రభవ
ర్తిల్లు ప్రళయవిశేషమనియు నెఱుంగునది.

పూర్తిగాఁ దెలిసికొందువు" అనిపలికి శ్రీహరి యచ్చటనే యంత ర్ధానముచెందెను. సత్యవ్రతుఁడు భగవంతుఁడు చూపిన కాల మునుగూర్చి వేచియుండెను. అతఁడు తూర్పునకుఁ జివరలుండు నట్లుగాఁ బఱపఁబడిన దర్భలపై నుత్తరాభిముఖుఁడై కూర్చుం డి మత్స్యమూర్తిపాదముల హృదయమున ధ్యానించుచుండెను. ఇట్లుండ మహామేఘము లాకసమును గప్పి ఘోరముగా వర్షిం చెను. ఆ యుదకముచే సముద్రము వర్ధిల్లి హద్దుదాఁటి భూమిని ముంప నారంభించెను. సత్యవ్రతుఁడు భగవంతుని ధ్యానించు చున్నసమయమున నొక మహానావ వీతెంచెను. అది చూచి యతఁడు బీజములను, నోషధులను దానినుంచి సప్తర్షులతోఁ గూడి నావపైఁ గూర్చుండెను. అంత ఋషులు సత్యవ్రతునిఁ జూచి "ఓ రాజా! సంతతమును శేషశాయిని ధ్యానించుచుండుము. ఈ ముప్పునుండి తప్పించి మనలనతఁడు సుఖంపఁజేయును" అనిరి. అతఁ డట్లు స్మరించుచుండెను. అంత నామహార్ణవమందు భగ వంతుఁడు లక్షయోజనముల పొడువై సువర్ణమయమై యొక కొమ్ముగల్గి యాశ్చర్యము గొలుపు మత్స్యరూపమునఁ బ్రత్య క్షమయ్యెఁ. సత్యవ్రతుఁడు శ్రీహరి చెప్పినట్లుగా నొక మహాసర్ప ముచే నానావను మత్స్యమూర్తి కొమ్మునకుఁ గట్టి సంతుష్టచిత్తుఁ డయి యతని నిట్లు నుతింప నారంభించెను. "ఓ దేవా! అనాది యగు దేహాత్మాభిమానరూప మగునజ్ఞానముచే స్వాత్మ పరమా త్మతత్త్వమును బోఁగొట్టుకొని తాపత్రయ పీడితు లగుజను లీ సంసారమున నిర్నిమిత్తముగా జనించిన నీకృపకుఁ బాత్రులయి నిన్నాశ్రయించి ముక్తులగుచున్నారు. వారికి ముక్తినిచ్చువాఁడ వును ముక్తి సాధనుఁడవును నీవేకదా! అట్టి నీవు మాకుఁ

బ్రాహ్మణుడవయ్యె గురువవై యున్నావు. మఱియు జననమరణా దులు గలజీవులు దేహాత్మాభిమానులై స్వకీయములగు పుణ్య పాపకర్మముల కధీనులై శబ్దాదివిషయ సుఖములను సంపా దింపఁ దలంపుగొని దుఃఖజనకము లగుకర్మముల నాచరించుచు న్నారు. అయినను వారు నిన్ను సేవించి తన్మహిమవలన దేహా త్మాభిమాన బుద్ధిని విడుచుచున్నారు. నీవు హితోపదేష్టవును, అజ్ఞాన నివర్తకుఁడవును కాన మాయందు దయయుంచి మా యభిమానగ్రంథిని వదలింపుము. అగ్ని సంపర్కమువలన బం గారు మలమును విడిచి స్వవర్ణమును బొందినట్లు ముముక్షు వగు పురుషుఁడవ్వనిసేవచేఁ బుణ్యాపుణ్యరూపమగు కర్మజాలమును విడిచి స్వస్వరూపమును బొందుచున్నాఁడో యట్టియీశ్వరుఁడ వగునీవు మాకు గురువ వగుదువు గాక. మాగురువులకుఁగూడ గురువ వగుటచే నీవే మాకుఁ బ్రధానగురుఁడవు. పురుషులకు మోక్షము గల్గించిన నీవే కల్గింపవలెను. కాని యితరులతరము గాదు. నీసేవకు విముఖుఁడయినపురుషునికి సకలదేవత లేకీభ వించి గురుత్వమును వహించియున్నను నీ యనుగ్రహము యొక్క పదివేల వంతులలో నొకదానినైనను జేయఁజాలరు. అట్టి యసమర్థుల నాశ్రయించిన నేమిలాభము? ముక్తిప్రదుఁ డవును, సర్వాంతరాత్మయును నగునిను శరణుఁబొందెదము. మం చినేత్రములు గలవాఁడు గ్రుడ్డివానికిఁ దోడ్తో మార్గదర్శియైనట్లు సూర్యప్రకాశమువలె స్వభావసిద్ధజ్ఞానము గలనీవు స్వాత్మ రక్షణోపాయజ్ఞానము లేనిబ్రహ్మలకు తోడ్తో గురువవయి వర్తించు చున్నావు. ప్రకాశవస్తువులకుఁ గూడఁ బ్రకాశ కత్వశక్తిని గల్గించు నీవు ముక్త్యుపాయమును దెలిసికోవలె

ననియున్న మాకు గురువవై వర్తింతువుగాక. జనన మరణాది భీకరమైన సంసారి గురువనెడి యభిమానము గలవాఁడై దేని నవలంబించి విముఖదరముకాని సంసారము నొందునో యట్టి యసన్మార్గమగు నర్థకామాదుల నుపదేశించును. నీ వట్లు కాక యేది యెప్పటికిని నాశనమొందదో, యేది కేవలానంద మునకు హేతుభూతమో, యేది వ్యర్థముగాదో, యేది పురుషు నికి సుఖముగా ముక్తి నొసంగఁజాలునో యట్టి స్వపరయా థాత్మ్యజ్ఞానము నుపదేశింతువు. ఓ దేవా! నీవు సకలమున కును హితుఁడవు. అందఱప్రేమకు నిలయుఁడవు. నీవు సమస్త మున కంతరాత్మవై నియమించువాఁడవు. నీవు హితముపదే శించువాఁడవు; జ్ఞానమును, నభీష్టముల నొసంగువాఁడవు. నీ వీటువంటివాఁడవైనను లోకులు తమ హృదయకమలమున వసించు నిన్నుఁదెలిసికోఁజాలరు. శబ్దాదివిషయములం దాసక్తు లయినవారు ని న్నెట్లు తెలిసికోఁగలరు? ఓదేవా! దేవదేవుఁ డవును, శ్రేష్ఠుఁడవును, నగునిన్నును జ్ఞానోపదేశము నొందు నిమిత్తము శరణుసొచ్చితిని. కాన యో భగవంతా! పరమపురు షార్థమును బ్రకటించు వచనములచే విప్పశక్యముకానివై నా హృదయమందున్న దేహాత్మాభిమానాదులను నశింపఁజేయుము. నీ స్వరూపమును దెలుపుము" అని పలుకుచున్న రాజుపలుకులు విని యాది పురుషుఁడగు మత్స్యమూర్తి సంతసించి యా సము ద్రమున విహరించుచునే ప్రకృతివిలక్షణ మగునాత్మజ్ఞాన మును, భక్తియోగమును, దనచే రచింపఁబడిన మత్స్యపురాణ సంహితను, నాత్మరహస్యములను వివరించి సత్యవ్రతున కుపదే శించె, ఆసత్యవ్రతుఁడును మునులతోఁగూడ భగవంతునివలనఁ

ప్రకృతిపురుషులత త్త్వమును, బరమాత్మజ్ఞానమును నుప
దేశింప నిస్సందేహముగా విని తెలిసికొనెను. అనంతరము హరి
ప్రళయావసానమున నిద్రనుండి లేచిన బ్రహ్మకుఁ దాను హయ
గ్రీవునిఁజంపి పుచ్చుకొన్న వేదముల సర్పించెను. ఆసత్యవ్రతుఁడు
శాస్త్రజన్యజ్ఞానముచేతను, దజ్జన్యజ్ఞానముచేతను, నొప్పుచు
విష్ణుప్రసాదమువలన నీ కల్పమున వైవస్వతమనువయ్యెఁ. ఓ రా
జేంద్రా! రాజర్షి యగుసత్యవ్రతునికిని, మాయామత్స్యరూపి
యగునారాయణునకును బ్రవర్తిల్లిన సంవాదరూప మగుచరి
త్రమును విన్నవారు సంసారబంధనములవలన విడివడుదురు.
హరి మత్స్యావతార చరిత్రము నెవఁడు ప్రతిదినమును గీర్తిం
చునో వానికిఁ దలంచినంతమాత్రమునఁనే కోర్కెలు సిద్ధించును.
అనంతరమున నతఁడు పరమపదవిని జెందును. ఎవఁడు ప్రళయ
కాల సముద్రమున విహరించుచు నిద్రించిన బ్రహ్మనుండి వేద
ములఁ గపహరించిన హయగ్రీవుని సంహరించి వానినిదెచ్చి బ్రహ్మ
కిచ్చెనో, యెవఁడు సత్యవ్రతాదులకుఁ బురాణసంహితను
దత్త్వము నుపదేశించెనో, సకల కారణుఁ డయినయా మా
యామత్స్యమూర్తికి నమస్కరించెదను. ఇది యిరువదినాల్గవ
యధ్యాయము.

ఇది శ్రీమత్కేతవరపు వేంకటశాస్త్రి ప్రణీతమైన యాంధ్ర
వచన భాగవతమున అష్టమస్కంధము
సమాప్తము.

శ్రీకృష్ణార్పణ మస్తు.

శ్రీరస్తు.

శ్రీశారదాంబాయైనమః.

శ్రీమదాంధ్రభాగవతము

నవమస్కంధము.

"ఓ మునీంద్రా! మన్వంతరములనెల్ల నీవు వివరించితివి. ఆయా మన్వంతరములందు భగవంతుఁడవలంబించిన యవతారములను, నా యవతారములు సేసినకార్యములను వర్ణించి చెప్పితివి. విని యానందించితిని. ద్రవిడదేశాధిపతి యగుసత్యవ్రతుఁడనునొకరాజర్షి కలఁడనియు, నతఁడు గతించిన కల్పమందుఁ బరమపురుషుని సేవించి జ్ఞానము సంపాదించెననియు, నతఁడే వైవస్వతమను వయ్యెననియు, నిక్ష్వాకున్ర మొదలగువారతనిసుతులనియుఁజెప్పితివి. ఓ సర్వజ్ఞా! ఆ యిక్ష్వాకుప్రభృతుల చరిత్రములను, వదీయవంశజుల చరిత్రములను వేఱువేఱుగా నర్ణించిచెప్పుము. మాకు వినవలెనని వేడుకయగుచున్నది. మఱియు నావైవస్వతువంశమున నెనరెనరు జన్మించిరి? ఇప్పుడున్నవా రెవ్వరు? ముందు జన్మించువా రెవ్వరు? వారల కీర్తిదుష్కీర్తి లెట్టివి? వారల పరాక్రమాదిగుణము లెట్టివి? వానిని మాకుఁ బూర్తిగా వివరింపుమా" యని యిట్లు పరీక్షిన్నరేంద్రుండు బ్రహ్మవాదులగుమునులమధ్యమునఁ గూర్చుండి

యున్న శుకు నడుగఁగా సకలధర్మముల నెఱిఁగిన శుకుం డతని కిట్లనియె, "ఓరాజా! వైవస్వతమనువు వంశమును నిర్ణించె దను. కాని దాని సంపూర్ణముగా విస్తరించి చెప్పఁ బరము కాదు. నూఱేండ్లయినను జాలవు. పెద్దవియుఁ జిన్నవియునగు భూతముల కంతరాత్మయు, స్థూల చిదచిత్తులు శరీరముగాఁ గల వాఁడను నగుపరమేశ్వరుఁడు కల్పాంతమున నీ విశ్వమునంత టిని దనయం దిమిడ్చికొని యుండెను. అతని నాభివలన స్వర్ణ మయ మగుపద్మ ముదయించెను. ఓ మహారాజా! అందుండి చతుర్ముఖుం డుదయించె; అతని మనస్సువలన మరీచిసంభవించె; అతనికిఁ గశ్యపుఁడుగలిగెఁ; అతనికి దక్షపుత్రి యగుదితియందు వివస్వంతుఁ డనుకుమారుఁ డుదయించె. ఓ రాజేంద్రా! అతనికి సంజ్ఞాదేవియందు వైవస్వతమను సద్భవించె. మంచి మనస్సు గలయా వైవస్వతునికి శ్రద్ధ యనుభార్యయందుఁ బదుగురు పుత్రులు పుట్టిరి. వారు క్రమముగా నిక్ష్వాకుఁడు, శర్యాతి, నృగుఁడు, దిష్టుఁడు, ధృష్టుఁడు, కరూశకుఁడు, నరిష్యంతుఁడు, పృషధ్రుఁడు, నభగుఁడు, కవి, యనునామములచేఁ బిలువఁబడిరి.

ఇళోపాఖ్యానము.

వైవస్వతమనువునకుఁ బుత్రసంతానము కలుగక పూర్వమతఁడు వసిష్ఠునిఁ జేరి తనయపుత్రత్వమును దెలుపఁగ యతఁడు కరుణించి తా నాచార్యుఁడై యామనువుచే మిత్రావరుణ మను నిష్టిని జేయించెను. యాగసమయమున మనుపత్ని యగు శ్రద్ధ కేవలము పాలనమాత్రమే యాహారముచేసికొని, నియమ మవలంబించినదై హోతను సమీపించి నమస్కరించి తనకుఁ గన్యక కలుగునట్లు చేయవలెనని యాచించెను. ఆప్రార్థన మ

డంగీకరించెను. పిమ్మట నధ్వర్యునిచేఁ బ్రేరితుఁడై హోత మనస్సును నిశ్చలముగాఁ జేసికొని మనుపత్ని స్వాహనమును మనస్సులోనుంచికొని వషట్కారము నుచ్చరించుచు, హవిస్సును గ్రహించి హోమముచేసెను. హోత యిట్లు విరుద్ధముగా హోమము చేయుటంబట్టి యజమానుని సంకల్పమునకు విపరీతముగా, ఇళ యనుకన్యక పుట్టెను. తాను గోరినట్లు పుత్రుఁడుగాక పుత్రిక పుట్టుటను గని మిక్కిలి సంతసింపక వైవస్వతమనువు గురువగు వసిష్ఠునిఁజూచి యిట్లనియె. "ఓ మునీంద్రా! మీరు బ్రహ్మవాదులు. మీరు పూనికొని చేసిన కర్మములు సంకల్పించుకొన్న ఫలము నిచ్చి తీఱవలెను. అట్లుగాక విపరీతఫలము నిచ్చినచోనది మిక్కిలి విచారకరము. మఱియు మంత్రశక్తి వ్యత్యాసమును జెందరాదు. మీరు మంత్రములను వాని యర్థములను, వాని వినియోగములను జక్కఁగా నెఱుఁగుదురు. మీమనస్సులు నిశ్చలములు. తపస్సుచేసి పాపములను దొలఁగించుకొన్న మహాత్ములరు. పండితులనోట నసత్యము వెలువడఁ గూడనట్లు మీరు మంత్ర పూర్వకముగాఁ జేసిన క్రియలన విపరీతఫలము గలుగఁ గూడదు. ఇట్లుండ నాసంకల్పమునకుఁ బ్రతికూలముగాఁ గూఁతు లెట్లు పుట్టినది?" అనిపల్కిన మనునవచనముల విని *మా ప్రపితామహుఁ డయినవసిష్ఠుఁడు హోత చేసినవ్యత్యాసము నెఱిఁగి మనువుం గాంచి యిట్లనియె. "ఓయీ! నీహోత నీసంకల్పమునకు విపరీతముగాఁ దలంచుటచేత నిట్టి ఫలవైషమ్యము సంభ

*శుకునకు వసిష్ఠుఁడు ప్రపితామహుఁ డగును. ఎట్లన, వసిష్ఠునకు శక్తిగలిగెను. అతనికిఁ బరాశరుఁడు, అతనికి వ్యాసుఁడు, అతనికి శుకుఁడు, కావున నతనికిఁ దాతతాతయయ్యెను.

వించినది. అయిన నాతపోబలముచే నీకూఁతునకుఁ బురుషత్వము లభించునట్లు చేసెద" నని ప్రతిజ్ఞచేసెను. అనంతరము మహాకీర్తి యగువసిష్ఠుఁడు పరమపురుషుని నుతింప నద్దేవుఁడు ప్రత్యక్షమై యతనికిఁ గావలసిన వరమునిచ్చిపోయెను. అందుచే నిళాకన్యక సుద్యుమ్నుఁడనుపురుషుఁడయ్యెను. ఓమహారాజా! ఆ సుద్యుమ్నుఁడొకనాఁడు కొందఱు మంత్రులును, బరిచారకులును, బరివేష్టించియుండ, సింధుదేశసంబంధి యగు నున్నతాశ్వము నెక్కి సుందరమగు చాపమును, నచ్చెరువు గొలుపు బాణములను, దాల్చి, కవచమునుదొడిగి మృగములను వేఁటాడు వేడుకతో నుత్తరదిక్కునకేఁగెను. అట్లతఁడు పోయిపోయి మేరువునకుఁ గ్రిందిభాగమునన్న యొకవనమును బ్రవేశించెను. ఆవనమందు శంకరుఁడు సర్వకాలములందును భార్యతోఁ గ్రీడించుచుండును. శత్రుహంత యగుసుద్యుమ్నుఁడందుఁ బ్రవేశింపఁగానే స్త్రీరూపమొందెను. అతఁడొక్కనగుట్లు మాఁడుగుట్లు మయ్యె. అతనియనుచరులును స్త్రీలయిరి. వారు పరస్పరమును జూచికొని స్త్రీరూపమునొందుటకు విచారించిరి" అనినవిని రాజిట్లనియె. "మునీంద్రా! ఆప్రదేశమున కట్టిమహిమ యుండుటకుఁ గారణమేమి? దాని కామహిమ నెవ్వరొసంగిరి? మాకు వినవలెననియున్నది. కాఫ్రస వివరించి చెప్పు"మనఁగా శుకుం డిట్లనియె "ఓరాజా! ఈశ్వరుఁడా యిలావృతవర్షమందున్న యీవనమునఁ బార్వతితోఁ గ్రీడించుచుండఁ దపోనిష్ఠులగుమునులు గొందఱు దమకాంతులచే దిక్కులను బ్రకాశింపఁజేయుచు నచ్చటికరుదెంచిరి. దిగంబరుడై శంకరుని తొడపయిఁ గూర్చుండియున్నపార్వతి వారిని జూచి మిక్కిలి సిగ్గుపడి దిగ్గునలేచి వస్త్ర

1504 శివుఁడు పార్వతితో క్రీడించుచుండ సుద్యుమ్నుఁడు మాటు.

మును ధరించెను. అప్పుడు ఋషులును వాగుసంభోగింపఁ దలంపు తోనున్నవారని తెలిసికొని వెనుకకు మరలి బదరికావనమునకుఁ బోయిరి. అంత రుద్రుఁడు తనప్రియురాలికిఁ బ్రియము చేయఁ దలంచి 'పురుషుఁ డీవనము సొచ్చెనేని స్త్రీ యగుఁగాక" యని పలికెను. అప్పటినుండియుఁ బురుషులావనమునకుఁబోవ మానిరి. ఆప్రదేశవృత్తాంత మిది. ఇఁక సుద్యుమ్ననివృత్తాంతము వినుము. ఆ రాజట్లు స్త్రీయై స్త్రీరూపమొందిన యనుచరులతోఁ గూడ నావనములందుఁ జరించుచుండెను. ఒకనాఁ డామె చెలికత్తెలతోఁగూడఁ దనయాశ్రమము చెంత విహరించుచుండు స్త్రీరత్న మగునామెను జూచి చంద్రునికుమారుఁ డగుబుధుఁడు మోహించెను. ఆమెయు బుధుని మోహించినది. వారిరువురును దంపతులయిరి. అట్లు సుఖించుచుండ వారికిఁ బురూరవునఁడనుపుత్రుఁడు పుట్టెను. అనంతర మొకనాఁడు సుద్యుమ్నుఁడు తనస్థితికి వగచుచుఁ దనకులగురువగు వసిష్ఠుని స్మరించుకొనెను. వసిష్ఠుఁ డతనికిఁ బ్రత్యక్షమయి యతనిరూపమునుజూచి జాలిపడి మగుఁడ నతనికిఁ బురుషత్వము సంపాదింపవలెనని నిశ్చయించి శంకరుని నుతించెను. ఆమునీంద్రునకు శంకరుఁడు ప్రసన్నుఁడై తనశాసనమును మునికోర్కిని, సఫలముగాఁ జేయఁదలంచి "నీ తపోమహిమచే సుద్యుమ్నుఁ డొకనెల పురుషరూపమును, నొకనెల స్త్రీరూపమును దాల్చి భూమిని బరిపాలించుఁగాత" యని పలికెను. దానికి వారు సమ్మతించిరి. పిమ్మట సుద్యుమ్నుఁడు తనగురువు ననుగ్రహముచేఁదనకిష్టమగుపురుషత్వమునుబొందిరాజ్యపాలనము చేయఁదొడంగెను; కాని ప్రజలకు సంతుష్టిలేకపోయెను. ఆ రాజునకుఁ బురూరవుఁడుకాక యుత్కలుఁడు, వినులుఁడు

నాఁబడుమువ్వురకొడుకులునుగలరు. వారుధర్మవత్సలులైదక్షిణ దేశములకుఁ బ్రభువులైరి. సుద్యుమ్ననకు మునలితనము రాఁగానే భూమండలమునకుఁ బురూరవుని రాజుగాఁ జేసి జితేంద్రియుఁడై తపమొనరింప వనమునకేఁగెను. ఇది మొదటియధ్యాయము.

పృషధ్రాదుల చరితము.

సుద్యుమ్నుఁడు వనమున కేఁగినపిమ్మట వైవస్వతమనువు యమునాతీరమునుజేరి పుత్రసంతాన మపేక్షించి నూఱువత్సరములతపస్సుసేసి యనంతరము స్వయంముగా విష్ణువు నారాధించెను. ఆదేవునను గ్రహమున నతఁడు దనతో సమానులగు పదుగురు సుతులను బడసెను. వారలే యిక్ష్వాకుఁడు మొదలగువారు. వారిలోఁ బృషధ్రునిఁ, దండ్రిగోపాలనమునకు నియమించె. అతఁడందులకంగీకరించి వీరాసన మనువ్రత మవలంబించి రాత్రిసమయమునఁగత్తిచేఁబూని సంచరించుచుఁ బులుల బారిఁబడకుండ గోవులనురక్షించుచుండెను. ఒకనాఁటిరాత్రి మేఘము లాకసమునుగ్రమ్మి వర్షించుచుండ నొకపులి వచ్చి గోశాలను బ్రవేశించెను. దానిఁజూచి శయనించి యున్నగోవులు భయపడిలేచి యాశాలయందిట్టటు పరిధ్వడఁజొచ్చెను. అయిననను బలిష్ఠమగుశార్దూల మొకగోవును బట్టుకొన నది యఱవనారంభించెను. పృషధ్రుఁడది విని దానిసమీపమునకుఁబోయెను. ఆకసమున మబ్బు క్రమ్మి చుక్కలైనఁ గనఁబడకపోవుటచే నాసమయము గాఢాంధకారముచే నావృతమైయుండెను. అందుచే నతఁడా చీకటిలోఁ బోల్పలేక భ్రాంతిచెంది ఖడ్గముతోఁ బులితలకు మాఱుగా

నొక కపిలగోవు శిరమునుఖండించెను. ఆక త్తిొన సమీపమున నున్న పులిచెవికిఁ దగిలినందున నది తెగిపడెను. దానికిఁ బులి భయముచెంది రక్తముచే మార్గమును దడుపుచు గోశాలనుండి నిష్క్రమించెను శత్రుహంత యగుపృషధ్రుఁడు పులి చచ్చెనని నిశ్చయించుకొనెను. తెల్లవాఱినతోడనే పులికి బదులుగా గోవు నుజంపినట్లు తెలిసికొని మిగుల దుఃఖించెను. వసిష్ఠుఁ డది యెఱిఁగి ప్రమాదవశమున నేరముచేసెనని యోజింపక పృషధ్రునిఁ జూచి "ఓ దుష్టా! నీవు క్షత్రియుఁడవై యుండఁదగదు. ఈపాప కార్యముచే శూద్రుఁడవగు" మని శపించె. పృషధ్రుఁ డాగురు శాపమును గృతాంజలియై స్వీకరించి యింద్రియముల జయించి భగవంతు నుపాసించెను.అనంతర మతఁడు కొన్నిదినములలోనే సర్వమున కంతరాత్మయు, దోషరహితుఁడు నగుపర బ్రహ్మమం దు ఫలాపేక్షలేని భక్తినిజూపి సర్వభూతములందును దయగలిగి సుఖదుఃఖములను సమముగాఁ జూచుకొనుచు నిహలోకసుఖము లందుఁ గోర్కిని విడిచి, స్వర్గాదిసుఖములనుగూడ నాదరింపక రాగద్వేషాదులను మనస్సునుండి పాఱఁదోలి యింద్రియముల జయించి దేహమున కనుబంధులగు దారసుతాదులను వదలి దైవ యత్నమువలన లభించు నాహారముచే దేహమును బోషించు కొనుచుఁ బరమాత్మయందు మనస్సునుంచి నిరతిశయానంద రూప మగుజ్ఞానముచేతనే తనివిచెందుచు, నిశ్చలుఁడై వెఱ్ఱి వానివలె వర్తించుచు, గ్రుడ్డివానివలె వస్తువులను జూడక, చెవి టివానిపగిది శబ్దమును వినక, భూమిపైఁ జరించెను. ప్రారబ్ధకర్మ మున్నంతకాల మిట్లతఁడు చరించుచు నవసానమున నొకప్పుడడ వికిఁబోయి దావాగ్నిని జూచి ప్రవేశించి దహింపఁబడి పరబ్రహ్మ

మును బొందెను.కడపటివాఁ డగుకవి విషయసుఖములం దభిలాష విడిచి రాజ్యమును బంధుపులను గృహమును ద్యజించి స్వభావ సిద్ధమగు కాంతులతోఁ బొల్చు పరమపురుషునిఁ జిత్తమున నిడి కొని చిన్నతనముతోనే పరమపదమును జెందెను. కరూశకునకు ముగ్గురు కొమరు లుండిరి. వా రుత్తరదేశములకుఁ బ్రభువులై బ్రాహ్మణులఁ బ్రేమించుచు ధర్మయుక్తులై ప్రజాపాలనమొన రించిరి. ధృష్టునికిఁ గొందఱు పుత్త్రు లుదయించిరి. కాని వారు క్షత్త్రధర్మములవిడిచి భగవంతు నుపాసించి తదనుగ్రహమున బ్రాహ్మణులైరి. నృగునకు సుమతియను పుత్త్రుఁడు పుట్టె. అత నికి భూతజ్యోతి యుదయించె. అతనికి వసువును, వానికిఁ బ్రతీకుఁడును, నతని కోషవంతుఁ డనుకొమరుండును, ఓషవతి యను కూఁతురును బుట్టిరి ఆ కన్యను సుదర్శనుఁడు వివాహమాడెను. నరిష్యంతుఁడను మనుసుతునకుఁ జిత్ర సేనుఁ డుదయించెను.వాని కి ఋక్షుఁడును, వానికి నీడ్వుఁడును, వానికిఁ గూర్చుఁడును, వాని కింద్ర సేనుఁడును జన్మించిరి. ఆ యింద్ర సేనునకు వీతిహో త్రుఁడు సంభవించె. అతనికి సత్యశ్రవుఁడు గలిగె. అతని కురు శ్రవుఁ డుద్భవించె. అతనికి దేవనత్తుఁ డుద్భవించె. అతనికి భగ వంతుఁడగు నగ్ని దేవుఁడే కుమారుఁడై యుదయించె. వాఁడే కానీనుఁ డనుఋషియయ్యె. వానికి జాతుకర్ణ్యుఁ డనియు నా మాంతరము గలదు. అతనివలననే యాగ్నివేశ్యగోత్రమని వా డఁబడు బ్రాహ్మణకులము ప్రభవించె. నరిష్యంతాదుల వంశ చరిత్రములను జెప్పితిని. ఇఁక దిష్టునివంశమును వినుము. దిష్టు నకు నాభాగుఁ డనుకుమారుఁడు కలఁడు. అతఁడు వైశ్యకులము నకు విహితములగు గోరక్షణాదివ్యాపారములను జేయుచు వై

శ్యుఁ డయ్యెను. ఆ నాభాగునకు మలంధనుఁడును, వానికి వత్స ప్రీతియు, వత్సప్రీతికిఁ బ్రాంశువు, ప్రాంశువునకుఁ బ్రమితియు, బ్రమితికి ఖమిత్ర్యిఁడు, ఖమిత్రునకుఁ జక్షుషుఁడు, చక్షుషునకు వివింశతియు నుద్భవించిరి. ఆవివింశతికి దంభుఁడు, వానికి ధార్మికుఁ డయిన ఖనినేత్రుఁడు, వానికిఁ గరంధముఁడును, కరంధమునకు అవిక్షిత్తును, నతనికి మరుత్తుఁడును జన్మించిరి. ఆ మరుత్తుఁడు భూ చక్రమునంతను బాలించి చక్రవర్తియనిపించుకొనియె. అతఁడు యోగీశ్వరుఁడును, అంగిరసుని సుతుఁడును సగుసంవర్తు నాచార్యునిఁగా వరించి వెక్కుయజ్ఞము లొనర్చెను. మరుత్తునివలె యజ్ఞముచేసినవాఁడు లోకమున వేఱొకఁడు లేఁడు. అతని యజ్ఞమున నుపకరణములన్నియు సువర్ణమయములె. అతఁడు సోమరసముచే నింద్రుని, దక్షిణలచే బ్రాహ్మణులను మిక్కిలి సంతసింపఁ జేసెను. ఆ యజ్ఞమున దేవతలు భోజనపాత్రములం దన్నాదులను వడ్డించిరి. విశ్వేదేవులనుదేవగణములే సభాసదులైరి. ఆ యజ్ఞవైభవము నేమని చెప్పను! ఆమరుత్తునకు దముఁడు, దమునకు రాజవర్ధనుఁడు, వాని సుధృతికి, సుధృతికి నరుండును, నరునకుఁ గేవలుఁడును, గేవలునకుబిందుమతుఁడును, వానికి వేగవంతుఁడును, వేగవంతునకు బిందువును, బిందువునకుఁ దృణబిందువును, నుద్భవించిరి. ఆ తృణబిందువు మహారాజులలో వాసికెక్కెను. అతఁడు భజనీయములగు గుణములు గలవాఁడు. అతని గుణములకు సంతసించి యలంబుస యనునొక యచ్ఛరమిన్న యతని స్వయముగా వరించెను. వాని కామెయందుఁ గొందఱు పుత్రులును, ఇలబిల యనుకన్యకయుఁ గలిగిరి. ఆ యిలబిలను విశ్రవుఁడు పెండ్లాడి యొకకుమారునిఁ గాంచెను. అతఁడే కుబేరుఁ

డనునామముతో ను త్తరదిక్పాలకుఁడయ్యె. మఱియు నతఁడు యోగీశ్వరుఁడును, దండ్రియు నగువిశ్రవసువలన నంతర్ధానరూప మగువిద్యను బొందె.ఆ తృణబిందువుపుత్త్రులు, విశాలుఁడు,శూన్యబంధుఁడు,ధూమ్రకేతువు నాఁబడు పేరులు గలవారు. అందు విశాలుఁడు వంశకర్తయై వైశాలీ పురమును నిర్మించెను. ఆ విశాలునకు హేమచంద్రుఁడును, హేమచంద్రునకు ధూమ్రాక్షుఁడును, ధూమ్రాక్షునకు సహదేవుఁడును, సహదేవునకుఁ గృశాశ్వుఁడును, గృశాశ్వునకు సోమదత్తుఁడును నుద్భవించిరి. ఆ సోమదత్తుఁడు పెక్కశ్వమేధములచేఁ బరమపురుషు నారాధించి ముక్తిగాంచెను. ఆతనికి సుమతియు, జనమేజయుఁడును సంభవించిరి. కూటస్థుఁ డగుతృణబిందువుని కీర్తిని వర్ధించు నీరాజులు వైశాలురని ఖ్యాతిఁ గాంచిరి. ఇది రెండవయధ్యాయము.

చ్యవనుఁడు సుకన్యను బరిగ్రహించుట.
చ్యవనుఁ డశ్వినీదేవతల సోమపీథులంజేయుట.

మనుపుత్త్రుఁ డగుశర్యాతికి వేదార్థజ్ఞాన మెక్కుడుగాఁ గలదు; శ్రౌతమందు మిక్కిలి నేర్పరి. కావునఁ జే యంగిరసుఁ డొనరించు సత్త్రయాగమున రెండవదినమునఁ జేయవలసిన క్రియావిధానమును జక్కఁగా నుపదేశింపఁగ లేదు. కమలదళము లవలె విశాలము లగునేత్రములుగల సుకన్యకయను కన్యక యొక్కతె యతనికిఁ గలదు. ఒకప్పు డా రాజు తన కుమారికతోఁ గూడ వనమున కేఁగి యచ్చటికి సమీపమున నున్న చ్యవనాశ్రమమునకుఁ బోయెను. అప్పుడు సుకన్య చెలికత్తెలతోఁగూడ నాయాశ్రమపృథులను జూచుచుఁ జరించుచుండఁగా నొక

చో నొకపుట్ట గానవచ్చెను. దాని కన్నములలో సూర్యుని మించిన కాంతి గన్పట్టుచుండెను. ఆ బాల యవివేకవంతురాలై దైవవశమున ముండ్లతో నా కన్నములను బొడిచెను. తోడనే వానినుండి రక్తము ప్రవహింపఁజొచ్చెను. అంత శర్యాతిసైనికుల కందఱకును మలమూత్ర నిరోధము కలిగెను. రాజాయుపద్రవమును జూచి యచ్చెరువడి వారలకిట్లనియె. "ఓ సైనికులారా! ఇది మహానుభావుఁడగుచ్యవనుని యాశ్రమము. మీలో నెవ్వరయిన నతని కపకారము చేయుచున్నారా? అతని యాశ్రమమున కేమయిన హానిగల్గించియున్నారా? ఏదో యిట్టిదుష్కార్యము మీవలన జరిగియుండవలెను. లేనిచో నిట్టి యుపద్రవము సంభవింప" దని యడుగుచుండెను. అంత సుకన్యక భయపడి తండ్రిని సమీపించి యిట్లనియె. "ఓ జనకా! నే నొక యమంగళకార్య మాచరించితిని. ఒక పుట్ట కన్నములలోనుండి దివ్యతేజస్సు గానరాఁగా నదేమో యనుకొని ముండ్లతోఁ బొడిచితిని. అదేమిచిత్రమో కాని యందుండి రక్తము ప్రవహింపఁజొచ్చెను. ఆలోచింప నా కాంతివిశేషములు పుట్టలోనుండి తపస్సుచేయుచున్న చ్యవనుని దేహమును సంబంధించినవేమో" యని పలుక విని శర్యాతి మిగుల భీతుఁడై యచ్చటికేగి పుట్టలోనుండి తప మొనర్చుచున్న చ్యవనునికి మ్రొక్కి స్తోత్రముచేసి ప్రసన్నునిఁ గావించుకొనెను. అనంతరము శర్యాతి చ్యవనునకు తన కూఁతును వరింపఁ దలఁపున్నట్లు గ్రహించి యామె నతని కర్పించి యతని యనుజ్ఞవడసి యతి కష్టముచేఁ బుత్రికావియోగమును సైఁచి యనుచరులతోఁ దనపురమున కేఁగెను. ఆ చ్యవనుడు ముక్కోపి,ముసలివాఁడు. అయినను సుకన్యక యతనిఁ బతి

గావరించిజాగరూకతతో నతని తలంపుఁ దెలిసికొని ప్రవర్తించుచుఁ దనమంచినడవడిచే నతని సంతసింపఁ జేసెను. ఇట్లుండ నొకనాఁ డశ్వినీదేవతలు తన యాశ్రమమునకు రాఁగాఁ జ్యవనుఁడు వారినాదరించి పూజించి సంతసింపఁజేసి "ఓ మహానుభావులారా! నన్నను గ్రహించి స్త్రీలకు మనోహరమగు యీవనమును సౌందర్యమును నాకొసంగుఁడు. మీరట్లు సేసినచో యాగములందు సోమపానరహితులగుమీకు సోమపానమును గల్పించెదను" అని పలికెను. వైద్యశ్రేష్ఠులగునా యశ్వికుమారులతని వచనములు విని సంతసించి యంగీకరించి "సిద్ధరసముచేఁ బూరిత మగునీ హ్రదమున మునుఁగుము. నీకోర్కి దీరు" ననిచెప్పి ముసలివాఁడును, ముడుతలతోను, బైకిఁగానవచ్చునాడులచేతను నెఱసిన వెండ్రుకలచేతను వికృత మయిన దేహము గలవాఁడును నగుచ్యవనుని వెంటఁబెట్టుకొని యాహ్రదములోఁ బ్రవేశించిరి. అనంతరము గొంతసేపటి కందుండి మనోహరమగునాకృతులతోను, బద్మమాలికలతోను బ్రకాశించుచుఁ, గుండలాద్యలంకారములను దాల్చి సుందరవస్త్రములను గట్టి పరస్పరమును వేఱుసేయఁ దరముకాని రూపములు గల మువ్వురుపురుషులు వెడలి వచ్చిరి. సూర్యునివంటి తేజస్సు గల యా మువ్వురలోను దనభర్త యెవఁడో తెలిసికోలేక సుకన్యక తన భర్తను దనకొసంగవలెనని యశ్వినీదేవతల శరణుఁజొచ్చెను. వా రామె పాతివ్రత్యమునకు సంతసించి యామెకుఁ బతినిజూపి మునిని వీడ్కొని దివమునకుఁ బోయిరి. కొంతకాలము చన్న తర్వాత శర్యాతి యాగము చేయుతలంపుతోఁ జ్యవనాశ్రమమునకుఁ బోయి తనకుమారికను దత్పార్శ్వమున సూర్యునివలెఁ

ప్రకాశించు చున్నపురుషునిఁ గాంచి తన యల్లు నానవాలు పట్ట లేక తన కూఁతు దేదో దుష్కార్యము చేసినదని విచారించుచుఁ దన పాదములకు నమస్కరించిన దానికి దీవన లొసఁగక కోపము తో నిట్లనియె. "ఓ పుత్త్రీ ! నీ విట్టి పని యేలచేసితివి? ఆ చ్యవన ముని లోకమునకెల్ల వందనీయుఁడు. అతని నీవు వంచించితివా? ఓదుర్మార్గురాలా ! అతఁడు ముసలివాఁడనియుఁ గురూపియనియుఁ దలంచి యతనినివిడిచి సుందరుఁడగువేఱొకని భర్తనుగాఁ జేకొంటివా? సత్కులమందుఁ బుట్టిన నీ మనస్సిట్లు విపరీతముగాఁ బరిణమించుచున్నదేమి ? నీవు చేసినపని కులమున కతినింద దెచ్చుచున్నది. నీవు సిగ్గుమాలి యొకజారుని వరించితి వన్నదుష్కార్తి నీ తండ్రికులమును,నీమగనికులమును మలినముగావించి యధోగతిపాలు చేయుచున్నది" అని పలుకు చున్నతండ్రినిగాంచి సుకన్య మందహాసముచేయుచు నచ్చెరువుతో నిట్లనియె. "ఓ జనకా! ఇతఁడు నీజామాత; భృగుకుమారుఁడయినచ్యవనముని. ఇతని కశ్వినీదేవతల యనుగ్రహమున నిట్టివయస్సు లభించినది. ఇతఁడన్యుఁడుకాఁ"డని యాసత్యాంతమునంతను దెల్పఁగాశర్యాతి యాశ్చర్యముచెంది మిక్కిలి ప్రీతుఁడై కుమారిని గౌఁగిలించుకొనెను.అనంతరముఁ చ్యవనుఁడు శర్యాతిచే సోమయాగమును జేయించెను.ఆ యాగమందు చ్యవనుఁడు తన తపోబలముచే సోమపానరహితులయినను నశ్వినీదేవతల కదిగల్గించెను.తమ్మువిడిచిసోమముచే నాశ్వినులను బూజించుచున్నశర్యాతినిగాంచి యింద్రుఁడు కోపించి యతనిఁ జంప వజ్రాయుధమె త్తెను. కాని చ్యవనుఁడు వజ్రహస్తమగునింద్రునిచేతిని స్తంభింపఁజేసెను. ఓరాజేంద్రా! అశ్వినులు వైద్యులనియు వారికి సోమపానములేదనియు మొదట

నిరాకరించిరికాని యదిమొదలు యాజకులందఱు నాశ్వినులకు సోమగ్రహము నొసంగ నంగీకరించిరి. ఇది సుకన్యక చరిత్రము. శర్యాతి కాకన్యకకాక యుత్తానబర్హియనియు, నానర్తుడనియు, భూరిషేణుడనియు మువ్వురు కొడుకులు గలరు. అం దానర్తునకు రైవతుఁడు జనించె. అతఁడు సముద్రమధ్యమునఁ గుశస్థలీనగర మును నిర్మించి యందు నివసించి యానర్తదేశములను బరిపా లించె. ఆకుశస్థలియే పిమ్మట ద్వారకాపురమని పేరు గాంచెను. అతనికి నూర్వురు కొడుకులుపుట్టిరి. వారిలోఁ గకుద్మియనువాఁడు పెద్దవాఁడు. వీరుగాక రైవతునకు రేవతి యనునొక కూఁతురు గలిగెను. ఆ రా జాకన్యకను వెంటఁబెట్టుకొని యా మెకుఁ దగిన వరుఁడెవఁడో తెలిసికొన నిరాటంకముగా బ్రహ్మ లోకమున కేఁగెను.ఇతఁ డచ్చటికిఁబోవునప్పటికి గంధర్వులు గానముచేయు చుండిరి. అందుచేఁ దనకవకాశము గలుగమి క్షణకాలమువేచి యుండెను. గానసభ ముగిసెను. రైవతుఁడు బ్రహ్మకు నమస్క రించి"యీ మెకుఁ దగినభర్త యెవఁ"డనియడిగెను.అతని పలుకులు విని నవ్వి బ్రహ్మ రైవతున కిట్లనియె." ఓరాజా!ఇక్కడ నొకక్షణ కాలము గతించిన భూలోకమునఁ బెద్దకాలము వ్యతిక్రమించి యుండును. నీ విచట క్షణకాల మున్నాఁడవు. ఈ కాలములోనే మానవులకు నాలుగు యుగములు నిరువదియేఁడుపర్యాయములు గడచెను. నీవు వచ్చునప్పుడు నీకూఁతున కెవని భర్తగా నిశ్చ యించుకొని వచ్చితివో వాఁడిప్పుడు లేఁడు. నీవెఱిగినవా రిప్పుడు భూలోకమున లేరు. వారందఱును గాలముచే సంహరింపఁబడిరి. వారుగాని,వారి పౌత్రులుగాని వారి గోత్రములుగాని యిప్పుడు వినఁబడవు. కావున నీ విప్పుడు భూలోకమున కరుగుము. నారా

యణాంశసంభూతుఁ డగుబలరాముఁ డనునొక మహాబలుఁ డు న్నాఁడు. అతని కీ కన్యారత్నము నిచ్చి పెండ్లిచేయుము. అతని సామాన్యునిఁగా నెంచకుము. అతఁడు భూభారమును హరింపఁ గోరి నిజాంశముచే భూమిలో నవతరించిన నారాయణుఁడే. పుణ్యప్రద మగుకీర్తి గలవాఁడు" అని యిట్లు పలుక విని సంత సించి బ్రహ్మకు నమస్కరించి దిక్కులందుండి భూపరిపాలన మొన ర్చుచున్న కకుద్మి మొదలగువారిచే చేవిడువఁబడియున్న యా కుశస్థలిని జేరెను. అప్పు డాపురము యాదవులచేఁ బరిపాలింపఁ బడుచుండెను. రైవతుఁడు దానినిజొచ్చి సుందరాంగియగు తన కూఁతును బలరామునకిచ్చి పెండ్లిచేసి తపమొనరింప బదరికా వనమున కరిగెను. ఇది మూఁడవయధ్యాయము.

అంబరీషోపాఖ్యానము.

ఓ రాజేంద్రా! ఇఁక మనుపుత్త్రుఁ డగునభగునిచరిత్రమును జెప్పెదను వినుము. ఆ నభగునకుఁ బెక్కుఁడు కొమరులు గలరు. అందులో నాభాగుఁ డనువాఁడు కనిష్ఠుఁడు. అతఁడు చిరకాలము గురుకులమందుండి విద్యాభ్యాసముచేసి జ్ఞానవంతుఁ డయ్యెను. అతని సోదరులు నాభాగుఁడు బ్రహ్మచారి యనియు జ్ఞానికావున నై హికసుఖములం దాశ లేనివాఁడనియు నిశ్చయించి పిత్రార్జిత మగుదానిలోనతనిభాగము వేఱుపఱుపక తమలోఁ దాముపంచు కొనిరి. అనంతర మతఁడువచ్చి తనభాగము తనకిండని సోదరుల నడిగెను. పంచుకొనునప్పుడు నిన్ను మఱచితిమి. ఇప్పుడు పంచి యిచ్చుటకు మా కవకాశము లేదు.తండ్రియొద్దకుఁ బోవుడము. అతఁడు భాగ మీవలసినదని చెప్పిన నిచ్చెదము" అని పల్క-

నతఁ డందుల కంగీకరించి జనకుపాలికరిగి సోదరులు తనకుఁ బాలీ యకుండఁ బంచికొనిరనియు, నది యన్యాయము గావున దనకుఁ గూడ నందులో భాగ మిప్పింపుమనియుఁ గోరెను. జనకుఁ డది విని కుమారుంజూచి యిట్లనియె. "పుత్రా ! నీ సోదరులు వంచిం చి పుచ్చుకొనిరి. వంచిత మగుధనమును నీవాశింపకుము. నాకు జీవనోపాధి యెట్లందువేని చెప్పెదను వినుము. ఇదిగో,ఈ సమీ పమునఁ బేధావంతు లగునాంగిరసులు సత్రయాగమును జేయు చున్నారు. అది పండ్రెండుదినముల పరిమితి గలది. ఆంగి రసులు బుద్ధిమంతులయ్యు నాఱవదినమునఁ జేయవలసిన క్రియా కలాపమునకుఁగల క్రమమును దెలియఁజాలక తడఁబడుచుం దురు. నాఁడు రెండుసూ క్తములు చెప్పవలయును. ఆంగిరసుల కా సూ క్తములు రెండునురావు. అవివచ్చినఁగాని క్రియావిధా నము తెలియదు. నీవిపు డచ్చటికిఁబోయి సమయముఁజేచి "మ హాత్ములకు నేను జెప్పనా" యని సందేహింపక యీ సూ క్త ములను నీవు చెప్పము. కర్మసమా ప్తి యైనతోడనే వారు స్వర్గ మునకుఁ బోవుదురు.కాన నప్పుడు నీయుపకారమునకుఁ బ్రత్యుప కారముగా మిగిలిన యాగధనమును నీకొసంగుదురు. అది నీజీవ నోపాధికిఁజాలును. నీవిప్ప డచ్చటి కరుగుము" అని తండ్రిచెప్ప విని సంతసించి నాభాగుఁ డట్లొనరించెను. సత్రయాగమున మిగి లిన ద్రవ్యమంతయు నాభాగునకిచ్చి యాంగిరసులు స్వర్గమున కరిగిరి. పిమ్మట నాభాగుఁడు యాగావశిష్టధనమును స్వీకరించు చుండ నల్లని యాకారముగల యొకపురుషుఁ డచటికివచ్చి యద లించి యీ ద్రవ్యమంతయుఁ దనకుఁ జెందవలెనని చెప్పి యడ్డ గించెను. మును లాద్రవ్యమును దనకిచ్చెనని నాభాగుఁ డనియె.

దాని కాపురుషుఁడు సమ్మతింపక "ఓయీ! దీనికి వివాద మేల? నీజనకుని కీవివాదాంశమును దెలుపుము. అతఁడు చెప్పి నట్లుమన మిరువుర మొప్పుకొంద"మని పల్కెను. నాభాగుఁడం దుల కంగీకరించి తండ్రిని సమీపించి యీ వివాదమును దెలి పెను. ఆతఁడు కొంచెము యోజించి "కుమారా! ఆ వచ్చిన వాఁడు రుద్రుఁడు. ఒకప్పుడు దక్షాధ్వరమున ఋషులంద ఱేకీభ వించి 'యాగశిష్ట మగుద్రవ్యమంతయు శంకరుని భాగము; అతనికిఁ జెందవలయు'నని నిర్ణయించిరి; యజ్ఞసంబంధి యగునా వస్తుజాతమంతయు నతనికే చెందవలె"నని తీర్పు చేసెను. నాభా గుఁ డదివిని యీవస్తుజాతమును దాను గ్రహింపఁ దగినయుపా యము నరయఁజాలక రుద్రుని సమీపించి నమస్కరించి యిట్ల నియె. "ఓశంకరా! మిగిలిన యజ్ఞధనమంతయు నీకే చెందవలయు నని మా జనకుఁడు చెప్పియున్నాఁడు. అదంతయు నీదే. అయినను నీవు నన్నను గ్రహించి యీ ద్రవ్యము నొసంగ వేఁడెదను. నీకు వందన మాచరించెదను." అని పల్కుచు నతని పాదముల పయిఁబడెను. రుద్రుఁ డతనిఁ గరుణించి యిట్లనియె. "ఓ నా భాగా! నీతండ్రి ధర్మముగాఁ దీర్చెను. నీవును సత్యమును బలికి తివి. సంతసించితిని. మంత్రద్రష్ట వగునీకు బ్రహ్మవిషయక మగు జ్ఞాన ముపదేశించెదను. గొప్ప యాపద సంభవించినను నీవొక ప్పుడును గల్ల లాడకుము; సత్యమునేపలుకుము. దానివలన నేను సంతసించెదను. నీవు నాకుం బ్రియుఁడ వగుదువు. యజ్ఞపరిశేషిత మగుద్రవ్యమును నీ కిచ్చితిని. పుచ్చుకొనుము" అనిపల్కి సత్య వత్సలుఁ డయినశివుం డచ్చటనే యంతర్ధానము చెందెను. ఓ రాజా! ఎవఁ డీ చరిత్రము నుదయసాయంకాలములందు నిశ్చల

మనస్సుతో స్మరించునో వాఁడు జ్ఞానవంతుఁ డగును; మంత్ర విదుఁ డగును; జీవాత్మ పరమాత్మల తత్త్వమును దెలిసినవాఁ డగును. ఆ నాభాగున కంబరీషుఁ డుదయించెను. అతఁడు పుణ్యాత్ముఁడు. మహాభక్తుఁడు. అమోఘమగు బ్రాహ్మణశాపమయి నను నతని స్పృశింపలేకపోయెను" అని పలికిన శుకునింజూచి రాజు "ఓ మునీంద్రా! రాజర్షియు బుద్ధిమంతుఁడు నగునంబరీషుని చరిత్రమువిన మనస్సు వేడుకపడుచున్నది. త్రిప్పఁ దరముకాని బ్రహ్మశాపముగూడ నతని బాధింపఁజాలకపోయె నని చెప్పితివి. అదియద్భుతముగా నున్నది. చెప్పు"మని వేఁడగా శుకమునీంద్రుఁ డతని కిట్లనియె. "పుణ్యాత్ముఁ డగునంబరీషునకు సప్తద్వీపపరిమిత మగు భూమండలముగలదు. నాశనములేని సంపదలు గలవు. ఇతరులకు లభింపని యుత్తమభోగ్యవస్తువులు కలవు. అయిన నతఁడవి యన్నియుఁ గలలోఁ గానవచ్చిన పదార్థములవలె నశ్వరములని యు వాని నమ్మి చరించినచోఁ బురుషుఁడు నరకము నొందు ననియు నిశ్చయించెను. అతఁ డిట్లు కేవలము విరక్తుఁడగుటయే కాక భగవంతుఁ డగువానుదేవునియందును, సాధువులగుతద్భక్తులందును మిక్కిలి భక్తినిజూపుచు, నీ విశ్వమంతయుఁ జిల్లి గవ్వవలె గ్రహింపఁబడగినదికాదని తలంచెను. ఎల్లప్పు డతనిచిత్తము కృష్ణుని పాదపద్మములనే ధ్యానించుచుండును. అతని వాక్కు వైకుంఠుని గుణగణములనే వర్ణించుచుండును. అతని చేతులు శ్రీహరిమందిరముల శుభ్రపఱుచుచునే యుండును. అతని చెవు లెప్పుడును హరికథలనే వినుచుండును. అతని నేత్రములు సతత మా ముకుందుని విగ్రహములను, నాలయములను మాత్రమే దర్శించుచుండు. అతని త్వగింద్రియము సర్వదా హరి

భక్తుల శరీరములను మాత్రమే స్పృశించుచుండును. అతని నాసిక భగవంతుని పాదపద్మ పరిమళములగల తులసీదళములను మాత్రమే మూర్కొనుచుండును. అతని జిహ్వా పరమేశ్వరునికి నివేదితమగు పదార్థములమాత్రమే రుచిచూచుచుండును. అతని పాదము లెప్పుడు పుణ్యక్షేత్రమార్గములందే చరించుచుండు. అతని శిరస్సు సంతతము హరికి నమస్కరించుచు నిర్మాల్యమును స్వీకరించుచునేయుండును. అతఁడు సర్వదా భగవద్భక్తులతోఁ గలసి యిట్లవయవములను, నింద్రియములను, గాలమును సద్వినియోగము చేయుచుండును. ఇట్లమహారాజు మనోవాక్కాయములచే నొనర్చు కర్మముల నన్నింటిని యజ్ఞనిర్వాహకుఁడయినవిష్ణువునకు సమర్పించుచు భగవద్భక్తులగువసిష్ఠాదిమహామునుల యాలోచనము ననుసరించి భూమిని బాలించుచుండెను. అతఁడు వసిష్ఠుడు, అసితుఁడు, గౌతముఁడు మొదలగు మునుల సాయమునుబడసి తనసంపదలచే మహాదక్షిణలు గలయశ్వమేధయాగములొనర్చి వానిచే హరినారాధించెను. అతఁడునదీప్రవాహమున కభిముఖముగానుండి యాగము చేయుతలంపుతో నా మరుప్రదేశమును విడిచి సరస్వతీనది కేఁగెను. అతని యశ్వమేధములందు సభ్యులును, ఋత్విజులును, జూడవచ్చినజనులును నలంకారాదులచే దేవతలతోఁ దుల్యరూపులయి కానవచ్చిరఁట! ఇంద్రాది దేవతలును శుభ్రవస్త్రములను, మనోహరము లగువిభూషణములను దాల్చి ప్రత్యక్షముగాఁ గనఁబడిరఁట! ఆ యంబరీషుఁడు తన జనులచే హరికథలను గానముచేయించుచుండును; ఆ కథలను భక్తితో వినునట్లు చేయుచుండును. అతఁడతని జనులకు స్వర్గసుఖమునుమించిన సుఖమును భూలోకమందే కలిగించు

చుండుటచే స్వర్గమపేక్షించువాఁ డొక్కఁడును లేఁడు. అతని జనులే స్వర్గమును గోరనప్పు డతనిమాట చెప్పనేల! ఇట్లారాజు తన జనులను గేనలము వస్త్రాలంకారాదులచేతనే దేవసము లుగాఁ జేయుటకాక సుఖమందుఁగూడఁ దత్సములఁగాఁ జేసెను. మఱియు సమస్తము బ్రహ్మాత్మకమని తలంచుచు నాత్మానంద మనుభవించుచు సర్వదా ముకుందునిఁ దమతమ హృదయ ముల దర్శించు చున్నయా జనులను యోగీశ్వరులకు దుర్ల భము లగుననిమాదిసిద్ధులే సంతసింపఁజేయలేవు. ఇఁకస్వర్గాది లిట్టివారు. ఆ మహారాజు స్వకులమునకుఁ దగినవియు సంగరహి తములు నగుకర్మముల నాచరించుచు భక్తియోగముచే హరిని సంతసింపఁజేయుచుఁ గ్రమముగా సకలసంగములను వదలెను. అతఁడు సుందరము లగుగృహములను, భార్యలను, గుమారు లను, బంధువులను, నుత్తమగజములును, రథములును, గుఱ్ఱ ములను నమితము లగునస్త్రములను, వెలలేని యలంకారము లను, నాయుధములను హేయములగాను, నశ్వరములగాను జూచుచుండువాఁడు. అతని నిశ్చలభక్తియోగమునకు హరి ప్రీ తుఁడై విపక్షులకు భయంకరమై, భీతులను రక్షింపఁజాలిన తన చక్రము నతని కొసంగెను. ఆ యంబరీషుఁడు భగవంతునా రాధింపఁదలంచి తనకన్నివిధములచేతను సాటివచ్చు భార్యతోఁ గూడి యొకసంవత్సరముతో ముగిసెడుద్వాదశీ వ్రతముచేసెను. ఆవ్రతాంతమునఁ గార్తికమాసమందు మూఁడుదినము లుపవా సముచేసి నాల్గవదినమగు ద్వాదశినాఁడు యమునలోఁ దాన మాడి మధువనమును బ్రవేశించి గంధపుష్పధూపాదులగు సమ స్త పూజాద్రవ్యములను సమకూర్చి హరిని బ్రతిష్ఠించి సహస్ర

ఘటములచే నభిషేకముగావించి శ్రేష్ఠములగు నాభరణముల చేతను, గంధములచేతను, బూలదండలచేతను, బుష్పములచే తను భక్తితోఁ బూజించెను. కేవలము విష్ణువును దన మనమున నిల్పి మహాత్ములగు బ్రాహ్మణులను, సిద్ధులనుగూడ నొప్పిదము గఁ బూజించె. బంగారుకొమ్ములును, వెండిడెక్కలును, సుంద రము లగువస్త్రములునుదాల్చి చాలినంత పాల నిచ్చుచు మంచి స్వభావముగల్గి శృంగాద్యవయవ సౌష్ఠవముగల్గి క్రొత్తగా నీని వత్ససహితములై యున్న గోవుల నఱువదికోట్లను దోహనపాత్ర ములతోఁగూడ బ్రాహ్మణులకు దానముచేసి బ్రాహ్మణోత్తము లకు ముందుగా షడ్రసోపేతమగు భోజనమిడి డక్షిణలనిచ్చి వారియనుజ్ఞ వడసి పారణచేయసిద్ధుఁడై యుండెను.అంత దైవవశ మున భగవంతుఁ డగుదుర్వాసుఁ డచ్చటి కేతెంచెను. అదివిని యమ్మహారాజతనికెదురుగఁ బోయి కొనివచ్చి యర్ఘ్యాదులిచ్చి యతిథిసత్కారముచేసి యతని పాదములపైఁ బడి నమస్కరించి తనయింట భుజింపవలయునని వేఁడెను. దుర్వాసుఁ డతనిప్రార్థన మంగీకరించి మాధ్యాహ్నికకృత్యములు నెఱవేర్చికొని వచ్చెద ననిచెప్పి యమునానదికిఁ బోయి పరబ్రహ్మమును ధ్యానించుచు నందు స్నానముచేసికొనెను.ఆ ముని త్వరగా రాకపోవుటచేతను, ద్వాదశి యప్పటి కొక యరగడియమాత్రమే మిగిలియుండుట చేతను, దాను పారణచేసినఁగాని వ్రతము దక్కదనియు, బ్రాహ్మ ణోత్తముఁడగు నతిథిని నిరాకరించి పారణచేయుట ధర్మము గాదనియుఁ బ్రాహ్మణులతోఁ జెప్పి యేమిచేసిన తనకు మేలుగలు గునో, యెట్లయినఁ దన్నధర్మము చుట్టుకొనదో యోజింపవల యునని కొంచె మాలోచించి, "ఓ బ్రాహ్మణులారా ! కేవలము

జలముచే వ్రతమున కంగ మగుపారణను జేసెదను. ఉదకపా
నము భుజించుటయుఁగాదు; భుజింపకపోవుటయుఁగాదు. కావున
వ్రతభంగముగాని యతిథి నిరాకరణముగాని కానేర"దని పలికి
యంబరీషుఁడు మనమున హరిని జింతించుచు జలపానముచేసి
ముని యాగమనమును నిరీక్షించుచుండెను. అట దుర్వాసుఁడు
యమునాతీరమున మాధ్యాహ్నికకృత్యములఁ దీర్చి యచ్చటికి
వచ్చి దివ్యజ్ఞానముచే నంబరీషుఁడు చేసినపనిని దెలిసికొని కోపా
తిశయముచే నొడలు కంపింప, బొమముడిచే మొగము భీతి
గొలుప నాకలి యొకమూలబొధింప నిర్వాజులనివాఁడై దోసి
లి పట్టి యున్నయంబరీషునిగుఱించి యిట్లనియె. "ఓ జనులారా!
ఈ రాజు కార్పణస్వభావుఁడు. ఇతఁడైశ్వర్యముచే నెంత మదిం
చెనో చూచితిరా! విష్ణువునకు భక్తుఁడు కాకయే విష్ణుభక్తుఁడ
ననెడియభిమానము వహించినవాఁడు. వీఁడెట్లు ధర్మవిరుద్ధ
ముగాఁ బ్రవర్తించెనో చూచితిరా? వీఁడు తన యాతిథ్యము
కొనుటకు నన్ను రమ్మని పిలిచి తుదకు నాకీయకుండఁగాఁ ధాను
భుజించెను. ఈ ధర్మవ్యతిక్రమమునకుఁ బ్రతిఫలమును ద్వర
లోనె పొందుఁగాక. ఇదిగో నాశక్తిని జూపెదను" అని పలుకు
చు నాముని కోపముచేఁ బ్రకాశించుచున్న జడ నొకదానిని
బెఱికి దానితోఁ నంబరీషునిఁ జంపఁదలంచి కాలాగ్నితుల్య మగు
శక్తిని నిర్మించెను. అంతట నాశక్తి ఖడ్గహస్తయై పాదములచే
భూమిని గంపింపఁజేయుచు నంబరీషున కెదురుగాఁ బోఁగా నతఁ
డు చూచిరవంతేనియు భయమందక నిశ్చలుఁడై హరిని స్మరిం
చుచు నిలువఁబడెను. ఆసమయమున భక్తవత్సలుఁడైనపర
మేశ్వరుఁడు తన భక్తుని రక్షింపఁ జక్రమునాజ్ఞాపింప నదివచ్చి

కోపోద్దీపిత మగుసర్పమును దావాగ్నికరణి నా శక్తిని దహించెను. అనంతర మది యమ్మని కభిముఖముగాఁ బోవుచుండెను. ఆముని యదిచూచి తన ప్రయాసము వ్యర్థమైనందులకు విచారించి భీతుఁడై తనప్రాణములను గాచుకొను తలంపుతోఁ బర్విడఁ జొచ్చెను. ప్రకాశించు మంటలు గలదావాగ్ని సర్పమును వలె నాచక్ర మతని వెంబడించెను. చక్రము తన్నుఁ దఱుము కొని వచ్చుచున్నదని తెలిసికొని ముని మేరుపర్వతగుహలోఁ దాగఁవలెనని పరువెత్తెను. ఆచక్ర మచ్చటికిఁ బోయెను. అంత దుర్వాసుఁడటనుండక దిక్కులకేఁగెను. అంతరిక్షమునకెగిరెను. అతలాదిలోకములకుఁ బోయెను. సముద్రములోఁ దాఁగెను. స్వర్గలోకమునకుఁ బోయెను. వేయేల! తన రక్షకై మూఁడు లోకములందును దిరుగఁజొచ్చెను. అతఁ డెచ్చటికిఁ బోయినను నాచక్రము వదలక దుస్సహాకాంతితోఁ బాధించుచునే యుండెను. రక్షణోపాయ మెచ్చటను దొరకలేదు. అందుచే నతనికి భీతి హెచ్చఁ జొచ్చెను. తుదకతఁడు తన్ను రక్షించువానిఁగూర్చి వెదకుచు సత్యలోకమునకుఁ బోయి బ్రహ్మను గాంచి "ఓ చతుర్ముఖా ! యీభగవచ్చక్రమునుండి నన్నుఁ గాపాడుము" అని మనవిచేసెను. అదివిని బ్రహ్మ యతని కిట్లనియె. " ఓయీ ! ఈ విశ్వము భగవంతునికిఁ గ్రీడాసాధనము. క్రీడావసానమునఁ గ్రీడాసాధన మగవిశ్వము నెట్లు సంహరించునో యట్లె నాస్థాన మునుగూడ నశింపఁజేయును. నాస్థానము రెండు పరార్ధములకాలము తరువాత నుండఁ జాలదు.ఆ పరమేశ్వరుఁడప్ప డీవిశ్వమునుంబోలె నాస్థానమును సయితమును బూమముడిచేతనే దహింపఁజాలినవాఁడు. కాలశరీరకుఁడయిన యమ్మహాత్మునిచక్రమును

మరలించునంత శక్తిమంతుఁడను గాను. ఆతేజమును మరలింప నేనే యశక్తుఁడనుగాను. శంకరుఁడు, దక్షుఁడు, భృగువు మొదలగు ప్రజాపతులు, నేకాదశరుద్రులు, దేవేంద్రాదులు గూడ నసమర్థులే. మేమందఱు మతని యాజ్ఞను శిరసావహించి లోక యాత్రను నడపుచున్నాము. మే మతని సేవకులము. నిన్ను రక్షింప మాతరముగాదు. ఆపరమేశ్వరునే శరణొందుము" అని బ్రహ్మ నిరాకరింపఁగా దూర్వాసుఁడు విష్ణుచక్ర సంతాపమును సహింపలేక శంకరుని మఱుఁగు సొచ్చుటకై కైలాసమున కరి గెను. శంకరుఁ డతనిఁ గాంచి యిట్లనియె. "వత్సా ! మావంటి వారికి సేవింపఁదగు నా పరమేశ్వరుని యఁడను, నతనిచే సృష్ట మగు బ్రహ్మాండమందును, లోకేశుల మనెడియహంకారముతో మేము పురువులవలెఁ దిరుగుచున్నాము. అతఁడు సృజింపఁ దలఁ చినకాలమందు బ్రహ్మాదు లగుజీవు లందఱును బుట్టుచున్నారు. అతఁడు సంహరింపఁ దలఁచినకాలమున నశించు చున్నారు. సనత్కుమారుఁడు, నారదుఁడు, చతుర్ముఖుఁడు, కపిలాచార్యుఁ డు, దేవలుఁడు, ధర్ముఁడు, ఆసురి, మరీచి మొదలగువారు, సర్వ జ్ఞులగు తక్కిన సిద్ధులు, నేను, మేమందఱు మతని మాయచే నావృతులమై యతని చేష్ట నెఱుఁగఁజాలము. ఆ మహాత్ముఁడు దాల్చు చక్రమిది.దీని సహింప మాతరముగాదు. నీ వా చక్రధ రుని మఱుఁగుసొచ్చితివేని సుఖము గల్గును" అని పలుక విని దుర్వాసుఁడు నిరాశచేసికొని, శ్రీమహాలక్ష్మితోఁగూడ శ్రీహరి సర్వకాలములందును నివసించియుండు వైకుంఠమునకుఁ బోయె ను. చక్రవహ్నిచే దహింపఁబడు నాముని యిట్లరిగి వారిని దర్శిం చి యతనిపాదములపైఁ బడి భయకంపితుఁడై యిట్లనియె. "ఓ

నారాయణా ! నీవు శిక్షితులను విడువనివాఁడవు; నీమహిమకు హద్దులేదు. నీవు భక్తులకు మిక్కిలి ప్రియుఁడవు. ఓ జగత్కారణా ! నీవు కరుణించి యపరాధి నగునన్ను రక్షింపుము. ఓదేవా ! నేను నీమహిమ నెఱుఁగఁజాలక నీ భక్తుఁ డగునంబరీషున కపరాధము గావించితిని. ఆ నా యపరాధమును మన్నించి నన్ను రక్షింపుము. ఆలోచింప నీ నామోచ్చారణమే నరకప్రాప్తిని గల్గించు పాపముల సైతము తూలించుచుండ నీ నా పాపమును దొలంగించుట నీ కేపాటిపని?" అని ప్రార్థించు చున్నమునిని గాంచి పరమేశ్వరుఁ డిట్లనియె. " ఓ మునీంద్రా ! అస్వతంత్రుఁడగు రాజసేవకునివలె నేను నా భక్తుల కధీనుఁడను. 'రాజసేవకుఁడు కర్మాధీనుఁడు కాన తన ప్రభువునకు వశ్యుఁడగుట సముచితమే. కాని నిఖలదోషహరుఁడవును, గల్యాణగుణాకరుఁడవును, గర్మాతీతుఁడవును నగునీవు భక్తుల కధీనుఁడవగుట హేయకార్యమే!'యని తలంపకుము. ఆశ్రిత వాత్సల్యముచే వివశుఁడనై న నాకు భక్తాధీనత హేయముకాదు. నాభక్తు లన్నివిధములచేతను నాకుపకారముచేయుచు నాహృదయమును దమయధీనముగా వించుకొనిరి. లోకములోఁ బురుషుఁడు తన చిత్తము ననుసరించి నాచిత్తము ననుసరించుట నాకు విధి. నేను నా భక్తులయిష్టము చొప్పున నడువవలయును. భక్తులు నాకుఁ బ్రియులగుటయే కాక నేను నాభక్తులకుఁగూడఁ బ్రియుఁడనై యుందును. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! * భక్తప్రియుఁడనగు నాకు నాశరీరము గాని, యెప్పుడును నన్ననుసరించు లక్ష్మిగాని నాభక్తులకంటె

*ఇట లక్ష్మీ భక్తులవలెనె విష్ణువునకుఁ బ్రీతివిషయురాలైయుండఁగా లక్ష్మిని సైతము గోరని చెప్పుట యసంగతమే. అయినను నారాయణుఁడు లక్ష్మిశం

నా కధిక ప్రియులుగారు. శరీరలక్ష్ములనైన విడుతునుగాని భక్తులను విడువఁజాలను. ఆలోచింప భార్యలను, గృహములను, బుత్త్రులను, నాప్తులను, ధనమును, నీలోకమును, బరలోకమును, వేయేల! ప్రాణములను గూడవిడిచి నన్ను శరణుసొచ్చుచున్న భక్తజనుల నెట్లు విడువఁగలుగుదును ? భక్తులు తమ చిత్తములను నాయందు నిశ్చలముగా నిలిపి సమస్తమును నా స్వరూపముగానే యెంచుచుఁ బతివ్రతలు తమ భర్తలనుంబోలె నన్ను భక్తిచే వశగతునిఁగావించుచున్నారు. ఆభక్తులు నాభక్తిచే నిండిన వారై నన్ను సేవించుటవలన గలుగుసాలోక్యము,సామీప్యము, సాయుజ్యము, సారూప్యము అను నాల్గువిధములగు ముక్తిని సైత మపేక్షింపరు. అట్లుండఁ గాలమునఁజే నశించునైశ్వర్యాదులను గోరరని వేఱుచెప్పవలయునా? వేయేల? సాధువులు నాహృదయము ననుసరింతురు. నేను సాధుహృదయముల ననుసరింతును. సాధువులకు నన్నుమించిన ప్రియవస్తువు లేదు. నాకు భక్తులను మించిన ప్రియవస్తువు లేదు. నెను దేనినైన సహింపఁగలను. కాని భక్తులకుఁ జేసిన యపరాధమును సహింపజాలను. అయినను నీవు శరణుచొచ్చితివి కావున నీకుఁ బ్రాణరక్షణోపాయమును దెలిపెదను. నీ వెవని కపరాధము గావించితివో యా యంబరీషునిఁ జేరి ప్రార్థింపుము. లోకములో సాధువుల బాధింపవలెనన్నతలంపుతోఁ జేసిన క్రూరకృత్యము తుదకుఁ దన్నే బాధించును. నీ వంబరీషునిఁ జంపఁదలంపుతోఁ జేసిన యపకారము నిన్నే చెందినది. తపస్సు విద్యయు నీరెండను విసీతుఁ

టెను భక్తులు తన కధిక ప్రియులని చెప్పట భక్తులకాధిక్యము లేదని నన్నతలంపుతోనన్నది కాని వాస్తవము కాదని గ్రహింపవలయును.



1527. అంబరీషుని పాదములను దూర్వాసుడు పట్టుకొని క్షమాపణ మడుగుట.

డయిన బ్రాహ్మణునకుఁ బురుషార్థములను సాధించును. దుర్వి నీతున కవిరెండును ననర్థదాయకము లగును. నీ తపోవిద్య లిట్లు విపరీతముగాఁ బరిణమించినందులకు విచారించెదను. పోనిమ్ము. గతమునకు విచారింపక యంబరీషునియొద్దకుఁ బోయి క్షమాప ణము కోరుకొనుము. అతనివలన నీకుఁ దప్పక భద్రముకలుగును. పోయిరమ్ము" అనెను. ఇది నాల్గవయధ్యాయము.

అంబరీషోపాఖ్యానము.

అని యిట్లు భగవంతుఁ డుపదేశింపఁగా దుర్వాసుఁడు చక్రాగ్నిచే దప్తుఁడగుచు దుఃఖితుఁడై చేయునది లేక వేగముగాఁ బోయి యంబరీషుని పాదములు పట్టుకొని రక్షింపుమని ప్రార్థించెను. అంత నంబరీషుఁడు బ్రాహ్మణుఁడువచ్చి తనపాదములు పట్టుకొన్నందులకు సిగ్గుపడి యతని దుఃఖమునుగాంచి జాలిపడి విష్ణుచక్రము నిట్లు నుతించెను. "ఓ యాయుధరాజమా! * నీవే యగ్నివి; నీవే సూర్యుఁడవు; నీవే నక్షత్రాధిపతి యగుచంద్రుఁడవు; నీవేజలమవు; నీవేభూమివి; నీవే యాకాశమవు; నీవే వాయువవు; గంధాది తన్మాత్రలును, ఇంద్రియములును నీకంటె వేఱు

* ఈ ప్రకరణమునఁ జక్రము సకలతేజస్సులకుఁ గారణమయియు, సర్వాత్మక మయియు వర్ణింపఁబడినది. ఆలోచింపఁగా "ఐతదాత్మ్యమిదం సర్వం" "సర్వం ఖల్విదంబ్రహ్మ" "నతత్రభాతి సూర్యోనచంద్రతారకమ్" మొదలగు శ్రుతుల వలన నారాయణుఁడే సర్వాత్మకుఁడనియు, సకలతేజస్సులకుఁ గారణుఁడనియు, నాతేజస్సులను గప్పిపుచ్చువాఁడనియు, సూర్యాదితేజస్సుల ననుగ్రహించి ప్రకాశింపఁజేయువాఁడనియుఁ దెలియఁబడుచున్నది కాని యతఁడాయుధముగాఁ దాల్చి చక్రమట్టి గుణములు గలదని చెప్పఁబడలేదు. అయినను

యినవికావు. ఓ సుదర్శనమా ! నీవు వేయంచులచే బ్రకాశించు దానవు. నీవు విష్ణుపునకుఁ బ్రియమైనదానవు. అట్టి నీకు నమస్కారము. నివెట్టి యస్త్రములనైన నవలీలఁ ద్రుంపఁగలవు. శరణాగతులను రక్షింతువు. నీవు జగమును పాలించుదానవు. జగత్పాలకమవగు నీకు శరణాగత రక్షణము యుక్తమైనది. కావున నీవీ బ్రాహ్మణునిఁ గరుణించి మంగళ రూపమునుదాల్చి యితనికి సుఖములొసంగుము. నీవు ధర్మములను గాతువు. ధైర్యము నొసంగుదువు. నీవు శాశ్వతముగానుందువు. నీవు యజ్ఞములచే నారాధింపఁబడి వానిని సాంతముగా నిర్వహింతువు. నీవు పురుషుని తేజమవు. నీవు సర్వరూపివి. ఓ సునాభమా ! నీవు సకల ధర్మశీలురగు రాజుల పాలిటఁదోడుకచ్చువు. నీవుముల్లోకములఁ గాచుదానవు. నిర్మలమగు కాంతిగలదానవు. నీవధికమగు మనోజవముచే నొప్పుచు నద్భుతకార్యముల నొనర్చుదానవు. అట్టి నీకు నమస్కారము. ధర్మములను వర్ధించుచున్న నీతేజస్సుచే మహాత్ముల దృష్టికిఁగానవచ్చు చీఁకటి నిరసింపఁబడినది. నీమహిమ యెట్టివారికి దెలియఁదరముకాదు. స్థూలసూక్ష్ముములను, సూక్ష్ముములను నగుచిదచిత్తులచేఁ బరిణమించిన విశ్వమంతయు నీకంటె భిన్నమైనదికాదు. నిరంజనుఁడగు పరమపురుషుఁ డాజ్ఞాపించినప్పుడు నీవు బలశాలులయిన దైత్యదానవ సైన్యములను జొచ్చి సులభముగా వారి బాహువులను, జఠరములను, దొడలను, బాదములను, గంఠములను, నర్వదాఖండించుచు మిక్కిలి ప్రకా

దక్కిన ప్రపంచమునఁదలఁ జక్రమునుగూడ భగవంతునకు శరీరభూతమే కనుక చక్రమునుగూర్చి చేసిన స్తోత్రము శరీర శరీరి న్యాయమునఁ చక్రశరీరకుఁ డగుపరమపురుషునండే పర్యవసన్న మగుచున్నదని తెలియఁదగును.

శించుచుండువు. సాధుజనులను రక్షించుటకును, దుష్టుల శిక్షించుటకును నిన్నుఁ బరమపురుషుఁడు నియమించియున్నాఁడు. నీవు శరణాగతుల యపరాధములనెల్ల సహించుదానవు. కావున శరణాగతుఁడయిన యీవిప్రుని రక్షించి నాకులము నిలువఁబెట్టుము. లేనిచో బ్రహ్మహత్యాదోషముచే నావంశము నశించిపోవును. ఈవిప్రునిఁ గావుము. ఇతనిఁగాచుట నీయాయుదము దయచూపుటయే. నేఁ జేసినదానము, నే నాచరించిన యజ్ఞాదులు, నేనడుపుచున్న వర్ణాశ్రమ ధర్మములు, పరమపురుషుని సంతసింపఁ జేయఁజాలునేని, నావంశము బ్రాహ్మణులనే దైవముగాభావించుచుండెనేని, యీబ్రాహ్మణుఁడు బొధారహితుఁడై సుఖించుఁగాక. సకలకల్యాణ గుణములకును నిలయుఁడయిన పరమేశ్వరుఁడు నేను జేయుచున్న బ్రహ్మోపాసనచే సంతుష్టి చెందెనేని యీవిప్రుఁడు దుఃఖముమానిచి సుఖించుఁగాక:" అని యిట్లును తిరప నాదక్రమతనికిఁ బ్రసన్నమై శాంతించి యంబరీషుని యను మతిచే నతనివిడిచి వెళ్లెను. అంత దుర్వాసుఁడు చక్రతాపము తొలంగుటచే సుఖియై యాకాశమును దీవించుచు నిట్లు స్తోత్రము చేసెను. "ఓరాజేంద్రా! అచ్యుతా! విష్ణుభక్తులమహిమ నిప్పుడు మాచితిని. నీపు నేనపరాధము చేసినను నాపు నీ వుపకారము చేసి నీయౌదార్యమును వెల్లడించితివి. భక్తప్రియుఁడును, నాశ్రితార్తిహరుఁడు నగుహరిని వశము గావించుకొన్న సాధుల కసాధ్యమగు కార్యమేనిగలదు? వారలపు విముఖరానిదేనిగలదు? నారాయణుని నామమును విన్నంతమాత్రనే పురుషుఁడు పాపరహితుఁడగుచున్నాఁడు. అతని పాదము లోకపావనియగు గంగానదికి జన్మస్థానము. అట్టి పరమపురుషుని భక్తులగు మీకు

నలభ్యమగున దేదికలదు? ఓ రాజా! మిక్కిలి దయాళుఁడవై నీవు నన్నను గ్రహించితివి. నాయపరాధమును లెక్కఁగొనక నాప్రాణముల నిచ్చికాపాడితివి" అని పొగడుచున్న దుర్వాసునిఁగాంచి సంతసించి నిరాహారుఁడైన రాజతని పాదముల పైఁబడి ప్రసన్నునిగాఁజేసి భుజింపఁజేసెను. అనంతరము దుర్వాసుఁడు రాజాదరముతో నిచ్చిన షడ్రసోపేతమగు నాహారమును గొని సంతుష్టచిత్తుఁడై యతని దీవించి యిట్లనియె. "ఓరాజా! భగవద్భక్తుఁడవగు నీవలనఁ బ్రీతుఁడనైతి. అనుగ్రహింపఁబడితిని. నిన్నుఁ జూచుటచేతను, నిన్నుఁ దాఁకుటచేతను, నీ మృదులాపములచేతను కృతార్థుఁడనైతిని. నీవిచ్చిన యాతిథ్యముచేఁ దృప్తినొందితిని. నీవొనర్చిన యీ పుణ్యకార్యము స్వర్గలోకమున దేవతాస్త్రీలు గానము చేయఁగలరు. నీకీర్తిని భూలోకవాసులందఱు నుతింపఁగలరు" అని యిట్లనుతించి యా మునిరాజు ననుమతివడసి యాకాశమార్గమున సత్యలోకమున కేఁగెను. అమునియంబరీషుని యొద్దకువచ్చినది మొదలు చక్రభీతుఁడై దిక్కులందు దిరిగి మగిడివచ్చుట కొకసంవత్సరకాలము పట్టెను. అయిన నంబరీషుఁడాహారమును గొనక కేవల ముదకమును మాత్రము గ్రోలుచు నతనిరాకను గోరుచునుండెను. దుర్వాసుఁడు భుజించిపోయిన పిమ్మటఁ దద్భక్తశేషమును దినిచక్రమువలన నామునికి దుఃఖము గల్గుటయు, దొలఁగుటయు, దవకాసమయమున నట్టిధైర్యాదులు గలుగుటయుఁ బరమాత్మప్రభావమువలననే యని తలంచుచుండెను. ఓనరేంద్రా! సుగుణపుంజమనఁదగిన యంబరీషుఁడు పరమాత్మయగు వాసుదేవుని యందు నిశ్చలభక్తిని నిలిపి దానిచే సత్యలోక పర్యంతము

గల సుఖములనన్నింటిని నరకతుల్యములఁగా భావించెను. పిమ్మట నంబరీషుఁడు సత్పాత్ర రత్నమునఁ దనతోఁ దుల్యులగు కుమారులను రాజ్యమిచ్చి యింద్రియముల జయించి యాశను బాఱఁదోలి వనమునకుఁ బోయి వాసుదేవునియందుఁ జిత్తమును నిశ్చలముగానుంచి సంసారమునువిడిచి ముక్తుఁడయ్యెను. ఈ యంబరీషుని పుణ్యచరిత్రమును సంతతమును బొగుడుచు ధ్యానించుచున్నవాఁడు తప్పక భక్తుఁడగును. ఇది నైవవయధ్యాయము.

అంబరీషుని వంశవర్ణనము ; శకుని చరిత్రము ; సౌభరి చరిత్రము.

ఓరాజా ! ఆయంబరీషునకు విరూపుఁడనియుఁ గేతుమంతుఁడనియు శంభుఁడనియు ముగ్గురుపుత్త్రులు గల్గిరి. వారిలోవిరూపునికిఁ బృషదశ్వుఁడు కలిగె. వానికి రథీతరుఁడు జన్మించె. సంతానము లేకపోవుటచే నతఁడు విచారించుచు నంగిరసునిఁ బ్రార్థింప నతఁడా రథీతరుని భార్యయందు బ్రహ్మవర్చసోపేతులగు సుతులనుబుట్టించెను. వారు రథీతరుని క్షేత్రమందుఁ బుట్టుటచే రథీతరగోత్రులనియు,నంగిరసుని బీజమువలన జన్మించుటంజేసి యాంగిరసులనియుఁ జెప్పఁబడిరి. కావుననే రథీతర పుత్త్రుల సంతానమువారి ప్రవరలో బ్రాహ్మణులును, క్షత్త్రియులును గలిసియుండిరి. ఓరాజేంద్రా ! ఇఁక నిక్ష్వాకుని వంశమును వర్ణించెదను. వైవస్వతమనువు తుమ్మఁగా నతనిముక్కువలన నిక్ష్వాకుఁడను ప్రసిద్ధపుత్త్రుఁడు గలిగె. అతనికి నూర్వురు తనయులు గల్గిరి. వారిలో వికుక్షి, నిమి, దండకుఁడు ననువారు పెద్దవారు. ఈ ముగ్గురును ఆర్యావర్తమునకుఁ బ్రభువులైరి. తక్కినవారి

లో నిరువదియైదుసురారాష్ట్రమునకుఁ దూర్పున సముద్ర
మువఱకుఁ గల్గిన భూమికిఁ బ్రభువులైరి. అల్లె యార్యావర్తము
నకుఁ బడమటనున్న భూమి కిరువది యైదుగురురాజులైరి. ఇఁక
మిగిలినవారు దక్షిణోత్తర భాగముల నేలఁ దొడఁగిరి. అందఱ
లోను బెద్దవాఁడగు వికుక్షియొకప్పుడు జనకాజ్ఞచే నష్టకశ్రాద్ధము
నిమిత్తము మాంసమును దెచ్చుటకై యడవికేఁగి శ్రాద్ధము
నకుఁ దగిన మృగములనుజంపి యాయాసముచేతను, నాఁకలిచే
తను మిక్కిలి బడలి శ్రాద్ధార్థము సంపాదింపఁబడినవానిఁ దినఁ
గూడదను జ్ఞానములేక వానిలో నొకశశమును దిని తక్కిన
వానిని దండ్రికిచ్చెను. అనంతర మిక్ష్వాకువు వసిష్ఠునిఁ గాంచి
"ప్రోక్షణచే మాంసమును సంస్కరింపు" మని పల్కఁ తఁడ
యుచ్ఛిష్టమనియు శ్రాద్ధమునకుఁ దగదనియుఁ జెప్పెను. ఇక్ష్వా
కుఁడు గురువునలనఁ దనకుమారుఁడు చేసిన దుష్కర్మమును
దెలిసికొని నియమము నతిక్రమించిన వికుక్షిని గోపించి తనదేశ
మునుండి తఱిమివేసెను. పిమ్మట నిక్ష్వాకుఁడు తపమునేయుచు
గురుసహితుఁడై భగవంతుని సద్గుణముల ననుపదించుచు దాని
వలన విరక్తుఁడై ప్రారబ్ధావసానమునఁ గళేబరమును విడిచి
ముక్తుఁడయ్యె. తండ్రి ముక్తిచెందుటఁ దెలిసికొని వికుక్షి
మరలి వచ్చి యీ భూమండలమునుఁ బాలించుచుఁ బరమేశ్వర
ప్రీతికై యజ్ఞము లొనర్చి శ్రాద్ధముకొఱకుఁ దెచ్చిన శశమును
భక్షించుటఁ జేసి శశాదుఁడను నామమును వహించి సుప్రసిద్ధు
డయ్యె. ఆ వికుక్షికిఁ బురంజయుఁ డనుకుమారుఁ డుదయించె.
పూర్వము సురాసురులకు సమరము సంభవించెను. అందురాక్ష
సులు ప్రబలులయి దేవతలను బరాభవించి తఱిమిరి. విశ్వేశ్వరుఁ

డయిన విష్ణు వదిచూచి పురంజయుని సురలకు సహాయునిఁగాఁ బంపె. అంత నతఁడు వృషభరూపము దాల్చిన యింద్రునిపైఁ గూర్చుండి దేవతలచే సన్నుతుఁడై కవచమును దొడిగి దివ్య చాపమును, నిశితశరములను ధరించి విష్ణువుతేజస్సుచే వర్ధిల్లుఁడై సురలతోఁ గూడి పడమటిదిక్కున కరిగి దైత్యులపురముల నరికట్టెను. అచ్చట నా పురవాసులకును బురంజయునకును దలఁచిన భయము గల్గింపఁజాలు ఘోరయుద్ధమయ్యెను. పురంజయుఁడు మహాశౌర్యముతోఁ బోరాడి పెక్కండ్రను జంపెను. తక్కిన దైత్యులు ప్రళయకాలాగ్నివలె దుస్సహుఁడైనపురంజయుని బాణఘాతములకోర్వఁజాలక పరిపిడి పాతాళమున దాఁగిరి. ఇట్లు పురంజయుఁడు దైత్యులను జయించి వారి పురములను, ధనములను గొనివచ్చి యింద్రున కర్పించెను. ఆ రాజు పురములను జయించుటచేఁ బురంజయుఁడనియు, నింద్రుని వాహనముగాఁ జేసికొనుటచే నింద్రవాహనుఁడనియు, వృషభముయొక్క ककుత్తు (మూఁపురము) నందుఁ గూర్చుండుటఁజేసి ककుత్స్థుఁడనియు నామములచేఁ బిలువఁబడెను. ఆపురంజయునకు అనేనసుఁ డనుకుమారుఁడు గలిగెను. వానికిఁ బృథువును, బృథువునకు విశ్వగంధుఁడును, నతనికిఁ జంద్రుఁడును, నాయనకు యువనాశ్వుఁడును, నతనికి శాబస్తియునుదయించిరి. అతఁడు శాబస్తి యనుపురమును నిర్మించి ప్రసిద్ధిగాంచెను. ఆ శాబస్తికిఁ బృహదశ్వుఁడును, నతనికిఁ గువలయాశ్వుఁడును జనించిరి. బలవంతుఁడగు కువలయాశ్వుఁ డిరువదియొక వేగురగు తనపుత్త్రులతోఁ గలిసి యుదంకమునికిఁ బ్రియముగా ధుంధుఁ డనుదైత్యునితో యుద్ధముచేసి చంపెను.

కాన నతనికి ధుంధుమారుఁ డనునామాంతరము గల్గినది. ఆ యు
ద్ధమున నతని కుమారులలో ముగ్గురు తప్ప దక్కిన వారంద
ును ధుంధుని ముఖాగ్ని కాహుతులైరి. ఆ మిగిలినవారు,
దృఢాశ్వుఁ డనియుఁ, గపిలాశ్వుఁ డనియు, భద్రాశ్వుఁ డనియు,
నామములు గలవారు. అందు దృఢాశ్వునకు హర్యశ్వుఁడును,
అతనికిని గుంభుఁడును వానికి బర్హ్ణాశ్వుఁడును, వానికిఁ గృశా
శ్వుఁడును, వానికి సేనజిత్తును, వానికి యువనాశ్వుఁడును నుద
యించిరి. ఆ యువనాశ్వునికి సంతానము లేనందున మిక్కిలి
విచారము నందుచుఁ దననూర్వురు భార్యలతోను వనమున కరి
గెను. అచ్చటిమును లతనివిచారమును జూచి జాలిపడి సమా
హితచిత్తులై యతనిచే నింద్రదేవతాకమగు పుత్రకామేష్టిని
జేయించిరి. ఆ యాగకాలమున నొకనాటిరాత్రి రాజు మిక్కిలి
దప్పిగొని యజ్ఞశాలను బ్రవేశించి యచ్చట శయనించియున్న
విప్రులను జూచి పలుకరింపక భార్య త్రావఁదగిన మంత్రజల
మును దానే పానముచేసెను. పిమ్మట మునులు లేచి మంత్రజల
ము లేని కలశమును జూచి విచారించుచు రాజు నొద్దకేగి "ఓరా
జా! ఎవఁ డీపనిచేసెను? పుత్రోత్పత్తికిఁ గారణమగు నీ మంత్ర
జలము నెవఁడు త్రావెను?" అని యడిగి దైవవశమున రాజే
యాపని గావించెనని యెఱిఁగి దైవబలము ముఖ్యమైనదియుఁ
బురుషబల మెందుకును బనికిరాదనియుఁ దలంచి భగవంతునకు
నమస్కరించిరి. కొంతకాల మేగునప్పటికి యువనాశ్వుని దక్షిణ
కుక్షిని భేదించుకొని యొకమహాపురుషుఁ డుదయించెను. అట్లు
పుట్టి పిల్లఁ డాకలికోర్వ జాలక యేడ్చుచుండ మునులుగాంచి
"చనుఁబాలులేక పోవుటంజేసి వీఁడిట్లేడ్చుచున్నాఁడు. వీఁడిఁక నేమి

పానముచేసి జీవించు"నని పలుకఁగాఁ బుత్రకామేష్టిచే నారాధితుఁడగు నింద్రుఁడువచ్చి "నన్నుఁ బానముచేయు"నని చెప్పి యమృతమును స్రవించుచున్న చూపుడువ్రేలిని గుడువఁబెట్టెను. కావున *మాంధాత యనునామ మతనికిఁ గల్గె. కుమారుఁడు కడుపు భేదించుకొని పుట్టినను యువనాశ్వుఁడు విప్రుల దయగలవాఁడగుటచేతను స్మృతినొందలేదు. కాని యనంతరమతఁ డచ్చటనే తపస్సుచేసి ముక్తిచెందెను. ఓ పరీక్షిన్న రేంద్రా! ఆ మాంధాత రావణాసురుఁడు మొదలగు దొంగలకు భయము పుట్టించిన వాఁడగుటచే నతనికి త్రసదస్యుఁడను బిరుదనామము నింద్రుఁడొనర్చెను. యువనాశ్వకుమారుఁడగుమాంధాత సమర్థుఁడై చక్రవర్తియై సప్తద్వీపాత్మకమగు భూవలయము నిరంకుశముగా మొక్కఁబోని పరాక్రమముచేఁ బరిపాలించెను. ఆత్మజ్ఞాన సంపన్నుండయిన మాంధాత బహు దక్షిణలుగల యజ్ఞములను జేసి సర్వదేవమయుఁడును, దన తేజస్సుచేతనే ప్రకాశించువాఁడును, సర్వమున కంతరాత్మయు నగు నారాయణుని సంతసింపఁ జేసెను. మఱియుఁ బురోడాశాది ద్రవ్యము, మంత్రములు, విధానము, కర్తయు ఋత్విజులును, ధర్మములును, దేశమును, గాలమును, నీ సమస్త మెవనిస్వరూపమో యట్టి పరమేశ్వరుఁడతని యాగములకు సంతసించెను. యువనాశ్వుఁడు పాలించిన భూమండలము చక్రవాళ పర్యంతము వ్యాపించి యున్నదని చెప్పుదురు. ఆ మాంధాత శతబిందుని కుమారిక బిందుమతిని వరించి పురు

---

* మాంధాత, ధాత యనఁగాఁ బానము చేయువాఁడని యర్థము. "మాం" అనఁగా "నన్ను" అని యర్థము. ఇంద్రుఁడు "నన్నుఁ బానముచేయు" నను నర్థముగల "మాంధాతా" యనుపదమును జెప్పుటచే నతని కా పేరుగల్గినది.

కుత్సుడు మొదలగు కుమారులను నేఁబండ్రఁ గూతులకు బడ సెను. ఆ కూతులండఱును సౌభరియను మహర్షిని పెండ్లాడిరి. ఆ వృత్తాంతమును జెప్పెద వినుము. ఆ సౌభరి యొకనాఁడు యమునానదిలో మునిఁగి తపమొనర్చుచు నందు పెద్ద మత్స్య ము పొందుచున్న మైథున సుఖమును జూచి యట్టి సుఖము తా ననుభవింపవలెనని యపేక్షించి మాంధాతను సమీపించి నీ కుమారికలలో నొకదాని నాకిచ్చి పెండ్లిచేయుమని వేఁడెను. మాంధాతవాని ముదిసలి రూపమును జూచి రోసియుఁ దాను నిరాకరింపక "ఓ మునీంద్రా! నా కన్యలకు స్వయంవరమ హోత్సవము గావించెదను. అందు వారిలో నీ యిష్టమగు దాని వరింపవచ్చు" నని పలికెను. సౌభరిరాజు మాటనిని "ఈ రాజు స్త్రీల కసహ్యమగు నా రూపమును, మడుతలు పడియున్న, నా శరీరమును, వడఁకుచున్న నా శిరస్సును,ఇట్టివానికి నా కూతు నెట్టిచ్చెద" నని యూహించి నన్నుఁ దిరస్కరించెను. కానిమ్ము. దేవతా స్త్రీలకుఁగూడఁ గోరఁదగిన రూపమును నాతపః ప్రభా వమున సంపాదింపఁగలను. ఇట్లుండ మానవ కన్యలకుఁ గాంక్ష ణీయమగు వాని సంపాదించుటలో వింతయేమున్నది?" అని నిశ్చయించుకొని రాజాజ్ఞను బడసి యంతఃపురమును బ్రవేశిం చెను. ఆ కన్యకలు యోగవశము మహా సౌందర్యవంతుఁడగు నతనిఁ జూచి "నేనే యితని వరించెదను, నాకే యితఁడు తగి నవాఁడుకాని నీకుఁ గాఁడు" అని యిట్లు ప్రతి కన్యకయు బలు కుచుఁ బడస్వరము కలహించుకొనుచుఁ దుదకందఱు నతని వరిం చిరి. సౌభరి వారలనందఱను బెండ్లాడి తన యాశ్రమమునకుఁ గొనిపోయి తనతపశ్శక్తిచే వారిలో నొక్కొక్కదాని కొక్కొక

దివ్యభవనమును నొక్క యుద్యానవనమును, నిర్మలోదకము లును గమలములును గల యొక్క సరస్సును, నిర్మించెను. ఆ గృహములు చక్కఁగా నలంకరించుకొనిన స్త్రీ పురుషులచేతను మధురముగా గానముచేయుచున్న శుకశారికాది పక్షులచేతను, తుమ్మెదలచేతను, వందులచేతను, అమూల్యమైన శయ్యలచేతను, రత్ననయములగు నాసనములచేతను, మనోహరములగు వస్త్ర భూషణములచేతను, పానద్రవ్యములచేతను, దివ్యమగు చందనా దులచేతను, భోజన పదార్థములచేతను, బుష్పమాలికలచేతను, బ్రకాశించుచుండెను. సార్వభౌములకుఁ గూడ లభింపని భోగ్య వస్తువులతో నిండియున్న యతని గృహములనుగాంచి సామ్రా జ్యాధిపుఁడై యేడుద్వీపములు గల భూమినేలుచున్న మాంధా త యచ్చెరువడి తనగర్వమును విడిచిపెట్టెను. ఆ సౌభరి యిట్లు గృహస్థాశ్రమ మవలంబించి నానావిధములగు నింద్రియ సుఖ ము లనుభవించుచుండియు నేమిచుక్కలచే నగ్ని హోత్రుఁడుఁ బోలె నా సుఖములచేఁ దృప్తినొందలేదు. ఆ మహా ముని యొక నాఁ డొకచోఁ గూర్చుండి యమునానదియందు మత్స్యములఁ జూచుటచేఁ దనకుఁగల్గిన విషయచాసల్యమును దెలిసికొని తనలో నిట్లనుకొనియె, "జనులారా! తపశ్శాలియగు నీ సౌభరి తనంతఁ దాను బొందించుకొన్నయాత్మనాశనమును జూడుఁడు. వీఁడు మిక్కిలి బుద్ధిహీనుఁడు. కానిచో నదిలో విహరించుచున్న చేప లను జూచినంతమాత్రమునఁ జలించి విషయసుఖముల కాశ పడి చిరకాలమునుండి ధ్యానించుచున్న పరబ్రహ్మమును విడుచు నా? కావున మోక్షమపేక్షించువారు గృహస్థుల సంబంధ మును విడువవలయును. సర్వ విధములచేతను దనయింద్రియ

ములను శబ్దాదివిషయములచెంతకుఁ బోనీయరాదు. ఒంటిగానే తపమొనర్పవలెను. రహస్యస్థలమందుండియే యపరిచ్ఛిన్నుఁడగు భగవంతునియందు మనస్సును గూర్పవలెను. ఒకప్పుడును సంగము నంగీకరింపరాదు.ఒకప్పుడు సంగము చేసినచో సాధుజనులతోను, మునులతోను మాత్రమే చేయవలెను. ఇదిగో నాదురవస్థను జూడుఁడు. మొదట నే నొక్కఁడనే తపముచేసికొను చుంటిని. నీటిలో విహరించు మత్స్యములఁ జూచి విషయాభిలాషకులలోనై యేఁబదిమంది భార్యలను బెండ్లియాడి వారలం దయిదువేలకొడుకులను గాంచియు మనస్సు విషయసుఖములందుఁ దృష్ణివహింపకున్నది. నామనస్సు మోహాదులచే నావృతమై సంతతమును మిథునకర్మమునందే సక్తమగుచున్నది. శబ్దాదివిషయములే పురుషార్థములని తలంచుచున్నది. ఎట్టి యనర్థము సంభవించినదో చూడుఁడు. కానున ముముక్షులందఱును సంగమును బరిత్యజింపవలెను" అని తలపోయుచు నామునీంద్రుఁడు కొంతకాలము గృహముననుండి వైరాగ్యముచెంది కామ్యకర్మములను ద్యజించి వనమున కరిగెను. పతివ్రతలగు నాతని భార్యలందఱు నాతని వెంబడించి పోయిరి. అటసౌభరి మనస్సు బ్రహ్మమునందుఁ జేర్చి శరీరమును కృశించున ట్లుగ్రమగుతపం బొనర్చుచు నాహవనీయాదులగు నగ్నులతోఁ గూడఁ బరమాత్మయం దనుసంధానము చేసెను. అనంతర మతని భార్యలు ముక్తుఁడయిన తమభర్తను గాంచి తామును బరమాత్మోపాసనచేసి తమపతి యనుగ్రహముచేతను, భగవదుపాసన ప్రభావముచేతను, శాంతించిన యగ్ని

యందు మంటలవలె లీనతఁజెంది ముక్కలైరి. ఇది యాఱవ యధ్యాయము.

మాంధాతృ వంశపరంపరను వర్ణించుట.

ఓ రాజా! మాంధాతపుత్రులైన పురుకుత్సాదులలో నంబరీషుఁడనువానిని బితామహుఁడయిన యువనాశ్వుఁడు పుత్రునిఁగా స్వీకరించెను. ఆ కారణమున నంబరీషుని కుమారుఁడు తాత పేరును వహించి యువనాశ్వుఁడని ప్రఖ్యాతి చెందెను. ఆ రెండవ యువనాశ్వునకు హారితుఁడనుకుమారుఁడు గల్గెను. అంబరీషుఁడును, యువనాశ్వుఁడును, హారితుఁడును మాంధాతృ ప్రవరకుఁ జేరినవారు. ఇఁక బురుకుత్సుని సంతతిని జెప్పెదను వినుము. పురుకుత్సుఁడు నాగకన్యకయగు నర్మదను బెండ్లాడెను. ఆ నర్మద భర్తృప్రేమను సంపాదించుకొని తన సోదరులగు సర్పరాజుల కోర్కిపైని తాను భర్తను పాతాళమునకుఁ గొనిపోయెను. అక్కడ విష్ణుబలసంపన్నుఁడైన పురుకుత్సుఁడు వధింప శక్యముగాని గంధర్వుల నవలీలఁ జంపి సర్పములవలన భయములేకుండునట్లు వరము గాంచెను. ఈ వృత్తాంతమును విన్నవారికిని జదివిన వారికిని సర్వ భయమెంత మాత్రమును లేదు. ఆ పురుకుత్సునికి త్రసదస్యువును, నతనికి నరణ్యుఁడును, నతనికి హర్యశ్వుఁడును, వానికిఁ ద్ర్యరుణుఁడును సంభవించిరి. ఆ త్ర్యరుణునకుఁ ద్రిబంధురుఁడుదయించె. వానికి సత్యవ్రతుఁడు గలిగె. వానికిఁ ద్రిశంకుఁడుద్భవించె. ఆ త్రిశంకుఁడే గురువగు వసిష్ఠుని శాపమునఁ జండాలుఁడై పిమ్మట విశ్వామిత్రుని తపఃప్రభావముచేఁ బొందితోఁగూడ స్వర్గమున

కేగి యిప్పటికిని నక్షత్రరూపుఁడై చూపట్టుచున్నాఁడు. చండాలుఁడైన త్రిశంకుఁడు స్వర్గలోకమునకుఁ దగని వాఁడని దేవత లతనిఁగ్రిందికిఁ ద్రోసివేయఁగాఁ దలక్రిందై శరణు శరణని వేడుచు వచ్చుచున్న యతనిఁ గాంచి విశ్వామిత్రుఁడు దయాళువై తన తపఃప్రభావముచే స్వర్గాంతరమును గల్పించి యందతని నుంచి క్రిందఁ బడకుండఁ జేసెను. అతని కుమారుఁడు హరిశ్చంద్రుఁడు. ఆ హరిశ్చంద్రుని నిమిత్తమే విశ్వామిత్రుఁడును వసిష్ఠుఁడును * బక్షీరూపములనొంది యనేకసంవత్సరములు పోరాడిరి. అతనికి సంతానము లేకపోయెను అందుచే నతఁడు మిక్కిలి దుఃఖితుఁడై నారదుని యుపదేశము వలన వరుణుని శరణొంది తనకు పీరుఁడగు పుత్త్రునిచ్చినచో నందులకుఁ బ్రతిఫలముగా నా పురుషునిఁ బశువునుగాఁ జేసి 'నీకుఁ బ్రీతిగలుగునట్లు యాగమును చేసెద' నని పలికెను. దానికి వరుణుఁడు సమ్మతించెను. వరుణుని యనుగ్రహమువలన హరిశ్చంద్రునకు రోహితుఁడను కుమారుఁడు కలిగెను. పిమ్మట వరుణుఁడువచ్చి హరిశ్చంద్రునిఁ జూచి "నీకుఁ గుమారుఁడు కలిగెను. నీవతనిఁ బశువునుగాఁ జేసి మత్ప్రీతిగా యాగమును జేయు"మనియెను. దానికి హరిశ్చంద్రుఁడు"పదిదినములు గతించినఁ గాని యాగ యోగ్యుఁడుకాఁ" డనెను. వరుణుఁడందులకు సమ్మతించి మరలిపోయి పది దినములు గతించిన తరు

---

* విశ్వామిత్రుఁ డింద్రునియొద్దఁ దాఁ జేసిన ప్రతిజ్ఞను జెల్లించుకొన సెంచి రాజసూయ దక్షిణ మనుసెపమున నా రాజు సర్వస్వమును వారించి నానాబాధలను బెట్టెను. వసిష్ఠుఁ డది తెలిసికొని విశ్వామిత్రునిఁ "బక్షీత్వము పొందు" మని శపించెను. విశ్వామిత్రుఁడు నట్లే యతని శపించెను. అంత నా యిర్వురును బక్షులయి బహుశాలము పోరిరని పురాణ ప్రసిద్ధి.

వాత వచ్చి యజ్ఞము చేయుమని యడిగెను. దాని కా రాజు బాలునికి దంతములు వచ్చినఁగాని సవనమునకు యోగ్యుఁడు కాఁడనెను. దంతములు వచ్చిన తరువాత వరుణుఁడు వచ్చి యాగము చేయు మనెను. దాని కతఁడు పాలదంతము లూడినఁ గాని క్రతుయోగ్యుఁడు గాఁడనెను. దానికి వరుణుఁడు సమ్మతించి కొంతకాలము చన్న పిమ్మట వచ్చి "ఇదిగో నీ బాలుని దంతము లూడిసవి. యజ్ఞమొనర్పు" మనియెను. పిమ్మట హరిశ్చంద్రుఁడు బాలునికి మరల దంతములు వచ్చినఁగాని యాగ పశువగుటకుఁ దగఁడని పలెక్కను. వరుణుఁ డప్పటికి మరలిపోయి దంతములు వచ్చుటను జూచి యాగము చేయుమని హరిశ్చంద్రు నడిగెను. దాని కతఁడు బాలుఁడు యుద్ధయోగ్యుఁ డయినప్పుడు కాని యర్హుఁడు కాఁడనెను. ఓ పరీక్షిన్న రేంద్రా! హరిశ్చంద్రుఁ డిట్లు పుత్రప్రేమచేఁ గాలము గడుపుచుండులను జూచి తానును దత్కాలమును నిరీక్షించుచుండెను. అంతలో రోహితుఁడు తన తండ్రి తన్ను యాగపశువు నుగాఁ జేయునని తెలిసికొని ప్రాణములఁ గాచుకొను తలంపుతో విలునమ్ములు దాల్చి యరణ్యమునకుఁ బాఱిపోయెను. దానికి వరుణుఁడు కోపించి కుక్షిరోగ రూపమున హరిశ్చంద్రుని బాధింపఁ దొడంగెను. ఆకడుపు మిక్కిలి పెరుఁగుటచే నా రాజు పలు బాము లనుభవించుచుండెను. రోహితాశ్వుఁడు తండ్రికి సంభవించిన యాపదను దెలిసికొని చూడవలెనని తన పురమునకుఁ బోఁదలంచెను. కాని యింద్రుఁ డతనికిఁ గానవచ్చి "ఓయీ! నీ విప్పుడు మీ పురమునకుఁ బోవలదు. అసత్య మాడినందున మీ తండ్రికిఁ గుక్షిరోగము సంభవించినది. నీవు భూమండల

మున సంచరించి పుణ్యక్షేత్రముల సేవించుచు నా పుణ్యముచే నీ జనకుని కుక్షిరోగమును మరలింపు " మని బోధించెను. రో హితుఁ డందులకు సమ్మతించి కొన్ని వత్సరములు భూపర్యట నము సలిపి పుణ్యక్షేత్రముల సేవించెను. అతఁడు ప్రతివత్సర మును దన పురమునకుఁ బోవ సిద్ధమగుచుండెను. కాని యిం ద్రుఁడు తొంటియట్ల చెప్పి వారించుచుండెను. ఇట్లతఁ డయిదేం డ్లు గడపెను. ఆఱవ వత్సరమును గూడఁ గడపి భృగువంశ సం భూతుఁడైన యొక బ్రాహ్మణ కుమారునిఁ గొని తన పురమునకు వచ్చి తండ్రిఁగాంచి యతని కాబొలు నర్పించి తనకు బదులుగా నాతనిఁ బశువునుగాఁ జేసి వరుణ ప్రీతిగా యాగము చేయుమ నెను. అనంతరము మహా యశుఁడైన హరిశ్చంద్రుఁడు వరుణ ప్రీతిగాఁ బురుష మేధమును జేసి రోగవి ముక్తుఁడయ్యె. ఆ పురు షమేధమున విశ్వామిత్రుఁడు హోత; భృగువంశసంభూతుఁ డైన జమదగ్ని యధ్వర్యుఁడు; వసిష్ఠుఁడు బ్రహ్మ; అయాస్యుఁడు ఉద్గాత; ఇట్టి మహాపురుషులను గూర్చికొని చేసిన యాగమున కింద్రుఁడు మిక్కిలి సంతసించి హరిశ్చంద్రునకు సువర్ణరథము నిచ్చెను. ఓ రాజా! యాగపశువయిన శునశ్శేపుఁడను ముని కుమారుని వృత్తాంతమును బిమ్మటఁ జెప్పెదను. ఆ హరిశ్చం ద్రునియు నతని భార్యయు సత్యమును, ధైర్యమును, బొడఁ గాంచి విశ్వామిత్రుఁడు సంతోషించి యాత్మజ్ఞానము నుపదే శించెను. హరిశ్చంద్రుఁ డాజ్ఞానబలముచే మనస్సును బృథ్వి యందుఁ జేర్చి యా పృథివిని జలముతోను, జలమును దేజస్సు తోను, దేఁస్సును వాయువుతోను, వాయువును గగనముతోను మిళితముగా జేసి, యా గగనమును దామసాహంకారమందు

ను, దానిని మహత్తత్త్వమందును, దానినిఁ బ్రధానమందును జేర్చి దానియందున్న జీవకళ యగు విద్యను ధ్యానించి దానిచే నజ్ఞానమును దొలఁగించుకొని సమస్తబంధనములను విడిచి నామరూపములచే నిర్దేశింపఁ దరముకాని స్వస్వరూపమును గాంచెను. ఇది యేడవయధ్యాయము.

హరిశ్చంద్రుని వంశ వివరణము; సగరుని చరిత్రము.

హరిశ్చంద్రుని సుతుఁడగు రోహితునకు హరితుఁడును, వానికిఁ జంపుఁడును గలిగిరి. ఆ చంపునిచేఁ జంపాపురి నిర్మింపఁబడెను. ఆ చంపునకు సుదేవుఁడు గలిగెను. వానికి విజయుఁడు సంభవించె. వానికి భేరుకుఁ డుద్భవించె. వానికి వృకుఁడుజనించె. వానికి బాహుకుఁడు పుట్టె. ఆ బాహుకుఁడు కొంతకాలము రాజ్యమేలి శత్రువులు బలీయులై తనరాజ్యము నపహరించినందున విచారించుచు నేమియుఁ జేయఁజాలక భార్యతో వనమున కేఁగెను. బాహుకుఁడటఁ చిరకాలముండి ముదుసలివాఁడై కాలధర్మము నొందెను. అతని భార్య భర్తృ వియోగమును సహింపఁజాలక చావ యత్నించుచుండ నౌర్వుఁడను మునివచ్చి "గర్భిణివగు నీవిట్లు చావరా" దని వారించెను. అనంతర మామె గర్భము దాల్చినదని తెలిసికొని దాని సవతులు మిక్కిలి సహింపఁజాలక యన్నముతోఁ గలిపి విషమును బెట్టిరి. ఆ విషమువలన శిశువు గాని యామెగాని మృతినొందలేదు. కొంతకాలమునకు సవతులు పెట్టిన గరముతోఁ గూడఁ బుట్టినందున సగరుఁడను పేరిని వహించి యొకబాలుఁ డుద్భవించె. ఆ సగరుఁడు భూమండలము నేకచ్ఛత్రాధికారముతోఁ బాలించెను. అతని కుమారులచేఁ

ద్రవ్వఁబడి సముద్రము సాగరమని చెప్పఁబడుచున్నది. అతఁడు తాళజంఘులను పేరుగల యవనులు శకులు బర్బరులు మొద లగు వారిని జయించెను. అయినను దన గురువగు నౌర్వుని వచనము చొప్పున వారినిఁజంపక వికారవంతులఁగాఁ జేసి విడి చెను. వారిలోఁ గొందఱకుఁ బూర్తిగా ముండనముచేసి శ్మశ్రు వును మాత్రమే మిగిల్చెను. గొందఱ నర్ధముండితులుగా నొన ర్చెను. కొందఱకుఁ గట్టు వస్త్రముమాత్రమే యుండునట్లు చేసెను. మఱికొందఱకు బైనస్త్రము మాత్రమే మిగిల్చెను. అతఁ డౌర్వుని యుపదేశము ననుసరించి సకలవేదస్వరూపుఁ డును, సకలదేవతాస్వరూపుఁడు నగుశ్రీహరి నశ్వమేధము లచే నారాధింప నారంభించెను. పెక్కుయాగములు పూర్తి చేసెను. అతఁడు నూఱవ యజ్ఞము చేయు చుండఁగా, నిం ద్రుఁడు దానికి సహింపఁజాలక, యాగాశ్వము నపహరించి రసాతలమునఁ దప మొనర్చుచున్న కపిలమహాముని చెంత నుంచి వెడలిపోయెను. ఆ సగరునకు సుమతి యనియుఁ, కేశిని యనియు నిరువురు భార్యలు గలరు. వారిలో సుమతి కఱువది వేవురు కొమరులు గలరు. సగరుఁడు వారిని హయమును వెదకఁ బంపెను. బలగర్వితులైన యా సగరసుతులు జనకుని శాసన మును జలఁదాల్చి భూమండలము నంతటిని గాలించి కానక తుద కు భూమిని ద్రవ్వి రసాతలమును బ్రవేశించి యీశానదిక్కున కేఁగి తపమొనర్చుచున్న కపిలుని సమీపమున సంచరించుచున్న యాగాశ్వమునుగాంచి "ఇదిగో, వీఁడే మనయశ్వము నపహరిం చినవాఁడు. ఇక్కడ దాఁగియుండి మనరాకనెఱిఁగి యేమియు నెఱుఁగనివానివలెఁ గనులుమూసి కపటతపమున కారంభించెను.

వీఁడు పాపాత్ముఁడు, చంపుఁడు, చంపుఁడు" అని పలుకుచు నాయుధములఁదాల్చి యతని కభిముఖముగాఁబోయిరి. ఆసను యమునఁ గపిలుఁడు కన్నులువిప్పెను. ఇంద్రునిచే వంచిత చిత్తులై మహాత్ముఁడగు కపిలున కపరాధముచేయ నెంచినవారం దఱును క్షణకాలములోఁ దమశరీరమందున్న యగ్ని కాహు తులై భస్మమైరి. కొందఱు సగరసుతులు కపిలునికోపాగ్నిచే భస్మీభూతులైరనిచెప్పుదురు; కాని యదిమంచివాదముకాదు. కేవలము శుద్ధసత్వగుణమునకు నిలయుఁడై జగములకుఁ బరి శుద్ధిగల్గించుచు వర్తించు కపిలమహాముని యందుఁ గోపరూప మగు తమోగుణము సంభవించుటెట్లు? భూసంబంధియగు పరా గ మాకసమునకు సంభవించునా ? సంభవింపదు. ఆకాశ మెప్పుడును వాస్తవముగాఁ బరాగమున కాశ్రయము కాదే! మఱియు నెవనిముఖమునుండి యుదయించి సాంఖ్యము, పెద్ద పడవకు సాటియై మృత్యుభయమును గల్గించునదియు దుర్లంఘ్య మైనదియు నగుసంసారసముద్రమునుండి ముముక్షువులఁ దరిం పఁజేయుచున్నదో, యట్టిమహానుభావుఁడును, సర్వజ్ఞుఁడును, బరమాత్మయునగు కపిలునకు శత్రుమిత్రభావము సంభవించు టెట్లు? కావున నెనుకటివాద మాదరింపఁదగినదికాదు. ఆసగ రునకుఁ గేశినియను రెండవభార్యయందు అసమంజసుఁడను నొక కొమరుఁడుండెను. అతని కంశుమంతుఁ డనుసుతుఁడు గలఁడు. ఆ యసమంజసుఁడు పూర్వజన్మమున మహాయోగియై సంగదోషమువలన యోగభ్రష్టుఁడై యీ జన్మమొందెను. పూర్వజన్మమందలి యోగప్రభావముచేఁ దనజన్మమును స్మరిం చుకొని యతఁడు తనకుసంగదోషము సంభవింపకుండుటకై

తా నయోగ్యుఁడైనట్లు లోకమునకుఁ జూపఁదలఁచి జ్ఞాతుల కపకారమొనర్చుచు జనుల నడలింపఁజేయుచు నాడుకొనుచున్న బాలురను గొనిపోయి సరయూనదిలోఁ బాఱవైచుచుండెను. అది తండ్రి తెలిసికొని పుత్రప్రేమను భేదించి వానిని బురము నుండి తఱిమివేసెను. దాని కసమంజసుఁడు సంతసించి యోగ ప్రభావముఁజే సరయువులోఁ బాఱవైచినబాలకులను దెచ్చి వారికర్పించి యటనుండి కదలిపోయెను. అయోధ్యావాసులం దఱు మరల బ్రదికివచ్చిన బాలురనుజూచి యాశ్చర్యమందిరి. పిమ్మట సగరుఁడుకూడఁ దనకుమారుని ప్రభావమెఱుఁగ కుండఁ దఱిమినందులకుఁ బశ్చాత్తాపము నొందెను. ఆ యసమంజసుని కుమారుఁడయిన యంశుమంతుఁడు తాతయాజ్ఞను శిరసావహించి హయమును వెదకఁబోయి తనతండ్రులు వెడలిననూర్గము ననుసరించి పాతాళమును బ్రవేశించి యెదుటఁ బెద్దబూదికుప్పను, నాసమీపమున హయమును, నచ్చటనే యాసీనుఁడై భగవదవతారమెయున్న కపిలమహాముననినిజూచి యతనిని సమీపించి నమస్కరించి దోసిలివట్టి నిశ్చలచిత్తుఁడై యిట్లనుతించె "ఓదేవా! యోగిజనులైనను సమాధిమొదలగు నుపాయముల నవలంబించి పరమాత్మవగునీతత్త్వమును స్పష్టముగా నెఱుంగఁజాలరు. ఇట్లుండఁ దక్కినవారింగతి చెప్పనేల? సామాన్యముగా శరీరులు నీ సంబంధియగు మాయచే మోహితులయి ప్రపంచమునఁ గానవచ్చు శబ్దాది విషయములను దాని ననుభవించు తమశరీరమును మాత్ర మెఱుఁగుదురు కాని పరమార్థమును దెలిసికోలేరు.

ఓమహనీయా! అట్టియనంతమహిమగలిగి యానందాత్మకమగు జ్ఞానమునకు నిలయమై, స్వభావముచేతనే మాయాగుణముల నంటక యోగీశ్వరులగు సనకాదులకుఁగూడఁ గానరానినిన్ను మూఢుఁడనగునేనెట్లు భావింపఁగల్గుదు? మాయాగుణములను విసర్జించి, కర్మాధీనమగు దేహమునుదాల్చక, నామరూపభేదము లేనివాఁడవై, చేతనధర్మములఁగాని యచేతనధర్మములనుగాని పొందక, కేవలము జ్ఞానోపదేశమునిమిత్తమే యిచ్ఛాధీనమగు శరీరమునుదాల్చియున్న పురాణపురుషుఁడవగు నీకునమస్కారముగావించెదను. ప్రజలుకామమునకును, ఔరాసకును, అసహనమునకును, జిహ్వవికారమునకును, లోఁబడి, యెవనిమాయచే సృజింపబడినగృహాదులనుజూచి భోగ్యస్థానము లనుబుద్ధి వహించి తిరుగుచున్నారో యట్టి నీకు నమస్కారము. ఓ దేవా! సర్వాంతరాత్ముఁడ వగునీ సందర్శనమువలన విషయాభిలాషను నశించినది. పుణ్యాపుణ్యకర్మములు నశించినవి. దేహాత్మభ్రాంతి రూపమగు మోహమడుగంటినది.దృఢమయినదై నను మోహపాశము విచ్ఛిన్నమైనది. కృతార్థుఁడనైతి" నని యిట్లు భక్తిపరవశుఁడై నుతించుచున్న యంశుమంతు ననుగ్రహించి కపిలాచార్యుఁడిట్లనియె. "ఓ వత్సా! నీ తాత యొనర్చు యాగమునకుఁ బశువగు గుఱ్ఱమిదియే. దీనిఁ గొనిపొమ్ము. నీ తండ్రులందఱు నిదిగో నిచ్చటనే భస్మమై పడియున్నారు. వారిని దరింపఁజేయునది గంగోదకము తప్ప వేఱొకటి లేదు." అని పలికిన కపిలునివాక్యమును శ్రద్ధతో విని యతనికి నమస్కరించి యా యశ్వమును గొనివచ్చి తాత కీయఁగా నతఁడు సంతసించి తన యాగమును పూర్తిచేసెను. అనంతరము సగరుఁడు రాజ్యము నంశుమంతుని

కిచ్చి, దేహమందును, దదనుబంధులగు భార్యాదులందును, స్పృహ విడిచి సంసారబంధమును వీడి యూర్వీ డుపదేశించిన జ్ఞానమార్గ మవలంబించి ముక్తిచెందెను. ఇది యెనిమిదవ యధ్యాయము.

గంగావతరణ కథ. కల్మాషపాద ఖట్వాంగ చరిత్రములు.

అంశుమంతుఁ డెట్లయినను గంగనుదెచ్చి తన తండ్రులను దరింపఁజేయ యత్నించి పెద్దకాలము తపమొనర్చెను; కాని కార్యము నెఱవేర్పకయే మృతినొందెను. పిమ్మట నతని కుమారుఁడు దిలీపుఁడును దండ్రివలెనే గంగను గొని వచ్చుటకై తపమాచరించి యందుల కసమర్థుఁడై కాలధర్మ మొందెను. అనంతర మతని కుమారుఁడు భగీరథుఁడు దృఢమనస్కుఁడై తండ్రితాతలు దలంచిన కార్యమును గొన సాగింపనెంచి మిక్కిలి యుగ్రమగు తపమొనర్చెను. అతని తపమునకు సంతసించి గంగాదేవి యతనికిఁ బ్రత్యక్షమై "ఓయీ! నీకిష్టమగు వర మును వేఁడుమిచ్చెద" నని పల్కఁగా భగీరథుఁ డామెకు నమస్కరించి యభిప్రాయమును వెల్లడించెను. అదివిని గంగాదేవి యిట్లనియె. "ఓయీ! నేను భూతలమున కవతరించునపుడు నా వేగమును సహించు వారెవరు? అట్టి వాఁడివఁడై నను లేనిచో నేను భూతలమును భేదించి పాతాళమున కరుగవలసి వచ్చును. ఇంతియకాక భూలోకమునఁ బ్రజలు తమ పాపములను నా యందుఁ గడుగుకొందురు! ఆ నరులు నాకుఁ గల్గించు పాప మును నే నెట్లు తొలఁగించు కొనఁగలుదును? కావున నేను భూమియందుఁ బ్రవహింప నిష్టపడను. దీనికిఁ దగిన యుపాయ

మాలోచింపుము." అనిన విని భగీరథుఁ డిట్లనియె. "ఓ తల్లీ! భూమిలోఁ గేవలము పాపాత్ములే లేరు. కామ్యకర్మములను విడిచి యింద్రియములను జయించి బ్రహ్మోపాసకులును నగు బ్రాహ్మణ శ్రేష్ఠులు వెక్కుఁరు గలరు. వారు లోకములను బవిత్రములఁ జేయఁ జాలినవారు. వారు వచ్చి నీలోఁ దానమాడుటచే మానవుల వలన నీకుఁ గల్గిన పాపములను స్వీకరింతురు. భగవంతుఁడు పాప హరుఁడు కాన యీ సాధువులం దెల్ల ప్పుడును నినసించి యీ పాప ములను హరించును. కావున దీనికి నీవు విచారింప వలసిన పని లేదు. తంతువులందుఁ బటమువలె నెవనియం దీవిశ్వమంతయు వ్యాపించినదో, యెవఁడు బ్రహ్మ మొదలుకొని తృణము వఱకుఁగల శరీరుల కంతరాత్మయై యున్నాఁడో, రుద్రశరీరకుఁ డగు నాపర మాత్మనీ వేగమును ధరింపఁ గల్గును" అనిన భగీరథు వచన ములు విని గంగ వానికి వెండియు నిట్లనియె. "వత్సా! నీ చెప్పిన యుపాయమునకు సంతసించితిని. నాయుదకములు ధరిం చు నిమి త్తము శంకరునిఁ బ్రసన్నునిఁగాఁ జేసికొనుము" అనిన విని సంతసించి యీ రా జచ్చోటుగదలి యొక పవిత్రస్థలమును జేరి శంకరునిఁ దపంబున నారాధించెను. దాని కతఁడు స్వల్పకాలము లోనే ప్రసన్నుఁడయ్యెను. భగీరథుఁడు తన మనోరథమును విన్న వింప శంకరుం డిదివఱకే "లోకహితముకై గంగానదిని దాల్చె ద" ననిశపథముచేసియున్న వాఁడు; కావున నతని కోర్కికి మాఱు చెప్పక సమ్మతించి విష్ణువు పాదమునుండి వెడలిన దగుటచే పవి త్రమైన గంగానదిని ధరించెను. అనంతరము భగీరథుఁడు లోక పావనియగు గంగను తన పితరుల దేహములు భస్మమై పడిన స్థలమునకుఁ దీసికొని పోనిశ్చయించి వాయువేగముతోఁ దన రథ

మును నడిపింపఁగా గంగ దాని ననుసరించె. ఇట్లు గంగ దేశము లనుండి పాఱి వానిని పడుపుచుఁ, బవిత్రముగాఁ జేయుచుఁ బోయి దగ్ధులయిన సగరకుమారులను పడిపెను. ఆ సగరసుతులు బ్రాహ్మణున కపరాధము చేయుటచే భస్మమైనను దమ దేహభస్మములకు గంగా జలస్పర్శము లభించుటచే నందఱును స్వర్గమును జెందిరి. ఓరాజా! భస్మీభూతములగు శరీరములచేతనే గంగను దాఁకి సగరసుతులు ముక్తిచెందిరని చెప్పవలసినపుడు దృఢనియమముతో శ్రద్ధతో గంగానదిలోఁ దానమాడు వారికి స్వర్గము లభించునని వేఱె చెప్పవలయునా? సంసారచ్ఛేదకుఁడగు హరి పాదకమలమునఁ బుట్టిన గంగానది జలస్పర్శమునం దింత ప్రభావమున్నదని యాశ్చర్యపడ నవసరము లేదు. ఆ యనంతుని పాదకమలములందు శ్రద్ధతోఁ దమ మనస్సులను నిల్పినమునీశ్వరులు రాగాదిదోషవర్జితులై విషువఁదరముకాని ప్రకృతి సంబంధమును విడిచి తత్కాలమునందే ముక్తిఁ జెందుచుండ దీని కాశ్చర్యమే ల? ఓ రాజా! ఆ భగీరథునకు శ్రుతుఁడను కుమారుఁడు కలిగెను. అతనికి నా భావరుఁడు జన్మించెను. వానికి సింధుద్వీపుఁడు దయించె. అతని కయుతాయువు సంభవించె. అతనికి ఋతువర్ణుఁడు పుట్టె. అతఁడే నలునికి మిత్రుఁడై యతనికి ద్యూత శాస్త్ర రహస్యమును దెలిపి యతనివలన నశ్వవిద్యను సంపాదించె. అతనికి సర్వకాముఁ డుదయించెను. సర్వకామునకు సుదాసుఁడు ప్రభవించె. అతనికి మదయంతీపతి సంభవించె. ఓ నృపా! అతనినే మిత్రసహుఁడనియు మఱికొందఱు కల్మాషపాదుఁడనియుఁ జెప్పుదురు. ఆ కల్మాషపాదుఁడే వసిష్ఠుని శాపమువలన సంతాన రహితుఁడాయెను. అని పలుకు శుకునిఁజూచి "మహాత్ముఁడగు

సౌదాసునకు శాపము సంభవించుటకుఁ గారణమేమో తెలుపఁ దగినచోఁ దెలుపు" మని యడుగఁగా నతనికి శుకుం డిట్లనియె. "ఓ నరపాలా! సౌదాసుఁ డొకప్పు డడవికి వేఁటాడఁబోయి యట నొక రాక్షసుని సంహరించి వాని సోదరునిఁ జంపకుండ విడిచెను. ఆ దురాత్ముఁడు తన సోదరునిఁ జంపినందుల కా రాజునకుఁ దగిన ప్రత్యపకారము చేయఁ దలంచి యతని గృహమునకు వంటవాని వేషముతోఁ జని యనుజ్ఞ వడసి పాకాదులో నర్చ్చునుండెను. ఒకపుడువసిష్ఠుఁడు రాజు గృహమునకు భుజింపరాఁగా నీవంటవాఁ డతనికి నరమాంసము వండివెట్టెను. వడ్డించుచున్న యా మాంసమును జూచి వసిష్ఠుఁడు త్వరగాఁ దెలిసికొని కోపముతో రాజును జూచి"నీ విట్లు నరమాంసమును నాకుఁ బెట్టించితివికాన రాక్షసుఁ డవగు"మని శపించి తరువాత నా యపరాధము వంటవానిదికాని రాజుదికాదని తెలిసికొని యాశాపమును బండ్రెండు సంవత్సరములు మాత్రమే యనుభవింపఁదగినదని యవధి యేర్పఱిచెను.అంత సౌదాసుఁడు నిష్కారణముగాఁ దన్ను శపించిన వసిష్ఠునిపైఁ గోపముంచి మాఱుశాప మీయనెంచి చేతితో నీళ్లు పట్టుకొనెను.కాని యతని భార్యయగు మదయంతి వలదని వారించుటచే నాయుద్యమమును మాని యా జలమును జీవులతో నిండిన భూమ్యాకాశములం దెచ్చుటఁ బోసినను జీవుల కపాయము సంభవించునని యెంచి యా జలమును దన పాదములపై విడిచెను. తీవ్రములగు నాయుదకముల తాఁకుడుచేఁ బాదములు కమలీ నల్లవడియెను. నైల్యమనఁ గల్మాషమే. కల్మాషము పాదములందు గల్గిన కారణమున నతఁడు కల్మాషపాదుఁడని పేరుగాంచెను. అతఁడు రాక్షసుఁడై యడవిలోఁ దిరుగుచు మిక్కిలి

యాఁకలిగొని యొకచోట మునిదంపతులు వానర రూపము నొంది క్రీడించుచుండఁగాఁ జూచి యందుఁ బురుష వానరమును భక్షింపఁ బట్టుకొనెను. అపుడామునిపత్ని రతియందుఁ దనపతి తృప్తిచెందినట్లు కానక యా రాక్షసునిఁ జూచి యిట్లనియె. "ఓయీ! నీవు రాక్షసుఁడవుకావు; ఇక్ష్వాకు సంతతికిఁ జెందిన మహాత్ముడవు; మదయంతికి భర్తవు. ఇట్టి యోగ్యుఁడవు కావున నీవు బ్రాహ్మణునిఁ జంపుట యుక్తము కాదు. నేను సంతాన మపేక్షించి యితనితోఁ గ్రీడించుచుంటిని. నాయం దితఁ డింకను దృప్తి చెందలేదు. ఇట్టి సమయమునఁ జంపుట మహా పాతకమండ్రు. ఇంతియకాక మానుష దేహము జీవుని కన్ని పురుషార్థములను సంపాదించును. అట్టి మానవ శరీరమును నీవు రక్షించినచోఁ బురుషార్థముల నన్నింటిని నశింప జేయుటవలనఁ గల్గిన పాపములను బొందవలసి వచ్చును. మఱియు, నితఁడు విద్వాంసుఁడు, తపశ్శాలి. సత్ప్రవర్తనుఁడు, సద్గుణవంతుఁడు. మహాపురుషుఁడును సర్వజ్ఞత్వాది గుణములతోఁ గూడ సకల భూతములందు నంతరాత్మయై యున్నవాఁడు నగు పరమాత్మ నుపాసింపనున్నాఁడు. ఇట్టి బ్రహ్మర్షిని రాజర్షి శ్రేష్ఠుఁడవును, రాజ్యపాలకుఁ డవును నగు నీవు తండ్రికొడుకునువలెఁ జంపుట ధర్మమా! మఱియు సజ్జనహితుఁడవగు నీవు సాధువును బాపర హితుఁడును బ్రహ్మవాదియు సూత్రాదులను జదివినవాఁడును నగు నీ బ్రాహ్మణునిఁజంపుట న్యాయమా! గోవధవలెనే బ్రహ్మ వధయును విడువఁదగినదియే. కావున నితని విడువుము. నాప్రార్థ నము వినక యన్నివిధములచేత నితని భక్షింప నిశ్చయించితేని నన్నుముందుగాఁదిని పిమ్మట నాభర్తనుదినుము. జీవహితమగు

దేహమునలె నితఁడులేని నేను క్షణకాలమైనను జీవింపలేను" అని యి ట్లాబ్రాహ్మణి దీనముగాఁ బ్రార్థించుచు, దిక్కుమాలినదాని వలె విలపించుచున్నను శాపమోహితుఁడగుటచే సౌదాసుఁడు వినక పులి పశువునువలె నాబ్రాహ్మణుని భక్షించెను. అనంతరము రాక్షసునిచే భక్షితుఁడయిన భర్తను జూచి బ్రాహ్మణి తనదుర్దశను గూర్చి దుఃఖించుచుఁ దుదకుఁ గోపోద్దీపితయై సౌదాసునిఁజూచి "కామార్తనగు నాప్రార్థనమువినక నిరపరాధుఁడయిన నా భర్తను భక్షించితివి. కావున నీవు శాపార్హుఁడవు. నీవు స్త్రీతో సంగమించితివేని మరణ మందుదువు గాక" యని శపించి సహగమనముఁ జేయనెంచి భర్త యెముకలను నేరి చితిపైఁ బెట్టి ప్రజ్వలింపఁజేసి తన దేహము నందు వైచి భర్త పొందినలోకమునే చెందెను. సౌదాసుఁడు పండ్రెండు వత్సరములు గడపి శాపవిముక్తుఁడై పురముచేరి యొకనాఁడు భార్యయగు మదయంతితోఁ గ్రీడింప యత్నింప నామె బ్రాహ్మణశాపమును దెలిపి నివారించెను. అదిమొదలు సౌదాసుఁడు మృత్యువునకు భయపడి స్త్రీసంగమును విడిచెను. ఆకారణమున నతనికిఁ దనకుఁ గల్గిన సంతానము లేదయ్యె. అనంతరము, సౌదాసుఁడు తన భార్యకు సంతాన మిమ్మని వసిష్ఠునిఁ గోరఁగా నతఁ డందులకు సమ్మతించి యట్లు చేసెను. మదయంతి గర్భము దాల్చెను. కాని యేడు వత్సరములు గతించినను ప్రసవము కాలేదు. అప్పు డామె సాతితోఁ గడుపును గొట్టుకొనఁగా నొక పుత్త్రుఁడు కలిగెను. అశ్మఘాత మువలనఁ గల్గుటంబట్టి యా సుతున కశ్మకుఁ డనునామము గల్గె. ఆ యశ్మకున కొకకుమారకుఁ డుదయించె. పరశురాముఁడు క్షత్త్రియుల సంహరింప భూమిని దిరుగుచున్నప్పుఁ డతఁడు స్త్రీల

చే రక్షింపఁబడి జీవించి పిమ్మట క్షత్త్రియవంశమునకు మూల భూతుఁ డయ్యెను. నారీజనముచే రక్షింపఁబడుటచే నారీకవచుఁ డనియు క్షత్త్రియ వంశమునకు మూల మగుటవలన మూలకుఁ డనియుఁ బేరొందెను. అతనికి దశరథుఁ డనువాఁ డుదయించె. అతనికి నైలబిలుఁడు సంభవించె. వానికి విశ్వసహుఁడు ప్రభవించె. అతనికి ఖట్వాంగుఁడుఁ గలిగె. అతఁడు చక్రవర్తియై భూమిని బాలించుచు నొకప్పుడు దేవతల ప్రార్థనముచొప్పున వారికి సహాయుఁ డుగాఁ బోయి యుద్ధమున దుర్జయులగు దైత్యులను సంహరించెను. దానికి దేవతలు సంతసించి "వరము కోరుకొ"మ్మనిరి. అతఁడు తన యాయు వీక నెంతకాల మున్నదో. తెలుపుఁ డని సురలను వేఁడెను. వా రిం కొకరెండుగడియల కాలమున్న దని చెప్పఁగాఁ దన పురమునకు మరలి యతఁ డిట్లు నిశ్చయించుకొనెను. " నాకు బ్రాహ్మణకులముకంటెఁ బ్రాణములు ప్రియములుకావు. కులదైవమే నాకుఁ బ్రియమైనది. కాని కొడుకులును, సంపదలును, భూమియు, రాజ్యమును, భార్య, జనమును నాకుఁ బ్రేమింపఁ దగినవికావు. చిన్నతనమునుండియు నామన స్సధర్మమార్గమునఁ జరింపలేదు. ఉత్తమశ్లోకుఁ డయినభగవంతునికంటె వేఱయిన వస్తువు విశ్వమం దున్నదని భావింపలేదు. ముల్లోకముల కధిపతు లగుదేవతలు నాకుఁ గావలసిన వరమిచ్చెదమనిరి. అయినను భగవంతుని సంతతమును సేవించెడి నేను దానిని నిరసించితిని. దేవతలు దేహాత్మాభిమానము గలవారై సర్వదా తమ హృదయముల నంతరాత్మ రూపముగా నున్నపరమేశ్వరునిఁ జూచి సరోత్తమ వస్తువుగా భావింపఁజాలక సామాన్యము లగు విషయసుఖములనే పరవస్తువుగా భావింతురు.

దేవతలే యట్లు వర్ణించుచున్నప్పుడు తక్కినవారి సంగతి చెప్ప నేల? అయినను దేవతావరముగాని స్వర్గముగాని భగవత్ప్రాప్తి కడ్డుగల్గించునని విసర్జించితిని. కావున నీలోకమున భగవన్మాయచే నిర్మితములై గంధర్వనగరములవలె ననిత్యములైయున్న శబ్దాదివిషయములందును ప్రకృతిపరిణామాత్మక మగుశరీరమందును, సంగమును విడిచి పరమేశ్వరుని భక్తితో శరణొందెదను" అని నిశ్చయించుకొని భక్తులందఱును దేనిని ప్రమాది సిద్ధమును, హేయగుణరహితమును, కల్యాణగుణ నిలయమును, దురూహామును నగు, పరబ్రహ్మమునుగాఁ జెప్పుదురో యా పరవస్తువు నందు మనస్సు నిలిపి దేహమును విడిచి గుణాష్టక రూప మగు స్వస్వరూపము నొందెను. ఇది తొమ్మిదవయధ్యాయము.

శ్రీ రా మ చ రి త్ర ము.

ఓరాజా! ఆ ఋష్యశృంగునకు దీర్ఘబాహువును, వానికి మహాకీర్తియగు రఘుమహారాజును, వాని కజుఁడును, వానికి దశరథుఁడును సంభవించిరి. వేదమయుఁడయినవిష్ణు వంశాంశములచే నాల్గువిధములయి సురల ప్రార్థనము చొప్పున నా దశరథునకుఁ బుత్రచతుష్టయమై జన్మించెను. ఆ నలువురును గ్రమముగా రాముఁడనియు లక్ష్మణుఁడనియు భరతుఁడనియు, శత్రుఘ్నుఁడనియు నామములను దాల్చిరి. ఓరాజేంద్రా! సీతాపతి శ్రీరాముని చరితమును దత్త్వదర్శులగువాల్మీకాదిమునులు విపులముగా వర్ణించిరి. నీవు గూడ నానేకపర్యాయము లా చరిత్రమును వినియున్నావు. తండ్రి సత్యవాక్యమును బరిపాలించుటకై రాజ్యము విడిచి యడవికేగి ప్రియురాలగుసీత కరస్పర్శమునైనను

సహింపఁజాలని సుకుమారము లగు పాదపద్మములతో నందుఁ గ్రుమ్మరుచు, సుగ్రీవ లక్ష్మణులయనునయవచనములచే మార్గా యాసమును దొలఁగించుకొనుచు రాఁగా, శూర్పణఖను విరూప నుగాఁజేయుటచేఁ గుపితుఁ డైనరావణుఁడు సీతను గొనిపోవఁగాఁ, దదీయవిరహమువలనఁ గోపోద్దీపితుఁడై బొమముడి మాత్రము చేతనే భయపడిన సముద్రుని బంధించి రావణాదు లనెడి మహా టవికి బావానలమువంటివాఁడైన శ్రీరాముఁడు మమ్ము రక్షించుఁ గాక." అని శ్రీ శుకుఁడు ధ్యానించి వెండియు రాజున కిట్లనియె. "ఓరాజేంద్రా! రాముఁడు చిన్నతనమునందు విశ్వామిత్రుని యా గమును సంరక్షింప లక్ష్మణునితోఁ బోయియు నతని సాయ మక్కఅలేకయే మారీచాది రాక్షసులను దునుమాడెను. అనంతర ము రాముఁడు విదేహదేశముల కరిగి సీతాస్వయంవరసమయము న వీరాధివీరులు చూచుచుండఁగా మున్నూఱుగురు బలవంతులు గొనివచ్చినదియుఁ గఠోరమైనదియు నగుశివధనుస్సును సులభ ముగా నెక్కిడి యేనుఁగు గున్న చెఱుకునువలె ముక్కలు చేసెను. ఇట్లు వితఱిచి సౌందర్యముచేతను గుణములచేతను సుస్వభావము చేతను బ్రాయముచేతను దనకు సరివచ్చుచు, సీతానామమును దాల్చి పూర్వజన్మమున లక్ష్మీనామముతోఁ దనవక్షఃస్థలమున నివ సించిన యీ కన్యామణిని వశముఁ గావించుకొని మరలి తనపుర మునకు వచ్చుచు మార్గమధ్యమున నిరువది యొక్కమాఱు భూ మండలమున సంచరించి రాజులనెల్లఁ బోలియించిన పరశురాము నెదుర్కొని యతని గర్వమును బూర్ణముగా నశింపఁజేసెను. తరు వాత నతఁడయోధ్యచేరి సీతతో సుఖముగాఁ గాలము గడుపుచుఁ దన తండ్రి యగుదశరథుఁడు సత్యపాశబద్ధుఁడై పూర్వము కైక



1556. సీతావివాహము.



విభీషణుఁడు శ్రీరాముని శరణుఁ జొచ్చుట.

కొనసంగిన వరములఁ దీర్చ నిశ్చయించి యడవి కేఁగు మనఁగా దానికి సంతసించి యోగీశ్వరుఁడు ప్రాణములవలెనె రాజ్యసంపదలను మిత్రులను గృహములను దల్లిని సంతోష పూర్వకముగా విడిచి యరణ్యమున కరిగెను. కొంతకాల మట నంచరించుచు నొకచోట రావణుని చెల్లెలును గామాతురయు నగుశూర్పణఖను విరూపనుగాఁ జేసి కోదండపాణియై వనవాసమున మిక్కిలి కృశించినవాఁడైనను నొక్కఁడే దాని బాంధవులగు ఖరదూషణులు త్రిశిరుఁడు మొదలగు పదునాల్గువేల రక్కసులను సంహరించెను. సీతావృత్తాంతమును శూర్పణఖవలన విని రావణుఁడు కామాంధుఁడై తనంతఁ దాను సీతను గొనిపోవ జంకి మారీచుని తోడుగొనెను. మారీచుఁడు కనకమృగమై సీతారాములకు మోహముఁ గల్గించి రాముని నాశ్రమమునుండి మిక్కిలి దూరము గొనిపోఁగా నంత నతఁడు దాని మాయనుగనుఁగొని సంహరించి మగిడి వచ్చుచుండెను; కాని రామలక్ష్మణు లిరుప్రురు నాశ్రమమందు లేకుండుటఁ జూచి రావణుఁడు తోఁడేలివలెఁ బొంచియుండి సీతను గొనిపోయి లంకలో నుంచెను. బ్రహ్మరుద్రాదులచేఁ బూజితము లగుపాదపద్మములు గల రాముఁడు భార్యావియోగము నొంది స్త్రీసంగము గలవారిల్లే దుఃఖభాక్కులగుదు రనునది నల్వురకుఁ దెలియఁజేయుచుఁ గృపణుని వలె దుఃఖించుచుఁ దమ్మునితోఁ గూడ వనమందుఁ జరించుచు, సీతను విడిపించుటకై రావణునితోఁ బోరి చచ్చిన జటాయు వనుగృధ్రమున కుత్తరక్రియలు సలిపి, కబంధునిఁ దెగటార్చి, వానరులతో మైత్రిచేసికొని, వాలినిజంపి, సుగ్రీవునికిఁ బట్టముకట్టి వానరులవలన సీత జాడ తెలిసికొని వనచరసమూహములతోఁ

గూడి సముద్రతీరమున విడిసెను. అతఁడక్కడ మూఁడుదినములు దీక్షితుఁడై సముద్రు నుపాసించెను. కాని యతఁడు ప్రసన్నుఁడు కాలేదు. అందులకు రాముఁడు కుపితుఁడై నిష్పుకలరాల్చు కడకంటితో సాగరమును జూడనారంభించెను. దాని కోర్వఁజాలక జలజంతువులు దిరుగుడు పడఁజొచ్చెను. తోడనే సముద్రుఁడు భయముచే స్తంభీభూతుఁడై పూజాద్రవ్యములఁ దాల్చి మూర్తిమంతుఁడై నచ్చి యతని పాదారవిందముల శరణుసొచ్చి యిట్లనియె. "ఓరామా! నిర్వికారుఁడవును లోకాధిపతివియు నాదిపురుషుఁడవును నగునిన్ను జడుడ నగునే నెట్లు తెలిసికోఁగలను. అయినను నీ సందర్శనమువలన జ్ఞానవంతుఁడనై నీ కధీనములైన త్రిగుణములలో సత్త్వమువలన సురగణములును రజస్సువలనఁ బ్రజాపతులును దమంబువలన రుద్రాదులును జనించిరనియు, సత్త్వాదులకు నీవు నియంతవనియు నిప్పుడు తెలిసికొంటిని. ఓ దేవా! నా జలమును బంధించి స్వేచ్ఛగా నరుగుము. విశ్రవసుని కుమారుని రావణుని జయింపుము. సీతను గొనిరమ్ము. ఆలోచింప నాజలమును నీకుఁ బ్రతిబంధకముగాదు. అయినను దిగ్విజయు లగురాజు లందఱును నీయొనర్చిన మహాకార్యమును జూచి యచ్చెరువడి నీ కీర్తిని గానముచేయునట్లుగా నాపై సేతువును బంధింపుము." అని పలికిన సముద్రుని వచనములు విని రాముఁడు సంతసించి కపీంద్రులు గొనివచ్చిన వృక్షములచేతను బర్వతశిఖరములచేతను సేతువును బంధించి, సుగ్రీవుఁడు, నలుఁడు, హనుమంతుఁడు మొదలగు వానరవరులతో సముద్రమును దాటి విభీషణుఁడు చూపు చున్నమార్గము ననుసరించి పూర్వము హనుమంతునిచే భస్మీభూతము

గావింపఁబడిన లంకను జొచ్చెను. వానరవీరులు లెక్కకెక్కువయి తన్ను నిరోధించి క్రీడాస్థానములను గోపురములను సభామండపములను, ధాన్యాగారములను, ధనగృహములను, ద్వారములను, గృహములను, ప్రాసాదములను, గపోతపాలికలను, వేదికాదులను, ధ్వజములను, హేమకుంభములను, శృంగాటకములను, ధ్వంసముచేయఁగాఁ బాడువడిన లంకాపురి, యేనుఁగు కదుపులచేఁ గలఁపఁబడిన నదివలెనే ఘూర్ణిల్లసాగెను. రావణుఁడు వానరులు చేయు ఘోరకృత్యములకు సహింపఁజాలక నికుంభుఁడు, కుంభుఁడు, ధూమ్రాక్షుఁడు, దుర్ముఖుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు. ఇంద్రజిత్తు, ప్రహస్తుఁడు, కుంభకర్ణుఁడు మొదలగు వీరులను బ్రత్యేకముగా వానివాని సైన్యములతోఁ గూడ యుద్ధమునకుఁ బంపెను. శూలములు, కత్తులు, చాపములు, శరములు, ప్రాసములు, తోమరములు, భిండివాలములు, పట్టిసములు మొదలగు నాయుధములఁ దాల్చి యారాక్షస సైన్యములు విజృంభించి వచ్చుచుండెను. అది రాముఁడు చూచి సుగ్రీవుఁడు, లక్ష్మణుఁడు, హనుమంతుఁడు, గంధమాదనుఁడు, నీలుఁడు, అంగదుఁడు, ఋక్షుఁడు, పనసుఁడు మొదలగు వానరవీరులతోఁ గదలిపోయి దైత్యసైన్యముల నెదుర్కొని పోరనారంభించెను. అందు రాముని సేనానాయకులగునంగదాదులు రావణుని గజములతోను, రథములతోను, గుఱ్ఱములతోను, బదాతులతోను, గలసికొని వృక్షములచేతను, బర్వతముల చేతను, బాణములచేతను, గదలచేతను మోదిరి. ఘోరయుద్ధము జరిగెను. దానిలో రావణుని బలమంతయుఁ గూలెను. తన బలమంతయు యుద్ధమునఁ గూలుట చూచి రావణుఁడు కుపి

తుండై విమానమెక్కి రాముని నెదుర్కొనెను. అంత రాముఁడు మాతలి యుక్త మగునింద్రరథము సూర్యునివలెఁ బ్రకాశించుచు దన నిమిత్తము రాఁగా దాని నధిష్ఠించి మిక్కిలి విరాజిలుచుండెను. రావణుఁడు చూచి సహింపలేక వెంటనే యతి నిశితము లగుబాణములచే రాముని గొట్టెను. రాముఁడా బాణములను దూల్చుచు వానిఁ జూచి యిట్లనియె. "ఓరీ రాక్షసాధమా! కుక్కచాటుచాటున నిల్లు సొచ్చి వస్తువును దస్కరించికొనిపోయినట్లు మేము లేనట్టి సమయమున మాయాశ్రమమును బ్రవేశించి నా భార్యను బతివ్రత నపహరించితివి. లజ్జాకర మయినకార్యము చేసియు నీవు లజ్జింపకున్నావు. యమునివలె మహాబలుఁడనగు నేను నీ వొనర్చిన యీ చెడుపనికిఁ దగిన ఫలము నిప్పుడే యందించెదను." అని పలికి యంత వింట శరమును సంధించి ప్రయోగించెను. అది వజ్రాయుధమువలెఁ ననివార్యమైపోయి రావణుని హృదయమును భేదించెను. తోడనే వాఁడు పదిముఖములచే రక్తము గ్రక్కుచు క్షీణపుణ్యుఁడగువాఁడు స్వర్గమునుండి భూమిపైఁ బడినట్లు విమానమునుండి క్రిందఁబడి ప్రాణములు విడిచెను. అప్పుడు మందోదరి మొదలగు రాక్షసస్త్రీలు వడినడి రావణు సమీపమున కరిగిరి; అక్కడ శత్రుబాణములచే నిహతులైనతమ తమ బంధువులను గౌఁగిలించుకొనుచు గుండెలు బాదుకొనుచు దీనరాండ్రయి యెలుఁగెత్తి యిట్లు విలపింప నారంభించిరి. "ఓనాథా! ఓలోకరావణా! మేము హతప్రాయల మయితిమి. ఇప్పుడు శత్రువులచేఁ బీడితయగు లంకాపురి నీవు లేక పోవుటచే శోభారహిత యైయున్నది. ఇఁక లంకాపురజను లెవని

శరణుఁజొత్తురు. ఓనాథా ! నీవు కామాంధుఁడవై సీతాదేవి ప్రభావము నెఱుఁగక యపకార మొనర్చితివి. అందుచేతనేకదా నీ కిట్టి దుర్దశ సంప్రాప్తమైనది. ఓ కులవర్ధనా ! పతివ్రత యగు సీత కపకారము చేయుటచేతనే యీ లంకాపురి నీవలె విధవ యైనది. నీ దేహము గ్రద్దల కాహారమైనది. నీ యాత్మ నరక మనుభవింపఁ బోయినది." అని యిట్లు విలపించుచుండ విభీష ణుఁడు రామాజ్ఞను బొంది వారి నోదార్చి రావణాదులకు యథా విధిగాఁ బ్రేతకర్మము లొనర్చెను. పిమ్మట శ్రీరాముఁడశోకవన మున నొక శింశుపామూలము నాశ్రయించి తన యెడఁబాటున కు మిగులఁ దపించుచుఁ గృశించి తన సందర్శనమున వికసించిన ముఖపద్మముఁ గల్గి యున్నతన ప్రియురాలిని సీతను గరుణించి యీమె నోదార్చి పుష్పకమెక్కించి విభీషణుని లంకాధిపతినిఁగా నొనర్చి కల్పాంతమువఱకుఁ బ్రదికియుండునట్లు వర మిచ్చి సుగ్రీ వ విభీషణులతోను, హనుమంతునితోడను, నందుఁ గూర్చుండి మార్గ మధ్యమున లోకపాలు రిచ్చు చున్నపూజలను గైకొ నుచు బ్రహ్మాదులు తన యద్భుత చరిత్రములనుతించుచుండఁగా నయోధ్యాపురమునకుఁ బోయెను. అక్కడ భరతుఁడు వల్క లాంబరములను జటలను దాల్చి గోమూత్రసహిత మగుయవా న్నమును మాత్రమే భుజించుచు దర్భలపై శయనించుచు, ను న్నట్టు విని కరుణాశాలి యగురాముఁడు మిక్కిలి పరితపించెను. అట భరతుఁడు శ్రీరాముని రాకను విని సంతసించి పురజనుల తోను, మంత్రులతోను, బురోహితులతోను గూడి పాదుకలను శిరమునఁ దాల్చి మంగళవాద్యములు మ్రోఁగుచుండఁగా, బ్రాహ్మణులు గొంతెత్తి స్వస్తివచనములను బఠించుచుండఁగా,

నంది గ్రామమునుండి రాము నెదుర్కొనఁబోయెను. ఆస మయమున సరిగంచు పతాకలచే వెలయు రథములపైఁ గొందఱును, నుత్తమాశ్వములపైఁ గొందఱును, బయలువెడలిరి. స్వర్ణకవచములను దాల్చిన భటులు గొందఱు భారులు దీర్చి నడవఁజొచ్చిరి. వారాంగనలు తాంబూలాదులను ధరించి పోఁజొచ్చిరి. పురజను లందఱును మహారాజున కర్హము లగు ఛత్రచామరాదు లగుకానుకలఁ బట్టికొని యెదురు చనిరి. ఇట్లు మహాపరివారముతో భరతుఁడన్న నెదుర్కొని ప్రేమచే హృదయము ద్రవింపఁ గన్నులు బాష్పముచే నిండ భక్తితోఁ బాదుకలను ముందుంచుకొని దోసిలిగట్టి నిలుచుండెను. అంత శ్రీరాముఁడు తమ్ముని భరతుని గట్టిగా నాలింగనముచేసికొని యా నందబాష్పములచే నతనిఁ దడుపుచు, భ్రాతృప్రేమను వెలి పుచ్చుచుఁ బ్రజలొసంగు నమస్కృతు లొందుచు నమస్కార యోగ్యులగు కులవృద్ధులకెల్ల సీతాలక్ష్మణులతోఁ గూడ నమస్కరించెను. ఉత్తరకోసలవాసులగుజను లందఱును జిరకాలమునకు వచ్చిన ప్రభువును జూచి పుష్పములు జల్లుచు నుత్తరీయములను గదల్చుచు సంతసముతో నృత్యముసేయ నారంభించిరి. అనంతరము రాముఁడయోధ్యాభిముఖుఁడై యరిగెను. అప్పుడు భరతుఁడు పాదుకలను దాల్చెను. సుగ్రీవ విభీషణులు చామరములు వీచుచుండిరి. ఆంజనేయుఁడు శ్వేతాతపత్రము పట్టెను. ధనుస్సును, దూణీరములును శత్రుఘ్నుఁడు ధరించెను. సీత తీర్థకమండలువును బట్టుకొనెను. అంగదుఁడు ఖడ్గము స్వీకరించెను. జాంబవంతుఁడు బంగారుడాలును ధరించెను. శ్రీరాముఁ డిట్లు సేవింపఁబడుచుఁ బుష్పకాసీనుఁడై స్త్రీలచేఁ బరివేష్టితుఁడై

వందిమాగధులచే నుతిగాంచుచు, నప్పుడే యుదయించి గురు శుక్రాది గ్రహములతోఁ బ్రకాశించు చంద్రుని సరిపోలుచు భరతాదుల యనుమతిని బడసి మహావైభవముతో నయోధ్యను బ్రవేశించి రాజభవనమునకేఁగి కైక మొదలగు సవతితల్లులకును, దనతల్లియగు కౌసల్యకును, వసిష్ఠాదిమహాత్ములకును, స్నేహితులకును, గులీనులకును, ననుచరులకును యథార్హముగాఁ బూజలొనర్చి యాదరించి వారి యాదరమునకుఁ బాత్రుఁడయ్యె. సీతాలక్ష్మణులు గూడ నచ్చటికి వారి నందఱను యథోచితముగాఁ బూజించి వారిచ్చు పూజల నందుచు రాజభవనముఁ జొచ్చిరి. కౌసల్యాదులు తమ పుత్త్రులను జెంది, పోయిన ప్రాణములు వచ్చినట్లు సంతసించి, తొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని యానందబాష్పములచే స్నానము చేయించుచు దుఃఖములను విడిచిరి. అంత వసిష్ఠుఁడు కులవృద్ధులతోఁ గూడ రాముని జటలను విప్పించి చతుస్సముద్రములనుండి యుదకము తెప్పించి యథావిధిగా శ్రీరాముని రాజ్యము కభిషిక్తునిఁజేసెను. రాముఁడి ట్లభిషిక్తుఁడై సుందరవస్త్రములను దాల్చి చక్కఁగ నలంకృతుఁడై యా యలంకారములతోను, భార్యతోను, సోదరులతోను మిక్కిలి ప్రకాశించెను. తరువాత భరతుఁడు పాదములపైఁ బడి నమస్కరించి ప్రార్థింపఁగా సింహాసనమునఁ గూర్చుండి ప్రజాపాలనభారము వహించెను. ప్రజలందఱును దమతమ ధర్మములను యథావిధిగా నాచరింప మొదలిడిరి. రాముఁడు తండ్రి పుత్త్రులనువలెఁ బ్రజలను గాపాడెను. ప్రజలు రామునిఁ దమతండ్రినిగా భావించిరి. అది త్రేతాయుగమైనను ధర్మము నాల్గుపాదములను బ్రవర్తించుటంజేసి కృతయుగమువలెఁ జూ

పఱచెను. సర్వభూతముల సుఖమును గాంక్షించువాఁడును ధర్మజ్ఞుఁడును నగురాముఁడు రాజ్యము చేయుచుండఁగా వనములును, నదులును, బర్వతములును, రమ్యకాదివర్షములును, సింహాదిద్వీపములును, సముద్రములును, బ్రజలు కోరిన వస్తువులన్నియొసంగుచుండెను. ఓ పరీక్షిన్నరేంద్రా! రాముని రాజ్యమునఁ బ్రజల కాధిగాని వ్యాధులుగాని లేవు. ఎవనికిని ముదుసలితనము రాలేదు. ఆఁకొన్నవాఁడుగాని, దప్పిగొన్నవాఁడుగాని దుఃఖితుఁడుగాని భీతుఁడుగాని కష్టవంతుఁడుగాని మచ్చునకైనను గానరాలేదు. మృత్యువు తనంతఁ దానచ్చి యొక్కనినైనను గొనిపోలేదు. రాముఁడేకపత్నీవ్రతము నవలంబించి రాజర్షివలె నలరారుచు, రాగద్వేషాదులను బాఱఁదోలి ప్రజలకు విహితధర్మముల నేర్పుచు స్వయముగా వర్ణాశ్రమధర్మములను యథావిధిగా నాచరించెను. సీత వినయానతయై ప్రేమచేతను బరిచర్యచేతను సుస్వభావముచేతను భయముచేతను సిగ్గుచేతను రామునిమనస్సును హరించి యతని ప్రేమ కాస్పదురాలయ్యె. ఇది పదియవయధ్యాయము.

శ్రీ రా మ చ రి త ము.

అనంతరము శ్రీరాముఁడు వసిష్ఠాదుల సాయమునఁ బెక్కుయాగములొనర్చి సర్వదేవమయుఁడయినతన్ను నారాధించుకొనెను. ఇట్లు యాగములొనర్చి హోతకుఁ బ్రాగ్దిక్కును, బ్రహ్మకు దక్షిణమును, అధ్వర్యునకుఁ బశ్చిమదిక్కును, ఉద్గాత కుత్తరమును, నా దిశాంతరమున నున్నభూమండలము నంతటి నాచార్యునకును దక్షిణగా నొసంగెను. ఇంతియకాక సకలవస్తువులం

దును నిస్స్పృహుఁడై సమస్తమును బ్రతిగ్రహింప బ్రాహ్మణులు తగుదురని తలంచి తనయొడల నున్నయలంకారముల నన్నిటిని విప్రుల కొసంగి కట్టుబట్టలతో మిగిలెను. సీత భర్త యభిప్రాయ మెఱిఁగి తన యలంకారములనెల్ల బీదల కిచ్చి మంగళసూత్రము మాత్రము మిగిల్చికొనెను. హోత మొదలగు బ్రాహ్మణులు రాముని బ్రాహ్మణభక్తిని సత్పురుషలందుఁ జూపు చున్నయతని యతి వాత్సల్యమునకును మిక్కిలి మెచ్చుకొని యూర్ధ్వచిత్తులై యతనికిఁ బ్రాగాది దిశల నర్పించి యిట్లు సంభాషించిరి. "ఓభగవంతా ! ఓరామచంద్రా ! నీవు సమస్తకామములచేతను సంపూర్ణుఁడవు. అట్టి నీకు వీనితో నేమి ప్రయోజనము ? మఱియును మాహృదయమునఁ బ్రవేశించి స్వప్రకాశముచే నజ్ఞానమును దొలఁగించి నిరతిశయపురుషార్థ మగుమోక్షమునే యిచ్చు చున్ననీ కీ ప్రాగాది దిక్కుల నిచ్చుటనఁగా నెంత ? నీవు బ్రహ్మకులము నాదరించువాఁడవు. స్వీయతేజముచే సర్వదా వెలుఁగొందువాఁడవు. నీ వెప్పుడును సంకోచము నొందని యపరిచ్ఛిన్నజ్ఞానము గలవాఁడవు. ఉత్తమశ్లోకులలో ముఖ్యుఁడవు. మునీంద్రులచే సేవింపఁబడు పాదపద్మములు గలవాఁడవు. అట్టి నీకు నమస్కార" మనిపల్కి వెడలిపోయిరి. పిమ్మట రాముఁడు సీతతోఁ బదివేలవత్సరములు సుఖముగా రాజ్యము సల్పి యొకనాఁడు లోకవృత్తాంతములను దెలిసికొన గూఢవేషముదాల్చి యొరులకుఁ దెలియకుండఁ బురమున నచ్చటచ్చట సంచరించుచు నొకచో భార్య నుద్దేశించి జరుగు చున్న వాక్కలహమును వినెను. ఒక పురుషుఁడు పరుని యింటికి వెళ్లి వచ్చుటచేఁ దన భార్య వ్యభిచారిణి యనియు, దాని నేలుకొన నీయుఁ దన చుట్టము

లతో వాదించుచుండెను. దానికి వారు "పరునియింట నున్న సీతను రాముఁ డేలుకొనలేదా? అంతకంటె నీవు ఘనుఁడవా" యనిపల్క వాఁ డదివిని *"రాముడు స్త్రీకిఁ బరవశుఁ డయ్యెఁ గావున సీతను దెచ్చుకొనెను. నే నట్టివాఁడను గాను నే దాని నొల్లనని" ప్రత్యుత్తర మిచ్చెను. రామున కిది చెవిని బడినతోడనే మిక్కిలి విచారించి నానాముఖముల లోకమున వ్యాపించు చున్నయపవాదమునకు భయపడి గర్భిణి యగుసీతను రహస్యముగా నడవిలో విడిచిపెట్టెను. అంత జానకి మృగములవాతఁ బడక భాగ్యవశమున వాల్మీకిమహాముని యాశ్రమమునకుఁ బోయి యతనిచే నాదరింపఁబడి ప్రసవకాలము రాఁగానే కవలపిల్లలను గాంచెను. వారు కుశలవులని వాసిఁగాంచిరి. వాల్మీకి యాకుమారులకు జాతకర్మాది క్రియల నొనర్చెను. ఇట లక్ష్మణున కంగదుఁడు చంద్రకేతుఁడు ననువారును, భరతునకు దక్షుఁడు పుష్కలుఁడు ననువారును, శత్రుఘ్నునకు సుబాహు శ్రుతసేను

---

* ఇందులకు మూలము. "త్రయోదశాబ్ద సాహస్ర మగ్నిహోత్ర ముఖండితమ్" అని యున్నది. "దశవర్ష సహస్రాణి దశవర్ష శతానిచ" అని రాముఁడు పదివేలవత్సరములు సీతతోఁ గలిసియున్నట్టును బదివందల వత్సరములు సీతావియోగానంతర మందున్నట్టును నీ శ్లోకమునఁగల పృథగ్వాక్యముల చేతనే తెలియుచున్నది. ఆలోచింపఁ బైరెండిటికి విరోధము సంభవించుచున్నది. అయినను రామావతార స్థితి పదునొకండువేలని ప్రసిద్ధి కావునఁ దదనుగుణముగా నీసంఖ్యను సరిపుచ్చుకొనవలెను. ఎట్లన సీతావియోగము నొందిన రాముఁడు వేయువత్సరములే కడపినను, నావియోగకాలము మిక్కిలి దుస్సహమై, నూఱువత్సరముల కాలమొక వేయిపత్సరముల కాలముకంటె నెక్కుడుగాఁ జూపట్టుచున్నదని యేదో యభిప్రాయము కల్పించుకొనవలెను.

లనువారును నిర్వ్యాజేసి కొమరులు గల్గిరి. భరతుఁడు దిగ్విజయ మొనర్చుచుఁ గోట్లకొలఁది గంధర్వుల జయించి వారి సర్వధన మును గొనివచ్చి రామున కర్పించెను. శత్రుఘ్నుండును మధు రాక్షసుని కుమారుఁ డగు లవణాసురుని మధువనమునఁ జంపి యట మథురాపురిని నిర్మించెను. అట సీత తనకుమారులను వాల్మీకి కప్పగించి ప్రియవిరహమును సైఁపలేక యతని పాదకమ లమును ధ్యానించుచు భూవివరమును బ్రవేశించెను. శ్రీరాముఁ డదివిని సతత మామెగుణములనే స్మరించుకొనుచు జ్ఞానముచే దుఃఖము నరికట్ట నశక్తుఁడయ్యెను. ఓరాజా ! పురుషునకు స్త్రీ సాంగత్యము మిక్కిలి చెఱుపు గల్గించును. అది ప్రతివానికిని దుఃఖము గల్గించు. భగవ దవతారమగు రాముఁడే యాశోక ము నడఁపఁజాలక పోయెను. గృహస్థులగు గ్రామ్యజనుల సంగ తిచెప్పనేల ? శ్రీరాముఁ డనంతరమునవే ఱొకభార్యను బరి గ్ర హింపక బ్రహ్మచర్యము సలుపుచు నేపదుమూఁడువేల వత్సరం బు లగ్నిహోత్రము నఖండితముగా వేల్చెను. అనంతరము రాముఁడు దండకారణ్యమునఁ దిరుగుటచేఁ గంటక విద్ధము లైన తనపాదములను బ్రజలు సంతతము తలంచు కొన్నట్లుచేసి జ్యోతి ర్మయమయిన పరమపదమున కరిగెను. ఓరాజా ! రాముఁడు దేవతల కోర్కిదీర్ప భూమియం దవతరించిన నారాయణుఁడే. లోకమున నతనికి సములుగాని యధికులుగాని లేరు. అట్టిమహా ప్రభావముగల శ్రీరామునకు సముద్రబంధనము, రావణాదివ ధయు, సమరమున వానరులు తోడుచూపుటయు నివియన్నియు లీలామాత్రములని యెఱుంగుము. సంకల్పమాత్రముచేతనే లోకముల సృజింపఁజాలిన రఘుపతి కిట్టి కార్యములవలన నేపాటి

కీర్తికలుగును? దిగంతములవఱకు వ్యాపించిన యెవనికీర్తిని గీర్తిఁదను లైన ధర్మ రాజాదిరాజులు తమ సభలలో నుతించుచున్నారో, మార్కండేయాది మునులు దేనిని గానముచేయుచున్నారో, యెవని పాదపద్మములు పాపహారములై దేవతలయు రాజాధిరాజులయు శిరస్సుల కలంకారప్రాయమగునో యట్టి శ్రీరాముని శరణుసొచ్చెదను. కోసల దేశవాసులలో నెవరు రాముని సేవించిరో, యెవ్వరు సందర్శించిరో, యెవ రనుసరించిరో, వారందఱును గర్మవర్జితులై యోగీశ్వరులు పొందు నుత్తమ పదమును బొందిరి. ఓ రాజా! శాంతినిష్ఠుఁడగు పురుషుఁడు వీనులవిందుగా రామచరితమును విన్నచో వాఁడు సంసారహేతుభూతములగు కర్మబంధనములను వదలి ముక్తుఁ డగుచున్నాఁడు; అనిన విని రాజు శుకునిఁగాంచి "ఓ ముసీంద్రా! రాముఁడు దేశవాసులను, సోదరులను, బారులను నెట్లు ప్రేమించి వర్తించెను? వారందఱును రాము నెట్లుప్రేమించి సేవించిరి? ఆ వృత్తాంతమును వివరముగాఁ జెప్పు" మనఁగా ముసీంద్రుఁ డతని కిట్లనియె. త్రిభువనేశ్వరుఁడగు రాముఁడు సింహాసనమును స్వీకరించి తమ్ములను దిశాపాలనమందు నియోగించి తాను దల్లులచెంతనుండి యనుచరులతోఁగూడ నయోధ్యను బాలింపఁ దొడఁగెను. రాముఁడు రాజయినప్పుడు వీథులన్నియుఁ జందనోదకములచేతను, మదపుటేనుఁగుల మదశీకరములచేతను దడుపఁ బడుచుండెను. ప్రజలు సంతోషభరితులై మేడలను, గోపురములను, సభా భవనములను, రథ్యాస్థలములను, దేవాలయములను, బంగారు కలశములతోను, బతాకలతోను, బూగవృక్షములతోను, రంభాస్తంభములతోను, జిత్రతరములగు వస్త్రములతోను, నద్దములతోను,

బూలదండలతోను, దోరణములతోను, నిరంతర మలంకరించి కన్నులపండువుగాఁ జేయుచుండిరి. ఇంతియకాక పౌరులు పూజా సాధనముల ధరించి రాముని దర్శించి పూజించి "ఓ దేవా! పూర్వము వరాహావతారమున నీ వుద్ధరించిన భూమండలము నిపుడు పరిపాలింపు" మని వేడుచు నాశీర్వదించుచుండిరి. చిర కాలమునకు వచ్చిన శ్రీరాముని సందర్శింప వేడుకపడుచు స్త్రీలును, బురుషులును బిల్లలును దమతమ గృహములనువిడిచి మేడ లనెక్కి కన్నులారఁ జూచియుఁ దనివిచెందక పుష్పవర్షములను గురియించిరి. రాముఁడు రాజమందిరమును బ్రవేశించెను. అది యిక్ష్వాకుఁడు మొదలగువారిచే సేవింపఁబడినది. అది నిరవధిక ములగు రత్నరాసులకు నిలయమై యమూల్యములగు వస్తువులచే నొప్పుచు, పగడముల గడపలుగల ద్వారములచేతను, వైడూ ర్యమయములగు స్తంభ పంక్తులచేతను, నిర్మలములగు నింద్రనీల ములు గూర్చిన ప్రదేశములచేతను, దళతళ మెఱయు స్ఫటికశిల లతోఁ గట్టిన గోడలచేతను, జిత్రవర్ణములగు పూలదండలచేతను, బతాకలచేతను, నానావిధములగు వస్త్ర సమూహములచేతను, మణిచయములచేతను, ముత్యములచేతను, భోగ్యవస్తువులచేతను నలంకృతమై ప్రాణవంతమైనట్లు కానవచ్చుచుండెను. అం దెక్క డఁజూచినను బరిమళ ద్రవ్యముల ధూపములు నెగడుచుండెను. ఏవంకఁ జూచినను బుష్పసంతతులు వెలయుచుండెను. ఏతట్టుచూ చినను దేహమునిండ నగలుదాల్చి దేవతలతో సమానులగు స్త్రీ పురుషులు సంచరించుచుండిరి. అట్టి మందిరమును బ్రవేశించి యాత్మారాములగు మునిజనులకు నాయకుఁడయిన శ్రీరాముఁడు తనకు నిరంతరమును బ్రియచేష్టలుచేయుచు నిరతిశయమగు నను

రాగముతో సీతాదేవి తన్ను సేవించుచుండ, నామెతోఁ జిరకాలము సుఖము లనుభవించెను. ఇట్లు శ్రీరాముఁడుచితకాలము లందు సుఖము లనుభవించుచు, వర్ణాశ్రమధర్మముల యథావిధిగా నాచరించుచుఁ, బ్రజలచే ధ్యానింపఁబడు పాదపద్మములు గలవాఁడై చిరకాలము రాజ్యమేలెను. ఇది పదునొకండవ యధ్యాయము.

ఇక్ష్వాకువంశానుక్రమము.

శ్రీరామునకుఁ గుశుండును, గుశున కతిథియు, నతనికి నిషధుఁడును, వానికి నభుఁడును, వానికిఁ బుండరీకుఁడును, వానికి క్షేత్రధన్వుఁడును గలిగిరి. అతనికి దేవానీకుఁ డుదయించెను. వానికి హీనుఁడుగలిగె. వానికిఁ బారియాత్రుఁ డుద్భవించె. వానికి బలుఁడు సంభవించె. వానికిఁ జలుండును, వానికి వజ్రనాభుఁడును గలిగిరి. ఆవజ్రనాభుఁడే సూర్యాంశమువలన నుద్భవించె. వానికి ఖగణుండును, వానికి విధృతియు, నతనికి హిరణ్యనాభుఁడును గల్గిరి. ఆహిరణ్యనాభుఁడే యోగాచార్యుఁడై న జైమినికి శిష్యుఁడై యోగశాస్త్ర మభ్యసించి మహాభ్యుదయము గల్గించునది యు,నజ్ఞాన నివారకము నగునాశాస్త్రమును యాజ్ఞవల్క్య మహర్షికి నేర్పెను. అతనికిఁ బుష్యుఁడును, వానికి ధ్రువసంధియు, నతనికి సుదర్శనుఁడును, నతని కగ్నివర్ణుఁడును, నతనికి శీఘ్రుఁడును, నతనికి మరుత్తును సువయించిరి. అతఁడు యోగముచే మృత్యువును జయించి కలాపమనెడి గ్రామము నాశ్రయించి యుండి కలియుగాంతమున నశించిన సూర్యవంశమును బుత్త్రపౌత్రాది పరంపరచే మరలఁ బ్రవర్తింపఁ జేయఁగలఁడు. ఆమరుత్తునకుఁ

బ్రస్నుఁడును, నతనికి సంధియు, వానికి మర్షణుఁడును, వానికి సుమహాత్తును, వానికి విశ్వసాహ్యుఁడును, వానికి బృహద్బలుఁ డును సంభవించిరి. అతఁడే నీజనకుఁడగు నభిమన్యునిచే సమర మున మడిసె. ఇక్ష్వాకువంశమునఁ బుట్టిగతించినవారు వీరె ! ఇఁక నుద్భవించువారిని జెప్పెదవినుము. బృహద్బలునికి బృహ ద్రణుఁడును, వాని కురుక్షుతుఁడును, వానికి వత్సప్రీతుఁడును, వానికిఁ బ్రతివ్యోముఁడును, వానికి భానుండును, వానికి దేవా కుఁడును సంభవింతురు. వాఁడే వాహినీపతియని వాసిఁగాం చును. వానికి సహదేవుఁడును, వానికి బృహదశ్వుఁడును, వానికి భానుమంతుఁడును, వానికిఁ బ్రతీకాశ్వుఁడును, వానికి సుప్ర తీకుఁడును, వానికి మరుదేవ్నుఁడును, వానికి సురక్షత్త్రుఁడును, వానికి బుక్షకుఁడును, వాని కంతరిక్షుఁడును, వానికి సుత పుఁ డును, వాని కమిత్రజిత్తును, వానికి బృహద్వాజుఁడును, వానికి బర్హ్యి, వానికి ధనంజయుఁడును, వానికి రణంజయుఁడును, వానికి సృంజయుఁడును జనింతురు. సృంజయునికి శౌక్యుఁ డుద యించు. వానికి శుద్ధోదుఁడు జన్మించు. వానికి లాంగలుఁ డుద్భ వించు. వానికిఁ బ్రసేనజిత్తు జనించు. వానికి క్షుద్రకుఁడు పుట్టును. వానికిఁ గుణకుఁడు గలుగును. వానికి సురథుఁ డుత్పత్తిఁజెందు. అతనికి సుమిత్రుఁడు సంభవించు. ఇతఁడే యీవంశమునకుఁ గడపటివాఁడు. ఈచెప్పిన వారందఱును బృహద్బలుని వంశ మున ముందు జన్మించువారలు. ఇక్ష్వాకురాజులవంశము కలి యుగమున సుమిత్రునివఱకు నిలిచి యతనితో నంతరించును. ఇది పండ్రెండవయధ్యాయము.

మిథిల వంశానుక్రమము

ఓరాజా! ఇక్ష్వాకు కుమారులలో వికుక్షివంశమును వర్ణించి చెప్పితిని. ఇఁక నిమి వంశమును వివరించెద వినుము. ఇక్ష్వాకుకు మారుఁ డయిన నిమి గురువగు వసిష్ఠుని చెంత కేఁగి తా నొనర్చు సత్రయాగమున నతని ఋత్విక్కుగా నుండవేఁడెను అతఁ డింత కుఁబూర్వమే నే నింద్రునకు ఋత్విక్కుగా నుండుటకు నిశ్చయించుకొంటిని. ముందుగా నింద్రుని యాగముచేయించి వచ్చి నీ యాగము నెఱవేర్చెద. అంతవఱకు నిరీక్షించియుండు" మని చెప్పెను. దానికి నిమి మాఱుపల్కలేదు. వసిష్ఠుఁడు శక్రునియాగము నిర్వహింపఁబోయెను. అంతట విద్వాంసుఁడగు నిమి జీవితము చంచల మనియుఁ దలంచిన సత్కార్యము వెంటనే నెఱవేర్పవలెనని యు నిశ్చయించి వసిష్ఠుఁడు వచ్చునందాఁక నిరీక్షింపక మఱి కొందఱ మునులను ఋత్విజులఁగా వరించి యాగమారంభించెను. వసిష్ఠుఁ డట నింద్రుని యాగమును నిర్వర్తించి వచ్చి శిష్యుని వ్యతిక్రమమునుఁజూచి కోపించి "పండితమానివగు నీవు దేహము విడుతువుగాక" యని శపించెను. అది నిమివిని "ధనాశచే ధర్మమెఱుంగక వర్తించుచు నకారణముగా నన్ను శపించితివి కావున నీవుగూడ దేహమును విడుతువుగాక" యని ప్రతిశాపమిచ్చెను. ఇట్లు శపించి నిమి దేహమును విడిచెను. మా ప్రపితామహుఁడగు వసిష్ఠుఁడుగూడ దేహమును విడిచి యూర్వసినిజూచి మోహముచెందిన మిత్రావరుణులకుఁ గుమారుఁడై జన్మించెను. అట ఋత్విజులు మృతినొందిన నిమిదేహమును బరిమళద్రవ్యములందుంచి కాపాడి సత్రయాగమును నిర్వర్తించి యచ్చటికివచ్చిన దేవతలనుగాంచి "మీరు నిమిని బ్రతికింప శక్తులగుదురేని ద

యయుంచి బ్రతికింపుఁ"డని కోరఁగా వా రట్లు చేయసమ్మతిం చిరి. కాని వారింజూచి" మహాత్ములారా! నాకు దేహసంబంధము వలదు. మరల వియోగదుఃఖమునకుఁ గారణమగు ననిభయపడి మునీశ్వరు లాసంబంధమును గోరక హరియందుఁ జిత్తమును జేర్చి తత్పాదపద్మములను సేవించు చుందురు. కావున దుఃఖమున కును, మోహమునకును, భయమునకుఁ గారణమగుదేహమును గ్రహింప నిష్టపడను. ఒకవేళ దేహసంబంధ మున్నచో జలము లలోని చేపలకుంబోలె దానె యెప్పుడును మృత్యు వనుసరిం చుచుండును " అని పలికెను. దేవత లదివిని "నీవీ స్థూల దేహము మాని సూక్ష్మదేహము నాశ్రయించి శరీరుల నేత్ర ములందు నిమేషోన్మేషములచేఁ జూడఁబడుచు స్వేచ్ఛగా నుండు"మనిపల్కి వెడలిపోయిరి. దాని కతఁ డిష్టపడెను. అప్పుడు మునీశ్వరులు దేశ మరాజకమగుటవలన సంభవించుచున్న యుప ద్రవములనుజూచి నిమి దేహమును మథింపఁగా నొక కుమా రుఁడు జన్మించెను. ఆబాలుఁడు సామాన్యముగా నితరులకు లభిం పని జననముగలవాఁడగుటచే జనకుఁడనియు, జీవరహితమగు దేహమునం బొడముటచే విదేహుఁడనియు, మథించుటంజేసి పుట్టెను గాన మిథిలుఁడనియుఁ బ్రఖ్యాతిగాంచెను. మిథిలుఁ డొకపురమును నిర్మించెను. అది యతనిపేర మిథిలాపురమని పిలువఁబడియె. ఆమిథులునకు ఉదావసు వుదయించెను. అతనికి నందివర్ధనుఁడు సంభవించె. అతనికి సుకేతుఁడుగలిగె. అతనికి దే వరాతుఁ డుదయించె. వానికి బృహద్రథుఁడు జన్మించె. వానికి మహావీర్యుఁడుపొడమె. వానికి సుధృత్తుగలిగె. వానికి ధృష్ట కేతు వుదయించె. వానికి హర్యశ్వుఁ డుద్భవించె. వానికి మరుఁడు

పుట్టె. అతనికిఁ బ్రతింధకుఁడుగలిగె. వానికిఁ గృతరథుఁడు జనిం చె. అతనికి దేవమీఢుఁడు జన్మించె. అతనికి విధృతియు, నత నికి మహాధృతియు, వానికిఁ గృతరాతుఁడును, వానికి మహా రోముఁడును, వానికి స్వర్ణరోముఁడును, వానికి హ్రస్వరోముఁ డును సంభవించిరి. ఆ హ్రస్వరోముఁడు యజ్ఞభూమిని దున్ను చుండఁగా నతని సీరాగ్రమువలన సీత బయటికివచ్చెను. కావున నతనికి సీరధ్వజుఁడని నామముగల్గెను. ఆ సీరధ్వజునకుఁ గుశధ్వజఁ డును నతనికి ధర్మధ్వజుఁడును సంభవించిరి. ఆతనికిఁ గృతధ్వజు డనియు, మితధ్వజుఁడనియు నిరువురు కొమరులుగల్గిరి. అందుఁ గృతధ్వజునకుఁ గేశిధ్వజుఁడును,మితధ్వజునకు ఖాండిక్యుఁడును గలి గిరి. ఓరాజా ! కేశిధ్వజుఁడు బ్రహ్మవిద్యయందు నిపుణుఁడు. ఖాం డిక్యుఁడు కర్మయోగమునందు నేర్పరి. వాఁడు కేశిధ్వజుని వలన భయపడి యెచ్చటికో పాఱిపోయెను. ఆ కేశిధ్వజునకు భాను మంతుఁ డుదయించె. వానికి శతద్యుమ్నుఁ డుద్భవించె. అతనికి శుచియు, వానికి సనద్వాజుఁడును, వాని కూర్ధ్వకేతుఁడును, వా ని కజుఁడును, వానికిఁ బురుజిత్తును, వాని కరిష్టనేమియు, వానికి శ్రుతాయువును, వానికిఁ బార్శ్వగుఁడును, వానికిఁ జిత్రరథుఁ డును, వానికి క్షేమాద్రియు, వానికి హేమరథుఁడును, వానికిఁ గృత్యరథు డును,వాని కుపగురువును, వాని కగ్న్యంశసంభూతు డగు నుపగుప్తుఁడును, వానికి శ్వసనుఁడును, వానికి సువర్చసుఁ డును, వానికి సుభాషణుఁడును, వానికి శ్రుతుఁడును, వానికి జ యుఁడును, జయునకు విజయుఁడును, విజయునకు ధృతుఁడును, ధృతునకు శునకుఁడును, శునకునకు వీతిహవ్యుఁడును, వానికి ధృ తియు, ధృతికి విపులాశ్వుఁడును, వానికిఁ గృతియుఁ, గృతికి మ

హావశీయు సంభవించిరి. ఓరాజా ! వీరు మిథిలుని సంతతివారు. వీరందఱు నాత్మవిద్యయందు విశారదులై భగవత్ప్రసాదము వలన గృహస్థులై యుండియు సుఖదుఃఖాదులఁ బొరయక విముక్తులైరి. ఇది పదుమూడవయధ్యాయము.

చంద్రవంశ చరిత్రము.

ఓరాజా ! దేనియందుఁ బుణ్యయశులయిన పురూరవాదులు జనించిరో పావనమగు నా చంద్రవంశమును వివరించెదను వినుము. అనిరుద్ధరూపియగు పరమపురుషుఁడుదకముల శయనించి యుండఁగా నతని నాభివలన జగత్పద్మ ముదయించె. దాననుండి చతుర్ముఖుఁడు జన్మించె. అతని కత్రిమహాముని సంభవించెను. అతఁడు సకలగుణములచేతను దండ్రికిని వచ్చుచుండెను. అతని యానంద శౌష్పమువలనఁ జంద్రుఁడు పొడమె. కావునఁ యతఁడమృతమయుఁడయ్యె. బ్రహ్మ,బ్రాహ్మణులకును,గలువలకును,నోషధులకును నతని నధిపతిగానొనర్చె. ఆచంద్రుఁడు త్రిభువనములను జయించి రాజసూయయాగ మొనర్చెను. అతఁడు బృహస్పతి భార్యయగు తారను బలాత్కారమున హరించెను. బృహస్పతివచ్చి తనభార్య నిమ్మని చంద్రునిఁ బెక్కుసారులు యాచించెను; కానియతఁ డామె నొసంగలేదు. దానికై దేవాసురలకు ఘోర యుద్ధము సంభవించె. బృహస్పతిపైఁ గోపముచే శుక్రుఁడు తనశిష్యులగు దైత్యవర్గముతోఁ జంద్రపక్షమవలంబించెను. రుద్రుఁడుబృహస్పతియందలి స్నేహముచే భూతగణములతో నతనికి సాయమొనర్చెను. సకలదేవగణములతో నింద్రుఁడుగూడ గురువు నకుఁ తోడయ్యెను. ఇట్లు దేవాసురులు రెండుపక్షములై తార

నిమిత్తము మహాసమర మొనర్చిరి. రెండు పక్షములందును బెక్కురు చచ్చిరి. అప్పుడు బృహస్పతి జనకుడగు నంగిరసుని ప్రార్థనముచొప్పున బ్రహ్మవచ్చి చంద్రుని నిందించి తార నిచ్చి పుచ్చుమని నిష్ఠురముగాఁ జెప్పెను. చంద్రుఁడు బ్రహ్మకుభయపడి గర్భిణియగు తారను బృహస్పతి కర్పించెను.గురుఁడు దాని స్వీకరించి గర్భమును దాల్చినట్లు తెలిసికొని. 'ఓతుచ్చురాలా! నాక్షేత్రమగు నీయందుఁ బరులుంచిన గర్భముండరాదు. దానిని వెంటనే విడిచిపెట్టుము. లేదేని నిన్నుభస్మముగావించెద''నని పలికెను. దానికిఁ దార భయమందు చుండెను. బృహస్పతి మరల దానిం జూచి వంశకరుఁడయిన కుమారుఁడు నీగర్భమందు లేనిచో భస్మముగావింతును. ఉన్నచోఁటిమించెదను'' అని పల్కెను. అంతఁ దార లజ్జితయై చంద్రునితోఁ సమానుఁడగు పుత్రునిఁగనెను. బృహస్పతి కడు సుందరుఁడగు బాలునిఁజూచి తాను దీసికొనవలెనని నిశ్చయించెను. చంద్రుఁడుగూడ నట్లేతలంచెను. అందుచే ''వీఁడు నాకొడుకుగాని నీకొడుకుగాఁ''డని చంద్ర బృహస్పతులు వాదించుకొనుచుండిరి. దేవతలును మునులును, తారనుజూచి ''యీపుత్తుఁడెవ్వరికిఁ గలిగె''నని యడిగిరి. ఆమెసిగ్గుచే మాటాడలేదు. అంత బాలుఁడు తల్లినిజూచి కోపించి '' ఓదుష్టనర్తనురాలా ! వ్యర్థమగు సిగ్గుతో నిపుడు మాటాడవేమి ? నే నెవరికి జనించితినో నాకుఁజెప్పుము, నీలోపమును దాఁపకు''మని తల్లిని నిందించుచుండెను. ఇట్లు తల్లిని నిందించుచున్న బాలునిఁజూచి బ్రహ్మ తారను రహస్యస్థలమునకుఁ బిలిచి మంచిమాటలచే ననునయించి ''వీఁడెవని సుతుఁ''డని యడిగెను. అమె సిగ్గుతో ''చంద్రునివాఁ''డని మెల్లగాఁబలికెను. అంత బ్రహ్మ యా బాలునిఁ

జంద్రునకిప్పించెను. "ఈ బాలుఁడు గంభీరమగు బుద్ధిచేఁ జంద్రు
న కానందము కలిగించుటంజేసి యితఁడు బుధుఁడను నామముఁ
దాల్చు"ననిచెప్పి బ్రహ్మవెడలి పోయెను. ఆ బుధుఁడు స్త్రీరూప
ముదాల్చిన సుద్యుమ్ననియందుఁ బురూరవునిఁగాంచెను. అతఁ
డూర్వశిని జేపట్టి యూయువు మొదలగు పుత్త్రులను బడసెను.
దేవకాంతయగు నూర్వశి నితఁడెట్లు వరింపఁగల్గెనో చెప్పెదను
వినుము. ఒకప్పుడు నారదుఁడు సురలోకమునఁ బురూరవుని సౌం
దర్యమును, గుణములను, నౌదార్యమును సత్ప్ర వర్తనమును,
ధనమును, బరాక్రమమును వర్ణించుచుండ నూర్వశి విని కా
మాతురయై మిత్రావరుణులిచ్చిన శాపముచే మనుష్యభావము
నుబొంది రెండవ మన్మథునివలెనున్నయతనిఁ గాంచి మనస్సు
దిట్టపఱిచికొని సమీపించెను. పురూరవుఁ డాసుందరినిజూచి సం
తోషముచే నేత్రములు వికసింపఁ బులకితగాత్రుఁడై మృదు
వచనములతో నామె కిట్లనియె. "ఓసుందరీ ! నీవు సుఖముగా వ
చ్చితివా ! కూర్చుండుము. నీదానుఁడను. నీకుఁ గావలసిన కార్య
మొనర్చువాఁడను. నాతోసఖ్యము చేయుము. మనమిరువురము
వెక్కేండ్లు సుఖముగా వర్తింతము" అనవిని యూర్వశి వానిం
జూచి "ఓసుందరా ! సౌందర్యవంతుఁడ వయిననిన్ను వీక్షించి
న యే స్త్రీమనోదృష్టులు నీయందు సక్తములుగావు? రమింప
దలంపుతో నీవఱుమును బొందిన స్త్రీమఱియెప్పటికిని దానివిడు
వనోపదు. ఓరాజా ! నే నీమేషములను ముద్దుతోఁ బెంచుచు
న్నాను. ఇవినాకుఁ గుమారులవంటివి. వీనిని నీవు కాపాడుచుం
డుము. నీవు వీనిని రక్షించినంతకాలమును స్త్రీల కుత్తమవరుఁడ
వయిన నీతోఁ గ్రీడింతును. నేను ఘృతమును దప్ప వేఱొకదాని

నాహారముగా స్వీకరింపను. సంభోగకాలమునందుఁ దప్పఁ దదితర సమయములందు నీవు దిగంబరుఁడవై కానరాఁగూడదు. ఒకవేళ నీవు కనఁబడినచో వెంటనే నిన్ను విడిచిపోవుదును. దీనికి నీవం గీకరించితి వేని నీయభిలాషము నెఱవేర్తును" అని పలికెను. పు రూరవుఁ డదివిని దాని సమయమునకు సమ్మతించి "ఓసుందరీ! అయ్యో! నీసౌందర్యము నిరుపమానమైనది. నీ భావముగూడ శ్లాఘ్యమైనది. ఈ రెండును నరలోకమునంతను మోహింపఁ జేయఁ జాలినవి. నీయంతట నీవు ప్రేమతోఁ జేరవచ్చుచున్న ని న్నేమను షుఁడు వరింపఁడు?" అని పల్కి పద్మగంధము గల్గిన యా మె తోఁగూడి చైత్రరథము, నందనము మొదలగు నుద్యానవనము లందు విహరించుచు యథేష్టముగాఁ గ్రీడించుచు నా మెముఖ పరిమళమున వశ్యుఁడై యెక్కు-సంవత్సరము లానందించెను. అం త సురలోకమున నొక నాఁ డింద్రుఁడు కొలువుదీర్చి యూర్వశి లేకుండుటచేఁ దన సభ ప్రకాశింపలేదని విచారించి యామెను గొనివచ్చుట కిరువుర గంధర్వుల నియమించెను. అంతవా రిరు రువును మధ్యరాత్రియందుఁ గటికి చీకటిలో మెల్లమెల్లగాఁ బోయి రాజు రక్షించుచున్న మేషములను హరించిరి. అంత నూర్వశి కొనిపోఁబడుచున్న మేషముల యఱపునువిని "అయ్యో! చచ్చి తిని. కుత్సితనాథుఁడవును, నపుంసకుఁడవును, వీరమన్యుఁడవును నగు నీచేఁ జంపఁబడితిని. విశ్వాసముచేఁ బిల్లలవంటి మేషముల నీయొద్ద దాఁచుకొంటిని. వాని నిప్పుడు దొంగలు హరించిరి. నాపి ల్లలు పోవుటచే నే నిఁక మృతప్రాయను. ఆఁడుది భయపడి శయ నించునట్లుగా నీ వెప్పుడును రాత్రి శయనించియే యుందువు. నాశరీరమును బెనఁచిన బాహుపాశమునువిడువు. పొమ్ము. నన్ను

విడుచుటకు భయపడి యెల్లప్పుడును గౌఁగిలించుకొనియె యుం దువు" అని ములుకులవంటి పలుకులతో నొప్పింప గజవర మం కుశభూతమును సహింపఁజాలనియట్లు పురూరవుఁడు త్వరపడిలేచి ఖడ్గమును దాల్చి కోపముతో నా రాత్రిసమయమున వస్త్రము ధరింపకయే మేషములను దెచ్చుటకుఁ బర్వెత్తెను. అగంధర్వులు పురూరవుఁడు వచ్చుటను దెలిసికొని తమకార్యము సఫలమైనం దులకు సంతసించి వానినచ్చట వదలి పాఱిపోయిరి. ఆ రాజు వానిని దీసికొని వచ్చుచుండఁగా దిగంబరుఁడయిన భర్త నూర్వ శి చూచి సమయభంగమగుటచే నటనుండి కదలిపోయెను. పురూరవుఁడు నచ్చి తల్పమందు భార్యలేకుండుటను జూచి దుఃఖితుఁడై యామెనే సంతతమును జింతించుచు వెఱ్ఱియై తిరువాని వలెఁ జూపట్టుచు భూమండలమునఁ బరిభ్రమించుచుఁ గురుక్షే త్రమున సరస్వతీ తీరమున నైదుగురు చెలికత్తెలతోఁ గూడియు న్నయూర్వశిని జూచి సంతుష్ట హృదయుఁడై మృదువుగా నిట్లుప లెక్కె. "ఓ ప్రియురాలా ! నిలువుము. నిలువుము. ఈ ఘోరదుఃఖ మున నన్నుఁ బడవేయ నుచితముకాదు. ఏకాంతమున మనము చేయవలసిన గోష్ఠియింకను మిగిలియున్నది. నుసము సల్లాపము సల్పుదము రమ్ము. ఓదేవీ ! నిన్ను వెదకుచుఁ జాలదూరము వచ్చి తిని. నీవు కరుణింపనిచోఁ గమనీయమగు నాదేహము నిచ్చట విడువవలసి వచ్చును. నీయనుగ్రహమునకుఁ బాత్రమైన యీ నాశరీరమును దోఁడేళ్లును, గ్రద్దలునుదినును. ఇంతకంటె హేయ ముగలదా?" అని దీనాతిదీనముగాఁ బ్రార్థింప నాయూర్వశి య తనికిట్లనియె. "ఓయీ ! నీప్రతిజ్ఞను వృథచేయక ధీరుఁడవుకమ్ము. నీవు మరణింపవలదు. నీశరీరము తోఁడేళ్లకు భక్ష్యముకాకుండుఁ

గాక. ఓరాజా! ఆలోచింప నెక్కడను స్త్రీసఖ్యము స్థిరమైయుండదు. తోడేళ్ల హృదయమువలె స్త్రీహృదయము మిక్కిలి క్రూరము. స్త్రీలకు దయయుండదు. వారిస్వభావము క్రూరము. వారి కోర్పుసున్న. వారు తమ ప్రియమును సాధింప నెంతటి సాహసమునైనఁ జేయుదురు. ఒకప్పుడు వారు స్వల్ప ప్రయోజనము నిమిత్తము విశ్వాసార్హుఁడయిన భర్తనైనను, సోదరునైనను జంపుదురు. కొందఱు స్త్రీలు భర్తలందుఁ గపట విశ్వాసముంచి యభిప్రాయములను దెలియ నీయక, వాని యందు మనస్సు నిల్పక వేఱొక క్రొత్తపురుషునిఁ గోరుచు జారిణులై యథేష్టముగాఁ బ్రవర్తింతురు. కావున మావంటివారి స్నేహమును విడువుము. ఓహృదయేశ్వరా! నీ విప్పటి కొక సంవత్సరమైన పిమ్మట నాతో నొకరాత్రి వసింపఁగలవు. అప్పుడు నీకు మఱియొకపుత్రుఁడుగలుగును" అని పలుక రాజు దానివచనములవలన నామె యిప్పుడు గర్భిణియై యున్నట్లు తెలిసికొని తన పురమున కరిగెను. సంవత్సరాంతమునఁ బుత్రునితోఁగూడ నూర్వశి పురూరవునిచెంతకు వచ్చెను. అతఁడు దానిఁజూచి యానందించి యామెతోనా రాత్రి నివసించెను. నిశాంతమునందుఁ దన విరహమును సహింపలేని రాజునుజూచి యూర్వశి "ఓరాజా! నీ వీ గంధర్వులను మతించి ప్రసన్నులఁగాఁ జేసికొనుము. వారు నాలోకమునకుఁ దగినసాధనమును దెలిపి నన్ను నీకొసంగుదురు" అని పల్కెను. పురూరవుఁడు గంధర్వుల నుతించెను. వారతనిఁగరుణించి యగ్నిస్థానము చేసికొనఁదగిన పాత్ర మొకదాని నిచ్చిరి. రాజాయగ్నిస్థాలిని బుచ్చుకొని యది యూర్వశీప్రాప్తికి సాధనమని నిశ్చయించి యొకపుడు వనమున సంచరించుచు నొకచో దానిమఱచి

యింటికిఁబోయి యూర్వాత్రి యచ్చటఁ గడపెను. అంత త్రేతా యుగ ప్రారంభము కాఁగాఁ బురూరవుని మనస్సున వేద మావిర్భవించెను. దానివలన నతఁడు శిఖగర్భమగు నశ్వత్థకాష్ఠములవలన నగ్నిని మథింపవచ్చు ననితెలిసికొని, వానిని సంపాదించి మంథనకాష్ఠములఁగాఁ జేసి యూర్వశీలోకమును బొందఁ దలంపుతో మంత్రపూర్వకముగాఁ గ్రిందికాష్ఠము నూర్వశిగాను, మీఁదికాష్ఠమును దన్నుఁగాను వానిరాపిడివలనఁ గల్గిన ద్రవ్యమును బుత్త్రునిఁగాను దలంచుచు మథించెను. అట్లు మథించుటవలన నగ్ని జనించెను. ఆ యగ్నిని వేదోక్తములగు త్రివిధసంస్కారములచేతను మూఁడురూపములగా నొనర్చి పురూరవుఁడు బుణ్యలోకమును గల్గించువారగుటచే వారిని బుత్త్రులనుగా నిశ్చయించెను. అనంతరము పురూరవుఁ డూర్వశీలోకమును గోరుచు, నాయగ్నులచే సర్వ దేవతాశరీరుఁడును, యజ్ఞఫలదాయకుఁడును, నాత్రితార్తి హరుఁడును నగుభగవంతు నారాధించెను. ఓరాజా! కృతయుగమున సకలవాఙ్మయములకును బీజభూతమై యోంకార మొక్కటియె యుండెను. అపుడు వేదమొక్కటియె. నారాయణుఁడొక్కఁడే దేవుఁడుకాని వేఱొకఁడులేఁడు. అగ్నియు నేకవిధమే యుండెను. హంసమను పేరితో వర్ణముగూడ నొక్కటియె యుండెను. త్రేతాయుగమున కాదియందుఁ బురూరవునివలన వేదము మూఁడు విధములయ్యెఁ. ఆ విభాగముచేతనే కర్మమార్గము స్పష్టమయ్యెను.ఆపురూరవుఁడగ్నిరూపపుత్త్రుని కారణమున గంధర్వలోకమును బొందెను. ఇది పదునాల్గవయధ్యాయము.

—·✤·—

పురూరవ వంశము.

ఓరాజా ! పురూరవున కూర్వశియందు ఆయువు, శ్రుతాయువు, సత్యాయువు, రయుఁడు, జయుఁడు, విజయుఁడు ననునాఱుగురు కొమరులుగల్గిరి. అందు శ్రుతాయువునకు వసుమంతుఁడుగలిగె. సత్యాయువునకు శ్రుతంజయుఁడుద్భవించె. రయున కేకుఁడనువాఁడుదయించె. జయున కమితుఁడుదయించె. విజయునకు భీముఁడు సంభవించె. భీమునకుఁ గాంచనుఁడుగలిగె. వానికి హోత్రకుఁడుపొడమె. వానికి జహ్ను వుదయించె. అతఁడు గంగానదిని బుక్కిటఁబట్టి విడుచుటచేతనే గంగకు జాహ్నవి యనునామము గల్గినది. ఆజహ్నుఁడు పూరునిఁగాంచెను. వాఁడు బలాకునిఁగనియె. వాఁ డజకునిఁబుట్టించె. ఆ యజకునికిఁ గుశుఁ డుదయించె. వానికిఁ గుశాంబుఁడు ధూర్తయుఁడు వసువు కుశనాభుఁడు నను నల్వురుకొమరులు గల్గిరి. అందుఁ గుశాంబునకు గాధియుదయించె. అతనికి సత్యవతియను కూఁతురుగలిగె. ఆకన్యను దన కీయవలయునని భృగువంశజాతుఁడగు ఋచీకుఁడను నొక బ్రాహ్మణుఁ డడుగఁగా గాధి తనకన్య కతఁడు తగినవాఁడు కాఁడని నిశ్చయించి యతని కిట్లనియె. "ఓ విప్రవర్యా ! ఒకచెవిమాత్రము నలుపును, దక్కిన శరీరమంతయుఁ జంద్రునంత తెలుపును గల గుఱ్ఱముల వేయింటిని నాకన్యకు శుల్కముగా నీయవలయును. ఆలోచింపఁ గుశికుని వంశమునఁబుట్టిన యీకన్యకదియుఁ జాలదనియే తలంచెదను. అయిన నీవు వానిఁ దెచ్చియిచ్చితేని నాకన్యకనిత్తు" ననఁగా ఋచికుఁ డాతనియభిప్రాయమును గనిపెట్టి వరుణుని సమీపమునకరిగి యతనియాచించి గుఱ్ఱములను దెచ్చి గాధికొసంగి యాసత్యవతినిఁ బెండ్లాడెను. ఒకప్పుఁడు తనభార్యయు,

నత్తయును వచ్చి తమకుఁ బుత్రసంతానము గల్గింపవలెననికో రఁగా నామని బ్రహ్మమంత్రములతో నొకచరుపును, క్షత్ర మంత్రములతో వేఱొకదానిని సిద్ధముచేసి స్నానమున కరిగెను. అతఁడు స్నానముచేసి వచ్చునంతలో సతనియత్తగారు తనయ ల్లుఁడు తనపుత్రికపైనున్న ప్రేమచే నామెనిమిత్తమై శ్రేష్ఠమైన చరుపును గల్పించియుండునని తలంచి తన కాచరుపునీయవల యునని సత్యవతినిఁ గోరఁగా నామె తల్లికోర్కి వృథచేయఁజా లక తన చరుపు నామెకిచ్చి యామెచరుపును దాను దీసికొని భక్షించెను. అంత ముని మరలివచ్చి యా వృత్తాంతమును దెలి సికొని భార్యనుజూచి "ఓ యవివేకురాలా! మిక్కిలి తెలివితక్కు వపని చేసితివి. నీకుఁ గల్లెడుపుత్రుఁడు క్షత్రధర్మము లవలం బించి యుద్ధాదులందు నిపుణుఁడగును. నీసోదరుఁడు బ్రహ్మవిద్యా విదుఁడగును. ఇది నీ బుద్ధిహీనతవలనఁ గల్గినది" అనెను. సత్యవతి మిక్కిలివిచారించి తనతప్పును మన్నించి తనకు యోగ్యుఁడగును తుఁడు జనించునట్లు చేయుమని భర్తనుబ్రార్థింప సతఁడనుగ్ర హించి యామె కొమరుఁడు శాంతుఁడగునట్టును, మనుమఁడు క్రూరుఁడగునట్టును జేసెను. కావున సత్యవతికి శాంతుఁడును, దపోనిష్ఠుఁడు నగు జమదగ్ని యుదయించెను. ఆసత్యవతి లోక పావనియగు నదియై ప్రవహించె. అదియే కౌశికియనివాసిగాంచె. ఆ జమదగ్ని రేణుకను బరిణయమయ్యెను. అతని కామెయందు వసుమనుఁడు మొదలగు కొమరులుపుట్టిరి. వారిలోఁ గడపటివాఁ డు రాముఁడని ప్రఖ్యాతిగాంచెను. ఆరాముఁడే భగవదంశావతా రమని చెప్పుదురు. అతఁడు హైహయవంశము నంతరింపఁజేయ టయే కాక యిరువదియొకమాఱు భూమినిజరించి క్షత్రియు

బీజము లేకుండఁ జేసెను. గర్వించి పుడమికి భారమునుగల్గించుచు రజస్తమోగుణములకు నిలయమై ధర్మమార్గమును వదలి చరించుచు, బ్రాహ్మణులకు విపరీతమై వర్తించు క్షత్త్రికులము స్వల్పమగు నపరాధముచేసి పూర్ణముగా నశించెను.అనిన శుకుంగాంచి నరేంద్రుఁడు "ఓ మునీంద్రా ! దురాత్ములగు రాజు లొనర్చినయ పరాధ మెట్టిది? ఆయపరాధముచే క్షత్త్రియు నంశములన్నియుఁ బూర్ణముగా నశింపఁ గారణమేమి?"అని యడుగ శుకుండిట్లనియె. "ఓరాజా ! పూర్వము కార్తవీర్యార్జునుఁ డను నొకనృపశ్రేష్ఠుఁడు హైహయ దేశములను బాలించుచుండెను. అతఁడు నారాయణాంశ సంభూతుఁడైన దత్తాత్రేయునిసేవించి యారాధించి తదనుగ్రహముచే బాహు సహస్రమును శత్రువులకు దుస్సహమగు పరాక్రమమును బుద్ధిబలమును, తేజమును, నింద్రియబలమును, కీర్తిని, శరీరబలమును, నణిమాదులగు యోగసిద్ధులను బడసి వాయువువలె లోకములం దనర్గళుఁడై సంచరింపఁ దొడఁగెను. అతఁడొకనాఁడు మదోద్ధ్రిక్తుఁడై వైజయంతియను పుష్పమాలచే నొప్పుచుఁ దనభార్యలతోఁగూడ రేవానదియందు జలక్రీడ సల్పుచుఁ దనభుజములచే నానదిని బంధించెను. తోడనే నదీజలము పొంగి, కార్తవీర్యుని జయింపవచ్చి సైన్యములతో నానదీతీరమున విడిసియున్న రావణుని శిబిరమును ముంచెను. రావణుఁడు దానికి సహింపఁజాలక క్రీడించుచున్న కార్తవీర్యునిఁ బరాభవింప సరభసమునఁ జనఁగా నది యతఁడుగ్రహించి స్త్రీలండఱునుజూచి నవ్వుచుండ రావణుని వాలివలె సులభముగాబంధించి కొంతకాలము గారాగారముననుంచి గర్వముతొలఁగించి విడిచెను.మహాబలుఁడైన యాయర్జునుఁ డొకనాఁడు వేటకుఁజని యథేచ్ఛగా

సంచరించుచు జమదగ్ని యాశ్రమమునకుఁ బోయెను. అంత జమదగ్ని యా రాజునకును వానిపరివారమునకు నుచిత మర్యాదలుగావించి కామధేనువును రప్పించి వారలకందఱకును నతిథి సత్కారము లొనర్చెను. ఆ యర్జునుఁడు తన యైశ్వర్యముకంటె నధికమయిన యాముని సామర్థ్యమును జూచి సహింపక యాతఁ డిచ్చిన పూజలను స్వీకరింపక కామధేనువును బట్టితేవలయు నని భటుల నాజ్ఞాపించెను. భటులు నిరంకుశులై దీనముగా నఱచుచున్నను వదలక సవత్సయగు నా ధేనువును మాహిష్మతికిఁ గొనిపోయిరి. కార్తవీర్యుఁ డిట్లపకారము చేసిపోయిన కొంతసేపటి కెక్కడకోపోయిన పరశురాముఁడు మరలి తనతండ్రియాశ్రమమునకు వచ్చి యారాజు దౌర్జన్యమును విని దండితాడిత మగు సర్పమువలెఁ గుపితుఁడై భయంకరమగు పరశువును,విలు నమ్ములను, నమ్ముల పొదులనుదాల్చి, కవచముఁదొడిగి, శత్రువులకు దుర్ధర్షుఁడై, గజరాజును సింహమువలె,నారాజు ననుసరించి పోయెను. ధనువును, బాణములను, బరశువునుధరించి లేడిచర్మ మంబరముగాఁ దాల్చి సూర్యకాంతివలె జటాకలాపము ప్రకాశింపఁ బరాక్రమ మతిశయింపఁగా నతి త్వరితగమనమున వచ్చు పరశురాముని౯గాంచి కార్తవీర్యుఁడు తనసైన్యముల నతనివధింప నాజ్ఞాపించి పురము ప్రవేశించెను. రాజానుమతిని బడసి పదునేడక్షౌహిణుల పరిమితిగల యా చతురంగసైన్యములును విజృంభించి కత్తులను, గదలను, బాణములను, శతఘ్నులను, శక్తులను దాల్చివచ్చి యెదిరింపఁగా రాముఁడొక్కఁడే వానిని సంహరించెను. అగ్నివంటి ప్రతాపముగలిగి శత్రుసైన్యముల సంహరించు భృగురాముఁడు శత్రుసైన్యములు విక్రమించుచున్న స్థలములం

దెల్లఁ దన పరశువును ద్రిప్పికొట్టఁగా నట రిపుల బాహువులును, దొడలును, మెడలును, దెగిపడుటయేకాక వీరులు, సూతులు, వాహనములుగూడఁ గుప్పకుప్పలుగాఁ గూలుచుండిరి. ఇట్లు రాముని కుఠారముచేతను, బాణములచేతను, గవచములును, ధ్వజములును, విండ్లును, శరీరములును, రక్తసిక్తములై యుద్ధ భూమిని బడుచున్న తన సైన్యములఁ జూచి కార్తవీర్యుఁడు మిక్కిలికోపముతో వడివడి నటకరుదెంచి యేనూఱుచేతులతో విండ్లువట్టి మిగిలినకరములతో బాణములనుదీసి సంధించి రాము నిపైఁ బ్రయోగించెను. కాని యస్త్రవిద్యాకుశలుఁడయినరాము డొక్కవింటితోనే యాశరముల నన్నింటి నొక్కటఁ ద్రుంచెను. అందుల కర్జునుఁడు క్రుద్ధుఁడై తనహస్తములతోఁ బర్వతములను వృక్షములను బెఱికి రాముని పైకిఁజిమ్మెను. అట్లుయుద్ధమున విజృం భించివచ్చుచున్న యర్జునునిఁ బరిహాసముచేయుచు రాముఁడుతీవ్ర ధారగల కుఠారముచే వానిభుజములను బలాత్కరించి ఛేదించె ను. అంతతో నూరకుండక వెంటనే పర్వతశృంగమునువలె వాని శిరమునుగూడ భూమిని గూలనేసెను. ఇట్లర్జునుఁడు మడిసినతో డనే వానిపుత్త్రులు పదువేవురును భయపడి వత్సముతోఁగూడ హోమధేనువును గొనివచ్చి రాముని కర్పించి పరిద్విడిపోయిరి. అంతరాముఁడు తనయాశ్రమమునకు మరలి యలఁతనొందియు న్న యాధేనువును దండ్రికర్పించి తానొనర్చిన పనిని సోదరులకు ను దండ్రికిని వర్ణించిచెప్పెను. అదివిని జమదగ్ని విచారించుచు రాముంజూచి "ఓరామా! రాజనఁగా సర్వదేవమయుఁడు. నీవు వ్యర్థముగాఁ గోపమూని యట్టిరాజునుజంపి మహాపాప మొన ర్చితివి. తండ్రీ! మనము బ్రాహ్మణులము. రాజసకర్మముల నొన

రింపఁదగము. మనకు శాంతియే ముఖ్యము. అది గలవారమగు టచేతనే మనములోకమునఁ బూజ్యులమగుచున్నారము. తీమను బోలినది వేఱొకటిలేదు. లోకగురువగు బ్రహ్మ దానివలననే మహోత్కృష్టమగు పదమును గాంచెను. సూర్యునికాంతివలె బ్రాహ్మణుని శమదమాది సంపదప్రకాశించును. భగవంతుఁడగు శ్రీహరి యట్టి శమాదిసంపన్నునికే వేగముగాఁ బ్రసన్నుఁడగును. మూర్ధాభిషిక్తుఁడగురాజును జంపుట బ్రహ్మహత్యకంటెను మహత్తరపాపము. అట్టిపాపము ని న్నావరించినది. కావున నీవిఁక గంగాదిపుణ్యతీర్థములను సేవించి యీ పాపమును దొలఁగించుకొనుము." అని యుపదేశించెను. ఇది పదునేనవయధ్యాయము.

పరశురాముఁడు జనన్యాదుల జంపుట.

ఓ కురునందనా! తండ్రి యుపదేశమును విని యొకసంవత్సరము తీర్థములను సేవించి మరలి యాశ్రమమునకు వచ్చెను. ఒకప్పుడు పరశురాముని జనని రేణుక జలముదెచ్చుటకై గంగానదికేఁగి పద్మమాలఁదాల్చి యందచ్చరలతోఁ గ్రీడించుచున్న చిత్రరథుఁడనుగంధర్వరాజునుజూచి యతనియందు స్పృహయాళువై హోమకాలమును మఱచి యచ్చటనుండెను; కాని కొంతసేపటి కెట్టకేలకుఁ గాలాతిక్రమమును దెలిసికొని భర్త తన్ను శపించు నేమోయని భయమందుచు రేణుక యమందగతిం జని జలకుంభమును బతిసన్నిధినుంచి బద్ధాంజలియై నిలువఁబడెను. అంత జమదగ్ని తనభార్య మనశ్చాంచల్యమును దెలిసికొని కోపించి కుమారులను బిలిచి "కుమారులారా! పాపాత్ములారాలైన మీ

తల్లిని జంపుఁ"డని యానతిచ్చెను. కాని వారు మాతృవధకు జంకి జనకాజ్ఞ నిరసించిరి. అందులకు మని మండిపడి రామునిఁజూచి "ఓయీ! పాపులయిన నీసోదరులను, దల్లిని జంపుము" అని యా జ్ఞాపింప నతని తపఃప్రభావమును సమాధిని బూర్ణముగా నెఱిఁగి నవాఁడు కావున రాముఁడుజంకక వారల నొక్కఁ బెట్టున ఖండిం చెను. కుమారునిపనికి మిక్కిలి సంతసించి జమదగ్ని వానిఁజూచి "వలయువరము వేఁడు"మన రాముఁడు తనజననీసోదరుల జీవము లనిమ్మని ప్రార్థించెను. జమదగ్నియిచ్చెను. తోడనే రామునితల్లి యు, సోదరులును, నిద్రపోయిలేచినట్లు లేచిరి. ఓరాజేంద్రా! రాముఁడు జనకుని తపోబలమును జ్ఞానాతిశయమును నెఱిఁగిన వాఁడు కావుననే మరలఁ దనవారలను బ్రదికింపవచ్చునని నిశ్చ యించి యనుచితకార్యము నొనర్చెనుగాని, లేనిచో నట్లొనర్చునా? కార్తవీర్యునికుమారులు రామునిప్రతాపమునకు భీతిల్లి పలాయితులై తమతండ్రిమరణమును సర్వదా స్మరించుకొనుచు నొకప్పుడును గొంచెమైనను సుఖము చెందలేకపోయిరి. ఒకప్పు డు రాముఁడు సోదరులతోఁగూడ వనాంతరమున కరిగియుండుట గాంచి హైహాయులు తమపగ సాధింప నిశ్చయించుకొని జమ దగ్నియాశ్రమముసొచ్చి యగ్నిహోత్రశాలయందుఁ గూర్చుండి భగవంతునియందు మనస్సుఁజేర్చి మైమఱచియున్న జమదగ్నిం గాంచి పాపనిశ్చయులై రేణుక వలదువలదని దీనాతిదీనముగాఁ బ్రార్థించుచున్నను కఠినచిత్తులై వినక యతనిశిరమును నఱికి కొనిపోయిరి. రేణుక పతిమరణమును గన్నులారఁజూచి మాన సిక క్లేశముచేతను, శోకముచేతను, బీడితయై గుండె బాదు కొనుచు "ఓరామా! రామా! రమ్ము, రమ్ము." అని యెలుఁగెత్తి

పిలిచెను. అంతఁ బరశురాముఁడును నతనిసోదరులును దూరమున నుండియె "హా రామా" యను నార్తస్వరమును విని త్వర తో నాశ్రమమునకు వచ్చి మృతినొందిన జనకునిఁగాంచి దుఃఖ ముచేతను, క్రోధముచేతను, దైన్యముచేతను, రోదనముచేతను, మోహితులై "హా జనకా! హా సజ్జనవరా! హా ధర్మ్మా! మమ్మ నాథులఁజేసి పోయితివా" యని కొంతవడి విలపించిరి. పిమ్మట రాముఁడు ధైర్య మవలంబించి తమ పితృదేహమును రక్షింప సోదరుల నియోగించి పరశువును గేలఁగీలించి క్షత్త్రకులనాశము చేయ నిశ్చయించి బ్రహ్మ హంతకులకు నిలయమగుటచే శోభ చెడియున్న మాహిష్మతినిజేరి హైహయులను జంపి వారిశిరము లను గొండలవలెఁ బోర్వులువెట్టెను. మఱియుఁ గ్రూరులు భీతి ల్గునట్లు వారల రక్తమును మహానదిగా నొనర్చెను. అయిన నమంగళకార్య మొనర్చిన క్షత్త్రకులమునఁ గసిదీఱక యిరువది యొకమాఱు భూవలయమునఁ దిరిగి క్షత్త్రియులఁ బూర్ణముగా సంహరించి శమంతపంచక మనుప్రదేశమున శోణితోదకము లగు నైదుహ్రదములందుఁ బితృతర్పణముగావించి కోపముచల్లా ర్చుకొనెను. అనంతరము రాముఁడు తనజనకుని శిరమును గొని వచ్చి కాయముతో నదికి యూగములచే సర్వదేవమయుఁడైన పరమేశ్వరు నారాధించెను పిమ్మట యజ్ఞదక్షిణగా హోతకుఁ దూర్పుదిశనిచ్చెను. దక్షిణదిశను బ్రహ్మకును, బడమటి దిక్కు నధ్వర్యునకును, ఉత్తరము నుద్గాతకును నొసంగెను. విదిక్కులను దక్కిన బ్రాహ్మణుల కర్పించి మధ్యభాగమును గాశ్యపున కిచ్చి యందులో నార్యావర్తము నుపద్రష్టకు సమర్పించె. పిమ్మట రాముఁడవభృథస్నానముచేసి సమస్తపాపములను దొలంగించు

కొని మేఘమండలమును బాసిన సూర్యనిచందమున సరస్వతీ నది చెంతఁ బ్రకాశించెను. జమదగ్ని స్మృతి చిహ్నమైన నిజ దేహమునుబొంది రామునివలనఁ బూజలనంది నక్షత్రరూప మొంది సప్తర్షులలోను గడపటివాఁడై యాకసమునఁ బొల్చుచుం డెను. భగవంతుని యావేశావతారమును, బ్రహ్మనేత్రుఁడు నగు రాముఁడు రాఁబోవు మన్వంతరమున బృహద్భేదమును బ్రవర్తిం పఁజేసి సప్తర్షులలో నొకఁడు కాఁగలఁడు. ఇప్పు డతఁడు క్షత్రి యవధమాని శాంతుఁడై సిద్ధాదులచేఁ బొగడ్తగాంచుచు మహేంద్రపర్వతమున నున్నాఁడు. ఓరాజా! విశ్వాత్ముఁడగు శ్రీ హరి యిట్లుభృగువంశమున నవతరించి భూమికిభారము గల్గించు క్షత్రియుల ననేక పర్యాయములు సంహరించి భూభారమును హరించెను. ఓరాజా! సత్యవతి తల్లి బ్రహ్మ మంత్రపూత మగు చరువును భక్షించి విశ్వామిత్రుఁ డనుకుమారునిఁ గాంచెను. అతఁడు వహ్నివలె తేజశ్శాలియై మహాఘోర తప మొనర్చి క్షత్రియత్వమును వదలి బ్రహ్మర్షియయ్యె. క్షత్రియుఁడయ్యు బ్రాహ్మణుఁడగుటకుఁ గారణ మితని బ్రహ్మమంత్రపూతమగుచరు వును భక్షించుటయె. అతనికి నూఱ్ఱురు కొమరులు గలిగిరి. వారిలో మధ్యముఁడు మధుచ్ఛందుఁ డనువాఁడు. అతని నామ మునుబట్టి యతనికి జ్యేష్ఠులును గనిష్ఠులునుగూడ మధుచ్ఛం దులనునామమును దాల్చినవారు. ఆకాశమున భృగువంశజుఁ డగు నజీగర్తి యనునొక బ్రాహ్మణునకు శునశ్శేపుఁ డనుకుమారుఁ డుండెను. వాఁడు హరిశ్చంద్రుని యాగమునఁ బశువుగా నమ్మఁ బడి రోహితుని వెంటఁబోవుచు మార్గమధ్యమున విశ్వామిత్రునిఁ గలిసికొని తనవృత్తాంతమునుజెప్పి శరణుసొచ్చెను. విశ్వామిత్రుఁ

డతనిఁ గరుణించి యతనిఁ బుత్త్రునిఁగా స్వీకరించి మధుచ్ఛందుని కంకె జ్యేష్ఠులగువారిని బిలిచి "యీతని మీలో జ్యేష్ఠునిఁగా నెంచుకొనుఁ"డనిచెప్పెను. కాని వారందుల కంగీకరింపరైరి; గాన కోపముతో వారిని మ్లేచ్ఛులుగా శపించి మధుచ్ఛందునికంకె బిన్నలగు నేబండ్రనుబిలిచి తనయభిప్రాయమును దెలిపెను. వారు తండ్రికిభయపడి శునశ్శేపుని జ్యేష్ఠునిఁగాఁ బరిగ్రహించిరి. ఆశునశ్శేపుఁడు హరిశ్చంద్ర యూపబద్ధుఁడయి విశ్వామిత్రుఁడుపదేశించిన మంత్రముచే దేవతలను బ్రసన్నులనుగాఁ జేసికొని పాశవిముక్తుఁడై వారివలనఁ దనప్రాణములరక్షించుకొనియె. అతఁ డావరుణయాగమున దేవతలచే దత్తమగు ప్రాణములు గలవాఁడు కావున దేవరాతుఁ డనునామమును వహించెను. దేవరాతుఁడు మరలిరాఁగా విశ్వామిత్రునిపుత్త్రులు మధుచ్ఛందుఁడు మొదలగువారతని జ్యేష్ఠునిఁగాను మంత్రద్రష్టనుగాను నొనర్చిరి. ముని.తనయాజ్ఞను మన్నించినందులకుసంతసించి మధుచ్ఛందుఁడు మొదలగువారిని జూచి "ఓ తనయులారా ! మీరు నా యానతి ననుసరించి దేవరాతుని జ్యేష్ఠునిఁగాఁ బరిగ్రహించి నన్నుఁ బుత్త్రవంతునిఁగాఁ జేసితిరి. కావున మీరును బుత్త్రవంతులై వర్ధిల్లుఁడు. ఓ కౌశికులారా ! ఈదేవరాతుఁడు మీ కౌశికులలో నొకఁడు. మీరీతని ననుసరింపు" డని పల్కెను. విశ్వామిత్రునకు వీరలేకాక యుష్మికుఁడు, హారీతుఁడు, జయంతుఁడు, సుమదుఁడు మొదలగు మఱికొందఱు కొమరులు గల్గిరి. ఇట్లు విశ్వామిత్రుని కుమారులలోఁ గొందఱు శపింపఁబడుటచేతను, గొంద ఱనుగ్రహింపఁబడుటచేతను, బరునిఁగుమారునిఁగా స్వీకరించుటచేతను గౌశికగోత్రము నానావిధములయినది. అన్యఁ

డగుదేవరాతుఁడు కౌశికులలో జ్యేష్ఠుఁడై ప్రవరలోఁ జేరుటచే వారి ప్రవరయును మార్పుచెందెను. ఇది పదాఅవయధ్యాయము.

ఆయు వంశాదికము.

ఓరాజా ! పురూరవుని కుమారులలో నేవురవంశములను వర్ణించితిని. ఇఁక మొదటివాఁడగు నాయువు వంశమును వర్ణింతు వినుము. ఆయువునకు నహుషుఁడు, క్షత్రవృద్ధుఁడు, రజియు, రంభుఁడు, వీర్యవంతుఁ డనునేవురు తనయులుగల్గిరి. వారిలో క్షత్రవృద్ధుని వంశమును ముందుగా వర్ణించెదను. క్షత్రవృద్ధునికి సుహోత్రుఁడుజన్మించె. అతనికిఁగాశ్యుఁడు, కుశుఁడు,గృత్సమదుఁ డనుమువ్వురుకొమరులు గల్గిరి. వారిలోఁగృత్సమధుననుశునకుఁ డుదయించె. వానికి శౌనకుఁడుగల్గె. అతఁడే బహ్వృచులలోఁ బ్రధానుఁడయ్యె. కాశ్యునకుఁ గాశిరాజును, గాశిరాజునకు దీర్ఘతపుఁడును, దీర్ఘతపునకు ధన్వంతరియు జనించిరి. అతఁడే యాయుర్వేదమును ప్రవర్తింపఁ జేసెను. వాసుదేవాంశమువలన నవతరించి దేవతలతోఁబాటు యాగభాగమునుబొంది నామస్మరణచేతనే రోగములను దూలించు ధన్వంతరికంటె భిన్నుఁడైనను,నీతఁడును భగవదంశసంభూతుఁడే. ఈధన్వంతరికిఁ గేతుమంతుఁడును, కేతుమంతునకు భీమరథుఁడును, భీమరథునకు ద్యుమంతుఁడును జన్మించిరి. ఆద్యుమంతునకే దివోదాసుఁడనునామాంతరము గలదు. వానికిఁ బ్రతర్దనుఁడు సంభవించె. అతనికి శత్రుజిత్తుగలిగె. అతనికి ఋతుధ్వజుఁడుద్భవించె. వానికే కువలయాశ్వుఁ డనువేఱొక నామముగలదు. ఆకువలయాశ్వున

కలర్క్కుఁడు మొదలగువా రుదయించిరి. వారిలో నలర్క్కుఁడు యూవనవంతుఁడై యుండియే యఱువదియూఱువేలవత్సరములు భూమిని బాలించెను. వానివలె యూవనవంతుఁడై యంతకాలము నేలఁబాలించిన రాజువే లోకఁడులేఁడు. ఆయలర్క్కునకు సన్నతియు, సన్నతికి సుకేతుఁడు, సుకేతునకు సుకేతనుఁడును, వానికి ధర్మకేతువును, ధర్మకేతువునకు సత్యకేతువును, సత్యకేతునకు ధృష్టకేతువును, ధృష్టకేతువునకు సుకుమారుఁడును, సుకుమారునికి వీతిహోత్రుఁడును, వానికి భర్గుఁడును, భర్గునకు భర్గభూమియు జనించిరి. ఓరాజా ! ఈచెప్పినరాజులు క్షత్రవృద్ధుని సంతతివాఁగు. ఇఁక రంభునివంశమును వినుము. రంభునకు రభసుఁడును, రభసునికి గంభీరుఁడును, వానికిఁ గ్రతువును సంభవించిరి. ఆక్రతువునకు బ్రాహ్మణకుల ముద్భవించెను. ఆయువు కొమరులలోఁ గడపటివాఁడగు వీర్యవంతునకు అనేననుఁడు, వానికి శుద్ధుడును, శుద్ధునకు శుచియు, శుచికి ధర్మసారథి యనునామాంతరముగల త్రికకుప్పను, ద్రికకుప్పనకు శాంతరయుఁడును జన్మించిరి. ఆశాంతరయుఁడు జ్ఞానయోగమవలంబించి ముక్తుఁడయ్యెఁకాని పుత్త్రులఁగనలేదు. ఆయువుకుమారుఁడగు రజి కమితతేజస్కులగు నేనూఱుకొమరులు గల్గిరి. ఆరజి దేవతల ప్రార్థన మంగీకరించి దైత్యులను సంహరించి వారపహరించిన స్వర్గలోకము సాధించి యింద్రున కర్పించెను. అయినను దేవేంద్రుఁడు ప్రహ్లాదునకు భయపడి స్వర్గలోకము నారజికే వెండియునర్పించి తన రత్నౌభరమునంత నాతనిపైనుంచెను. కొంతకాలమున రజి దేహమును దొఱఁగెను. వానికొడులు స్వర్గరాజ్యమును వశముగావించుకొని యజ్ఞభాగములను స్వీకరించి యింద్రుఁడువచ్చి

యాచించినను నొసంగలేదు. ఇంద్రుఁడు బృహస్పతితో నా లోచించెను. అంత నతఁడు అభిచారహోమమును జేసి యా రజి తనయుల కింద్రాధిపత్యమున కనుకూల మగుబుద్ధి లేకుండఁ జేసెను. తోడనే యింద్రుఁడు మార్గభ్రష్టులగు వారి నంద ఱను సంహరించెను. ఒక్కనిని విడువలేదు. ఓరాజా! క్షత్ర వృద్ధుని మనుమఁడగు కుశునకుఁ బ్రీతియుఁ బ్రీతికి సంజయుఁడు ను, సంజయునకు జయుఁడును, జయునకుఁ గృతుఁడును, గృతు నకు హార్యశ్వకుఁడును, వానికి సహదేవుఁడును, సహదేవునకు భీముఁడును, భీమునకు జయసేనుఁడును, జయసేనునకు సంకృ తియు బొడమిరి. ఆసంకృతి క్షత్రధర్మపరుఁడై మహాశూ రుఁడై వాసిగాంచెను. ఓరాజా! క్షత్రవృద్ధవంశజులగు రాజులు వీరె. ఇఁక నహుషుని సంతతివారిని వివరింతు వినుము. ఇది పదునేడవయధ్యాయము.

నహుషవంశము.

ఓనరేంద్రా! దేహేంద్రియములవలె నహుషునకు యతి, యయాతి, సంయాతి, ఆయాతి, వియతి, కృతి యనెడి యార్గురు కొమరులుగల్గిరి. వారిలోఁ బెద్దయగు యతి రాజ్యము దుఃఖకర మనియు, రాజాధికారమువలనఁ బురుషునకుఁ దన్నెఱుఁగనంత మత్తత సంభవించుననియుఁ దెలిసికొని తండ్రి యిచ్చెదనన్నను రాజ్యమును స్వీకరింపలేదు. నహుషుఁ డింద్రాధిపత్యము వహిం చి కామాంధుఁడై శచీదేవి పొందుగోరి యామెకోర్కిఁ జొప్పున బ్రాహ్మణవాహన మెక్కి త్వరగా నడువుఁడని వారలను దన్ని వారిశాపమునకుఁ బాత్రుఁడై పెనుఁబామై నేలఁగూలిన యనం

తరము యయాతిరాజ్యమును స్వీకరించి తనసోదరుల నల్వురను నాల్గుదిశలను బాలింప నియమించి తాను శుక్రునికూఁతును దేవయానిని, వృషపర్వునికూఁతును శర్మిష్ఠను బెండ్లియాడి వారి తో సుఖముగా భూమిని బాలింపఁ దొడఁగెను. అనిన విని రాజు మునీంద్రుంజూచి "మహాత్మా ! శుక్రుఁడు భృగువంశసంభూతుడగుబ్రహ్మర్షిగదా ! యయాతి క్షత్రియుఁడు. యయాతి బ్రాహ్మణకన్యక నెట్లుపెండ్లాడఁగలిగె? వీరి కీసంబంధ మెట్లుపాసఁగె?. ఇట్టి విపరీతవివాహ మెందయినఁగలదా!" యని ప్రశ్నింప శుకుం డతనికిట్లనియె. "ఓరాజా ! వృషపర్వుని కుమారిక శర్మిష్ఠ యొకనాఁడు వేగురు చెలిక తెలు కొలిచివచ్చుచుండఁగా గురుపుత్రియగు దేవయానితోఁగూడి పుష్పద్రుమములఁజేతను, మధుకరముల మధురగానములచేతను మనోహరమగు నుద్యానవనమున విహరించెను. అనంతరము వారొక సరస్సును సమీపించి కట్టుపుట్టములఁ దీరముననుంచి దానిలోఁజొచ్చి యొకరిపై నొకరు నీళ్లు జల్లుకొనుచుఁ గ్రీడించుచుండిరి. ఆసనుయమున శంకరుఁడు పార్వతీసహితుఁడై వృషభము నధిష్ఠించి యాప్రాంతమునకు వచ్చుచుండఁగాఁజూచి యాబాలిక లందఱును సిగ్గుపడి త్వరగాఁ దీరమునుజేరి వసనములను ధరించిరి. అత్వరలోఁ దెలియక శర్మిష్ఠ దేవయానివస్త్రమును దాల్చెను. దేవయాని యదిచూచి శర్మిష్ఠ కట్టినపుట్టము తనదని తెలిసికొని మిక్కిలి కోపించి యిట్లనియె. "అయ్యో! మాదాసియగు శర్మిష్ఠచేసిన యయుక్తకార్యమును జూడుఁడు. వివేకములేకుండ మేము ధరింపఁదగిన వసనమును ధరించినది. యజ్ఞమందలి హవిస్సును గుక్కవలె వసనము ధరింప నిది యర్హురాలుకాదు. అన్నిజాతులలోను బ్రాహ్మ

ణు లు త్తములు. వారు తపస్సుచేఁ బరమపురుషునకు ముఖమైరి. ఆ బ్రాహ్మణులు జ్యోతిస్స్వరూప మగు బ్రహ్మము నుపాసించెదరు. లోకమున మంగళకరమగు వైదికమార్గ ముపదేశించినవారు వారేకదా! వారికిఁ బావనమూర్తియు సర్వాంతర్యామియు శ్రీనివాసుఁడు నగుభగవంతుఁడే నమస్కరించును. తక్కినవారు నమస్కరింతురని వేఱుచెప్పవలయునా? ఈకారణములచే బ్రాహ్మణు లు త్తములు. వారిలో భృగువంశజు లు త్తమో త్తములు. ఈశర్మిష్ఠతండ్రి వృషపర్వుఁడు మాకు శిష్యుఁడు. ఇట్లుండ మేము దాల్పవలసిన వస్త్ర మిది దాల్పనర్హుఁ రా లగునా? శూద్రుఁడు వేద మును బఠింప నెట్లర్హుఁడగును?" అని నిందించిన దేవయానిని శర్మిష్ఠఁజూచి యీమె కఠోరవచనములకుఁ దాళఁజాలక కోప ముచే భుజంగివలె రోఁజుచుఁ బెదవి గొఱుకుచు నిట్లనియె. "ఓ భిక్షుకీ! నీవృత్తము తెలిసికొనక నోటికివచ్చి నట్లెల్ల వదరెద వేల? ఎందుల కాత్మస్తవ మొనర్చుకొనెదవు? మీరు కాకుల వలె నాహారాదుల నిమిత్తము మాగృహములఁ గాచికొని యుండియు నిప్పు డీప్రగల్భము లేల?" అని పరుష వచనముల నిందించి యంతఁ గోపము పట్టఁజాలక దేవయాని కట్టువస్త్రము నొలిచి దిగంబరనుగాఁ జేసి నూతిలోఁ ద్రోయించి తనయింటికిఁ బోయెను. అంత యయాతి మృగయార్థమై యటసంచరించుచు దప్పిగొని జలపానముకై యా కూపమును సమీపించి దిగంబర యగు దానింజూచి తన యుత్తరీయమును గట్టనిచ్చి దయతోఁ దనపాణిచే నామెపాణిని స్వీకరించి వైకిదీసెను. ఇట్లు తన్నుద్ధరించిన వీరుని యయాతినిజూచి ప్రేమపూర్ణములగు వాక్కులతో నిట్లనియె. "ఓరాజా! ఓపురంజయా! నీవు నాపాణిని గ్ర

హించితివి. నీచే గృహీత మగునాపాణిని బరుఁడు గ్రహింపఁదగదు. నన్నుఁ బెండ్లాడుము. బ్రాహ్మణకన్యకను రా జెట్లు పరిగ్రహింప నగునని సందేహమువలదు. మనకు దాంపత్యరూప మగుసంబంధము కేవల మీశ్వరకృతముకాని మానవకృతముగాదు. కాని చో నీకూపమునఁగూలి యెప్పుడునువలంపనినాకు నీసందర్శనము లభింపనేల? ఇదియే యీశ్వర కృతమనుటకు నిదర్శనము. ఇంతే కాదు. పూర్వముబృహస్పతి కుమారుఁడు కచుఁడునన్నుశపించెను. దానివలన నాకు బ్రాహ్మణుఁడు భర్తకాఁగూడఁడు. క్షత్త్రియుఁడే కావలెను. నా హస్తమునుబట్టినవాఁడే నాకు భర్త" యనిపలుక యయాతి విని శాస్త్రవిరుద్ధమగుటచేఁ దన కిష్టములేకపోయినను, దైవమువలన లభించుటచేతను దనమన స్సామెయందు లగ్నమగుటచేతను, దదీయవచనమున కంగీకరించి వెడలిపోయెను. అంత దేవయాని యేడ్చుచు జనకునిసమీపించి శర్మిష్ఠచేసిన దుష్టకృత్యమును నివేదించెను. అది విన్నతోడనే శుక్రుఁడు విమనస్కుఁడై యీపౌరోహిత్యముకన్న బిచ్చమే మేలని నిశ్చయించి కుమారీసహితుఁడై వృషపర్వుని పురమునువిడిచి పోవుచుండెను. అంతవృషపర్వుఁడు తనశత్రువులగు దేవతలతో నేకీభవింప వెడలిపోవుచున్నట్లుగ్రహించి యతనివెంబడిఁజని మార్గమధ్యమునఁ గలిసికొని యతనిపాదములపైఁ బడి మిగులఁ బ్రార్థించి ప్రసన్నునిఁగాఁ జేసికొనెను. శుక్రుఁడు కోపమునువిడిచి వృషపర్వునిఁజూచి "ఓయీ! నాకు దేవయాని ముద్దుకూఁతురు. ఆమెనువిడిచి నే నుండలేను. ఆమె యేమికోరునో దాని నొసంగుము. అట్లయిన మరలివచ్చెదను" అని పలికెను. వృషపర్వుఁడందులకు సమ్మతించి దేవయానినిగోరుమనఁగా నామె "నీకూతురు; సఖీ జనముతోఁగూడ

నన్ను సేవించుచు నే నెచ్చటికేఁగిన నచ్చటికిరావలయును. ఇదియె నాకోర్కి" అని పల్కఁగా నతఁ డట్లొనర్చెను. అంత శర్మిష్ఠ శుక్రునివలనఁ దన జనకాదులకు సంభవించెడు ననర్థమును జూచి కార్యగౌరవమును దెలిసికొని మా ఱాడక చెలిక త్తియలతోఁ గూడ దేవయానికి దాసియయి కొల్చుచుండెను. అనంతరము శుక్రుఁడు యయాతినిబిలిపించి తనకూఁతును శర్మిష్ఠతోఁగూడ నర్పించి యొకప్పుడును శర్మిష్ఠతో సంగమింపఁగూడదని కఠినము గాఁ జెప్పెను. అతఁ డందులకంగీకరించి వారిఁ దోడ్కొనిపో యెను. కొంతకాలమునకు దేవయాని కుమారునిఁగని సంతసించు చుండ నది శర్మిష్ఠగాంచి తానుగూడ సంతానమును గాంచవలె నని తలంచి తన ఋతుకాలమున యయాతినిఁ బతిగావరించెను.

ధర్మవిదుఁడగు యయాతి సంతానార్థము ఋతుకాలమున సంగ మింపఁ గోరుచున్న కాంతనువిడుచుట ధర్మముగాదని నిశ్చయించి శుక్రుని యాజ్ఞావచనము బంధించుచున్నను సరకుగొనక యామె యభిలాషమును దీర్చెను. దేవయానికి యదువును, దుర్వసువు ననుఁ నిర్వురు సుతులుగల్గిరి. శర్మిష్ఠకు ద్రుహ్యుఁడు, అనువు, పూరుఁడునను మువ్వురుతనయులు గల్గిరి. అభిమానవంతురాలగు దేవయాని తనభర్తవలననే శర్మిష్ఠ సంతానవంతురాలయ్యెనని యెఱిఁగి క్రోధమూర్ఛితయై యలిగి పుట్టింటికిఁబోయెను. కాము కుఁడైన యయాతి ప్రియురాలి ననుసరించి పాదములపైఁ బడి సాంత్వవచనములచే బతిమాలియు నామెను బ్రసన్నురాలిని గాఁ జేయలేకపోయెను. అంత శుక్రుఁ డదితెలిసికొని యయాతి కార్యమునకుఁ గోపించి "ఓ మందబుద్ధీ ! ఓరీ కాముకా ! ఓరీ అనృతరూపా ! నరులను వికృతరూపులనుగాఁ జేయు ముదు

సలితనము నిన్నావేశించుఁగాక" యని శపించెను. ఇట్లు శపింపఁ బడి యయాతి యతనిఁగాంచి "ఓ బ్రాహ్మణోత్తమా! నన్నను గ్రహింపుము. నీ కుమారికవలన నాకుఁ గామములం దింకను దృప్తిలేదు. కావున న న్నీయవస్థలోనుంపు"మని బతిమాలెను. దానిని విని కరుణించి "నాశాపముతప్పదు. అయిన నీకామము దీఱునిచో నీవార్ధకమును వేఱొకనికిచ్చి వానియౌవనమును నీవు దీసికొనుమని బదులుచెప్పెను. ఇట్లు యయాతి వ్యవస్థచేసికొని పురమునకు వచ్చి జ్యేష్ఠకుమారుఁడగు యదువునుబిలిచి "కుమారా! నీమాతామహుఁడగు శుక్రుఁడు నాకీ జరాావస్థనుగల్గించె. నాకు విషయసుఖములం దింకను దృప్తిలేదు. కావున నాజరావస్థను దీసికొని నీయౌవనావస్థ నిమ్ము. కొన్నివత్సరములు క్రీడించి నీయౌవనము నీకిచ్చెద"నని పలుకఁగా యదు వతని కిట్లనియె. "ఓ జనకా! పురుషుఁడు విషయసుఖము లనుభవింపకుండ వైరాగ్యమందఁజాలఁడు. నే నిదివఱకు విషయసుఖము సుంతే ననుభవింపలేదు. చిరకాలము సుఖమనుభవించిన నీవే యిట్లు శాంతినిబడయఁజాలనిచో నామాట చెప్పనేల? కావున ముదుసలివాఁడనై యుండఁజాలను" అని పల్కవిని యయాతి తుర్వసునిఁబిలిచి తన యభిప్రాయము తెల్పెను. అతఁడును నిరాకరించెను. పిమ్మట ద్రుహ్యుని, ననువునుబిలిచి యడుగ వారును నస్థిరమగుదేహమున స్థిరత్వబుద్ధినుంచి తండ్రికోర్కిని దిరస్కరించిరి. అనంతరము రాజు వయస్సుచేఁ బిన్నయయ్యును గుణములచేఁ బెద్దయగు పూరువు నుబిలిచి "ఓ వత్సా! నీవు నాకోర్కిదీర్పుము. నీవు నీ యన్నలవలెనే నన్ను నిరాకరింపఁదగవు" అని పలుకవిని యతఁడతని కిట్లనియె. "ఓ మానవేంద్రా! జనకునిదేహమునఁ బుట్టిన పురుషుఁ

డెవ్వఁడు లోకమునఁ బితృవాక్యమును నిరసింపఁగలఁడు? పిత్రనుగ్రహమువలనఁ దప్పకుండ నైహికసుఖమేకాక యాముష్మికసుఖముగూడ లభించును. జనకునికోర్కి మనమునం దుండఁగనే తెలిసికొని చేయువాఁడుత్తముఁడు. చెప్పినపిమ్మటఁ జేయువాఁడు మధ్యముఁడు. జనకాజ్ఞయం దశ్రద్ధపూని తుద కొనర్చువాఁడధముఁడు. అశ్రద్ధవహించియుఁ జేయనివాఁడధమాధముఁడు" అని పలికి సంతోషపూర్వకముగానే తన తండ్రి జరానష్టను బ్రతిగ్రహించెను. ఆ యయాతి పుత్త్రుఁడిచ్చిన వయస్సుచే విషయసుఖముల యథేష్టముగా ననుభవించుచు సప్తద్వీప పరిమిత యగుభూమిని బాలించుచుఁ దండ్రి పిల్లలనువలెఁ బ్రజల ధర్మయుక్తముగాఁ బోషించుచుండెను. ఓరాజా! అతఁడిట్లు యథాప్రీతిగా నింద్రియ సుఖము లనుభవించుచున్నను నింద్రియపటుత్వము సుంతేనియుఁ దఱుఁగలేదు. దేవయాని ప్రతిదినమును మనోవాక్కాయలచే భర్తను సేవించి యేకాంతమునఁ గూడ నతనికి మిక్కిలి ప్రియురాలయ్యెను. ఎవఁడు సర్వదేవతామయుఁడో, యెవఁడు ధారాధకులయా ర్తిని దొలఁగించునో, యెవఁడు యాగములం దారాధితుఁడై తత్ఫలము నొసంగునో, ఆకాశమున మేఘుపంక్తివలె నెవనియందుఁ జిదచిదాత్మకమును, స్వప్నసమానమును, మాయామనోరథతుల్యమును నగుప్రపంచమొకప్పుడు గానవచ్చి వేఱొకపు డంతర్ధానముచెందుచు మఱొకప్పుడు నానావిధమై చూపట్టునో, యెవఁడు హృదయకుహరమలందు శయనించునో, యెవఁడు సూక్ష్మవస్తువులలోనెల్ల సూక్ష్మవస్తువో, యెవఁడు జీవసమూహమునకుఁ బ్రాప్యుఁడును ప్రాపకుండు నాధారుండు నగుచున్నాఁడో, యట్టి పరమేశ్వరునిఁ దన

హృదయమునందిలిపి ఫలాభిలాష లేకయే వెక్కు యాగము లాచరించి పరమపురుషుని సంతసింపఁ జేసెను; కాని సార్వభౌముఁడగు యయాతి కుత్సితము లగునింద్రియములచే వేయువత్సరములు విషయసుఖము లనుభవించియుఁ దృప్తి చెందలేకపోయెను. ఇది పదునెనిమిదవయధ్యాయము.

---

* యయాతి బస్తోపాఖ్యానము చెప్పుట.

ఓరాజా! యయాతి స్త్రీ లోలుఁడై చిరకాలము విషయసుఖము లనుభవించి యొకప్పుడు తన యజ్ఞానమును దెలిసికొని నిర్వేదమునంది ప్రియురాలగు దేవయానికిఁ దనవర్తన మనుకరించు నొక యుపాఖ్యానము చెప్పఁదలంచి యిట్లనియె. "ఓభార్గవీ! భూమిలో నన్నివిధములచేతను నాచరిత్రమును బోలినయొక యితిహాసమును జెప్పెదను. వినుము. అకటా! నావర్తనము తుచ్ఛమైనది. జితేంద్రియులై వసమందు సంచరించు చున్నపండితులందఱును నావర్తనమునుగూర్చి దుఃఖించుచున్నారు. పూర్వమొకవనములో నొకమేష మసహాయమై తనకుఁ బ్రియమగు దానివెదకుచు నందంద తిరిగితిరిగి యొకచోఁ గర్మనశమున నూతిలోఁబడి యున్నయొకయాఁడుమేకనుగాంచి కామించి దాని నుద్ధరించుటకుఁ దగినయుపాయ మరయుచుండెను; కాని యది

---

* ఈయితిహాసమును యయాతి తనచరిత్రమును దెలుపనెంచి యన్యాపదేశముగాఁ జెప్పుచుండెను. ఇందు మేషము యయాతియనియు, వనమే సంసారమనియుఁ, బ్రియవస్తువే విషయసుఖములనియుఁ, గూపమునఁ బడిన యామేషి దేవయానియనియు గ్రహింపవలయు. మేషము నూతినుండి మేషి నుద్ధరించుటకు యత్నించుట యయాతి దేవయాని నుద్ధరించుటతోఁ బోలునని యొఱుఁగునది.

తోఁపలేదు. *తుట్టతుద కామేషము శృంగములచే నొడ్డును ద్రవ్వి మన్ను దీసినై చి యుత్తారణమార్గము నేర్పఱిచి పైకిఁదీసెను. తోడనే యామేషి కూపమువలన నిర్గమించివచ్చి యా మేషమును బత్తిగాపరించెను. ఆమేషమును దానిని బత్తిగా గ్రహించెను. †ఆమేషితోఁగూడి పరిపుష్టసర్వావయమై, రతిసమర్థమై, రేత స్సేక్తయై, మైథునసమర్థ మై యున్న యామేషమును జూచి, మఱికొన్నియాఁడుమేక లచ్చటికివచ్చి కామించినవి. ‡ ఆపురుష మేషము కామగ్రస్తమై తన స్త్రీలతోసర్వదారమించుచుఁ దన్నుఁ దామఱచెను. ఆమేషీచయములో నొకటి దానికిఁ బ్రియురా లయ్యెను. § శ్రేష్ఠమగుదానితోఁ గ్రీడించుచుండఁ బూర్వము కూపమునుండి నిర్గమించి వచ్చినది దానిఁజూచి సహింపక పోయెను. తోడనే యది దుర్మదయమును, బ్రియమువలెఁ గానవచ్చునదియుఁ, గామియు, నింద్రియాధీనమును నగునా పురుషమేషమును విడిచిపోయెను. స్త్రీలోలమయిన యాబస్తము దీనమై తన భార్యకోపమును దీర్పనెంచి బిడాలిని బిడాలమువలె దానివెంబడించిపోయి మార్గమధ్యమునఁ బొర్లించియు దాని కోపమును బోకార్పలేక పోయెను. అంత నొక ద్విజుఁడువచ్చి యాబస్తము వృషణముఁ ఛేదించి మగుడ నదిప్రార్థింపఁ గరుణించి యదికిచ్చెను. ఇట్లాబస్తముతిరిగి యండకోశమును బొంది కూపలబ్ధ

---

* దీనివలన యయాతిదేవయాని నుద్ధరించుట తెలియవచ్చుచున్నది.

† దీనివలన శర్మిష్ఠాదులు యయాతిని వరించుట తెల్లము.

‡ దీనంబేసి యయాతి కామగ్రస్తుఁడై యాత్మను మఱచుట స్పష్టము.

§ ఇది శర్మిష్ఠను యయాతిప్రేమించుటను, దానికి దేవయాని సహింపకుండుటను దెలుపుచున్నది.

యగు మేషితోఁగూడి చిరకాలము కామ మనుభవించియుఁ బరితృప్తి చెందలేకపోయెను. ఓసుభ్రూ! నే నాబస్తమువలె నీవ్రేమయను యంత్రమునకు వశ్యుఁడనై నీవిభ్రమాదులచే మోహితుఁడనై నన్ను నే మఱచి వర్తించుచుంటిని. కామము లనుభవించుటవలన శాంతినొందవు. భూమండలమందున్న ధాన్యాదులుగాని బంగారుగాని, పశువులుగాని స్త్రీ రత్నములుగాని కామాసక్తునికి మనఃప్రీతిని గల్గింపఁజాలవు. ఇంకను మఱింతకోర్కిని బుట్టించును. హవిస్సుచే నగ్ని చల్లారక వర్ధిల్లినట్లు, అనుభవించుటచేఁ గామము మఱింత వర్ధిల్లునుగాని శాంతింపదు. అట్టి కామము మెట్లుశాంతించునో చెప్పెదను వినుము. పురుషుఁడొప్పుడు సర్వభూతములందును రాగద్వేషాదులఁ జూపక సమదృష్టి గలఁడేని, వాఁ డిచ్చటికేగిన మిక్కిలి సుఖించును. వానికి దిక్కులన్నియు సుఖమయములుగాఁ గన్పించును. ఆలోచింప విషయాభిలాషను మిక్కిలిచెడ్డది. దుర్మతులు దాని నెప్పటికిని విడువఁజాలరు. పురుషుఁడు ముసలితనముచే జీర్ణించినను నదిజీర్ణింపదు. అది సకల దుఃఖములను గూర్చును. సుఖము నపేక్షించువాఁడైనచో దప్పక యాతృష్ణను విడువవలెను. పురుషుఁడొప్పుడును, దల్లితోఁగాని, దోఁబుట్టువులతోఁగాని, కూఁతుతోఁగాని రహస్యమున నేకాసనమునఁ గూర్చుండరాదు. బలిష్ఠము లగునింద్రియములు విద్వాంసు నైననాకర్షింపక మానవు. నేను నీతోఁగూడి వేయుసంవత్సరములు విషయసుఖము లనుభవించితిని. అయిన విషయాభిలాషము క్రమముగా హెచ్చుచున్నది గాని తఱుగలేదు. కావున నే నీ తృష్ణను విడిచి బ్రహ్మమును జిత్తమునఁ జేర్చి శీతోష్ణాదిద్వంద్వములను దిరస్కరించి దేహాత్మ భ్రాంతినిబాఱదోలి మృగ

ములతోఁగలసి చరింప వనమున కేఁగెదను. ఐహికసుఖములను గాని, యాముష్మికసుఖములనుగాని, విద్వాంసుఁ డాసింపఁడాదు. అట్లు చేసినచో నాతనికి సంసారమును, దానివలన స్థావర మూర్ఖ యు సంభవింపక మానదు. కావునవెవఁడు వాని నాసింపక నిరతిశయమగు నానందరూపమునఁ బొల్చు పరమాత్మ తత్త్వము తెలిసికొనునో, వానికి విషయాభిలాషము స్వయముగానే నివర్తించును" అని దేవయానితోఁ జెప్పి తనవయస్సును బూరునకిచ్చి యతనివలన జరావస్థను స్వీకరించి యాగ్నేయమునకు ద్రుహ్యుని, దక్షిణమునకు యదువును, బ్రతీచికిఁ దుర్వసుని, నుత్తరమునకు ననువును, బ్రభువులనుగాఁ జేసి భూమండల మంతకును యోగ్యుఁడగుపూరువు నభిషేకించి యన్నలనందఱను సతని కధీనులఁగాఁజేసి తాను వనమున కరిగెను. అక్కడ నతఁడు, వెయ్యి సంవత్సరము లనుభవించినను దనుగని యింద్రియసుఖములను దెక్కలువచ్చిన పక్షిగూఁటినివలె, క్షణమాత్రమున విడిచి సమస్తసంగములను వదల్చుకొని బ్రహ్మోపాసనచే గుణకార్యములను నశింపఁజేసి పొందఁదగిన పరమపదము నొందెను. అట దేవయాని భర్తచెప్పినకథ విని స్త్రీ పురుషుల పరస్పరస్నేహముచే గల్గిన వికారమును బరిహసించుటకుఁ జెప్పినను గేవలము తన్ను గెలిచేయుటకే యనినిశ్చయించి పానశాలయందలి పాంథులసంబంధము వలె నీశ్వరాధీను లయినపతిపుత్రాదుల సంబంధము భగవన్మాయావిరచితమని తెలిసికొని దేహముతోను, దదనుబంధులతోను, వేయేల యందఱుతోను, దనకుఁగల సంబంధము స్వప్నమువలె ననిత్యమని నిశ్చయించి భగవంతునిధ్యానించి లింగదేహమును విడిచెను" అని చెప్పి శుకుఁడు "జగత్సృ

ష్టయు, సర్వభూతముల కాధారభూతుఁడును శాంతాత్ముఁడును నగువాసుదేవునకు నమస్కార మొనర్చెదను" అని నమస్కరించి వెండియు నిట్లనియె. ఇది పందొమ్మిదవయధ్యాయము.

పూరుని వంశము.

ఓరాజా! దేనియందు నీవు జన్మించితివో, దేనియందు వంశవర్ధను లగుబ్రాహ్మణులును, రాజర్షులు నుదయించిరో యాపూరు వంశమును వర్ణించెదను; వినుము. పూరునకు జనమేజయుఁడును, జనమేజయునకుఁ బ్రథన్వుఁడును, ప్రథన్వునకుఁ బ్రవిరోధుఁడును, ప్రవిరోధునకు నమస్యుఁడును, నమస్యునకుఁ జారుఁడును, జారునకు సుద్యుఁడును, సుద్యునకు బహుగవుఁడును, బహుగవునకు శర్యాతియు, శర్యాతికి సంయాతియు, సంయాతికి అహంయాతియు, వానికి రౌద్రాశ్వుఁడును, రౌద్రాశ్వునకు ఘృతాచి యనునచ్చరయందు భగవంతుని దశేంద్రియములవలె ఋతేపుఁడు, కక్షేపుఁడు, స్థలేపుఁడు, కృతేపుఁడు, జలేపుఁడు, సన్నతేపుఁడు, ధర్మేపుఁడు, సత్యేపుఁడు, వ్రతేపు వనుపదుగురుపుత్త్రులును, బుట్టిరి. ఆఋతేపున కంతిసారుఁడును వానికి సుమతియు, ధ్రువుండు, నప్రతిరథుండు ననుమువ్వురు కుమారులునుగల్గిరి. వారిలోన ప్రతిరథునకుఁగణ్వుఁడును, గణ్వునకు మేధాతిథియు, మేధాతిథికిఁ బ్రస్కణ్వుఁడు మొదలగుబ్రాహ్మణులును బుట్టిరి. అంతిసారసుతుఁ డైననుమతికి రైభ్యుఁడును, వానికి దుష్యంతుఁడును గలిగిరి. ఆదుష్యంతుఁ డొప్పుడువేఁటాడ నరణ్యమున సంచరించుచు నటకు సమీపమున నున్నకణ్వాశ్రమమున కరిగి యచ్చటఁ గూర్చుండి లక్ష్మివలెనె స్వీయకాంతులచేఁ దన్ను నలంకరించుకొనుచు జగన్మోహినివలెఁ గాన

వచ్చుచున్న శకుంతలయను యువతినిజూచి మోహమంది తదీయ దర్శనమునకు మిగుల సంతసించి మృగయాప్రయాస మంతయుఁ దొలంగఁ గామపీడితుఁడై మందహాసముచేయుచు మృదుమధు రముగా నిట్లనియె. "ఓ యువతీ! ఇంత సుందరాకారముతోఁ బోల్చుచున్న నీ వెవతెవు? నీ వెవనికుమారివి? ఏమిచేయుటకై నీ వీనిర్జనవనమునకు వచ్చితివి? ఓ సుమధ్యా! నీవృత్తప్పక రాజపు త్నివై యుండవలయును. కావున నే నామనస్సు నీ వంకకుఁ బరెవ్వత్తుచున్నది. నీ వట్లు కానిచో పూరు వంశసంభూతుఁడ నగు నామన స్సధర్మమార్గమున నేల ప్రవర్తించును?" అనిన విని శకుంతల యిట్లనియె. "ఓ నరేంద్రా! నేను విశ్వామిత్రునకు మేనకయందుఁ బుట్టినదానను. నాతల్లి స్వర్గమునకుఁ బోవుచు నను వనమున డించిపోయెను. నాచరిత్రము కణ్వమహాముని కిఁ దెలియును. వానికేమి? అది యటుండనిండు. మీకు మేమేమిచే యవలయును? రండు. కూర్చుండుఁడు. మాయిచ్చుపూజల స్వీక రింపుఁడు. ఇచ్చట నివరధాన్యమున్నది. ఇష్టమువచ్చినచో భుజిం పవచ్చును. మీకిష్టమున్నచో నిట నివసింపవచ్చును." అని మధు రముగా నుడివిన విని రా జామెనుజూచి "సుందరీ! కుశికవంశ మునఁ బొడమిన నీ కీవినయాదు లెంతయుఁ దగియున్నవి. లోక మున రాజకన్యకలు స్వయముగానే భర్తలను స్వీకరింతురు. నీవు రాజకన్యకవు గావున భయముంచి నన్ను వరింపుము" అనిన నామెయందుల కంగీకరించెను. దేశకాల విభాగమెఱిగినదుష్యం తుఁడు వెంటనే యామెను గాంధర్వవిధిచేఁ బరిణయమయి యా రాత్రి యామెతోఁ గ్రీడించి తెల్లవాఱినతోడనే తనపురమునకుఁ బోయెను. శకుంతల గర్భముదాల్చి కొలఁదికాలములో నొక

కుమారునిఁ గనియెను. కణ్వుఁ డందులకు సంతసించి వనమందే బాలునకు జాతకర్మాదిక్రియల నొనర్చెను. ఆబాలుఁడు క్రమము గావర్ధిల్లి స్వీయబలముచే నొకసింహమునుబట్టుకొని దానితో నాడుకొనుచుండెను. భగవంతుని యంశాంశమువలన జనించి యపారవిక్రముఁడైన కుమారునిఁ దీసికొని శకుంతల భర్తృగృహ మునకేఁగెను. కానిరాజు భార్యాపుత్త్రులు నిర్దుష్టులైనను లోకా పవాదమునకు జడిసి స్వీకరింపలేదు. అంతట సర్వభూతములును వినుచుండ "ఓ రాజా! సంతతివిషయమై తల్లి చర్మమయపాత్ర మువలె నాధారమాత్రమే కాని ప్రధానురాలుకాదు. పుత్త్రో త్పత్తికిఁ దండ్రియే ముఖ్యుఁడు. ఈపిల్లఁడు నీకుమారుఁడు. శకుం తల నీభార్య. తప్పక భరింపుము. భరింపుము. శకుంతల నవమా నింపకుము. ఈబాలుఁడు వంశకర్తయగును. వంశకర్తయగు కొమరుఁడు తండ్రిని నరకమునుండి రక్షించును. శకుంతలావచ నము సత్యము. ఈపిల్లఁడు నీవలననే కలిగెను. వాసుదేవాంశ సంభవుఁడును, బ్రహ్మణ్యుఁడును, సత్యసంధుఁడును, గుణగ్రా హియు, కీర్తివర్ధనుఁడును, గృతజ్ఞుఁడును, మహోత్సాహియు, స్థూలవక్షుఁ డునగు నీకుమారునిస్వీకరింపు" మని పల్కెను. అది విని దుష్యంతుఁడు సంతసించి భార్యాపుత్త్రులను స్వీకరిం చెను. దుష్యంతుని యనంతరమున భరతుఁడు చక్రవర్తియై మహాకీర్తిని సంపాదించెను. వాసుదేవాంశ సంభూతుఁడైన యాభరతునిమహిమ భూమి నెల్లెడలను నుతింపఁబడుచున్నది. ఆ భరతునిచేతియందు విష్ణువునకువలెఁ జక్రాదిరేఖలును, బాద ములందుఁ బద్మరేఖలునుగలవు. అతఁడు చక్రవర్తిగా నభిషిక్తుఁ డైనపిమ్మట గంగాతీరమున నిన్నూటయేఁబది యశ్వమేధయా

గముల భగవంతు నారాధించెను. అనంతరము దీర్ఘతముఁడను మునిని పురోహితునిఁగా నొనర్చికొని యమునాతీరమును జేరి బ్రాహ్మణులకుఁ జాలినంత ధన మిచ్చుచు డెబ్బదియెనిమిది హయములను నిర్దుష్టములను బంధించి బంధనపూర్వక మగుయూగము లచే నీశ్వరు నారాధించెను. ఆరాజు ప్రకృష్టగుణముగల యొక ప్రదేశమున నగ్నిచయనము చేసి యసంఖ్యాకములగు గోవు లను దానము చేసెను. ఆగోవులను వేగురు విప్రులు పంచు కొని స్వీకరించిరి. అట్లి యారాజు మహాఁకార మనుతీర్థమునయాగ మొనర్పనెంచి నూటముప్పది యశ్వములనుబంధించి రాజుల కాశ్చర్యము గల్గించుచు దేవతలును రాజులును జేయు విఘ్ను ములను దొలంగించుకొని యూగపూర్తిగావించెను. ఆతీరము నందే తెల్లని శృంగములుగల్గి హిరణ్య పరివృతములయి పదు నాల్గయుతముల సంఖ్యగల భద్రగజములను బ్రాహ్మణుల కొసం గెను. భరతుఁ డొనర్చిన యద్భుతకర్మములను బూర్వులెవ్వ రును జేయలేదు. ఇఁకముందు వారెవ్వ రొనర్పలేరు. బాహువు లను సాధనములఁగాఁ జేసికొని స్వర్గమునొంద లేని విధమున నెవ్వ రునతఁ డొనర్చిన యద్భుతకార్యముల నొనర్పలేరు. బ్రాహ్మణుల కపకారమొనర్చు కిరాతులు, హూణులు, యవనులు, నాంధ్రు లును, వంగదేశస్థులు, శకులు, గషులు మొదలగు హీనజాతి రాజులను, మ్లేచ్ఛులను దిగ్విజయ సమయమున సంహరించెను. పూర్వము దేవతలను జయించి పాతాళమున దాఁగియున్న రక్క సులను జంపి వారుగొనిపోయిన దేవతాస్త్రీలను, మనుష్యాదు లను విడిపించికొని వచ్చెను. ఆభరతుఁడు పాలించు కాలమున భూమ్యాకాశము లతనిప్రజలకు వలయు వాంఛితములఁ బూరిం

చెను. అతఁ డిట్లు దిక్కులందుఁ దనయాజ్ఞ యప్రతిహతమై వర్తిం చున ట్లిరువదియేడువేల వత్సరములు భూమినిపాలించెను. పిమ్మ ట నాసార్వభౌముఁడు లోకపాలుర యైశ్వర్యమును మించిన తన యైశ్వర్యము, రాజ్యసంపద, యప్రతిహతమగు నాజ్ఞాచక్రము, ప్రాణములు మొదలగు నై హికమంతయు ననిత్యమని నిశ్చయించి విరక్తుఁడయ్యెను. ఓరాజా ! ఆ భరతునకు విదర్భరాజ కుమారి కలు మువ్వురు భార్యలైరి. వారిలో నొక్కొక్కఁ తె కొక్కొక కుమారుఁడుగలిగెను. కాని భర్త యాపుత్త్రులను జూచి తనకుఁ దగినవారు కారని పల్క నదివిని కోపించి యా స్త్రీ లాపిల్లలను జంపివైచిరి. ఇట్లు తనవంశము నశించుటచే మిక్కిలి విచారించి భరతుఁడు మరుత్తులనుగూర్చి యాగ మొనర్ప, వారతనికిఁ బ్రస న్నులై భరద్వాజుఁ డనుసుతుని సమర్పించిరి. ఆ పుత్త్రుఁ డెట్లు పుట్టెనో, వానికి భరద్వాజుఁ డని పే రెట్లు వచ్చెనో, చెప్పెదను. బృహస్పతికి ఉచథ్యుఁ డనుసోదరుఁడుకలఁడు. వానికి మమత యను భార్యగలదు. ఆమెగర్భిణియై యుండగా బృహస్పతి యా మెను మోహించి సంభోగించుచుండ గర్భస్థుఁ డగుశిశువు, వల దు వల దని వారించెను. చానికిబృహస్పతి గోపించి "నీవు దీర్ఘత మస్సును బ్రవేశింతువు గాక. నీవంధుఁడ వగుదువు గాక" యని శపించి బలాత్కారముచే వీర్యమును విడిచెను. ఆగర్భస్థుఁ డగు బాలుఁడు దీర్ఘతముఁ డనిపేరుగాంచెను. లోపలనుండి యాబా లుఁ డావీర్యమును గాలితోఁ దన్ని వేయ నది భూమియందుఁబడి కుమారుఁడయ్యెను. ఆమమత భర్తకు భయపడి బాలుని విడిచి పోవుచుండెను. అది చూచి బృహస్పతి " ఓమూఢురాలా ! ఈ బాలుని విడిచిపోదువేమి? ఇరుపురకుఁ బుట్టినవాఁడు గావున వీఁడు

ద్వాజుఁ డనఁబడును. వీనిని నీవుభరింపక తీఱదని" పల్కెను. అది విని యమమత "ఓ బృహస్పతీ! ఈద్వాజుని నీ వేభరింపు"మని పల్కి వెడలిపోయెను. ఆబృహస్పతియు నిర్దయుఁడై యీబాలు నివిడిచిపోయెను. ద్వాజుని నీవేభరింపుమని యొండొరులతో వివదించుకొని విడిచిపోయిరి. కాన యీబాలుఁడు భరద్వాజుఁ డను నామము దాల్చెను. దేవతలు వానిఁగొనివచ్చి భరతునకొసంగిరి. ఆ బాలుఁడు వితథమైన భరతవంశమునకు దత్తుఁడగుటవలన భుఁడను వేఱొక నామమును దాల్చెను. ఇది యిరువదవ యధ్యాయము.

గర్గరంతిదేవవంశాదులు.

ఓరాజా! ఆవితథునకు మన్యువును, మన్యువునకు బృహత్క్షత్రుఁడు, జయుఁడు, మహావీర్యుఁడు, నరుఁడు, గర్గుండు ననునేవ్వురు కుమారులును, గల్గిరి. వారిలోనరునకు సంకృతియు, సంకృతికి గర్గు, రంతిదేవు లనునిద్దఱుకొమరులును సంభవించిరి. ఓరాజా! వారిలోరంతిదేవుని కీర్తి భూలోకమును స్వర్గలోకమునుగూడ నావరించెను. ఆ రంతిదేవుఁడు తన సంచితార్థమంతయు నర్థుల కుఁబంచిపెట్టి నిర్ధనుఁడై దైవప్రాప్త మగునన్నపులచే నాఁకటిఁ బుచ్చుచు, ధైర్యముచెడనీక కుటుంబముతోఁగూడఁ గృశించి జలపానము నైనఁజేయక నలువదియెనిమిది దినములనుగడపెను. అంత నాఁటియుదయమున దైవవశమువలన ఘృతపాయసములును, నన్నపానములును బ్రాప్తింపఁగా తృప్తిపాసలచే వడకుచుఁ దనకుటుంబముతోఁగూడఁ దినుటకు సంసిద్ధుఁడైన రాజుండ నొకయతిథివచ్చె. ఆ రంతిదేవుఁడు వచ్చిన యతిథినాదరించి

శ్రద్ధాళువై సకలభూతములును భగవదాత్మకములే యని నిశ్చయించి యా యాహారములోఁ గొంతభాగ మతనికి నొసఁగ నతఁడు భుజించి సంతసించి వెడలిపోయెను. తక్కిన యాహార మును గుటుంబమునకు విభజించి తిన యత్నించుచుండ తృట్పీడి తుఁ డగు నొకవృషలుఁ డేతెంచెను. వాఁడు దానమున కనర్హుఁ డైనను లేదనక యున్నయన్నములో నొకభాగ మతనికిచ్చి వాఁడు సంతుష్టుఁడై చన్నపిమ్మట రంతిదేవుఁడు తన కుటుంబము తో నున్నదాని నారగింప దొరకొనుచుండఁగాఁ గుక్కలతోఁ గూడ వేఱొకయతిథివచ్చి "ఓరాజా! నేనును, నా కుక్కలును మిక్కిలి యాఁకొనియున్నారము. ఆ యాహారమును మాకర్పిం పు" మని యాచించెను. అంతట రంతిదేవుఁ డాతని నాదరించి గౌరవపూర్వకముగా నవశిష్టమిచ్చి వానిభగవంతునిఁగా భా వించి నమస్కరించెను. ఇఁక జలముమాత్రము మిగిలియుం డెను. అదైన నొక్కరికిమాత్రమే సరిపడును. దానిని ద్రావ సిద్ధపడి యుండ నొకచండాలుఁడు వచ్చి "ఓమానవనాథా! నేను జుండాలుఁడను. మిక్కిలి దప్పిగొనియున్న వాఁడను. ఆ యుదకము లిచ్చిరక్షింపు" మని ప్రార్థించెను. ఆ రంతిదేవుఁడు దీనములయి శ్రమకరములైన వానినచనములు విని మిక్కిలి జాలిపడి యమృత తుల్యము లగుమాటలతో నిట్లనియె. "ఓపు ల్కసా! నేను బ్రహ్మలోకాదుల నపేక్షింపను. మోక్షమును వాంఛింపను; కాని, క్షుత్పిపాసలచేఁ బీడితు లయినశరీరుల మనో దుఃఖములుననున్నఁబొందుఁగాక" యని కోరుచున్నాను. మతియు జీవింపఁదలంపుగొన్న వారి జీవములు నిలుచునట్లు జలాదుల నొసంగినవాని కాఁకలి, దప్పి, శ్రమము, గాత్రకంపము, దైన్య

ము, క్లమము, శోకము, విచారము, మోహము మొదలగు వికా రములలో నొకటేనియుఁ గలుగఁజాలవు. కావున యాచకులకు నాప్రాణమీవలసి వచ్చిన నిచ్చెద"నని పల్కి దయాళువై పిపా సచేఁ జావసిద్ధుఁడైన యా చండాలున కా పానీయ మర్పించెను. అంత బ్రహ్మాదిదేవతలురంతిదేవుని సద్గుణములకు సంతసించి యత నికిఁ బ్రత్యక్షమై, "నీసద్గుణమును బరీక్షించుటకై విష్ణుమాయయే వృషలాది రూపముగావచ్చినది" యనిచెప్పి ప్రకృతి పురుష వివే కము నొసంగిన, రంతిదేవుఁడు భక్తితో స్వీకరించి, వారలకు నమస్కరించి, దేహమందును, దదనుబంధులయందును, మమ త్వమును విడిచి యైహిక సుఖములందుఁగాని యాముష్మిక సుఖ ములందుఁగాని మనస్సును జొప్పింపక కేవలము వాసుదేవుని యందుఁజేర్చెను. అన్యఫల మపేక్షింపకుండఁ జిత్తము వాసుదే వునియందుఁ జేర్చుటచే రంతిదేవునకుఁ ద్రిగుణాత్మకయగు మా య,స్వప్నమువలె నగోచరమయ్యెను. ఓరాజా ! ఆ రంతిదేవుని ప్రభావమునకు మెచ్చుకొని యతని ననుసరించిన యోగులె నా రాయణభక్తులై ముక్తి చెందుచుండ నతఁడు ముక్తుఁడయ్యెనని వేఱుచెప్పవలయునా ? ఇఁక గర్గుని వంశమును వినుము. గర్గునకు శినియు, శినికి గార్గ్యుండును గల్గిరి. అతనివలన బ్రాహ్మణకుల మేర్పడియె. మహావీర్యునకు దురితక్షయుండును, దురితక్షయు నకుఁ ద్రయ్యారుణియుఁ గలియుఁ బుష్కరారుణియు, నను ముప్పురు కొమరులును గల్గిరి. వారును బ్రాహ్మణులయిరి. బృహ త్క్షత్రునకు సుహోత్రుఁడును, సుహోత్రునకు హస్తియు సంభ వించిరి. ఆ హస్తియే తనపేర హస్తినపురమును నిర్మించెను. అతని కజమీఢుఁడు, ద్విమీఢుఁడు, పురుమీఢుఁ డనుముప్పురు

ప్రభవించిరి. వారిలో నజమీఢుని సంతతివారగు ప్రియమే ధాదులు బ్రాహ్మణులైరి. అజమీఢునకు బృహదిషుఁడను మఱి యొక కొమరుఁడు గలఁడు. ఆబృహదిషునకు బృహద్ధనువును, బృహద్ధనువునకు బృహత్కాయుఁడును, వానికి బృహద్రథుఁడును, వానికి విశదుఁడును, విశదునకు ఘేనజిత్తును, ఘేనజిత్తునకు రుచిరాశ్వుఁడు, దృఢహనువు, గాశ్యుఁడు, వత్సుఁడు ననునలువురు కొమరులును సంభవించిరి. వారిలో రుచిరాశ్వునకుఁ బ్రాజ్ఞుఁడును, బ్రాజ్ఞునకుఁ బృథుసేనుఁడును, వానికిఁ బారుఁడును, బారునకు నీపుఁడును జన్మించిరి. ఆనీపునకు నూఱ్వురు కొమరులు జనించిరి. ఇంతియకాక నీపుఁడు * శ్రీశుకుని కన్యకయగు కృత్వినిఁ జేపట్టి యామెయందు బ్రహ్మదత్తునిఁగనియె. బ్రహ్మదత్తుఁడు సరస్వతియను భార్యయందు విష్వక్సేనునిఁగనెను. అతఁడే జైగీషవ్యుని యుపదేశమునుబొంది యోగశాస్త్రమును రచించెను. ఆ విష్వక్సేనున కుదక్సేనుఁడును, వానికి భల్లాదుఁడును జనించిరి. వీరు బార్హదీషవులను రాజులైరి. ద్విమీఢునకు యవీనరుఁడును, వానికిఁ గృతిమంతుఁడును, గృతిమంతునకు సత్యధృతియు వానికి

---

* ఇట శ్రీశుకుని కుమారుఁడని చెప్పుటచే శ్రీశుకునకు సంతానముగలదని చెప్పబడినది. ఈసంగతియె హరివంశాదులందుఁ గూడఁ జెప్పఁబడినది. "పారాశర సుతోత్పన్నశ్శుకోనామ మహాయశాః । వ్యాసాదరణ్యాం సంభూతో విష్ణుర్మాగ్నిరివ జ్వలన్ । సతస్యాం పితృ కన్యాయా మిరణ్యాంజనయిష్యతి । కృష్ణం గౌరం ప్రభుం శంభుం తథాభూతశ్రుతం జయం । కన్యాం కీర్తిమతీం షష్ఠీం యోగినీం యోగమాతరం । బ్రహ్మదత్తస్య జననీం మానుషీమ్॥" అని యున్నది. దీని యోజింప శుకమహాముని గూడ నొకప్పుడు గార్హస్థ్య మవలంబించెనని తెలియఁదగినది.

దృఢనేమియు దృఢనేమికి సుపార్శ్వుఁడును, సుపార్శ్వునకు సుమతియు, సుమతికి సన్నతిమంతుఁడును, సన్నతిమంతునకుఁ గృతియు జనించిరి. ఆకృతియె హిరణ్యనాభునివలన యోగమును, నాఱువిధములగు సామసంహితలను బఠించి ప్రవర్తింపఁజేసెను. అతని కుగ్రాయుధుఁడును, వానికి క్షేమ్యుఁడును, క్షేమ్యునకు సువీరుఁడును, సువీరునకు రిపుంజయుఁడును, వానికి బహురథుఁడును జన్మించిరి. హ స్తికొండు కగుపురుమీఢునికి సంతతిలేదయ్యె. అజమీఢుఁడు నళినియను భార్యయందు నీలునిఁగనియె. నీలునికి శాంతియు, శాంతికి సుశాంతియు, సుశాంతికిఁ బురుజ్జుఁడును, బురుజ్జునకు నర్కుఁడును, నర్కునకు భర్మ్యాశ్వుఁడును, భర్మ్యాశ్వునకు ముద్గలుఁడు యవీనరుఁడు, బృహదిషువు, కాంపిల్యుఁడు, సృంజయుఁడు ననునేవురు సుతులు నుదయించిరి. భర్మ్యాశ్వుఁడు వారినిజూచి "సుతులారా! మీరు నాపంచదేశములను బాలింపఁజాలుదు" రనిచెప్పెను. అందుచే వారు పంచాలు రనునామమును ధరించిరి. ముద్గలునివలన బ్రహ్మవంశము ప్రబలెను. దాన జనించినవారు మౌద్గల్యులని పేరొందిరి. దానిని సంగ్రహముగా వివరింతును. వినుము. భర్మ్యాశ్వపుత్రుఁడైన ముద్గలునకు దివోదాసుఁడనుకుమారుఁడును, నహల్యయను కూఁతురును జనించిరి. అం దహల్యను గౌతముఁడు పెండ్లాడి శతానందునిఁ గాంచెను. శతానందునకు సత్యధృతి యుదయించె. వాఁడు ధనుర్వేదవిశారదుఁడయ్యె. అతనికి శరద్వంతుఁడుదయించె. అతఁ డొకనాఁ డూర్వశిని జూడ రేతస్సు స్ఖలితమై శరస్తంబమునఁ బడియె. దానివలన నొకబాలుఁడును బాలికయుఁ బొడమిరి. శంతనుఁడు మృగయార్థము వనమున సంచరించుచు

వారిఁగని కృపతోఁదెచ్చి కృపుఁడనియు, గృపియనియుఁ బేరు పెట్టెను. అందుఁ గృపి ద్రోణాచార్యునకుఁ బత్నియయ్యె. ఇది యిరువదియొకటవయధ్యాయము.

చంద్రవంశానుక్రమము.

ఓరాజేంద్రా ! దివ్రోదాసునకు మిత్రాయువును, మిత్రాయువునకుఁ జ్యవనుఁడు, సుదాసుఁడు, సహదేవుఁడు, సోమకుఁడు నను నల్వురు సుతులునుబొడమిరి. వారిలోఁ గనిష్ఠుఁడగు సోమకునకు జంతుఁడు మొదలగు నూఱ్వురు జనించిరి. వారిలోఁ బృషదుఁడు కనిష్ఠుఁడు. వానికి ద్రుపదుఁడును, వానికి ధృష్టద్యుమ్నాది సుతులును, ద్రౌపది యనుసుతయు జన్మించిరి. అందు ధృష్టద్యుమ్ననకు ధృష్టకేతు వుదయించె. వీరు పంచాలురలోఁ జేరిన ముద్గలుని సంతతివారగుటంజేసి పాంచాలురని వాసికెక్కిరి. అజమీఢునకు బుఖుఁడనువేఱొక కొమరుఁడుగలఁడు. వానికి సంవరణుఁడును, వానికిఁ దపతి యనుసూర్యపుత్రియందుఁ గురురాజు నుదయించిరి. ఆతనిఁబట్టియె కురుక్షేత్రమను నామముగలిగె. ఆ కురువునకుఁ బరీక్షిత్తు, సుధనువు, జహ్నువు, నిషధుఁడు నను నలువురుపుట్టిరి. వారిలో సుధనువునకు సుహోత్రుఁడును, సుహోత్రునకుఁ జ్యవనుఁడును, వానికిఁ గృతియుఁ, గృతికి ఉపరిచరుఁడగువసువును, వానికి బృహద్రథుఁడును, కుసుంభుఁడును, మత్స్యుఁడును, బ్రత్యగ్రుఁడును జేదిపుఁడు ననుకొమరులును జన్మించిరి. వారిలో బృహద్రథునకుఁ గుశాగ్రుఁడును, వానికి ఋషభుఁడును, వానికిఁ బుష్పవంతుఁడును, బుష్పవంతునకు హితుఁడును, హితునకు జహ్నువును సంభవించిరి.

ఆ బృహద్రథునకు వే ఱొకభార్యయందు రెండుశిశుఖండము లుదయించెను. తల్లి వానిని బొఱవైవఁగా జరయను రాక్షసి వానితో నాడుకొనుచు సంధించి "జీవింపు, జీవింపు" మని పల్క- నవి బాలుఁడై జీవించి జరాసంధుఁ డనునామము దాల్చెను. ఆ జరాసంధునకు సహదేవుఁడును, వానికి సోమాపియు, వానికి శ్రుతశ్రవుఁడును గలిగిరి. కురుపుత్రుఁడైన పరీక్షిత్తునకు సంతానము లేదు. వానితమ్ముఁడగు జహ్నువునకు సురథుఁడును, సురథునకు విడూరథుఁడును, వానికి సార్వభౌముఁడును, వానికి జయత్సేనుఁడును, వానికి రాధికుఁడును, రాధికునకు ద్యుమంతుఁడును, వానికిఁ గోధనుఁడును, గోధనునకు దేవాతిథియు, వానికి ఋక్షుఁడును, ఋక్షునకు దిలీపుఁడును, దిలీపునకుఁ బ్రతీపుఁడును, బ్రతీపునకు దేవాపి, శంతనుఁడు, బాహ్లికుఁడు ననుమువ్వురు తనయులు వొడమిరి. వారిలో దేవాపి రాజ్యమొల్లక తపమొనర్ప నడవికేఁగెను. శంతనుఁడు రాజయ్యె. అతఁడే పూర్వజన్మమున మహాభిషుఁ డనుపేరనొప్పె. అతఁడీజన్మమున నృద్ధులను స్పృశించి వారికి యూవన మలవడఁజేసి శాంతినిగల్గించి సుఖము విస్తారముగాఁ గూర్చుటంజేసి శంతనుఁడను నామమును సార్థకముచేసికొనియె. శంతనుఁడు రాజ్యమును బాలించుచుండఁగా ద్వాదశవర్షక్షామము సంభవించె. అతఁడు విప్రులనుబిలిచి దాని కారణమడుగ "జ్యేష్ఠుఁడు, భార్యను నగ్నిహోత్రమును స్వీకరింపకుండఁ జిన్నవాఁడు స్వీకరించినఁ బరివేత్తయనఁబడు. నీవట్లానరించుటంజేసి పరివేత్తవైతివి. ఇంతియకాక నీవు రాజ్యమునకుఁ దగవు. నీ విప్పుడు మీయన్నకు రాజ్యమొసఁగితివేని యనావృష్టిదోషంబు తొలంగు" నని

చెప్పిరి. శంతనుఁ డడవిని వనమున కేగి యన్నకు నమస్కరించి రాజ్య మేలుకొమ్మ నిప్రార్థించెను. కాని, యంతకుఁ బూర్వమే శంతనునిమంత్రి యశ్మరాదుఁ డనువాఁడు బ్రాహ్మణులను బిలిచి యడవిలోనున్న దేవాపికిఁ బాషండమత ముపదేశింపుఁ డనిపంచెను. వారట్లుచేసిరి. దేవాపి పాషండమతము నాశ్రయించి వేదముల నిందించి యీ పాషముచే రాజ్యమున కనర్హుఁడయ్యె. అది శంతనుఁడు దెలిసికొని పురమునకు మరలివచ్చె. ఇప్పుడు శంతనుఁడు దోషభాక్కు గానఁదున వర్షము గురిసె. ఆ దేవాపి యోగమా శ్రయించి కలాప మను గ్రామమున నివసించియుండి కలియుగాంతమున నశించిన చంద్రవంశమును గృతయుగాది యందు మరల విస్తరింపఁజేయును. బాహ్లీకునకు సోమదత్తుఁడును, సోమదత్తునకు భూరియు, భూరిశ్రవుఁడు, శలుఁడనువారుమువ్వు రుదయించిరి. శంతనుఁడు బ్రహ్మశాపవశమున మానుషత్వముదాల్చి నగంగనువరించి భీష్మునిఁగాంచెను. అతఁడు బ్రహ్మజ్ఞాని. అతఁడు ధర్మవిదులలోఁ బ్రధానుఁడు ; పరమభాగవతోత్తముఁడు ; వీరాగ్రగణ్యుఁడు; పరశురామునిఁగూడ యుద్ధమున నోర్చిన జోదు. అతఁడు మహాపురుషుఁ డనితెలియుము. శంతనుఁడు గంగాదేవి యంతర్ధానముచెందిన పిమ్మట దాశకన్యకయగు సత్యవతిని వరించి చిత్రాంగదచిత్రవీర్యు లనునిరువురఁగనియె. వారిలోఁ జిత్రాంగుఁడు గంధర్వరాజుచే నిహతుఁడయ్యె. ఓరాజేంద్రా ! ఆసత్యవతియందే పరాశరుని తేజంబున నారాయణాంశసంభూతుఁ డగుకృష్ణద్వైపాయనుఁ డుదయించి వేదములను విభజించి వ్యాసుఁ డనిప్రఖ్యాతిగాంచెను. ఆమహామునివైలాదు లగు తనశిష్యులనెల్లమాని పుత్రుఁడ నైననాకుఁ బరమ

గుహ్యమైన యీభాగవతపురాణ ముపదేశించెను. భీష్ముడు విక్రమముచే స్వయంవరమునుండి కాశీరాజు కుమారికలగు నంబి కను, నంబాలికనుగానివచ్చి విచిత్రవీర్యునకుఁ బెండ్లిచేసెను. అతఁడు మిక్కిలి కామియై సర్వదా వారితోవిహరించుచు క్షయ రోగగ్రస్తుఁడై మృతుఁడయ్యె. అంత సత్యవతి యుపదేశమున వ్యాసుఁడు తనసోదరుని భార్యలతో సంగమించి యంబికయందు ధృతరాష్ట్రుని, నంబాలికయందుఁ బాండుని, దాసియందు విదురు నిఁబుట్టించెను. అందు ధృతరాష్ట్రునకు గాంధారియందు నూర్వురు తనయులును దుశ్శల యనుకూఁతురును గల్గిరి. వారిలోదురోధ నుఁడు జ్యేష్ఠుఁడు. పాండుఁ డరణ్యమున మృగరూపములఁదాల్చి క్రీడించు చున్నముని దంపతులలో మునినిజంపి శపింపఁబడి నం తానముగల్గింప ననర్హుఁడై యుండ నతని యనుమతిచొప్పున ధర్మానిలేంద్రుల నుపాసించి వారియనుగ్రహమున ధర్మజభీమా ర్జునులఁ బడసెను. అనంతరము మాద్రియు నశ్వినీదేవతల ప్రసా దమువలన నకులసహదేవులను గనియెను. పంచపాండవులకును ద్రౌపదియం దొక్కొకపుత్రుఁడు జన్మించెను. కాని వారందఱు పుత్రకులై భారతయుద్ధాంతమున నశ్వత్థామచే హతులైరి. వారు క్రమముగాఁ బ్రతివింధ్యుఁడనియు, శ్రుతసేనుఁడనియు, శ్రుతకీర్తియనియు, శతానీకుఁడనియు శ్రుతకర్మయనియుఁ బిలు వఁబడిరి. ధర్మరాజునకుఁ బౌరవియను భార్యయందు దేవకుఁడు జన్మించెను. భీమునకు హిడింబయందు ఘటోత్కచుఁడు, గాళి యను భార్యయందు సర్వగతుఁడును గలిగిరి. సహదేవునకు విజ యయందు సుహోత్రుండుగలిగె. నకులునకుఁ గరేణు మతియం దు నిరమిత్రుఁ డుదయించె. అర్జునున కులూపియం దిరావంతుఁ

డును, జిత్రాంగదయందు బభ్రువాహనుఁడును, సుభద్రయందు నీతండ్రియగు నభిమన్యుఁడును సంభవించిరి. మహాపరాక్రమ శాలియగు నభిమన్యున కుత్తరయందు నీవు జన్మించితివి. నీవు తల్లిగర్భములో నున్నప్పుడు కుటిలుఁడైన యశ్వత్థామ యస్త్రాగ్నిచే దహింపఁబడియుఁ గృష్ణుని మహిమంబున బ్రదికితివి. నీకు జనమేజయుఁడు, శ్రుతసేనుఁడు, భీమసేనుఁడు, ఉగ్రసేనుఁడు ననుసుతులుసంభవించిరి. వీరిలో జనమేజయుఁడు నీవు తక్షకునివలన మృతిగాంచిత వనితెలిసిన్నొని కోపించి సర్పయాగమొనర్చి సకల సర్పములను సంహరించును. పిమ్మట నతఁడు కాశ్యపేయుని బురోహితునిఁగాఁ జేకొని సకలదిశలను జయించి యశ్వమేధము లాచరించును.అతని సుతుఁడు శతానీకుఁడు యాజ్ఞవల్క్యునివలన వేదములను, కృపాచార్యునివలన నస్త్రవిద్యను, శౌనకునివలన నాత్మజ్ఞానమును సభ్యసించును. ఆశతానీకునికి సహస్రానీకుఁడు సంభవించు. వాని కశ్వమేధజుఁడును, వాని కసీమకృష్ణుఁడును, వానికి నిచ్చక్రుఁడును సంభవింతురు. హస్తినపురము గంగానదిచే నష్టముకాఁగా నిచ్చక్రుఁడు కౌశాంబిని రాజధానిగాఁ జేసికొని పాలించు. ఆనిచ్చక్రునకు ఉక్తుఁడును, వానికిఁ జిత్రరథుఁడును, వానికి శుచిరథుఁడును, శుచిరథునకు వృష్టిమంతుఁడును, వానికి సుషేణుఁడును, సుషేణునకు సునీతుఁడును, సునీతునకు నృచక్షువును, వానికి సుఖినలుఁడును, సుఖినలునకుఁ బరిప్లవుఁడును, వానికి మేధావియు, మేధావికి సునయుఁడును, వానికి నృపంజయుఁడును, వాని కూర్వుఁడును వానికి నిమియు,నిమికి బృహద్రథుఁడును వానికి సుదాసుఁడును, సుదాసునకు శతానీకుఁడును, వానికి దుర్దమనుఁడును, దుర్దమనునకు విహీనరుఁడును, వానికి దండపా

ణియు, వానికి నిధియు, నిధికి క్షేమకుఁడును, క్షేమకునకు బ్రహ్మక్షత్త్రుఁడును సంభవింతురు. వాఁడపు త్త్రికుఁడయి దేవతల యును గ్రహమున క్షేమకుఁడను సుతునిఁగాంచును; కాని వానితోడ వంశమంతరించును. ఇఁక ముందుసంభవించెడి మాగధరాజు లను గూర్చి చెప్పెదను వినుము. జరాసంధునకు సహదేవుఁడును, వానికి మార్జాలియు, మార్జాలికి శ్రుతశ్రవుఁడును, వానికి యుతాయువును, వానికినిరమిత్రుఁడును, నిరమిత్రునకు సునక్షత్రుఁడును, వానికి బృహత్సేనుఁడును, బృహత్సేనునకుఁ గర్మజిత్తును, గర్మజిత్తునకు శ్రుతంజయుఁడును, వానికి శుచియు జన్మింతురు. ఆశుచియే విప్రుఁడగును. ఆశుచికి క్షేముఁడును, క్షేమునకు సువ్రతుఁడును, సువ్రతునకు ధర్మసేత్రుఁడును, ధర్మసేత్రునకు దృఢసేనుఁడును, వానికి సుమతియు, సుమతికి సుబలుఁడును, సుబలునకు సునీపుఁడును సునీపునకు సత్యజిత్తును, సత్యజిత్తునకు విశ్వజిత్తును, వానికిఁ బురంజయుఁడును బ్రభవింతురు. వీరు బార్హద్రథులని వాసిగాంతురు. వీరివంశ మింకొక వేయువత్సరముల పర్యంతమును నిలిచి తరు వాతనాశన మందును. ఇది యిరువదిరెండవయధ్యాయము.

పూరునిపుత్రుఁడైన అనునివంశము; యదువంశవర్ణనము.

ఓరాజేంద్రా! యయాతి చతుర్థ సుతుఁడగుననునకు సభానరుఁడు, చక్షువు, పరోక్షుఁడనుమువ్వురు పొడమిరి. వారిలో సభానరునకుఁ, గాలనాభుఁడును, వానికి సృంజయుఁడును, సృంజయునకు జనమేజయుఁడును, వానికి మహాశాలుఁడును, వానికి మహామనుఁడును, వాని కుశీనరుఁడు, తితిక్షువునను నిరువురు పుత్త్రులును జన్మించిరి. అం దుశీనరునకు శిబి, వనుఁడు, క్రిమి, దర్వుఁడు

ననునలువ్వురుగల్గిరి.వారిలోశిబికి వృషదర్భుఁడు, సువీరుఁడు, మద్రు
డు, కేకయుఁడు ననునల్వ్వగు సుతులుగల్గిరి. ఉశీనరుని సోదరుఁడగు
తితిక్షువునకు వృషద్రథుఁడును, వానికి హేముఁడును, హేము
నకు సుతపుఁడును, సుతపునకు బలియు, వానికంగుఁడు, వంగుఁడు
కళింగుఁడు, సింహుఁడు, పుండ్రుఁడు ఆంధ్రుఁడు ననునార్వ్వురును
జనించిరి. వారిలోనంగునకు ఖనపానుఁడును, ఖనపానునకు హవి
రథుఁడును, వానికి ధర్మ్మరతుఁడు, వానికిఁ జిత్రరథుఁడును సంభ
వించిరి. ఆచిత్రరథునకే రోమపాదుఁ డనునామాంతరముగలదు.
అతనికి మిత్రుఁ డగుదశరథుఁడు శాంతయను కూఁతు సంతతిగా
నిచ్చెను. రోమపాదుఁ డొకప్పుడు ద్వాదశవర్షక్షామము పట్టి
నపుడు విభాండక సుతుఁ డగునతనిఁ దెప్పించుటకు గణికల నం
పఁగా వారు సంగీతముచేతను నృత్యముచేతను వాద్యవిశేషము
లచేతను నాలింగనాదులచేతనునతని వశ్యునిఁగాఁ జేసికొనివచ్చిరి.
అతఁడే శాంతను వరించెను. ఆఋశ్యశృంగుని యనుగ్రహమున
రోమపాదుఁడు పుత్రకామేష్టిచేసి సంతానము నొందెను. ఆఋ
శ్యశృంగుని యనుగ్రహమున దశరథుఁడుగూడఁ బుత్రులను
బడసెను. ఆరోమపాదునకుఁ జతురంగుఁడు, వానికిఁ బృథులా
క్షుఁడు, వానికి బృహద్రథుఁడు, బృహత్కర్మ్ముఁడు, బృహద్భానుఁ
డను నువ్వ్వరును జన్మించిరి. వారిలో బృహద్రథునకు బృహన్మ
నుఁడును, బృహన్మనునకు జయద్రథుఁడును, వానికి సంభూతి
యందు విజయుఁడును, విజయునకు ధృతియు, ధృతికి ధృతవ్రతుఁ
డును, వానికి సత్యకర్మ్ముఁడును, సత్యకర్మ్మనకు రథుఁడు నుదయించిరి.
ఆరథుఁ డనపత్యుఁడై కుంతీదేవి చిన్నతనమున సూర్యు నుపాసిం
చికొడుకునుగని భయపడి పెట్టెలోఁబెట్టి నదిలోవిడువఁగాఁ బ్రవా

హావశమునఁ గొట్టుకొనివచ్చి యొడ్డుచేరి బతికియున్న యాబా
లునిఁ గుమారునిఁగాఁ జేకొనియె. అతఁడు కర్ణుఁడనం బరఁగె. ఆత
నికి వృషసేనుఁడు సంభవించె. ఓరాజా ! ఇఁక యయాతిపు
త్రీయపుత్త్రుఁ డగుద్రుహ్యునిసంతతిని వినుము. ద్రుహ్యునకు
బభ్రుఁడును, వానికి సేతుఁడును, సేతున కారబ్ధుఁడును, వానికి
గాంధారుఁడును, గాంధారునకు ధర్ముఁడును, ధర్మునకు ధృతుఁ
డును, ధృతునకు దుర్మదుఁడును, దుర్మదునకుఁ బ్రచేతసుఁడును,
వానికి నూర్వురు సుతులును జన్మించిరి. వారు తూర్పుదిక్కు నాశ్ర
యించి మ్లేచ్ఛాధిపతులైరి. యయాతి ద్వితీయపుత్త్రుఁ డగు
తుర్వసునకు వహ్నియు, వహ్నికి భాగుఁడును, భాగునకు భాను
మంతుఁడును, వానికి సుభానుఁడును, సుభానునకుఁ గరంధము
డును, గరంధమునకు మరుత్తును సంభవించిరి. అతఁడపుత్రకుఁ
డై పూరువంశజుఁడయిన దుష్యంతునిఁ బుత్రునిఁగా స్వీకరిం
చెను. అయిన నతఁడు రాజకాముకుఁడై తుదకుఁ బూరువంశ
మునకే చెందెను. ఓరాజా ! యయాతికి జ్యేష్ఠపుత్త్రుఁ డగుయ
దువు వంశమును వర్ణించెద వినుము. అది పుణ్యదాయక
మైనది. విన్ననరుల పాపములను హరించును. యదువంశ
మున భగవంతుఁడు కృష్ణుఁడై యవతరించుటంజేసి యాపుణ్య
వంశమును గూర్చి విన్నవారు సకల పాప విముక్తులగుదురు.
ఓరాజా ! యదునృపునకు సహస్రజిత్తును, క్రోష్టువు, నలుఁడు,
రిపుఁడు ననునల్వు రుదయించిరి. అందు సహస్రజిత్తునకు శతజి
త్తును, వానికి మహాహయుఁడు, వేణుహయుఁడు, హైహయుఁడు
నను మువ్వురు సుతులుగల్గిరి. వారిలో హైహయునకు ధర్ముఁడును
ధర్మునకు నేత్రుఁడును గల్గిరి. ఆనేత్రునకుఁ గుంతియను నామాం

తరము గలదు. అతనికి సోహంజియు, సోహంజికి మహిష్మంతుఁడు, వానికి భద్రసేనకుఁడు, భద్రసేనునకు దుర్మద ధనకు లనునిరువు రుఁగల్గిరి. వారిలో ధనకునకుఁ గృతవీర్యుఁడుఁ, గృతాగ్నియుఁ, గృతవర్మయుఁ, గృతౌజుఁడు ననుతనయులును సంభవించిరి. వారిలోఁ గృతవీర్యున కర్జునుఁడు జన్మించె. అతఁడు సప్తద్వీపాధిపతియై హైహయాన్వయ సంభూతుఁడగుదత్తాత్రేయునివలన నణిమాది సిద్ధులను బొందెను. ఓరాజా ! యాగములను, దానములను, దపమునను, యోగమునను, వీర్యమునను, జయాదులను నర్జునుని సాటి చెందురాజు వే ఱొకఁడులేఁడు. అప్రతిహతబలుఁడయినకార్తవీర్యుఁడు ప్రతిదినమును దత్తాత్రేయుని స్మరించుకొనుచు నెనుబది యైదువేలవత్సరములు రాజ్యమేలెను. అదత్తాత్రేయుని స్మరణమువలన సకలసంపదలను దులఁదూఁగుచు నింద్రియసుఖములను బూర్ణముగా ననుభవించెను. అతనికి వేగురుసుతులు జన్మించిరి. కాని వారిలో నైదుగురుదప్ప దక్కినవారందఱును యుద్ధమునఁ బరశురామునిచే హతులైరి. అందు జీవించినవారు జయధ్వజుఁడు, శూరసేనుఁడు, వృషణుఁడు, మధుఁడు, ఊర్జితుఁడు ననునామములుగలవారు. అందు జయధ్వజునకుఁ దాళజంఘుఁడును, వానికి నూర్వురుకొమరులును బ్రభవించిరి. వారందఱును నౌర్వుఁడనుమునితేజమున నశించిరి. వారిలో వీతిహోత్రుఁడనువానికి మధువును, మధువునకు వృష్ణి మొదలగు నూర్వురుసుతులును జన్మించిరి. వారు మాధవులనియు, వృష్ణులనియు, యాదవులనియు వాసిగాంచిరి. యదునుతుఁడు కోష్టువనువానికి శ్వాహితుఁడును శ్వాహితున కురుశంకుఁడును, వానికిఁ జిత్రరథుఁడును, వానికి శశిబిందువును బుట్టిరి. ఆ శశిబిందుఁడు మహాయోగియై గుణాధి

కుండై * యాయాజాతులందుఁ బ్రసిద్ధములగు వస్తువులనుబొంది చక్రవర్తియై దిగ్విజేతయై ప్రకాశించెను. అతనికిఁ బదివేవురు భార్యలు గలరు. వారియం దామహాయశునకుఁ బదివేలలక్షల కొమరులు సంభవించిరి. పృథుశ్రవుఁడు మొదలగువా రాయ్వురు ప్రధానులు. వారిలోధర్మ్మ డనువాని కుశనుఁడుపయించె అతఁడు నూఱశ్వమేధముల నొనర్చెను. వానికి రుచకుఁడును, వానికిఁ బురుజిత్తు, రుక్మ్మఁడు, రుక్మ్మేషుఁడు, పృథుఁడు, జ్యామఘుఁడు ననునేవురును బుట్టిరి. వారిలో జ్యామఘునకు శైబ్యయను భార్యగలదు. అతని కామెయందు సంతానముగలుగ లేదు. భార్యకుభయపడి వేఱొకదానిఁ జేపట్టఁడయ్యె. ఇట్లుండ నతఁ డొకప్పుడు శత్రువులను జయించి వారియింటనుండి యొక కన్యకనుదెచ్చియు పభార్యగా వరించి రథముపై గూర్చుండఁబెట్టి తెచ్చుచుండెను. శైబ్య యాకన్యనుజూచి కోపముతో "ఓ వంచకా! నాస్థానమున నిని నెట్లుచేర్చితి" వని పలికెను. అదివిని జ్యామఘుఁడు భయపడి "సుందరీ! ఇది నీకుఁ గోడలుగానుండు" ననిన "గొడ్రాలనగు నాకుఁ గోడలగు నెట్లు?"ట్లనిప్రశ్నించెను. అది విని రాజు "ప్రస్తుతమున లేకపోయినను ముందు నీకుఁ బుత్రుఁడు జనింపఁగలఁడనఁగా

---

* దీనికి మూలము "చతుర్దశ మహారత్న" మని యున్నది. అనగా గజములు, హయములు, రథములు, ఆస్త్రీలు, బాణములు, నిధులు, మాలికలు, వస్త్రీలు, ద్రుమములు, శక్తులు, పాశములు, మణులు, ఛత్రములు, విమానములు ఇను నీ పదునాల్గువస్తువులందును శ్రేష్ఠములగునవి కలవాఁడు చతుర్దశమహారత్నుఁడని పిలువఁబడును. ఈయర్థమే మార్కండేయపురాణమునఁ జూపఁబడినది. "గజ వాజిరథాస్త్రీషు నిధిమాలాంబరద్రుమాః । శక్తిపాశమణి ఛత్రవిమానాని చతుర్దశ"

నామె సంతసించెను. అంతఁ జిరకాలమునుండి యతనిచే నారాధితులగు విశ్వేదేవులును బితరులును నతనిఁ గరుణించి పుత్త్రునను గ్రహించిరి. నొంతకాలమునకు శైబ్య గర్భముదాల్చి కువారునిఁ గనియె. అతఁడు విభర్కుఁ డనునామమునుధరించి యాకన్యను వరించెను. ఇది యిరువదిమూఁడవయధ్యాయము.

ఐసుదేవుని వంశక్రమము.

ఓరాజా! ఆవిభర్కున కాభామయందుఁ గుశుఁడు, క్రథుఁడు, రోమపాదుఁడు ననుమువ్వురు సుతులుగల్గిరి. వారిలో రోమపాదునకు బభ్రువు, బభ్రువునకుఁ గృతువు, వానికిఁ గుశికుఁడు, వానికిఁ జేదియు. వానికిఁజేద్యుఁడు మొదలగువారునుసంభవించిరి. విభర్కుని కొడుకగు క్రథునకుఁ గుంతియు, వానికి వృష్ణియు, వానికి నిర్వృతియు, నిర్వృతికి దాశార్హుఁడును, వానికి వ్యోముఁడును, వ్యోమునకు జీమూతుఁడును, జీమూతునకు వికృతియు, వికృతికిఁ దీవ్రరథుఁడును, వానికి నవరథుఁడును, నవరథునకుదశరథుఁడును, వానికి శకునియు, శకునికిఁ గరంభుఁడును, గరంభునకు దేవరాతుఁడును, దేవరాతునకు దేవక్షత్త్రుఁడును, వానికి మధువును, వానికిఁ గురువకుఁడును, గురువకునికిఁ బురుహూత్రుఁడును, పురుహూత్రునికి సాత్వతుఁడును, సాత్వతునకు భజమానుఁడు, భజి, దీప్తుఁడు, వృష్ణి, దేవాపృథుఁడు, అంధకుఁడు, మహాభోజుఁడు ననునేడ్వురును జన్మించిరి. వారిలో భజమానున కొకభార్యయందు నిమ్రోచియుఁ, గృకణుఁడు, వృష్ణియు ననుమువ్వురును, వేఱొకభార్యయందు శతజిత్తు, సహస్రజిత్తు, అయుతజిత్తు ననుమువ్వురును సంభవించిరి. దేవాపృథుఁడనువానికి బభ్రువను సు

తుఁడు జన్మించె. ఆజనకపుత్త్రుల మహిమను దెలుపుచు నార్యులు శ్లోకములనుబఠింతురు. వానియర్థంబు దెలిపెదను వినుము. దేవాపృథు బభ్రుప్రవుల సుగణసముదయము దూరమునం దెట్లు వినుచున్నామో, యట్లె సమీపమునకువచ్చి చూచుచున్నాము. వారిని బోలినవా రెచ్చటనులేరు. వారివంశమునఁ బుట్టినవారు బదునాల్గువేలయఱువదియేవురు. వారండఱును దేవాపృథు బభ్రుప్రవుల మహిమవలన ముక్తిఁబొందిరి. సాత్వతి కొడు కగుమహాభోజుఁ డతిధర్మాత్ముఁడు. అతనికి భోజు లనునృపులుపుట్టిరి. వృష్ణికి సుమిత్రయుధాజిత్తులను వారు దయించిరి. వారిలో యుధాజిత్తునకు శినియు, ననమిత్రుఁడు ననువార లుదయించిరి. వారిలో ననమిత్రునకు నిఘ్నుఁడును, నిఘ్నునకు సత్రాజిత్తు, ప్రసేనుఁ డనువారును గల్గిరి. అనమిత్రునకు శినియను వేఱొకసుతుఁడు గలఁడు. ఆశినికి సత్యకుఁడును, వానికి యుయుధానుఁడును, వానికి జయుఁడును, జయునకుఁ గుణియు వానికి యుగంధరుఁడును బ్రభవించిరి. అనమిత్రునకుఁ బృశ్నియను మఱియొక తనయుఁడు గలఁడు. ఆపృశ్నికి గాందిని యను భార్యయందు శ్వఫల్కుఁడు, చిత్రకుఁడు ననునిరువురు సుతులు గల్గిరి. వారిలో శ్వఫల్కునకు అక్రూరుఁడు, అసంగుఁడు, సారమేయుఁడు, మృదుకుఁడు, మృదువిచ్ఛివ్రుఁడు, వర్మదృక్కు, ధృష్టవర్ముఁడు, తుతోర్యాశ్వుఁడు, అరిమర్దనుఁడు, శత్రుఘ్నుఁడు, గంధమాదుఁడు, ప్రతిబాహుఁడు ననుపన్నిద్దఱుతనయులు సంభవించిరి. వారలకు సుసారయను నొకతోఁబుట్టువుకలదు. అందక్రూరునకు దేవవంతుఁడు, నుపదేవుఁడు ననుసుతులిర్వురు సంభవించిరి. ఉగ్రశరీరుని కుమారుఁడగుచిత్రరథునకు శశిబిం

దుఁడుగాక పృథువు, విదూరథుఁడు మొదలగువారు పెక్కురు గలరు. సాత్వతునిసుతుఁడగువృష్ణికిఁ గుకురుఁడు, భజమానుఁడు, శుచి, కంబలుఁడు ననువారుదయించిరి. వారిలోఁ గుకురునకుఁ విలోముఁడును, విలోమునికిఁ గపోతరోముఁడును జన్మించిరి. ఆతనికిఁ దుంబురుఁడు హితుఁడయ్యె. సాత్వతుని సుతుఁడగునంధకునకు దుందుభియు, వానికి దరిద్యోతుఁడును, దరిద్యోతునకుఁ బునర్వసువు, నతని కావాహుకుఁ డనుసుతుఁడును, నాహుకి యను సుతయు నుద్భవించిరి. ఆహుకునకు దేవకుఁడు, నుగ్రసేనుఁడు ననుతనయులు సంభవించిరి. అందు దేవకునకు దేవవంతుఁడు, ఉపదేవుఁడు, సుదేవుఁడు, దేవవర్ధనుఁడు ననునల్వురసుతులు గల్గిరి. వారికి ధృతదేవయు, శాంతిదేవయు, నుపదేవయు, శ్రీదేవయు, దేవరక్షితయు, సహదేవయు, దేవకియు ననునేడ్వురు తోఁబుట్టువులు గలరు. వారిని వసుదేవుఁడు పరిగ్రహించె. ఉగ్రసేనునకుఁ గంసుఁడు, సునామఁడు న్యగ్రోధుఁడు, కహ్వుఁడు, శంకుఁడు, సుభువు, రాష్ట్రపాలుఁడు, విసృష్టుఁడు, తుష్టిమంతుఁడు ననుకొడుకులును, గంసయుఁ, గంసవతియు, గంకయు, శూరభువును, రాష్ట్రపాలికయు ననుకూఁతులును జన్మించిరి. వారిని వసుదేవుని సోదరులు దేవభాగాదులు వరించిరి. చిత్రరథుని తనూజుఁడగు విదూరథునకు, శూరుండును, శూరునకు ధ్వజమానుఁడును, వానికి శిమియు శినికి స్వయంభోజుఁడును, వానికి హృదీకుఁడు, వానికి దేవబాహుఁడు, శతధనువు, కృతవర్మయనుమువ్వురు తనయులు నుదయించిరి. దేవమీఢుని సుతుఁడగుశూరునకు మారిష యనుభార్యయందు వసుదేవుండును, దేవభాగుండును, దేవశ్రవుండును, నానకుండును, సృంజయుండును,

శ్యామకుండును, గంకుండును, నసీకుండును, వత్సకుండును, వృకుండును ననుపదుగురు పుత్రులును; బృథయు, శ్రుతదేవయు, శ్రుతకీర్తియు, శ్రుతశ్రవసయు, రాజాధిదేవియు ననుకూఁతులేవ్వురును బుట్టిరి. వారిలోవసుదేవుఁడు పుట్టుసమయమున నానకములును, దుందుభులును మింటమ్రోసినవి. కావున నేయతఁడానకదుందుభియని పిలువఁబడు. వసుదేవుని జనకుఁడగు శూరుఁడు, తనచెలికాఁడగు కుంతిభోజకుఁ డపుత్రకుఁడైనందున నతనికిఁ బృథను దత్తనుగాఁజేసె. కుంతిభోజున కీయఁబడుట చేతనే పృథ కుంతియనునామమునొందె. ఆకుంతి దూర్వాసునిఁ బరిచరించి యతనియనుగ్రహమున దేవహూతి యనువిద్యను బొంది దానిఁబరీక్షించుటకై సూర్యునిఁ బిలిచిన నతండు ప్రత్యక్షమయ్యె. ఆమె యతనిఁజూచి "ఓదేవా ! నేను మంత్రపరీక్షార్థము పిలిచితిని; కానివేఱొండుగాదు. నన్నుక్షమించి మగలిపొమ్ము" అని ప్రార్థించిన సూర్యుఁడిట్లనియె "ఓసుందరీ ! దేవసందర్శనమెప్పుడును వ్యర్థముకాదు. కావున దేవతుల్యుఁడగు కుమారుని నీకుఁ గలిగించెదను. అయిన నీకన్యాత్వము చెడకుండవరమొసంగెద" ననిపలికి యామెకు గర్భమునుగల్గించి వెడలిపోయెను. తోడనే కుంతికి రెండవసూర్యునివలెఁబొల్చు నొకతనయుఁడు సంభవించె. అంతఁగుంతి లోకాపవాదమునకు జంకియానుతుని నదిలోవిడిచెను.ఆకుంతినే నీప్రతితామహుఁడగుపాండురాజుద్వాహమయ్యె. కుంతి సోదరియగు శ్రుతదేవను గరూశకుమారుఁడు వృద్ధశర్మచేపట్టె. మునిశాపమువలన నాదంపతులకు దంతవక్త్రుఁడనుదైత్యుఁడుదయించె.దానిసోదరియగు శ్రుతకీర్తిని గేకయుండు వరించి దానియందు సంతర్దనుఁడు మొద

లగు నేఁపురుతనయులను గనియె. వారు కేకయునకుఁ బుట్టిన వారగుటఁజేఁ గైకయు లనిపిలువఁబడిరి. రాజాధిదేవిని జయత్సేనుఁడు పెండ్లియాడి విందానువిందులను గనియె. దమఘోషుఁడునుచేదిరాజు శ్రుతశ్రవసను బరిణయమై దానియందు శిశుపాలునిఁగనియె. ఆశిశుపాలుని వృత్తాంతము నీకిదివఱకే తెలియఁజెప్పితిని. వసుదేవుని సోదరుఁడగు దేవభాగునకుఁ గంసయందుఁ జిత్రకేతు బృహద్బలు లనుపుత్త్రులుసంభవించిరి. అట్లే దేవశ్రవునకుఁ గంసవతియందు సువీరుండు నిషుమంతుఁడును జన్మించిరి. వాని సోదరుఁడయినకంకునకుఁ గంకయను భార్యయందు, బకుండును, సత్యజిత్తును, బురుజిత్తును బ్రభవించిరి. వానిసోదరుఁడగు సృంజయునకు రాష్ట్రపాలికయందు వృష దుర్మర్షణాదులు జనించిరి. వాని సహజుఁడయినశ్యామకునకు శూరభు వనుభార్యయందు హరికేశుఁడు హిరణ్యాక్షుఁడును జన్మించిరి. వత్సకు మిత్రకేశియను నచ్చరయందు బకాదులు సంభవించిరి. వాని సోదరుఁడగు వృకునకు దూర్వాక్షి యనునాతియందుఁ దక్షు పుష్కరస్వాదులు జన్మించిరి. వాని యనుజుఁడగు సనీకుఁడు సుధామయందు సుమిత్రుఁడు, అనీకపాలుఁడు మొదలగు వారినిగనియె. వానితమ్ముఁడగు నానకుఁడు కర్ణికయను దానియందు ఋతధాముని జయునిఁ బుట్టించె. ఓరాజా ! వసుదేవునికిఁ బౌరవి, రోహిణి, భద్ర, మదిర, రోచన, యిళ, దేవకి యనునేడ్వురుభార్యలు గలరు. వారిలో రోహిణియందు బలరాముండును, గదుండును, సారణుండును, దుర్మదుండును. విపులుండును, ధ్రువుండును, గృపుండును సంభవించిరి. పౌరవియందు సుభద్రుఁడును, భద్ర బాహుండును, దుర్మదుండును, భద్రుండును, భూతాదులగు

మతికొందఱును బ్రభవించిరి. మదిరయందు నందుఁడును, నుప నందుఁడును, గృతకుఁడును, శూరుఁడు మొదలగువారును జన్మించిరి. భద్రకు వేశియనువాఁ డుదయించె. రోచనయందు హస్తుఁడు, హేమాంగదుఁడు మొదలగువారుసంభవించిరి. ఇళయందురువల్కలాదులు ప్రభవించిరి. ఇంతియకాక వసుదేవునకు ధృతదేవి యనుభార్యయందుఁ ద్రిపృష్ఠుఁడును, శాంతిదేవయందుఁ బ్రశ్రమీఁడు మొదలగువారును, ఉపదేవయందుఁ గల్పవర్షాదులగు పదుగురు సుతులును, శ్రీదేవయందు వసుఁడు హంసుఁడు మొదలగు నార్వురకుమారులును, దేవరక్షితయందు గదాదులగుతొమ్మండ్రుసుతులును, సహదేవయందు శ్రుతముఖాదులగు నెనమండ్రు తనయులును, దేవకియందుఁ గీర్తిమంతుఁడును సుషేణుఁడును, భద్రసేనుండును, ఋజువును, సమదనుండును, భద్రుండును, సంకర్షణుండును బుట్టిరి. వీరలేకాక యతని కాదేవకియందు నారాయణావతారమగు కృష్ణుఁడును, మహాభాగయగు సుభద్రయును జన్మించిరి. ఆసుభద్రయే నీకుఁ బితామహియయ్యె. ఓరాజా! ఎప్పుడు లోకమున ధర్మము నశించి యధర్మమభివృద్ధిగాంచునో యప్పుడెల్ల భగవంతుఁ డవతరించును. కావున నీయుగమున దుష్టశిక్షణమొనర్చుటకై భగవంతుఁడు కృష్ణుఁడై యవతరించె. ఆపరమేశ్వరుఁ డిట్లవతరించుటకును, దుష్టశిక్షణాదికర్మముల నొనర్చుటకును స్వీయసంకల్పముతప్ప వే ఱొక కారణములేదు. భగవంతుఁడు జగమునకు సృష్టిస్థితిలయములుగలిగించు. అతఁడట్టి వ్యాపారము లొనర్చుట జీవులనను గ్రహింటకేకాని వేఱుకాదు. అదియెట్లుందువేని వినుము. పరమేశ్వరుఁడు లోకమునుబాలింప రామకృష్ణాద్యవతారములను దా

ల్వఁగా జీవులు నిత్యమును వారిసందర్శనాదులనంది స్వర్గాదిసుఖ
ములనుగాక కేవలము మోక్షమునే పొందుదురు. కావున భగ
వంతుని చేష్టితములు జీవులననుగ్రహించుటకేకాని స్వప్ర
యోజనార్థముకాదు. ఈయుగమున రాజాంశములు పెక్కురు
ప్రబలి రాక్షసతుల్యులై సేనాధిపతులై భూమికి భారముగల్గింప
చానిఁ దొలంగించుటకై పరమేశ్వరుఁడవతరించెను. బ్రహ్మముల
కయినను దురూహములగు చేష్టితములనొనర్చుకృష్ణుఁడు బల
రామసహితుఁడై పూతనా శిశుపాలాదులను సంహరించెను. కలి
యుగమున సంభవించు తనభక్తుల ననుగ్రహించుటకు దుఃఖ
హరమును బుణ్యావహమునగుకీర్తిని విస్తరింపఁజేసెను. అతని
కీర్తి కర్ణపేయమై పుణ్యతీర్థములవలె నెల్లెడలనొప్పుచున్నవి. భ
క్తులు తమకర్ణములను నంజలులచే గ్రహించి స్పృశించినచో
వారికర్మవాసనలన్నియు వెంటనే నశించును. ఆకృష్ణుఁడు బో
జాంధక మధు శూరసేన దాశార్హులను వారికేకాక కురుదేశస్థు
లకుఁగూడ నాశ్చర్యమొదవించు కర్మముల నొనర్చుచు, మంద
హాసముచేతను, గడకంటి చూపులచేతను, మృదువచనముల
చేతను, గమనవిలాసములచేతను, మనోహరమగు నాకారము
చేతను మానవలోకమును సంతసింపఁజేసెను. మకరకుండల
ములచే సుందరములగు శ్రవణములచేతను, కపోలములచేతను,
మిక్కిలి రమణీయమై, మందహాసశోభితమై, యున్న యాకృ
ష్ణుని వదనారవిందమును నిత్యము సాదర్శించియుండియు స్త్రీ
లును బురుషులును దనివిచెందక కన్నులకు నిమేషముగల్గించిన
నిమిని మిక్కిలి నిందించుచుందురు. ఓరాజేంద్రా! ఆకృష్ణుఁడు
లీలామానుషవిగ్రహమునుదాల్చి వ్రేపల్లెయందుఁ బెరుఁగుచుఁ

భూతనాదు లగువెక్కండ్ర దుష్టులనుసంహరించి వేలకొలఁది స్త్రీలనుబెండ్లాడి వారిలో నొక్కొక్కతయందు నూర్వురేసి తనయులను బడసి తన యాజ్ఞారూపమగు వేదమును జనులందుఁ బ్రవర్తింపఁజేసి యందఱవలెనను భూజలను గ్రహించె. ఇంతే కాక యతఁడు కురుపాండవులకుసంభవించిన సమరమున దుష్ట పార్థివులను, వారిసైన్యములనుగూల్చి భూభరమును దగ్గించి యర్జునునకు జయమిచ్చి, యుద్ధవునకుఁ దత్త్వ ముపదేశించి వైకుంఠమున కరిగెను. ఇది యిరువదినాల్గవయధ్యాయము.

ఇది శ్రీమత్సేతవరపు వేంకటశాస్త్రిప్రణీతమైన యాంధ్రవచన భాగవతమున నవమస్కంధము సమాప్తము.

శ్రీకృష్ణార్పణమస్తు.